ఈనాడు

హైదరాబాద్ 13-2-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 184
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కీటో డైట్ కథేంటి?



అటు ఊబకాయం.. ఇటు మధుమేహం.. ఒక్క బాణంతో ఈ రెండు రుగ్మతలనూ ఖాయంగా జయించొచ్చంటూ తెర మీదికి దూసుకొచ్చింది కీటో డైట్! 'ముల్లును ముల్లుతోనే' అన్నట్లు కొవ్వును కొవ్వుతోనే కరిగించొచ్చన్న ప్రచారమూ ఊపందుకుంది.

అసలేమిటీ ఆహార నియంత్రణ?

ఇది సరైనదేనా?

దీన్ని అంతా పాటించొచ్చా?

దీనిపై అంతర్జాతీయ అధ్యయనాలేమంటున్నాయి?

అనుభవజ్ఞులైన వైద్యులిచ్చే సలహా ఏమిటి?

చదవండి.. నేటి సుఖీభవలో!



మస్కట్‌లో ఉన్న పురాతన శివాలయంలో పూజల్లో పాల్గొన్న ప్రధాని మోదీ

పెద్దలకు మాత్రమేనా!

- 'ఫేస్‌బుక్'కు ముఖం చాటేస్తున్న యువత
- పెద్దలు, వృద్ధుల్లో పెరుగుతున్న ఆదరణ

ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌కు మరలుతున్న అమెరికన్లు

100 కోట్ల పైచిలుకు ఖాతాదారులున్న సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్‌కు కొత్త సమస్య పట్టుకుంది. యువ ఖాతాదారులు వైదొలగిపోతుండగా పెద్దలు మాత్రమే మిగులుతున్నారట! -2లో



అందరికీ ఆరోగ్యమస్తు

- వేసవిలో రాష్ట్రమంతటా ఉచిత రోగ నిర్ధారణ పరీక్ష
- అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాలు తదితరాలకు
- ఆర్‌బీఎస్‌కే, 104 సిబ్బంది సేవల వినియోగం
- సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు
- 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై ఆరోగ్యశాఖ దృష్టి

ఈనాడు - హైదరాబాద్

వేసవిలో రాష్ట్రమంతటా ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణాలు మినహా అన్ని గ్రామాల్లోనూ ఉచిత వైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహించడం ద్వారా..ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు పూర్తిచేయాలని తీర్మానించింది. అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల పనితీరు, రక్తంలో కొలెస్ట్రాల్..హిమోగ్లోబిన్, కాలేయం పనితీరు తదితర రక్త పరీక్షలతోపాటు..కంటి, దంత పరీక్షలూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అధునాతన ప్రయోగశాలను సంచార వాహనంలో ఏర్పాటుచేయడం ద్వారా ఈ క్రతువును విజయవంతం చేయాలని భావిస్తోంది. సంబంధిత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి భద్రపర్చనుంది.

ఇటీవల ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన



ఆరోగ్య సమీక్షలో ఉచిత నిర్ధారణ పరీక్షల అంశం చర్చకువచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీస నిర్ధారణ పరీక్షలు చేయించే పరిస్థితులు లేవనీ, కొన్ని ముఖ్యమైన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అది సాధ్యమవుతుందని వైద్య అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించగా..ఈ విషయంపై కార్యాచరణ రూపకల్పనలో భాగంగా ముఖ్యమంత్రి పేషీ ఉన్నతాధికారులతో సోమవారం వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.

వేసవిలోనే ఎందుకంటే..

రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్‌బీఎస్‌కే ద్వారా అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 ఏళ్ల యువత వరకు, 104 సంచార వైద్యసేవల ద్వారా ఆ తర్వాత వయసు వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్‌బీఎస్‌కే బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఏఎన్‌ఎం, ఫార్మాసిస్టు సేవలు అందిస్తుండగా.. 104లో ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టులు నియమితులై ఉన్నారు. వీరితోపాటు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఎలాగూ (మిగతా 2లో)



బాగ్‌లింగంపల్లిలో విద్యార్థుల సందడి

స్వచ్ఛత కోసం సమరశంఖం

- ఏకకాలంలో చీపురుపట్టి రోడ్లు ఊడ్చిన 15,320 మంది
- ఈనెల 15 నుంచి 22 వరకు స్వచ్ఛ సర్వేక్షణ్-2018 సర్వే
- హైదరాబాద్ నగరాన్ని ముందుంచాలన్న మంత్రి కేటీఆర్ -2లో

స్టెంట్ల ధరల్ని సవరించిన ప్రభుత్వం — నేటి నుంచి అమల్లోకి 2లో

తెలంగాణకు మరో మణిహారం

- నగరానికి టాటా, జీఈ వైమానిక ఇంజిన్ల తయారీ పరిశ్రమ
- భూమి పూజ చేసిన మంత్రి కేటీఆర్
- ఆదిభట్ల వైమానిక సెజ్‌లో 40 ఎకరాల కేటాయింపు
- 3 వేల కోట్ల రూపాయల పెట్టుబడి
- 500 మంది వైమానిక నిపుణులకు ఉపాధి
- రాష్ట్రానికి గొప్ప వరమన్న పరిశ్రమల మంత్రి
- డిసెంబరులో తొలి ఇంజిన్ ఉత్పత్తి చేస్తామన్న సంస్థలు



మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జీఈ దక్షిణాసియా అధ్యక్షుడు, సీఈవో విశాల్ వాంచూ, టాటా సన్స్ వైమానిక, మౌలికవసతుల విభాగం ఛైర్మన్ బన్మాలి

ఈనాడు, హైదరాబాద్: వైమానిక రంగంలో పేరొందిన ప్రసిద్ధ సంస్థలు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) సంస్థల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని ఆర్థికమండలిలో వైమానిక ఇంజిన్ల తయారీ పరిశ్రమకు ఏర్పాటు చేయనున్నాయి. దీనికి సోమవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఈ కార్యక్రమం జరిగింది. రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి, టాటా సన్స్ వైమానిక, రక్షణ, మౌలిక వసతుల విభాగం ఛైర్మన్ బన్మాలి అగ్రవాలా, జీఈ దక్షిణాసియా అధ్యక్షుడు, సీఈవో విశాల్ వాంచూ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఎండీ ఇ.వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు. దేశంలో రూ.3 వేల (మిగతా 2లో)



జైళ్లల్లో మందుబాబుల సందడి

- ప్రతినెలా వెయ్యిమందికిపైనే చెరసాలకు..
- కిక్కిరిసిపోతున్న బ్యారక్‌లు -2లో

నిరుడు జైల్లో ఉన్న మొత్తం ఖైదీల సంఖ్య:	9,650
ఇందులో మందుబాబులు:	6,511 మంది
ఈ ఏడాది జనవరిలో జైలుకెళ్లినవారి సంఖ్య:	1,758
వీరిలో మందుబాబులు:	920 మంది

ఈ లెక్కలన్నీ కేవలం చంచల్‌గూడ జైలువే. చర్లపల్లి కారాగారానికీ నెలకు 550 మందికిపైగా మందుబాబులు వెళ్తున్నారు.

గురుకుల పోస్టుల పరీక్షలు వాయిదా

కొత్త తేదీలు త్వరలో వెల్లడిస్తామన్న టీఎస్‌పీఎస్సీ

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, లైబ్రేరియన్, ప్రిన్సిపల్, పీడీ పోస్టులకు ఈనెల 19 నుంచి 23 వరకు జరగాల్సిన ప్రధాన పరీక్షల్ని టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసింది. సీజీజీ నుంచి తీసుకున్న బయోడేటాలో కొన్ని పొరపాట్లు దొర్లాయని, వాటిని సరిదిద్దిన తరువాతే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రధాన పరీక్షలకు ఎంపిక చేసిన జాబితాను మరోసారి క్షుణ్నంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గురుకులాల్లో ఆయా పోస్టులకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ప్రాథమిక పరీక్షలు నిర్వహించింది. ఇందులో 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రధాన పరీక్షలకు ఎంపిక చేసింది. ఈనెల 19 నుంచి ప్రధాన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. అయితే కొందరు అభ్యర్థులు ప్రాథమిక 'కీ' ప్రకారం అత్యధిక మార్కులు సాధించినా ఎంపిక కాకపోవడంపై టీఎస్‌పీఎస్సీని ప్రశ్నించారు. ఆయా విద్యార్థుల వ్యక్తిగత వివరాలు తనిఖీ చేసేందుకు వివరాలు పంపించాలని టీఎస్‌పీఎస్సీ సీజీజీని కోరింది. కానీ అక్కడి నుంచి వివరాలు అందుబాటులోకి రాలేదు. వచ్చిన సమాచారం (మిగతా 2లో)

రాజస్థాన్‌లో రైతులకు రుణమాఫీ

- ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.50వేల వరకు ఉపశమనం
- సహకార బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న చిన్న, సన్నకారు వ్యవసాయదారులకే వర్తింపు -16లో
- రాష్ట్ర ఖజానాపై భారం రూ.8వేల కోట్లుగా అంచనా
- వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు
- ఆ రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి వసుంధర రాజే వెల్లడి

సైన్స్ బోధపడాలంటే.. ఈ-విధానమే మేలు!

వాషింగ్టన్: అంతర్జాలం విధానంలో (వెబ్ ఆధారిత) బోధనలు జరిపితే.. సామాన్య శాస్త్రం(సైన్స్)లో వెనుకబడిన విద్యార్థులకు మరింత బాగా అర్థమవుతున్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఓరెగాన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వెలువరించిన తాజా అధ్యయనంలో అనేక ఆసక్తికర అంశాలను వివరించారు. రెండు రాష్ట్రాల్లోని 13 మాధ్యమిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంప్యూటర్లు, ట్యాబ్‌లు అందుబాటులో ఉంచి వారు పరిశోధనలు జరిపారు. 4 సైన్సు యూనిట్లపై ఆన్‌లైన్‌లో బోధనలు చేయించారు. 2,300 విద్యార్థులు, 71 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా.. పరిశోధనలకు ముందు, తర్వాత విద్యార్థులను పరీక్షిస్తే అందరిలోనూ సామాన్యశాస్త్ర విజ్ఞానం గణనీయంగా పెరిగినట్లు గుర్తించారు. అలాగే ఆంగ్లభాషను నేర్చుకోవడంలో కూడా 15శాతం పురోగతి కనిపించింది. తమ పరిశోధనల ద్వారా సైన్స్‌లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అంతర్జాల ఆధారిత బోధన ప్రణాళిక ఎంతో మెరుగైనదిగా తేలిందని విశ్వవిద్యాలయానికి చెందిన టెర్రాజాస్ అరెల్లాన్స్ తెలిపారు. సాంకేతిక విధానంలో బోధనలు చేయడం వల్ల విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న ఆసక్తిని పెంచే వాతావరణాన్ని కల్పించవచ్చని వెల్లడించారు. ఈ విధానంలో రూపొందించే ఈ-పాఠాలు, పాఠ్యపుస్తకాల అభ్యాసాలు విద్యార్థులు మమేకమయ్యేలా ఉంటాయని వివరించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో వీడియోలు చూడటం, విద్యాపరమైన ఆటలు(గేమ్స్) పెట్టడం, ఆలోచనలు పెంచేలా కృత్యాధార విద్య, సహ విద్యార్థులతో కలిసి నేర్చుకోవడం వంటివి ఈ-విధానంలో ఉంటాయని వెల్లడించారు.

స్వచ్ఛత కోసం సమరశంఖం

ఈనాడు - హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి - న్యూస్‌టుడే

స్వచ్ఛ హైదరాబాద్ కోసం నగరం సమర శంఖం పూరించింది. ఏకకాలంలో 15,320 మంది చీపుర్లతో రహదారులను 3 నిమిషాలు ఊడ్చి సరికొత్త రికార్డు నెలకొల్పారు. బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాల రహదారిపై సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగాపాల్గొని విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. "భారత ప్రభుత్వంకన్నా ముందే సీఎం కేసీఆర్ స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే స్ఫూర్తితో జీహెచ్‌ఎంసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నగరాన్ని బహిరంగ మల విసర్జన రహితంగా తీర్చిదిద్దింది." అని అన్నారు. అయితే ఇంకా చైతన్యం పెరగాల్సి ఉందన్నారు. స్వచ్ఛతను పాటించి ఈ నెల 15 నుంచి 22వరకు నగరంలో జరిగే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పౌరులు నగరాన్ని జాతీయ స్థాయిలో ముందుంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు పాల్గొన్నారు.

1969కి మిస్డ్‌కాల్ ఇవ్వండి..: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే చేపట్టేందుకు కేంద్రం నుంచి అధికారులు వస్తారని జీహెచ్‌ఎంసీ కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రజలు సర్వేపై అవగాహన కలిగి ఉండాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ 1969 నంబరుకు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. మిస్డ్‌కాల్ ఇచ్చినవారిలో కొంత మందికి అధికారులు ఫోన్ చేసి ఆరు ప్రశ్నలు వేస్తారని, వాటికి సానుకూల సమాధానాలు చెబితే హైదరాబాద్‌కు సర్వేలో మంచి మార్కులు వస్తాయన్నారు.

సొంతంకానున్న గిన్నిస్‌రికార్డు..: వడోదరలో గతంలో 5058మంది ఒకేసారి రహదారిని శుభ్రం చేయడం ద్వారా గిన్నిస్‌బుక్‌లో స్థానం దక్కించుకుంది. జీహెచ్‌ఎంసీ ఆ రికార్డును తిరగరాసినట్లయింది. 15,320 మంది చీపుర్లతో రోడ్డును శుభ్రం చేయడంతో ప్రాథమికంగా 'హైరేంజ్ ఆఫ్ వరల్డ్ రికార్డు' దక్కింది. అన్ని విషయాలను పరిశీలించిన అనంతరం గిన్నిస్‌రికార్డును ప్రకటిస్తారని అధికారులు తెలిపారు.





సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి లభించిన 'వరల్డ్ రికార్డ్స్' ధ్రువీకరణపత్రాన్ని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, హోంమంత్రి నాయిని నుంచి అందుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రులు, అధికారులు

'ఫేస్‌బుక్'కు ముఖం చాటేస్తున్న యువత

వాషింగ్టన్: అమెరికాలో ఫేస్‌బుక్‌ను ఉపయోగించే పెద్దల(25 ఏళ్లు దాటినవారు), వృద్ధుల సంఖ్య ఓవైపు పెరుగుతుంటే, మరోవైపు యువత రోజురోజుకూ తగ్గిపోతున్నారని ఆన్‌లైన్ పరిశోధకులు చెబుతున్నారు. యువతను ఆకర్షించడంలో స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్ ముందున్నాయని 'ఇమార్కెటర్' నివేదిక వెల్లడిస్తోంది. అగ్రరాజ్యంలోని 18-24 ఏళ్ల వయస్సువారిలో ఈ ఏడాది 5.8 శాతం ఫేస్‌బుక్ నుంచి వైదొలిగారు. అమెరికాలోని 12-17 ఏళ్ల వయస్సు ఉన్నవారిలో సగం మంది ఫేస్‌బుక్ వాడుతున్నారు. ఇందులో 5.6 శాతం తగ్గుదల కనిపించింది. 12 ఏళ్లలోపువారిలో 9.3 శాతం మంది తగ్గారు. 2019, 2020లోనూ ఇదే వైఖరి కొనసాగనుందని నివేదిక చెబుతోంది. 2019లో 25 ఏళ్లలోపు గల 20 లక్షల మంది ఖాతాదారులను ఫేస్‌బుక్ కోల్పోనుందని అంచనా. 2018లో స్నాప్‌చాట్‌కు 19 లక్షల మంది, ఇన్‌స్టాగ్రామ్‌కు 16 లక్షల ఖాతాదారులు పెరగనున్నారు. 24 గంటల తరువాత సందేశాలు అదృశ్యమయ్యే ఆప్షన్ కారణంగా స్నాప్‌చాట్ అంటే యువత ఇష్టపడుతున్నారని అధ్యయనంలో తేలింది. స్నాప్‌చాట్ తన ప్లాట్‌ఫామ్‌ను పునఃసృష్టిస్తోందని, వృద్ధుల్లోనూ ఆదరణ పెరగనుందని ఇమార్కెటర్ విశ్లేషకుడు డెబ్రా అహో విలియంసన్ చెప్పారు. అమెరికాలో ఫేస్‌బుక్‌కు 16.95 కోట్లు, ఇన్‌స్టాగ్రామ్‌కు 10.47 కోట్లు, స్నాప్‌చాట్‌కు 8.65 కోట్ల మంది ఖాతాదారులున్నారు.

ఒకే వేదికపై ఐటీ దిగ్గజాలు

- ఈనెల 19 నుంచి ప్రపంచ ఐటీ కాంగ్రెస్
- 150 మంది వక్తలు, 24 అంశాలపై ప్లీనరీలు
- ప్రధాని మోదీ ప్రారంభించే అవకాశం
- సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న సోఫీ రోబోట్

ఈనాడు - హైదరాబాద్

ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థలు, వ్యవస్థాపకులు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి రానున్నారు. ప్రపంచ ఐటీ సేవల సమాఖ్య (డబ్ల్యూఐటీఎస్‌ఏ), నాస్కామ్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా తొలిసారిగా హైదరాబాద్‌లో ప్రపంచ ఐటీ సదస్సును నిర్వహించనుంది. ఈనెల 19 నుంచి 21 వరకు మూడ్రోజులపాటు ఐటీలో నూతన టెక్నాలజీలు, భవిష్యత్తు, వివిధ రంగాల్లో ఐటీ వినియోగం తదితర అంశాలపై దేశ, విదేశాలకు చెందిన ఐటీ కంపెనీల ప్రతినిధులు చర్చలు, సదస్సులు, కీలక సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించనున్నటు సమాచారం. ఇదే విషయాన్ని సోమవారం నాస్కామ్ తమ ట్విట్టర్‌లో పేర్కొంది. కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, శ్రీలంక ప్రధాని రాణిల్ విక్రమసింఘే, తెలంగాణ సీఎం కేసీఆర్, కెనడా ఆర్థిక అభివృద్ధి మంత్రి నవదీప్ బైన్స్, ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీవాసుదేవ్, అడోబ్ సిస్టమ్స్ అధినేత శంతను నారాయణ్, హానివెల్ కార్యనిర్వాహక ఛైర్మన్ డేవిడ్ ఎం.కోటే తదితర దిగ్గజాలు హాజరవుతారు. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే "మానసిక సంసిద్ధత- సమయ స్ఫూర్తి' అనే అంశంపై సదస్సులో మాట్లాడతారు. తైవాన్ ఐటీ మంత్రి చెన్, లియాంగ్‌జీ, స్వీడన్ విద్యాశాఖ మంత్రి కరిన్ రోడింగ్ పాల్గొంటారు. ప్రపంచ ఐటీకాంగ్రెస్ సదస్సుకు సోఫియా (రోబోట్) ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ రోబో ఇప్పటికే వ్యక్తిగత ముఖాముఖి, ప్రజలతో నేరుగా సమావేశాలు నిర్వహించడంతో పాటు పెద్ద సదస్సుల్లోనూ మాట్లాడింది.

24 ప్రధాన అంశాలపై సదస్సులు...: అంతర్జాతీయ ఐటీ సంస్థలు కలిసి 1978లో ప్రపంచ ఐటీ సేవల సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నాయి. ఆ తరువాత ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌గా పేరొందింది. ఈ సమాఖ్యలో 80కిపైగా దేశాలకు చెందిన, 2500 మంది దిగ్గజ సంస్థలు వాటి ప్రతినిధులు, నిపుణుల, ప్రభుత్వ ప్రతినిధులు ఉన్నారు. తొలిసారిగా ఈ సదస్సుకు భారత దేశం వేదికగా నిలిచింది. అదీ హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అనుమతి లభించింది. మూడ్రోజులపాటు సదస్సులో 25 ప్రధాన అంశాలపై సదస్సులు ఉంటాయి. తొలిరోజు సదస్సు ప్రారంభమైన తరువాత "డిజిటల్ ఎకానమీ - పరిపాలన పునరాలోచన' అంశంపై జరిగే సదస్సులో కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్, బంగ్లాదేశ్ ఐటీశాఖ మంత్రి జునైద్ అహ్మద్ పాలాక్, అర్మేనియా ఐటీశాఖ మంత్రి వాహన్ మార్టియోసైన్, శ్రీలంక టెలీకమ్యూనికేషన్స్ మంత్రి హలీన్ ఫెర్నాండో, సెయింట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొంటారు.

150 మందికి పైగా ప్రతినిధులు

ప్రపంచ ఐటీకాంగ్రెస్‌లో 150 మందికి పైగా ప్రతినిధులు వివిధ ప్లీనరీల్లో పాల్గొంటారు. ఖతార్ ఎయిర్‌వేస్ సీఐవో ఏటీ శ్రీనివాసన్, ఆదిత్యాబిర్లా గ్రూపు కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.శివ కుమార్, అక్యూటీ ఉపాధ్యక్షుడు టోమ్ వాన్, బీసీజీ ఎండీ నీరజ్ అగర్వాల్, ఎవరెస్టు గ్రూప్ సీఈవో పీటర్ బెండర్ సామ్యూల్, గ్లోబల్ వర్క్‌ఫోర్స్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అరిమానితాయ, మన్‌థన్ సీటీవో అతుల్ బాత్రా, మహీంద్రా ప్రతినిధి జస్‌ప్రీత్ బింద్రా, సితా సీఈవో బర్‌బారా దాలిబార్డ్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ సీఐవో సామ్రాట్ దాస్, మైక్రోసాఫ్ట్ ఇండియా జీఎం కిరణ్ డీబీ, క్యాప్‌జెమిని సీవోవో తిర్రీ డెలాపోర్టే, టెరానెట్ సీఈవో ఎల్గిన్ ఫేర్‌వెల్, టీసీఎస్ సీఈవో రాజేష్ గోపినాథన్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, స్టాండెట్ ఛార్టర్డ్ సీఐవో డాక్టర్ మైఖేల్ గొర్రిజ్, టెక్ మహీంద్రా సీఈవో సీపీ గొర్నానీ, నాస్కామ్ వ్యవస్థాపకులు రవీ గురురాజ్, జినోవా సీఈవో ఎడ్వర్డ్ జంగ్, మారెస్క్ సీఈవో నవనీత్ కపూర్, ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఉపాధ్యక్షుడు ప్యాట్రిక్ నాయెఫ్, విప్రో సీఈవో ఎ.నీముచ్‌వాలా, సొనాటా సాఫ్ట్‌వేర్ సీఈవో శ్రీకర్‌రెడ్డి, గూగుల్ క్లౌడ్ విభాగాధిపతి ఓవిండ్ రోటి, ఇన్‌మొబి సీఈవో నవీన్ తివారీ, పెగాసిస్టమ్ సీఈవో అలన్ ట్రెఫ్లెర్ తదితరులు వివిధ సదస్సుల్లో మాట్లాడతారు.



హుండీల్లో లభించిన బంగారు, వెండి ఆభరణాలు

మేడారం హుండీల ఆదాయం రూ.10 కోట్లు

బాలసముద్రం (వరంగల్), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన మేడారం జాతర సందర్భంగా హుండీల ద్వారా రూ.10,17,50,363 ఆదాయం సమకూరింది. హన్మకొండలోని తితిదే కల్యాణ మండపంలో 479 హుండీలు తెరిచి వారం పాటు లెక్కించారు. సోమవారం నోట్లు, చిల్లర నాణేలు, విదేశీ కరెన్సీ, బంగారు, వెండి ఆభరణాల లెక్క పూర్తి చేశారు. నగదుతోపాటు 824 గ్రాముల బంగారం, 47.470 కిలోల వెండి ఆభరణాలు, 32 దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు హుండీల నుంచి వెలువడ్డాయి. విదేశీ కరెన్సీ నోట్లను ఆర్‌బీఐకి పంపుతామని మేడారం ఈవో రమేష్‌బాబు పేర్కొన్నారు.

అందరికీ ఆరోగ్యమస్తు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. ఈ క్రమంలో మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పూర్తిస్థాయిలో, జూన్‌లో రెండు వారాల వరకూ వీరందరి సేవలను నిర్ధారణ పరీక్షల కోసమే సమర్థంగా వినియోగించుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

కార్యాచరణ ఎలా?

- ముందుగా సంచార వైద్యంలో అధునాతన నిర్ధారణ పరీక్షల ప్రయోగశాలను నెలకొల్పుతారు.
- అంతకుముందే ఏఎన్‌ఎంలకు మధుమేహం, అధిక రక్తపోటు తదితర పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇస్తారు.
- నిర్దేశించిన తేదీల్లో వైద్యశిబిరాల ద్వారా గ్రామాల్లోనే రక్త, మూత్ర, కంటి, దంత తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. హాజరుకాని వారికి ఇంటి వద్దే వీలున్నన్ని పరీక్షలు చేస్తారు.
- రేడియాలజిస్టు సేవలు అవసరయ్యే వారిని సమీపంలోని ప్రాంతీయ ఆసుపత్రులకు తరలిస్తారు.

తొలుత వందరోజుల ప్రణాళిక

-లక్ష్మారెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి

వైద్య పరీక్షలను అందరికీ ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనేది ముఖ్యమంత్రి ఆకాంక్ష. అందుకనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. అన్ని పీహెచ్‌సీల్లో కనీసం 50 రకాల నిర్ధారణ పరీక్షలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నిరంతరాయంగా ఉచితంగా క్రమం తప్పకుండా ఔషధాలనందిస్తాం. ఇందులో భాగంగా వేసవిలో వంద రోజులపాటు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నాం.

మెట్రో నగరాల్లో హవాలా దందా

- ఇనుము, ఉక్కు సంస్థలకు సహకారం
- రూ.1.40 కోట్లు స్వాధీనం, ఆరుగురి అరెస్టు

ఈనాడు - హైదరాబాద్

భారీ హవాలా రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. రెండు స్టీల్ కంపెనీలు రాయ్‌పూర్ నుంచి హవాలా ద్వారా నగదు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని, సరిగ్గా నగదు మార్పిడి జరిగేప్పుడు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు బృందం ఇద్దరు ఏజెంట్లను పట్టుకుంది. ప్రధాన నిందితుడు జయేష్‌కుమార్ పటేల్ సహా ఆరుగురిని అరెస్టు చేసింది. వారి నుంచి సుమారు రూ.1.40 కోట్ల నగదును స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు, ఆదాయపన్నుశాఖ సహాయ సంచాలకులు రాజేశ్వర్‌రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.



హవాలా ఏజెంట్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు. చిత్రంలో ఆదాయపన్ను శాఖ సహాయ సంచాలకులు రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం ఆబిడ్స్‌లోని జయేష్‌కుమార్ కార్యాలయం నుంచి రూ.65 లక్షల నగదుతో బయటకొచ్చిన ఏజెంట్ బోనబోయిన విఘ్నేశ్వర్, మరో ఏజెంట్ గణేష్ సత్యనారాయణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. స్కాన్ ఎనర్జీ పవర్ లిమిటెడ్, రాయలసీమ స్టీల్ రోలింగ్ కంపెనీలకు డబ్బు తీసుకెళ్తున్నట్లు వారు చెప్పడంతో.. బంజారాహిల్స్, ఆబిడ్స్‌లలో ఉన్న ఆయా సంస్థల కార్యాలయాలకు అధికారులు వెళ్లారు. స్కాన్ ఎనర్జీ నుంచి రూ.47.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సంస్థ ముఖ్య ఆర్థికాధికారిని అదుపులోకి తీసుకున్నారు. జయేష్‌కుమార్ కార్యాలయంలోనూ రూ.18.45 లక్షలు చిక్కాయి. జయేష్‌కుమార్‌తో పాటు.. ఉద్యోగులు బమర్‌సిన్హ్ చౌహాన్, ప్రదీప్‌కుమార్‌లను పోలీసులు పట్టుకున్నారు.

వంద నోటుతో సంకేతాలు...

జయేష్‌కుమార్ అలియాస్ అతుల్ తొమ్మిదేళ్ల క్రితం గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. రూ.కోటికి రూ.60 వేలు కమీషన్ వస్తుండటంతో.. దిల్లీ, బెంగళూరు, చెన్నై, విజయవాడ, కోల్‌కతా, ముంబయి నగరాల్లో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేందుకు డబ్బును సమకూర్చుతున్నాడు. రూ.100 నోటు చిత్రాన్ని వాట్సాప్‌లో పంపడం, దానిని తన ఏజెంట్లకు చూపిస్తే నగదు ఇవ్వడం చేస్తున్నాడు.

జైళ్లలో మందుబాబుల సందడి

ఈనాడు, సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి - చంచల్‌గూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రధాన జైలులో ఇతరత్రా నేరగాళ్ల కంటే శిక్షపడిన మందుబాబుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. వీరి బ్యారక్‌లన్నీ నిత్యం నిండిపోయి ఉంటున్నాయి. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో నెలకు 1,100 మందికిపైగా మందుబాబులు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారు. వీరిలో 500-800 మందికి ఒకరోజు నుంచి నెల వరకూ శిక్షలు పడుతున్నాయి. ఇక సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో జైలుశిక్ష పడుతున్నవారు ప్రతినెలా 350 మంది వరకూ ఉంటున్నారు. నగర కమిషనరేట్ పరిధిలో జైలుశిక్ష పడినవారిని చంచల్‌గూడ జైలుకు... ఇతర కమిషనరేట్లలో చిక్కినవారిని చర్లపల్లి కారాగారానికి తరలిస్తున్నారు.

మందుబాబులను జైల్లోని ఇతర ఖైదీలతో కలిపి ఉంచట్లేదు. ప్రత్యేక బ్యారక్‌లో ఉంచి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. వీరితో మొక్కలకు నీరు పోయించడం, పారిశుద్ధ్య పనులు, గడ్డి తొలిగించే పనులను చేయిస్తున్నారు. అరెస్టుకు ముందు వారికి ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తారు. జైలులోనూ... తప్పతాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై వీడియోలను చూపిస్తారు. మందు తాగకపోతే ఉండలేనివారికి జైలు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవసరమైనవారిని ఎర్రగడ్డలోని ఐఎంహెచ్ సంస్థకు తరలిస్తున్నారు.

లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు

పోలీసులు మొదట మందుబాబుల వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. తర్వాత వారిని కౌన్సిలింగ్‌కు పిలిచి, కోర్టులో హాజరుపరుస్తున్నారు. అక్కడ శిక్షలు ఖరారవుతున్నాయి. అయితే, కౌన్సెలింగ్‌కు వచ్చే చాలామంది ఇళ్లలో అసలు విషయం చెప్పుకోలేక... 'మిత్రుడి ఇంట్లో కార్యముంది. ఊరెళ్తున్నా. రెండ్రోజుల్లో వస్తా'మని చెబుతున్నారు. కానీ, వారు ఎంతకూ రాకపోవడం, సెల్‌ఫోన్లు మోగకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఠాణాల చుట్టూ తిరిగి, చివరికి విషయం తెలుసుకుని జైళ్లకు పరుగులు తీస్తున్నారు.

2017లో చంచల్‌గూడ జైలుకు వచ్చిన మందుబాబులు: జనవరిలో 412 మంది, ఫిబ్రవరి-450, మార్చి-435, ఏప్రిల్-506, మే- 611, జూన్-375, జులై-1,000, ఆగస్టు-917, సెప్టెంబరు-615, అక్టోబరు-650, నవంబరు-635, డిసెంబరు-1,015 మంది.

గ్రహం అనుగ్రహం

13-2-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
త్రయోదశి: రా. 10-34 తదుపరి చతుర్దశి
ఉత్తరాషాఢ నక్షత్రం: తె. 5-07 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: రా. 10-01 నుంచి 11-48 వరకు
వర్జ్యం: ఉ. 11-25 నుంచి 1-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-47 నుంచి 9-33 వరకు
తిరిగి రా. 10-58 నుంచి 11-48 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-33; సూర్యాస్తమయం: సా.5-56
మహాశివరాత్రి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.6	30.2
కరీంనగర్	15.0	31.5
మెదక్	17.1	35.2
నిజామాబాద్	19.0	30.0
హైదరాబాద్	19.0	31.6
హన్మకొండ	20.0	32.0
మహబూబ్‌నగర్	20.0	32.6
తిరుపతి	20.6	31.6
రామగుండం	21.4	32.0
ఖమ్మం	22.0	36.0
సూర్యాపేట	25.0	35.5

ఆదిలాబాద్‌లో 12 డిగ్రీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చలి క్రమంగా తగ్గుతోంది. గత రెండ్రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. సోమవారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండలో రాత్రిపూట 18, పగలు 28 డిగ్రీలుంది. పలు ప్రాంతాల్లో పగలు సాధారణంకన్నా 3 డిగ్రీల వరకూ తక్కువగా ఉంటోంది. భద్రాచలంలో ఇందుకు భిన్నంగా... ఆదివారం పగలు రికార్డుస్థాయిలో 38 డిగ్రీలకు పెరిగింది. ఇది సాధారణం కన్నా 5 డిగ్రీలు అదనం.

సుమారు రూ.268 లక్షల కోట్ల బడ్జెట్-2019కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆమోదం తెలిపారు. పాకిస్థాన్‌కు పౌర, సైనిక సాయంగా మొత్తం 33.6 కోట్ల డాలర్లు (రూ.2251 కోట్లు) ఇవ్వాలని నిర్ణయించారు.

గురుకుల పోస్టుల పరీక్షలు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

అసంపూర్ణంగా ఉంది. దీంతో అభ్యర్థుల వ్యక్తిగత వివరాలు, ఇచ్చిన ఆప్షన్లను ప్రత్యేకంగా పరిశీలించాలని నిర్ణయించింది. సీజీజీ నుంచి పూర్తివివరాలు అందిన తరువాత వీటిని పరిశీలిస్తుంది. నూతన పరీక్ష తేదీలను త్వరలో ప్రకటిస్తామని కమిషన్ వెల్లడించింది.

14 నుంచి దివ్యాంగులకు వైద్యపరీక్షలు

ప్రభుత్వ విభాగాల్లో ఏఈఈ పోస్టుల భర్తీ (నోటిఫికేషన్ నెం. 31/2017)లో భాగంగా దివ్యాంగ అభ్యర్థులకు ఈనెల 14 నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. వినికిడి లోపం కలిగిన వారికి 14న కోఠీలోని ప్రభుత్వ ఈఎన్‌టీలో, శారీరక వైకల్యం కలిగిన వారికి 15న ఉస్మానియా ఆసుపత్రిలో, అంధత్వం ఉన్న వారికి 16న సరోజినీదేవి ఆసుపత్రిలో వైద్యపరీక్షలు ఉంటాయి. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఆసుపత్రిలోని పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల వివరాలు, షెడ్యూలును టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు కమిషన్ తెలిపింది.

స్టెంట్ల ధరల్ని సవరించిన ప్రభుత్వం

- నేటి నుంచి అమల్లోకి

దిల్లీ

గుండె జబ్బుల చికిత్సలో వాడే స్టెంట్ల ధరల్ని సరిగ్గా ఏడాది క్రితం దాదాపు 85% మేర తగ్గించిన ప్రభుత్వం తాజాగా సోమవారం వాటి గరిష్ఠ ధరల్ని మార్పు చేసింది. సాధారణ స్టెంట్ల (బీఎంఎస్) ధరని ప్రస్తుతమున్న రూ.7,400 నుంచి రూ.7,660కి పెంచింది. ఔషధ పూత ఉన్న స్టెంట్ల (డీఈఎస్) ధరల్ని రూ.30,180 నుంచి రూ.27,890కి తగ్గించింది. ఇవి మంగళవారం నుంచే అమల్లోకి వస్తాయని 'జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ' (ఎన్‌పీపీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే మార్కెట్లు నిల్వ ఉన్న స్టెంట్లపైనా ఈ ధరలే వర్తిస్తాయని స్పష్టంచేసింది. ఈ స్టెంట్లు అత్యవసర ఔషధాల కిందికి వస్తాయనీ, అందువల్ల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వీటి ధరల్ని నియంత్రణలో ఉంచాల్సిన అవసరం ఉందని తెలిపింది. తయారీదారులు గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) మదింపులో వస్తు-సేవల పన్ను (జీఎస్‌టీ)ను మినహా ఇతర రుసుముల్ని జత చేయడానికి వీల్లేదని పేర్కొంది. యాంజియోప్లాస్టీ నిర్వహించే ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు, క్లినిక్కులన్నీ స్టెంట్ల ధరలపై ఉన్న గరిష్ఠ పరిమితిని గుర్తించాలని సూచించింది. రోగుల నుంచి వీటిపై డబ్బు వసూలు చేసేటప్పుడు తాము సూచించిన నిబంధనల్ని పాటించాలని తెలిపింది. కొత్త ఎంఆర్‌పీని ముద్రించాలనే పేరుతో స్టెంట్ల సరఫరాకు ఎక్కడా అవాంతరం కలగకుండా చూడాలని తయారీదారుల్ని ఆదేశించింది. 8% వ్యాపార లాభాన్ని కలిపే గరిష్ఠ ధరల్ని నిర్ణయించామనీ, దానిని మించి ఎవరి నుంచీ (జీఎస్టీ మినహా) అదనపు మొత్తం వసూలు చేయకూడదనీ తెలిపింది. మధ్యలో తాము మరో ప్రకటన వెలువరించకపోతే ఎంఆర్‌పీ ధరలు 2019 మార్చి 31 వరకు అమల్లో ఉంటాయని వివరించింది. అసలు ధరకు మూడునాలుగు రెట్ల అధిక ధరల్ని విదేశీ సరకు పేరుతో వసూలు చేస్తుండడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది.

తెలంగాణకు మరో మణిహారం

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల పెట్టుబడితో తొలిసారిగా అత్యున్నత నాణ్యత గల ప్రపంచశ్రేణి సీఎఫ్‌ఎం లీప్ ఇంజిన్లు, జెట్ ఇంజిన్లు, వాటి విభాగాల తయారీ, అసెంబ్లింగు, టెస్టింగు పరిశ్రమతో పాటు పరిశోధన, అభివృద్ధి కోసం ప్రతిభ కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి వైమానిక సెజ్‌లో రాష్ట్రప్రభుత్వం 40 ఎకరాలను కేటాయించింది. ఇందులో 21 ఎకరాలను అప్పగించింది. దీనిద్వారా 500 మంది వైమానిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతుంది. నగర శివార్లలోని ఆదిభట్లలో టాటా సంస్థ వైమానిక సెజ్‌లు నడుస్తున్నాయి. తాజాగా విమానాల ఇంజిన్లను, వాటి విడిభాగాల తయారీకి కొత్త పరిశ్రమ వస్తోంది. లీప్ ఇంజిన్లు చైనా, కొరియా, జపాన్‌లలోనే తయారవుతున్నాయి. దేశంలో తొలిసారిగా వీటిని భారత్‌లో ఉత్పత్తి చేయనున్నారు.

కేటీఆర్ చొరవతో: పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ గత ఏడాదిగా వైమానిక పరిశ్రమను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని జీఈ సంస్థను కోరుతున్నారు. 2016లో అమెరికా పర్యటన సందర్భంగా ఆయన సంస్థ ఛైర్మన్ జాన్ ఎల్.ఫ్లానరీతో కలిసి ఆహ్వానించారు. గత డిసెంబరులో దిల్లీలోనూ మరోసారి ఫ్లానరీని కలిసి ఈఅంశాన్ని ప్రస్తావించారు. వెంటనే జీఈ సంస్థ గత డిసెంబరులో ముంబయిలో జరిగిన కార్యక్రమంలో వైమానిక ఇంజిన్ల తయారీ పరిశ్రమ కోసం టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కేటీఆర్ వినతిని పరిగణనలోకి పరిశ్రమ స్థాపనకు హైదరాబాద్‌ను ఎంపిక చేశారు.


వైమానిక రంగానికి ఊతం: కేటీఆర్

ప్రపంచంలో పేరొందిన వైమానిక ఇంజిన్ల తయారీకి తెలంగాణ వేదిక కావడం గర్వకారణంగా ఉంది. ఇదో గొప్ప వరం. రాష్ట్రానికి ఇది తలమానికం. ప్రస్తుతం జీఈ సంస్థ వైమానిక ఇంజిన్ల తయారీలో అగ్రస్థానంలో ఉంది. వచ్చే అయిదేళ్లకు ఇంజిన్ల ఆర్డర్లు ఉన్నాయి. టాటాసంస్థ వైమానిక రంగంలో ముందంజలో ఉంది. రెండు ప్రపంచస్థాయి సంస్థలు చేతులు కలపడం శుభసూచకం. భారత్‌లో వైమానిక రంగం మరింతగా అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ దేశాలకు ఇంజిన్లను ఎగుమతిచేసే స్థాయికి ఎదుగుతుంది. విమానయాన నిపుణులను తీర్చిదిద్దాలి. ఇందుకు నైపుణ్య అకాడమీ ఉపయోగపడుతుంది. తెలంగాణ వైమానిక కేంద్రంగా మారింది. రెండు వైమానిక సెజ్‌లున్నాయి. 5 విమానాల విడిది కేంద్రాలున్నాయి. రెండు అత్యుత్తమ శిక్షణ సంస్థలు నడుస్తున్నాయి. తాజా పరిశ్రమ తెలంగాణలో వైమానికరంగం అభివృద్ధికి మరింత ఊతమిస్తుంది. ఈ పరిశ్రమకు సహాయ సహకారాలను అందిస్తాం.

భారత్‌లో తయారీ స్ఫూర్తితో: బన్మాలీ అగ్రవాల మాట్లాడుతూ "భారత్‌లో తయారీ స్ఫూర్తితో మా కొత్త ప్రాజెక్టు చేపడుతున్నాం. భారతదేశ రక్షణ, వైమానిక రంగాల్లో అగ్రగామిగా ఉంది. లీప్ ఇంజిన్లకు డిమాండు పెరుగుతున్నందున మాసంస్థ టాటాతో చేసుకున్న ఒప్పందం ద్వారా నిర్ణీత లక్ష్యాలను చేరుకుంటాం. ఈ పెట్టుబడి ద్వారా నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించడంతో పాటు ఎగుమతులను పెంచుతాం." అన్నారు.

రాష్ట్రప్రభుత్వం సత్వర స్పందన: విశాల్ వాంచూ మాట్లాడుతూ, "పరిశ్రమ స్థాపనకు మంత్రి కేటీఆర్, రాష్ట్రప్రభుత్వం అధికారుల నుంచి చక్కటి సహకారం అందింది. గడువు కంటే ముందే భూములను అప్పగించారు. డిసెంబరు నాటికి ఈ పరిశ్రమలో ఇంజిన్‌ను ఉత్పత్తి చేస్తాం. మా సంస్థ జీఈతో పాటు టాటా ప్రపంచంలోనే మహోన్నత చరిత్ర గలవి. హైదరాబాద్‌లోని పరిశ్రమ ద్వారా సీఎఫ్‌ఎం ఇంజిన్లతో పాటు వాణిజ్య, మిలటరీ ఇంజిన్లను తయారుచేస్తాం.' అని వెల్లడించారు.

ఇదీ సంగతి!



రూ.600 కోట్ల రుణాలకు మార్కెటింగ్ శాఖ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: రైతుల నుంచి కందులను మద్దతు ధరకు కొనేందుకు రూ. 600 కోట్లను బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు హాకా, మార్క్‌ఫెడ్‌లకు అనుమతిస్తూ మార్కెటింగ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో సంస్థ రూ. 300 కోట్లను తీసుకునేందుకు ప్రభుత్వం పూచీకత్తునిస్తున్నట్లు తెలిపింది.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు అర్హతల మార్పు

- 14 కోర్సుల అభ్యర్థులు అర్హులే
- త్వరలో ఉత్తర్వులు

ఈనాడు - హైదరాబాద్

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల విద్యార్హతలను తెలంగాణ ప్రభుత్వం విస్తరించింది. ప్రస్తుతం ఈ పోస్టులకు ఇంటర్, డీఎంఎల్‌టీ లేదా బీఎస్సీ (ఎంఎల్‌టీ) పూర్తిచేసినవారినే అర్హులుగా ప్రకటించింది. అయితే, మరిన్ని కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకూ అవకాశమివ్వాలని నిర్ణయించింది. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 103, వైద్యవిద్య సంచాలకుల పరిధిలో 88, వైద్యవిధాన పరిషత్ పరిధిలో 9 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గతేడాది నియామక ప్రకటనను వెలువరించింది. ఈ పోస్టులన్నింటికీ ఇంటర్మీడియేట్, డీఎంఎల్‌టీ లేదా బీఎస్సీ (ఎంఎల్‌టీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. గతనెల 24తో అందుకు గడువు ముగిసింది. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇతర విద్యార్హతలున్నవారూ అర్హులేననీ, వారినీ పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి వినతులు వచ్చాయి. దీంతో ఇతరత్రా కోర్సులను పూర్తిచేసినవారికీ అవకాశమివ్వాలని సర్కారు నిర్ణయించింది. అర్హతల్లో మార్పులు చేయడంతో పాటు... దరఖాస్తు గడువును ఈనెల 25 వరకూ పొడిగించాల్సిందిగా టీఎస్‌పీఎస్సీకి వైద్యఆరోగ్యశాఖ త్వరలోనే ఉత్తర్వులీయనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. తాజా నిబంధనల ప్రకారం ఈ కింది కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులందరూ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు అర్హులే.

- సర్టిఫికెట్ ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు
- ఎంఎల్‌టీ(ఒకేషనల్)/ఇంటర్మీడియేట్(ఎంఎల్‌టీ-ఒకేషనల్)తో ఏడాది పాటు క్లినికల్ శిక్షణ.
- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ)
- బీఎస్సీ(ఎంఎల్‌టీ)/ఎంఎస్‌సీ(ఎంఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ (క్లీనికల్ పాథాలజీ) టెక్నీషియన్ కోర్సు
- బ్యాచ్‌లర్ ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ (బీఎంఎల్‌టీ)
- పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ
- పీజీ డిప్లొమా ఇన్ క్లీనికల్ బయోకెమిస్ట్రీ
- బీఎస్సీ(మైక్రోబయాలజీ)/ఎంఎస్సీ మైక్రోబయాలజీ
- బీఎస్సీ (మెడికల్ బయోకెమిస్ట్రీ)
- బీఎస్సీ (క్లీనికల్ మైక్రోబయాలజీ)
- ఎంఎస్సీ (బయోకెమిస్ట్రీ)

చిన్న విమానం కుప్పకూలి నలుగురి దుర్మరణం

శాంటాక్లరీటా: దక్షిణ కాలిఫోర్నియాలోని యాగ్వాడుల్సీ సమీపంలో ఒక చిన్న విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న నలుగురు మరణించారు. బాధితులెవరన్నది ఇంకా గుర్తించలేదు. ఒకే ఇంజిన్ ఉన్న ఈ విమానం ప్రయోగాత్మక విమానమని అధికారిక పత్రాలను బట్టి తెలుస్తోంది.

మూడు జిల్లాలకు తెదేపా అధ్యక్షుల నియామకం

ఈనాడు, హైదరాబాద్: 3 జిల్లాలకు తెదేపా అధ్యక్షులను నియమించారు. నల్గొండకు ఎండీ యూసుఫ్‌ను, సూర్యాపేటకు పెద్దిరెడ్డి రాజా, యాదాద్రి జిల్లాకు బండ్రు శోభారాణిని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ తెలిపారు.









ఈనాడు

గుర్తింపే ప్రాణాధారమా?

కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడటం అంటే ఇదే. అవినీతి బొక్కల ఆట కట్టించి నిరుపేదలకు సర్కారీ సేవలు, రాయితీలు నిరంతరాయంగా చేరేందుకంటూ ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన ఆధార్- అధికారగణాల అత్యుత్సాహం కారణంగా ఆ బడుగుల ప్రాణాలకే ముప్పుగా పరిణమించడం దిగ్భ్రాంతపరచేదే! ఆధార్ కార్డు తీసుకు రాలేదని ఓ నిండు చూలాలిని చేర్చుకోవడానికి గురుగ్రామ్‌లోని ఓ ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది నిరాకరించడం నిశ్చేష్టపరిచింది. ఆధార్ సంఖ్య చెబుతామన్నా ససేమిరా అన్న సిబ్బంది అమానవీయంగా చూలింతను గెంటేయడంతో వార్డు బయటే ఆమె ప్రసవించిన వైనం గుండెల్ని మెలిపెడుతోంది. కార్గిల్ యుద్ధంలో కనుమూసిన అమర జవాను భార్యకు ఆధార్ కార్డు చేతిలో లేనిదే చికిత్స చెయ్యబోమంటూ హరియాణాలోని సోనిపట్ వైద్యులు తలాడించడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ లబ్ధిదారులకూ ఆధార్ తప్పనిసరి చెయ్యడంతో, కార్డు లేని కారణంగా బియ్యం తెచ్చుకోలేక కొంతమంది ఆకలిచావులకు గురైన వ్యధార్త ఘటనలూ నమోదయ్యాయి. పౌరులందరికీ రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కునే ఆధార్ తొక్కిపెడుతున్నట్లుగా సాగిన దుష్పరిణామాలపై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ తీవ్రంగా స్పందించింది. ఆధార్ లేని కారణంగా ప్రజలకు ఎలాంటి అత్యవసర సేవలు, పథకాలు, సౌకర్యాలను దూరం చెయ్యరాదని స్పష్టీకరించింది. ఎవరికైనా ఆధార్ లేకపోయినా, ఆన్‌లైన్ పరిశీలనలో గుర్తింపు సరిపోలకపోయినా, వారిని ప్రత్యామ్నాయ పత్రాల ద్వారా గుర్తించి సకల సేవలు అందించాల్సిందేనని ప్రభుత్వాధికార గణాలకు నిర్దేశించింది. ఆధార్ చట్టంలోని ఏడో సెక్షన్ ప్రకారం- ప్రజలకు ఏ సౌకర్యాలనూ దూరం చెయ్యడానికి, నిరాకరించడానికి వీల్లేదు. కొన్నేళ్ల వ్యవధిలోనే త్రివిక్రమావతారం దాల్చిన ఆధార్- పౌరుల సకల జీవన పార్శ్వాలనూ అనుచితంగా ప్రభావితం చేస్తున్న వేళ, సరైన దిద్దుబాటు చర్యలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గీయాల్సిన విస్పష్ట లక్ష్మణ రేఖలు!

పన్నెండు పంచవర్ష ప్రణాళికలు కాలగర్భంలో కలిసిపోయినా, ఇండియా ఇంకా దిగువ మధ్యాదాయ దేశంగానే మనుగడ సాగిస్తోంది. పేదరిక నిర్మూలన లక్ష్యాన్ని సత్వరం సాధించాలంటే, ఎక్కడికక్కడ అవినీతిని మట్టుపెట్టాలన్న సదాశయం నుంచే ఆధార్ పురుడుపోసుకొంది. దేశవాసుల్లో ప్రతి ఒక్కరి పేరు, వయసు, చిరునామాతోపాటు బయోమెట్రిక్ పద్ధతిలో వారి వేలిముద్రలు, కనుపాపల చిత్రణలు సేకరించిన ఆధార్ ఓ మహా యజ్ఞమనడంలో మరోమాట లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీల బిల్లు ఏటా మూడున్నర లక్షల కోట్ల రూపాయలకు చేరిన తరుణంలో లబ్ధిదారుల గుర్తింపునకు జన్‌ధన్ యోజన, ఆధార్, మొబైల్ (జామ్) అనుసంధానం ద్వారా సమాచార నిధిని పటిష్ఠీకరించాలని మోదీ సర్కారు నిర్ణయించింది. 2016లో ఆధార్ చట్టబద్ధత కాకముందే- ఆ కార్డు లేదన్న కారణంగా ఏ ఒక్కరికీ ఎలాంటి లబ్ధినీ నిరాకరించరాదని సుప్రీంకోర్టు మానవీయంగా స్పందించింది. మొత్తం సబ్సిడీల భారంలో 30 శాతం అనర్హుల పాలవుతున్నందున ఆ అవినీతి కంతల్ని పూడ్చాలనుకోవడంలో ఎలాంటి తప్పూ లేదు. కాయకష్టంతో పొట్టపోసుకొనే నిరక్షరకుక్షులు కోట్ల సంఖ్యలో పోగుపడ్డ దేశంలో ఆధార్‌పై అవగాహన కలిగించి కార్డుల్ని వారికి నేరుగా అందించే బృహత్ యత్నం సాఫీగా జరిగిందా అంటే- లేదన్నదే జవాబు! ఇప్పటికి దాదాపు 120 కోట్లమంది ఆధార్ సంఖ్యల్ని పొందారని అంటున్నారు. తెలంగాణలో జనసంఖ్యను మించి ఆధార్ నంబర్లు జారీ అయ్యాయని నీతి ఆయోగ్ వెల్లడించిన నేపథ్యంలో- లోటుపాట్ల సాక్షిగా మరెన్నో కోట్లమందికి ఆధార్ ఇంకా అందలేదని తెలుస్తూనే ఉంది. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, అత్యవసర పరిస్థితుల్లో ఆధార్ చేతిలో సిద్ధంగా లేనికారణంగా ప్రాణావసర సేవల నిరాకరణ సమున్నత లక్ష్యం మౌలిక స్ఫూర్తికే తూట్లు పొడుస్తోంది!

ఆధార్ లేని కారణంగా సామాజిక భద్రతా ప్రయోజనాల్ని ఏ ఒక్క పౌరుడికీ నిరాకరించబోమని, ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు (రేషన్ కార్డుల వంటివి) పత్రాలతో వాటిని పొందగల వీలుందని మొన్న గురువారమే కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ఆ మేరకు నిరుడు డిసెంబరు 19నే నోటిఫికేషన్ జారీ చేశారంటున్నా- క్షేత్రస్థాయి స్థితిగతులు భిన్నంగా ఉన్నాయి. నిరుడు డిసెంబరు 15నాటికి- అయిదేళ్ల వయసులోపు పిల్లల్లో 43.4 శాతానికే ఆధార్ సంఖ్య కేటాయింపు జరిగిందని, మధ్యాహ్న భోజన సేవలు పొందుతున్న ఆరు నుంచి పద్నాలుగేళ్ల లోపు పిల్లల్లో 23 శాతానికి ఆధార్ లేదని కేంద్రప్రభుత్వమే చెబుతోంది. తప్పుల తడక వివరాలతో ఆధార్ కార్డు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోందని మొత్తుకొంటున్నవారు, తమ గుర్తింపు సంఖ్య సామాజిక భద్రతా పథకాలకు అనుసంధానం కాలేదని వాపోతున్న వారు, నెట్‌వర్క్ సమస్యల కారణంగా గుర్తింపు సరిపోలక ప్రతి నెలా దురవస్థల పాలవుతున్నవారూ విస్తృత సంఖ్యలో ఉన్నట్లు పలు వార్తాకథనాలు చాటుతున్నాయి. ఆధార్ సంబంధ సమస్యల కారణంగా రేషన్ అందలేదని దిల్లీ హైకోర్టులోనే వెయ్యి ప్రమాణ పత్రాలు దాఖలయ్యాయి. ఆధార్ కారణంగా కోట్లమంది నిత్యావసర సేవలకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆమ్నెస్టీ, హ్యూమన్‌రైట్స్ వాచ్ సంస్థలు నెలరోజులనాడే హెచ్చరించాయి. ఆధార్ వివరాలందించలేదని సమాచార హక్కు దరఖాస్తుల్నీ తిరస్కరించే స్థాయిలో అధికార శ్రేణుల పైత్యప్రకోపం ఆలోచనాపరుల్ని కుపితుల్ని చేస్తోంది. యథాలాపంగా నోటిఫికేషన్లు జారీ చెయ్యడం కాదు, ఆధార్ పేరిట నయాపీడనకు పాల్పడుతున్నవాళ్ల పీచమణిచే పటిష్ఠ కార్యాచరణే జనసామాన్యం ఆందోళనను ఉపశమింప చెయ్యగలిగేది!

సంస్కరణల రథం అవరోధాల పథం





ఎ.సూర్యప్రకాశ్

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో లెక్కలేనన్ని ప్రయోజనాలతో పాటు కొన్ని అసంగతాలూ లేకపోలేదు. సార్వత్రిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి, అధికారం చేపట్టి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుద్దామని ఉత్సాహపడే రాజకీయ పక్షానికి రాజ్యసభలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. కీలక ఆర్థిక, రాజకీయ సంస్కరణలకు సంబంధించి లోక్‌సభలో బిల్లులు నెగ్గించుకోగలుగుతున్న పాలక పార్టీలకు, ఎగువసభలో మాత్రం తరచూ చుక్కెదురవుతోంది. లోక్‌సభలో సాధారణంగానే బలం నిరూపించుకోగలుగుతున్న అధికార పార్టీ- రాజ్యసభకు వచ్చేసరికి విపక్షాల హవా ముందు తేలిపోతోంది. దేశంలో కాంగ్రెస్ ఏకపక్ష పాలన కొనసాగినన్నాళ్లూ ఈ సమస్య తలెత్తలేదు. ఎప్పుడైతే కాంగ్రెసేతర పక్షాలు అధికారంలోకి వచ్చాయో సమస్యలు మొదలయ్యాయి. సుదీర్ఘకాలంగా కాంగ్రెసేతర రాజకీయ పక్షాలకు తలెత్తిన సమస్యే ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఎదుర్కొంటున్నారు. రాజ్యసభలో కీలక బిల్లులకు ఆమోదం దక్కకపోవడంతో మోదీ సర్కారు కొంత ఇబ్బందికరమైన పరిస్థితినే ఎదుర్కొంటోంది.




'శాసన నిర్మాణ, పాలన క్రమానికి రాజ్యసభ అడ్డంకిగా పరిణమించకుండా అన్ని చర్యలూ తీసుకున్నాం'

– ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యులు

అభివృద్ధికి అడ్డు

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి సాఫీగా తీసుకువెళ్లే క్రమంలో అడుగడుగునా విపక్షాలు అడ్డుపడుతున్న తీరును ప్రధాని మోదీ కొంతకాలంగా తీవ్రంగా ఎండగడుతున్నారు. ముమ్మార్లు తలాఖ్ బిల్లు, వెనకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లులను రాజ్యసభలో విపక్షాలు మోకాలడ్డిన తీరును బెంగళూరులో కొంతకాలం క్రితం నిర్వహించిన ఓ రాజకీయ ర్యాలీలో ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. వెనకబడిన తరగతుల బిల్లు 2017 ఏప్రిల్‌లో; ముమ్మార్లు తలాఖ్ బిల్లు 2017 డిసెంబరులో లోక్‌సభలో ఆమోదం పొందాయి. అయితే దిగువసభ గడపదాటిన ఆ బిల్లులకు ఎగువ సభలో మాత్రం మోక్షం దక్కలేదు. లోక్‌సభలో మెజారిటీ ఉంది కదా అని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అమితోత్సాహంతో కదిలే పాలకపక్షాలకు రాజ్యసభ అతిపెద్ద ప్రతిబంధకంగా నిలుస్తోంది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో- సాధ్యమైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో పాగావేసి రాజ్యసభలో బలం పెంచుకునేందుకు అధికార పార్టీలు సాధారణంగా పావులు కదుపుతాయి. ఆ క్రమంలో రాష్ట్రాల అసెంబ్లీలను చేజిక్కించుకోవడంలో అధికారం నెరపే పార్టీ కొంతమేర సానుకూల ఫలితాలే రుచి చూడవచ్చు. ఫలితంగా రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో చెప్పుకోదగిన మేర తమ బలాన్ని పెంచుకోనూ వచ్చు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో రెండు దఫాలు మాత్రమే కేంద్ర సర్కారు సరైన దృష్టి పెట్టి పని చేయగలుగుతోంది. మూడో దఫా మీద దృష్టిపెడదామనుకునేలోపు మళ్ళీ సార్వత్రిక ఎన్నికలు తరుముకుంటూ వచ్చేస్తున్నాయి. దాంతో కథ మొదటికొస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకోవడంతోపాటు, అత్యధిక రాష్ట్రాలు చేజిక్కించుకున్న పార్టీకి ఉభయ సభల్లోనూ ఆధిపత్యం దక్కుతోంది.

ఉభయ సభలతో 1952లో పాలన ప్రస్థానం ప్రారంభమైంది మొదలు దేశంలో అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీయే ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగించింది. రాజ్యసభలోనూ ఆ పార్టీదే స్పష్టమైన మెజారిటీ! జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల జమానాల్లో ఉభయ సభల్లో చాలావరకు కాంగ్రెస్ ఆధిపత్యమే సాగింది. నెహ్రూ హయాములో ఉభయ సభలు పూర్తిగా హస్తంపార్టీ కనుసన్నల్లోనే నడిచేవి. ఇందిర, రాజీవ్‌ల పాలనలో కొంతకాలం మినహా రాజ్యసభలో మెజారిటీ సీట్లు కాంగ్రెస్ చేతిలోనే ఉండేవి. నెహ్రూ అనంతరం ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన లాల్‌బహదూర్ శాస్త్రి జమానాలోనూ ఎగువ సభలో హస్తం పార్టీ హవాయే సాగింది. మరోవంక కాంగ్రెసేతర పార్టీలకు, ప్రధానులకు దురదృష్టవశాత్తూ ఆ సౌలభ్యం దక్కలేదు. పీవీ నరసింహారావు జమానా విలక్షణమైనది. ఆయనకు రాజ్యసభలో కేవలం 85 నుంచి 99 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉండేది. చివరికి లోక్‌సభలోనూ ఆయనది మైనారిటీ ప్రభుత్వమే! దిగువ సభలో కేవలం 232 మంది సభ్యుల బొటాబొటీ దన్నుతోనే





కీలక బిల్లులకు ఎగువ గండం

దేశం కనీవినీ ఎరుగని విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి- నెహ్రూ-గాంధీ జమానా నాటి కుహనా సామ్యవాద విధానాలకు పీవీ నరసింహారావు చరమగీతం పాడగలిగారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరేళ్లపాటు ప్రధానిగా ఉన్నప్పటికీ రాజ్యసభలో భాజపా బలం ఏనాడూ 50కి మించలేదు. 1989 తరవాత 30 ఏళ్లపాటు భారత్‌లో ఏ ప్రధానమంత్రీ రాజ్యసభలో పూర్తి మెజారిటీ అనుభవించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలకు రాజ్యసభలో విపక్షం మోకాలడ్డుతోందన్న ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

మరికొద్ది నెలల్లో రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న మూడింట ఒకవంతు సభ్యుల పదవీ కాలం ముగియబోతోంది. ప్రస్తుతం భాజపాకు రాజ్యసభలో 58మంది సభ్యుల మద్దతు ఉంది. 245 సభ్యుల రాజ్యసభలో మిత్రపక్షాలతో కలిసి భాజపా అటు ఇటుగా 80దాకా బలం చూపించుకోగల పరిస్థితి ఉంది. ఈ దఫా జరగబోయే ఎన్నికల్లో రాజ్యసభలో భాజపా బలం ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు. అయితే రాజ్యసభలో సాధికారికంగా బిల్లులు నెగ్గించుకోవడానికి అవసరమైన మెజారిటీ 123. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ దఫా ఎన్నికల్లో భాజపాకు రాజ్యసభలో ఆ స్థాయి మెజారిటీ దఖలుపడదు. మొదటినుంచీ ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేస్తూ మోదీ ప్రభుత్వం ముందుకు కదులుతోంది. 2014లో ఎన్‌డీయే అధికారంలోకి వచ్చింది మొదలు రాజ్యసభలో మోదీ తీవ్రమైన ప్రతికూలతను ఎదుర్కొంటూనే ఉన్నారు. కీలక ఆర్థిక సంస్కరణ మద్దతు కూడగట్టుకునే క్రమంలో విపక్షాల రూపంలో ఆయనకు రాజ్యసభలో ముప్పుతిప్పలు ఎదురయ్యాయి. బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనలు) బిల్లు, బీమా చట్టాల (సవరణ) బిల్లు వంటి వాటి విషయంలో ఎన్‌డీయే తీవ్ర ప్రతిఘటన చవిచూసింది. సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాలకోసం తలపెట్టిన కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించే క్రమంలో మోదీ సర్కారు ఇబ్బందులు ఎదుర్కొంది. రాజ్యసభ పలు సవరణలు సూచించడంతో ఓబీసీ బిల్లు కిందటి నెల లోక్‌సభకు తిరిగి వచ్చింది. మోదీ ప్రభుత్వం ఆ బిల్లును లోక్‌సభలో తిరిగి ప్రవేశపెట్టింది. రాజ్యసభలో సూచించిన సవరణలన్నింటినీ తిరస్కరించాలని తమ సభ్యులకు నిర్దిష్ట దిశానిర్దేశం చేసింది. ఈ రకంగా ఉభయసభల మధ్య వివిధ బిల్లులు గోడకు కొట్టిన బంతుల్లా అటు ఇటు తిరుగుతున్న పరిస్థితి పాలన సంస్కరణలను అటకెక్కిస్తోంది.

రాజ్యసభలో పార్టీలవారీగా సభ్యుల సంఖ్య

భాజపా	58	జనతాదళ్ (యు)	7	అకాలీదళ్	3
కాంగ్రెస్	54	స్వతంత్రులు, ఇతరులు	6	తెరాస	3
సమాజ్‌వాది	18	తెదేపా	6	శివసేన	3
ఏఐఏడీఎంకే	13	ఎన్‌సీపీ	5	పీడీపీ	2
తృణమూల్ కాంగ్రెస్	12	బీఎస్‌పీ	5	మరో పదకొండు పార్టీలకు ఒక్కో ఎంపీ ఉన్నారు	
బిజూ జనతాదళ్	8	డీఎంకే	4		
నామినేటెడ్ సభ్యులు	8	ఆమ్‌ఆద్మీ పార్టీ	3	ఖాళీల సంఖ్య	6
సీపీఐ(ఎం)	7	ఆర్‌జేడీ	3	**మొత్తం సభ్యులు**	**245**

అభ్యంతరాలతో ఆలస్యం

ముమ్మార్లు తలాఖ్ బిల్లును లోక్‌సభ 2017 డిసెంబరు 28న ఆమోదించింది. అయితే రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ ఆ బిల్లుపై అనేక అభ్యంతరాలు లేవనెత్తింది. ఆ బిల్లును 'సెలక్ట్ కమిటీ'కి పంపాలని గట్టిగా పట్టుపట్టింది. దేశ సామాజిక వికాసానికి అత్యంత అవసరమైన రెండు కీలకమైన పాలన సంస్కరణలు- ప్రభుత్వానికి రాజ్యసభలో మెజారిటీ లేని కారణం వల్ల మూలనపడ్డాయి. నిజానికి ఇది తీవ్రంగా ఆందోళన చెందాల్సిన పరిస్థితి. దేశ సామాజిక, ఆర్థిక వికాసానికి చట్టసభలు బాటలు పరుస్తాయి. అయితే రాజకీయ కారణాలతో అత్యంత అవసరమైన బిల్లులకూ మోకాలడ్డి, వెనక్కి తిప్పికొడుతున్న సంస్కృతి దేశాన్ని వెనక్కిలాగుతుందనడంలో సందేహం లేదు. రాజ్యాంగ పరిషత్‌లో ఉభయ సభల ఆవశ్యకతపై సుదీర్ఘ చర్చోపచర్చలు జరిగాయి. ఆ చర్చల్లో చురుగ్గా పాల్పంచుకొన్న మెజారిటీ సభ్యులు ఎగువసభ ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఉభయ సభలు సమాన అధికారాలు కలిగి ఉన్నప్పటికీ- రాజ్యాంగ నిర్మాతలు రాజ్యసభకు చిన్నపాటి పరిమితులూ నిర్దేశించడం గమనార్హం. ఆర్థిక బిల్లులకు సంబంధించిన అంశాల్లో లోక్‌సభ మాటే చెల్లుబాటు అవుతుందని వారు తీర్మానించారు. ఎగువ సభ ఉండాలా అన్న చర్చ రాజ్యాంగ పరిషత్తులో వచ్చినప్పుడు, దాని అవసరాన్ని గట్టిగా తెలియపరచినవారిలో ఎన్.గోపాలస్వామి అయ్యంగార్ ముఖ్యులు. దేశ పురోగతికి అత్యవసరమైన కీలక బిల్లులు రాజ్యసభలో ఆమోదం లభించక ఈసురోమనే దుస్థితి భవిష్యత్తులో తలెత్తుతుందని బహుశా ఆయన ఊహించి ఉండరు. దేశంలో 130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సామాజిక, ఆర్థిక సంస్కరణలకు మోకాలడ్డుతూ తిరోగామి శక్తిగా వ్యవహరించే తీరు అయ్యంగార్ వంటివారి ఊహకు అంది ఉండదు! ఎన్‌డీయే తలపెట్టిన పాలన సంస్కరణలకు రాజ్యసభలో అడ్డుకట్టపడుతున్న తీరు- అయ్యంగార్ వంటివారి ఆదర్శాల మేరకు ప్రస్తుత రాజకీయాలు సాగడం లేదన్న విషయాన్నే కళ్లకుకడుతున్నాయి.

(రచయిత– ప్రసారభారతి ఛైర్మన్)

సాధికారతతోనే స్వావలంబన

మహిళలను గౌరవించని దేశం ఎప్పటికీ గొప్పది కాలేదన్నారు స్వామి వివేకానంద. స్త్రీలకు విద్య అందిస్తే ఎలాంటి సంస్కరణలు తమకు అవసరమో వారే నిర్ణయించుకుంటారన్నారు. వివేకానందుడు లక్షించిన విధంగా మహిళాలోకం అనేకానేక రంగాల్లో భారత మహిళ వడివడిగా అడుగులు వేసుకుంటూ ముందుకు దూసుకెళ్లింది. ఎంతగా అణచివేతకు గురవుతున్నా, మహిళలు అనాదిగా దేశ నిర్మాణంలో తమ ఉనికిని ఘనంగా చాటుకుంటూ వస్తున్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ నాటి తరం జాతీయ నాయకులతో సమఉజ్జీలుగా నిలిచి పోరాటాన్ని ముందుండి నడిపించారు. అలాంటివారిలో సరోజినీ నాయుడు అగ్రగణ్యులు. ఆమె జన్మదినమైన ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏటా దేశంలో నిర్వహిస్తున్నారు. ఏటేటా మహిళా దినోత్సవాలు వచ్చిపోతున్నాయే కానీ, స్వామి వివేకానంద కోరుకున్న విధంగా రాజ్యాంగపరమైన మహిళా సాధికారత దేశంలో నేటికీ సాకారం కాకపోవడం- జాతి విషాదం!

స్త్రీ-పురుష సమానత్వంపై దేశంలో ఎప్పటి నుంచో చర్చ సాగుతోంది. ఆకాశంలో సగం అన్న భావనల నినాదాలే గాని, క్షేత్రస్థాయిలో అణచివేత షరా మామూలుగా సాగుతోందన్నది నిష్ఠుర సత్యం. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి సాంఘిక దురాచారాలను తలకెత్తుకున్న సమాజం మనది. వృద్ధులకు పసిపిల్లల్ని ఇచ్చి పెళ్ళిళ్లు చేయడం, భర్త చనిపోతే ఆ బాలిక జీవితాంతం వైధవ్యంతో బాధపడటం లాంటి విషాదాలు నిన్నమొన్నటి వాస్తవాలు. రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం వంటి మహానుభావులు మహిళాలోకంలో సంస్కరణల కోసం పోరాడారు. సాంఘిక దురాచారాలపై విజయాలు సాధించారు. వారి పోరాటం ఫలితంగా కాలక్రమంలో సంఘంలో అనేక సానుకూల మార్పులు వచ్చాయి. విద్యావకాశాలు మహిళలకు అందివచ్చాయి. భారతీయ మహిళ చైతన్యవంతురాలైంది. మహిళా సమస్యల పరిష్కారానికి ఉమ్మడి వేదిక ఏర్పాటుచేయాలని 1974లోనే గట్టిగా నినదించారు. ఫలితంగా 1976లో కేంద్రప్రభుత్వం మహిళల కోసం జాతీయ కార్యాచరణ పథకాన్ని తీసుకొచ్చింది. 1988లో జాతీయ దృక్పథంతో కూడిన ప్రణాళికను స్త్రీల కోసమే ప్రకటించారు. మహిళల సమగ్ర అభివృద్ధికి దీర్ఘకాలిక విధానపత్రాన్ని ఇది రూపొందించింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళల సంక్షేమానికి 1988లో జాతీయస్థాయి కమిటీ పలు సిఫార్సులు చేసింది. బాలికలు, యువతుల అభివృద్ధి కోసం 1991లో జాతీయ కార్యాచరణను రూపొందించారు. విద్య, ఆరోగ్యం, జనాభాపై రూపొందించిన పలు జాతీయ విధానాల్లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమానికి పలు చర్యలను జాతీయ కమిటీ సూచించింది.

మహిళలు ఎంతగా చైతన్యవంతులవుతున్నా, ప్రభుత్వాలు ఎన్ని పథకాలతో ముందుకువస్తున్నా అణచివేత, అరాచకాలకు కళ్లెం పడకపోవడం బాధాకరం. దేశంలో రోజురోజుకు అతివలపై ఇంటా బయట పెచ్చరిల్లుతున్న



నేడు జాతీయ మహిళా దినోత్సవం

హింసా దౌర్జన్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, భ్రూణ హత్యలు, లింగ విచక్షణ, బాల్యవివాహాలు, అక్రమ రవాణా, వరకట్న వేధింపులు కొనసాగుతూనే ఉండటం కలచివేస్తుంది. దేశంలో 79 శాతం మహిళలు లైంగిక హింస ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్య సమితి నివేదిక సైతం స్పష్టీకరించింది. అసంఘటిత రంగంలో మహిళలు శ్రమదోపిడికి గురవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కోట్ల సంఖ్యలో మహిళలు ఏళ్ల తరబడి వ్యవసాయ రంగంలో నిలదొక్కుకుని పని చేస్తున్నారు. వారిలో దాదాపు 40 శాతం కూలీలుగానే మగ్గిపోతున్నారు. ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు, ఉపాధి వెదుక్కొంటూ కొత్త ప్రాంతాలకు వలసపోతున్న సమయంలో మహిళలు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. ఎన్ని కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ కొన్ని తరాలుగా మహిళలు సేద్య రంగంలోనే ఉంటూ దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా నిలదొక్కుకుని ఉండటానికి పాటుపడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తి, అభివృద్ధిలో వారి తోడ్పాటు గణనీయమైంది. గ్రామీణ భారతంలో వేతనాలపై కేంద్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన నివేదిక ప్రకారం, వ్యవసాయ రంగంలో వేతనాల విషయంలో మహిళల పట్ల విచక్షణ స్పష్టంగా వెల్లడైంది. పురుషులు పొందుతున్న వేతనాల్లో 27.6 శాతం మొత్తమే మహిళలకు లభిస్తోందని కేంద్ర కార్మికశాఖ కుండ బద్దలుకొట్టింది. మహిళా రైతుల దుస్థితిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.

ఇక 1993లో 73, 74 రాజ్యాంగ సవరణలతో మహిళలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. అయినా మహిళల చాటున పురుషులే అధికారం చలాయిస్తున్న దుస్థితి నెలకొని ఉంది. మహిళా సాధికారతకు దోహదపడే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఈ దిశగా క్రియాశీల చొరవ కనబడటమే లేదు. దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్రాల మహిళా కమిషన్ల పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. విభజన చట్టం పదో షెడ్యూల్‌లో ఉన్నందువల్ల పూర్తిస్థాయి నిధులు, విధులు, సిబ్బంది వాటికి సమకూరడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమించిన పాలకవర్గం ప్రస్తుతం తెలంగాణ మహిళా కమిషన్‌గా కొనసాగుతోంది. ఏపీలో మహిళా కమిషన్‌కు అవసరమైన మేర నిధులు, పూర్తిస్థాయి కార్యాలయం, తగినంత సిబ్బంది లేకపోవడంతో అనేక కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

ఆధునిక విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్న రోజులివి. ఎప్పటికప్పుడు సరికొత్త సమస్యలు పుట్టుకొచ్చి మహిళా లోకాన్ని వేధిస్తున్నాయి. బాలికల నుంచి యువతులు, వృద్ధుల వరకు అన్ని వయోపరిమితులవారు బయటకు చెప్పుకోలేని సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాబట్టి, మారుతున్న రోజులకు అనుగుణంగా మహిళా కమిషన్ల పరిధిని మరింతగా విస్తరించాలి. జనవరి 31న రజతోత్సవ వేడుకలను నిర్వహించుకున్న జాతీయ మహిళా కమిషన్‌కు ప్రభుత్వం మరింత దన్నుగా నిలవాలి. తద్వారా దేశంలోని మహిళా లోకానికి మెరుగైన భవిష్యత్తుకు భరోసా కల్పించాలి!

– నల్లాని రాజేశ్వరి

ఈనాడు లేఖలు

గుట్కాను అరికట్టాలి

పలు ప్రాంతాల్లో గుట్కా వాడకం ఎక్కువవుతోంది. కొంతమందికి అది నిత్యావసర వస్తువుగా మారిందంటే ఆశ్చర్యపడనక్కర్లేదు. దుకాణాల్లో లభించేవాటిని కొని విచ్చలవిడిగా వాడటం వల్ల, వారు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆటోల వంటి వాహనాలు నడపడం ద్వారా పొట్టపోసుకునే యువకులు ఆయా పదార్థాల వినియోగం కారణంగా ఏకాగ్రత కోల్పోయి రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాల్ని హరించడంతో పాటు అనేక కష్టనష్టాలకు దారితీసే గుట్కాల పట్ల తెలంగాణ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించాలి. వాటి తయారీ, రవాణా, నిల్వ, క్రయవిక్రయాలపై పూర్తిస్థాయి నిషా వేయాలి. ఆయా దుకాణాలపై దాడుల్ని నిర్వహించి, వాటిని స్వాధీనం చేసుకుంటేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. నామమాత్ర చర్యలతో ఒరిగేదేమీ ఉండదు. నోటి క్యాన్సర్, ఇతర వ్యాధులకు మూలమవుతున్న గుట్కాల పని పడితే తప్ప, ఆరోగ్య పరిరక్షణ సాధ్యం కాదు.

- జఫరుల్లా ఖాన్, మహబూబ్‌నగర్

ఫోన్లతో బెడద

నిబంధనల్ని అతిక్రమించడం కొంతమందికి పరిపాటిగా మారింది. ముఖ్యంగా చరవాణిలో సంభాషణ అలవాటుగా మొదలై, వ్యసనంగా తయారై, రోడ్డు మీద వెళుతున్నప్పుడు కూడా పరిసరాల్ని గమనించలేనంత స్థితికి దారితీస్తోంది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్త కారణంగా వాహనాలకింద పడి మరణించే, గాయాలకు గురయ్యే పాదచారుల సంఖ్య పెరుగుతోంది. విద్యాసంస్థలు, కార్యాలయాలు, ఇతర పని ప్రదేశాల్లోనూ ఫోన్ల మితిమీరిన వినియోగం ఎన్నో అనర్థాలు తెస్తోంది. పాఠాలు వినటం, చదవడం; విధుల నిర్వహణ, రోజువారీ కార్యక్రమాలపైనా ఇది విపరీత ప్రభావం కనబరుస్తోంది. ఇటువంటి పెడపోకడల నివారణలో యువకుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎంతైనా ఉంది.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

శివ ధర్మాలు

ఒక మాసానికి 'కృష్ణ చతుర్దశి' ఎలాంటిదో, సంవత్సరానికి మాఘం అటువంటిది. ప్రతి మాసమూ వచ్చే కృష్ణ చతుర్దశిని 'మాస శివరాత్రి' అంటాం. సంవత్సరానికే చతుర్దశి వంటి మాఘంలోని శివరాత్రి 'మహా శివరాత్రి' అని శాస్త్రాలు నిర్దేశించాయి.

శివ పర్వాల్లో అత్యంత ప్రధానమైన ఈ మహాశివరాత్రిని 'శివ ధర్మ వృద్ధికాలం' అంటారు. ఈ వేళలో చేసే శివధర్మాలు అత్యధిక ఫలితాలిస్తాయని, పున్నమివేళ సముద్రం పొంగినట్లుగా నేటి శివధర్మాలు కొద్దిపాటి అయినా సమృద్ధిగా ఫలిస్తాయని 'శివపురాణ' వచనం. శివ ధర్మాలు ప్రధానంగా అయిదు విధాలు. అవి- క్రియ, తపస్సు, జపం, ధ్యానం, జ్ఞానం. వీటిని చక్కగా చేస్తే 'శివయోగి' అవుతారు. అతడి జన్మ చరితార్థమై, కైవల్యం పొందుతాడంటాయి శైవాగమాలు.

క్రియను సత్కర్మగా చెబుతారు. శివలింగాన్ని పూజించడం ఇందులో ముఖ్యం. దానం, సేవా కార్యక్రమాలు ఈ విభాగంలోనివే. శాస్త్ర పద్ధతిలో అర్చించి శివుడికి నివేదించిన ప్రసాదాన్ని భక్తితో స్వీకరిస్తారు. క్షేత్రాల్ని దర్శించడం, శివలీలల్ని శ్రవణాదులతో గ్రహించడం దీని భాగాలు. బిల్వార్చన, అభిషేకాలు శివకర్మల్లో కీలకమైనవి. నియమాలతో శరీరాన్ని తగిన విధంగా శోషింపజేయడమే తపస్సు. శాస్త్రాల్లో నిర్దేశించిన వ్రతాల్ని ఆచరించాల్సి ఉంటుంది. వీటిలో మహా శివరాత్రి వ్రతం ఉపవాసానికి ప్రత్యేకం. కార్తిక, శ్రావణ మాసాల్లో శివ వ్రతాలకు 'జాగరణ' చెప్పలేదు. 'నక్త' వ్రతం (పగలు ఉపవసించి, రాత్రి ప్రారంభంలో భుజించడం) చెప్పారు. ఈ మహాశివరాత్రికి ఉపవాసమే ముఖ్యమైనది.

అనంతరం- జాగరణం. ఈ రాత్రి మధ్యకాలానికి 'తురీయ సంధ్య' అని పేరు. శుద్ధమైన పరమాత్మతత్వానికి సంకేతమిది. ఇది యోగాల్లో ధ్యాన సమాధి స్థితిని తెలియజేస్తుంది. నిత్య సాధనల కంటే- సర్వకాల సాధనలకు సిద్ధి శీఘ్రంగా లభిస్తుంది కాబట్టి, ఈ మహాపర్వంలో శివసాధనకు ప్రాముఖ్యముందని రుషి వాక్యం. శాస్త్రాల్లోని చాంద్రాయణాది వ్రతాలు, ఏకాదశి వంటివాటిని శివప్రీతిగా ఆచరిస్తే అది 'తపస్సు' అనిపించుకుంటుంది.



అంతర్యామి

శివనామాలు లేదా గురువు ద్వారా పొందిన శివమంత్రాల్ని నిత్యమూ జపించడం జప సాధనలో వైశిష్ట్యం. శబ్దరూప సాధన ప్రాణశక్తిలో దివ్యత్వాన్ని నింపుతుంది కనుక, భారతీయ యోగవిద్యలో మంత్ర యోగానికి ప్రాధాన్యమిచ్చారు. 'యజ్ఞాలన్నింటిలో జపయజ్ఞం శ్రేష్ఠం' అని గీతావాక్యం. మానసిక యోగానికి, శారీరక కర్మకు బలమిచ్చే శక్తి జపానికి ఉంది. దాన్ని 'వాచిక యజ్ఞం' అంటారు. జపంతో పాటు స్తోత్ర పఠన, పారాయణలు దీని పరిధిలోకి వస్తాయి.

బుద్ధిని ఏకాగ్రం చేసి, ప్రాణాయామం ద్వారా శుద్ధిని పొంది, హృదయ మధ్యంలోనో భ్రూమధ్యంలోనో శివుణ్ని ధ్యానించాలి. జ్యోతిః స్వరూపుడిగా, అర్ధనారీశ్వరుడిగా, దక్షిణామూర్తిగా, నటరాజుగా- ఇలా అనేక స్వరూపాల్లో దేనినైనా ధ్యానించవచ్చు. ధ్యానం, స్మరణ- మానసిక యజ్ఞాలు.

శ్రవణం, మననం, కీర్తనం- అనేవి జ్ఞానసాధనలో ముఖ్యమైనవి. 'వినడం' శారీరకం, 'కీర్తనం' వాచికం, 'మననం' మానసికం. ఈ త్రికరణాలతో శివుణ్ని గ్రహించడమే 'మహా సాధన'... అని సనత్కుమారుడు వ్యాసదేవుడికి ఉపదేశించాడంటారు. మంగళం, శాంతి, శుద్ధం, క్షేమం, మోక్షం, భద్రం- ఇన్ని అర్థాలు 'శివ'నామానికి ఉన్నాయి. ఈ శివమే స్వరూపంగా, స్వభావంగా కలిగిన పరమాత్మ- శివుడు.

శాంతిని, శుద్ధతను, శుభాన్ని తెలియజేసే శబ్దం- 'శమ్'. ఈ శాంతి శుద్ధ శుభాలకు మూలమైనవాడు 'శంభుడు'. వాటిని కలిగించేవాడు 'శంకరుడు'. దుఃఖాల్ని, రోగాల్ని పోగొట్టేవాడు 'రుద్రుడు'. ఆయన దేవతలకే దేవుడైన 'మహాదేవుడు'. శాశ్వత తత్వం కాబట్టి 'మృత్యుంజయుడు'. లోకపాలకులకు పాలకుడు కనుక 'మహేశ్వరుడు'.

నిరాకారంగా లింగరూపుడు. సాకారంగా బహు రూపుడు. అటువంటి పరమేశ్వరుడి అనుగ్రహంతో జీవితాన్ని శివమయం చేసుకొనే అవకాశమే మహాశివరాత్రి ఆచరణ!

– సామవేదం షణ్ముఖశర్మ


V-GUARD

పాలనా సంస్కరణలతో ముందుకు

- పరిశీలనలో జరిమానా అంశం
- వారం రోజుల్లో సమాచారం ఇవ్వాలి
- భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ జోరు పెంచాలి
- ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయాలి
- పట్టణ ప్రణాళిక ఉద్యోగుల రాష్ట్ర సమావేశంలో మంత్రి కేటీఆర్



పట్టణ ప్రణాళిక అధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులను ప్రభుత్వం నిర్దేశించిన 21 రోజుల్లో ఇవ్వకుంటే టీఎస్-ఐపాస్ విధానం తరహాలో బాధ్యులైన అధికారులకు జరిమానా విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కె.టి.రామారావు తెలిపారు. ప్రస్తుతం భవన నిర్మాణ అనుమతులకు గతంలో ఉన్న 30 రోజుల గడువును 21 రోజులకు తగ్గించిన అంశాన్ని గుర్తుంచుకుని పట్టణ ప్రణాళికా (టౌన్‌ప్లానింగ్) సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. సామాన్య ప్రజలకు అత్యంత పారదర్శకంగా ఇబ్బందుల్లేకుండా అన్ని అనుమతులు వచ్చేలా అభివృద్ధి అనుమతి నిర్వహణ విధానం(డీపీఎంఎస్) విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామన్నారు. మంత్రి హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్రంలోని పట్టణ ప్రణాళికా సిబ్బందితో మంత్రి సమావేశమయ్యారు. ఇందులో జీహెచ్ఎంసీ, డీటీసీపీ, పట్టణ ప్రణాళిక అధికారులు, సీడీఎంఏ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దనరెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, డీటీసీపీ విద్యాధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రజలు కొత్త పాలనను ఆశించారని దీనికి అనుగుణంగా అనేక పాలన సంస్కరణలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని మంత్రి అన్నారు. భవన నిర్మాణ అనుమతికి చేసుకున్న దరఖాస్తులో లోపాలున్నా, అదనపు సమాచారం లేదా పత్రాలు జతచేయాల్సి ఉన్నా వారంలోగా దరఖాస్తుదారునికి తెలపాలని పేర్కొన్నారు. అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించేందుకు విధానంలో మార్పులు చేశామన్నారు. డీపీఎంఎస్ విధానంపై అవగాహన పెంచుకుని పూర్తి పరిజ్ఞానంతో పనిచేయాలని కోరారు. పట్టణ ప్రణాళికా అధికారులు, ఉద్యోగులతో మూడు నెలలకోసారి సమావేశం కానున్నట్లు తెలిపిన మంత్రి వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

అక్రమ కట్టడాలు అరికట్టేందుకు ప్రాధాన్యం

కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో రోడ్ల విస్తరణ, అక్రమ కట్టడాలను అరికట్టడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పురపాలక పట్టణాల్లో లేఅవుట్‌లలో ఖాళీ స్థలాలను కాపాడటంలో పురపాలక కమిషనర్లతో కలిసి పనిచేయాలన్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టడానికి స్థానిక పట్టణ ప్రణాళిక అధికారులతో పాటు రాష్ట్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై వివరాలను అందించాలని పురపాలకశాఖ డైరెక్టర్, డీటీసీపీని ఆదేశించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు విధుల్లో సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో విధులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై సూచనలివ్వాలని కోరారు. ఆన్‌లైన్ విధానంపై మంత్రి అభిప్రాయాలు తీసుకున్నారు.

కేసీఆర్‌కు దంత పరీక్షలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మరోసారి దంత పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. నాలుగు రోజుల దిల్లీ పర్యటనలో రెండు రోజుల క్రితం కేసీఆర్ పంటికి రూట్ కెనాల్ చికిత్స చేశారని, సోమవారం సాయంత్రం మరోసారి వైద్యులు పరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. మూడు సిట్టింగులు తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో వైద్య పరీక్షల అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

కంది రైతుల్ని ఆదుకోండి

కేంద్రమంత్రి పాసవాన్‌కు ఎంపీ వినోద్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని కంది రైతుల్ని ఆదుకోవాలని కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి రాంవిలాస్ పాసవాన్‌కు తెరాస ఎంపీ వినోద్ విజ్ఞప్తి చేశారు. సోమవారమిక్కడ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. తెలంగాణలో కందులు అధికంగా దిగుబడి అయిన నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) కింద కందులు కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం వినోద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంది రైతులను ఆదుకోవాలన్న విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2లక్షల 84వేల మెట్రిక్ టన్నుల కంది సాగైందని.. అధిక దిగుబడి నేపథ్యంలో కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

వృత్తిపరమైన నైపుణ్యానికి పోలీసులు పదునుపెట్టాలి

- డీజీపీ మహేందర్‌రెడ్డి సూచన
- అబ్బురపరచిన శునకాల పాసింగ్ అవుట్ పెరేడ్

ఈనాడు, హైదరాబాద్: వృత్తిపరమైన నైపుణ్యానికి పోలీసులు నిరంతరం పదును పెడుతూనే ఉండాలని తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. అప్పుడు మాత్రమే ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం సాధ్యమవుతుందన్నారు. మొయినాబాద్‌లోని ఇంటెగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసు శునకాల పాసింగ్ అవుట్ పెరేడ్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మాట్లాడుతూ.. ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కొనే విధంగా పోలీసులను సన్నద్ధం చేసేలా ఈ అకాడమీ


ప్రతిభ కనబరిచిన శునకానికి పతకం ప్రదానం చేస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

రూపుదిద్దుకోవాలన్నారు. అకాడమీ ఆవరణలో నిర్వహించిన ఈ 17వ పాసింగ్ అవుట్ పెరేడ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న మొత్తం 71 శునకాలు, 92 మంది నిర్వాహకులు పాల్గొన్నారు. వీటిలో 6 అరుణాచల్‌ప్రదేశ్, 4 త్రిపుర, 3 కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం, 2 తెలంగాణ గ్రేహౌండ్స్, 3 ఆక్టోపస్, 2 ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌వి కాగా మిగతా 51 శునకాలు తెలంగాణ పోలీసుశాఖలోని వివిధ విభాగాలకు చెందినవి. లాబ్రాడర్, జర్మన్ షపర్డ్, బెల్జియన్ మెలినాయిస్, డాబర్‌మెన్, గోల్డెన్ రిట్రైవర్ జాతులకు చెందిన శునకాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా అవి ప్రదర్శించిన వివిధ విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డిల చేతుల మీదుగా శిక్షణలో ప్రతిభ కనబరచిన శునకాలకు పతకాలు బహూకరించారు. ఈ సందర్భంగా అకాడమీ ఆవరణలో 20 శునకాల కోసం నిర్మించిన కొత్త భవనాన్ని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ మొలిశెట్టి దామోదర్, ఎండీ బి.మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నిఘా విభాగాధిపతి నవీన్‌చంద్, ఇతర ఉన్నతాధికారులు గోపీకృష్ణ, సందీప్‌శాండిల్య, జితేందర్, ఎం.కె.సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై పరిశోధనకు రూ.50 లక్షలు

రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సమావేశంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ప్రాణాంతక వ్యాధుల నివారణ, తక్కువ ఖర్చుతో చికిత్సలపై పరిశోధనల కోసం రూ.50 లక్షలు మంజూరు చేశామని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖల మంత్రి జోగు రామన్న తెలిపారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాన్సర్ సహా అనేక వ్యాధులకు చికిత్స కోసం ప్రస్తుతం ప్రజలు భారీ ఎత్తున డబ్బులు వెచ్చించాల్సి వస్తోందన్నారు. వీటిపై పరిశోధనలు నిర్వహించి వ్యాధులను నయం చేయడంతోపాటు ఖరీదైన వైద్య పరీక్షలను పేదలకు అందుబాటులో ఉండేలా తక్కువ ఖర్చుతో అందించే చర్యలు చేపట్టామని తెలిపారు. దాదాపు పది సంస్థలు పరిశోధనకు ముందుకొచ్చాయని, వాటికి మొదటి విడతగా రూ.25 లక్షలు విడుదల చేశామన్నారు. మరో 25 లక్షలను రెండో విడతలో ఇస్తామని వెల్లడించారు. నల్గొండలో ఫ్లోరిన్ శాతాన్ని తగ్గించేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని చెప్పారు.

కార్మిక సంఘాలు బలంగా ఉంటే ప్రభుత్వాలు దిగొస్తాయి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా

నారాయణగూడ, న్యూస్‌టుడే: దేశంలోని అసంఘటిత రంగ కార్మికులంతా ఒక్కటై కదలితే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా అన్నారు. ఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అయిదు రోజుల శిక్షణ శిబిరం సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవనంలో ప్రారంభమైంది. కుంతియా మాట్లాడుతూ... కాంగ్రెస్ పేదల కోసం పని చేస్తే.. మోదీ ప్రభుత్వం ఆదానీ, అంబానీల కోసమే పని చేస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికులను ఒకటిగా చేయడమే అందరి ముందున్న సవాలుగా ఆయన పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మనది ధనిక, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని ప్రకటించుకుంటున్న సీఎం కేసీఆర్ ఉపాధి కార్మికులకు వేతనాలు ఎందుకు చెల్లించలేక పోతున్నారో చెప్పాలన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి, ఐటీయూసీ సింగపూర్ ప్రతినిధి షోయా యోషిదా, బ్రస్సెల్స్ ప్రతినిధి స్టీవెన్ బెండిక్ట్ మాట్లాడారు.



శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తున్న ఆర్.సి.కుంతియా, చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఓటర్ల సవరణ గడువు పెంచాలి: ఉత్తమ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సవరణ గడువును మరో మూడు వారాలు పొడిగించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. గతంలో ఇచ్చిన గడువులో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో అధికారులు అందుబాటులో లేరని, దీంతో చాలామంది సద్వినియోగం చేసుకోలేకపోయారన్నారు. టీపీసీసీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం గాంధీభవన్‌లో సమావేశం జరిగింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహాల బాధ్యుడు కుంతియా, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు పాల్గొన్నారు. ఓటర్ల సవరణపై ఈనెల 5 నుంచి 10 వరకు తమ కమిటీ గ్రామీణ జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా ఓటర్ల తొలగింపులో అనేక అక్రమాలు జరిగాయని, తేలిందని శశిధర్‌రెడ్డి నివేదిక అందచేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు 60 స్థానాలకు అభ్యర్థులతో జాబితా తయారు చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఉత్తమ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

నిర్మాణ స్థలంలో పేలిన డిటోనేటర్లు..

- కాపలాదారు భార్యకు గాయాలు

ఈనాడు, హైదరాబాద్, జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ నిర్మాణ స్థలంలో సోమవారం డిటోనేటర్లు పేలాయి. పేలుడు తీవ్రతకు ఆ స్థలం కాపలాదారు భార్యకు గాయాలు కావడంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొన్ని ఇళ్లు ధ్వంసమయ్యాయి. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 48లో ప్లాట్ నంబరు 969లో సిద్దార్థ కన్‌స్ట్రక్షన్స్ పేరు మీద ఖాళీ స్థలం ఉంది. దీనికి రాజస్థాన్‌కు చెందిన దంపతులు ఆశారాం, భగవతి కాపాలదారులుగా ఉంటున్నారు. ఆశిష్ అనే ఇంటీరియర్ డిజైనర్‌కు నిర్మాణ పనులు అప్పగించారు. అయితే దీన్ని మహేందర్ అనే వ్యక్తికి సబ్‌లీజ్‌కు ఇచ్చారు. స్థలంలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో వాటిని పేల్చేద్దామనుకున్నారు. ఇటీవల ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల (ఈడీ)ను రాళ్లకు సమీపంలో ఉంచారు. సోమవారం ఉదయం 8.45 గంటలకు ఆశారాం బయటకు వెళ్లాడు. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో అక్కడే రేకుల గదిలో ఉన్న అతని భార్య భగవతి బయటికి రాగా రాళ్లు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. పేలుడుకు ఇంటి గోడ కూలిపోవడంతో పాటు రేకులు ఎగిరిపడ్డాయి. ఘటనా స్థలానికి పక్కనే ఉన్న చరక్ పాఠశాల సిబ్బంది ఆందోళనకు గరయ్యారు. గాయపడిన భగవతిని అపోలో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో 98 ఈడీలను స్వాధీనం చేసుకున్నారు. నిర్మాణ పనులకు అనుమతి లేదని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో పేలుడు జరిగిన నిర్మాణ స్థలంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను పరిశీలిస్తున్న బాంబునిర్వీర్య బృందం ★ పేలుడు జరిగిన ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీఎంసీ సత్యనారాయణ

వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీచేస్తా: కోమటిరెడ్డి

వేములపల్లి, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పూర్తి ఆధిక్యం సాధించి అధికారంలోకి వస్తుందని సీఎల్పీ ఉప నేత, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా వేములపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2019 ఎన్నికల్లో తాను ఎంపీగా పోటీ చేస్తానని, పార్టీ భారీ మెజార్టీతో గెలవడంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు.

స్థిరాస్తి సంస్థ లబ్ధి కోసమే: రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు స్థిరాస్తి సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ అత్యవసరాదేశం (ఆర్డినెన్స్) తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌ను తెచ్చేందుకే శాసనసభను హడావుడిగా వాయిదా వేయించారన్నారు. పేదలకు మేలు చేయాలన్న యోచనే ప్రభుత్వానికి ఉంటే.. సభలో సమగ్రంగా చర్చించి చట్టసవరణ చేయాలన్నారు. అధికారులు గతంలో జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. సమగ్ర భూసర్వే వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్ రైతులు హనుమాన్‌చాలీసా పఠించాలని భాజపా మాజీ ఎమ్మెల్యే రమేష్ సక్సేనా సూచించారు.

ఒక అధికారి.. ఒకే చరవాణి సంఖ్య

- రాష్ట్ర, జిల్లా స్థాయిలోని వారికి శాశ్వతంగా కేటాయింపులు
- ప్రభుత్వ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేకంగా శాశ్వతంగా ఉండేలా చరవాణి సంఖ్యలు(ఫోన్ నంబర్లు) కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.. ఉమ్మడి వినియోగ బృందం(కామన్ యూజర్స్ గ్రూపు-సీయూజీ) తరహాలో వీటిని కేటాయించనుంది. దీని అమలు కోసం సన్నాహాలు ప్రారంభించింది. ప్రస్తుతం తెలంగాణలోని అధికారులకు చరవాణులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇచ్చినా.. అధికారులు మాత్రం ఎవరికివారే సొంతంగా సిమ్‌లు కొనుక్కొని వినియోగిస్తున్నారు. కొన్ని శాఖలు మాత్రం తమ పరిధిలోని సిబ్బందికి ప్రత్యేక సంఖ్యలతో సిమ్‌లు కేటాయించాయి. ఈ కారణంగా బదిలీ, పదవీ విరమణ అనంతరం కొత్తగా విధుల్లో చేరే వారిని సంప్రదించడంలో అటు ప్రజలు, ఇటు ఉన్నతాధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినియోగపరిమితి, బిల్లుల చెల్లింపుల వంటి అంశాల్లోనూ గందరగోళం ఏర్పడుతోంది. ఇటీవల. ప్రభుత్వం ఉన్నతస్థాయిలో నిర్వహించిన సమావేశంలో వీటి ప్రస్తావన వచ్చింది. దీనిని పరిగణనలోనికి తీసుకున్న ప్రభుత్వం అధికారులకు శాశ్వతంగా ప్రత్యేకంగా గుర్తించే సంఖ్యలున్న సిమ్‌లు కేటాయించాలని నిర్ణయించింది. ఒక శాఖలోని అన్ని స్థాయిల అధికారులకు ఒకే వరుస సంఖ్యలతో(సిరీస్) నంబర్లు కేటాయించాలనీ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. దీనిపై ఇప్పటికే కొన్ని టెలికాం సంస్థలను సంప్రదించినట్లు తెలిసింది. ఇప్పటికే కొన్ని ప్రైవేటు టెలికాం సంస్థలు సీయూజీ సేవలు అమలు చేస్తున్న నేపథ్యంలో.. దీనిపైనా ప్రభుత్వ వర్గాలు అధ్యయనం ప్రారంభించాయి. త్వరలోనే ఇది కార్యాచరణకు నోచుకోనుంది.

తెలుగు తప్పనిసరిపై బిల్లు పెడతాం: కడియం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒక సబ్జెక్టుగా తెలుగును తప్పనిసరి చేసేందుకు నేరుగా శాసనసభలో బిల్లు ప్రవేశపెడతామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టంచేశారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగుపై ఆర్డినెన్స్ తీసుకువస్తారా అని విలేకర్లు ప్రశ్నించగా...అంత అవసరమేముంది?...చాలా సమయం ఉంది కదా?... వచ్చే బడ్జెట్ సమావేశాల్లో శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేస్తామని సమాధానం చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని విధాలా సన్నద్ధమవుతున్నామని తెలిపారు.

వాదనలు సరిలేకే ఏపీకి అనుకూల తీర్పు

తెలంగాణ విద్యుత్ ఐకాస

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రాకు రిలీవైన ఉద్యోగులకు సంబంధించి తెలంగాణ వాదనలు సరిగా లేకపోవడం వల్లే కోర్టు తీర్పు వారికి అనుకూలంగా వచ్చిందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐకాస అభిప్రాయపడింది. సోమవారం ఐకాస ప్రతినిధులు విద్యుత్తుశాఖ మంత్రి జగదీష్‌రెడ్డితో సచివాలయంలో సమావేశమయ్యారు. పలు అంశాలపై మంత్రితో చర్చించినట్లు ఆ తర్వాత నాయకులు వివరించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో- రాష్ట్ర విద్యుత్ సంస్థ యాజమాన్యం రివ్యూ పిటిషన్ వేయాలని లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలని కోరారు. యాజమాన్యం తక్షణమే విద్యుత్తు ఉద్యోగుల విభజన ప్రక్రియను ప్రారంభించాలనీ, రిలీవ్ అయినవారిని సూపర్ న్యూమరరీ పోస్టుల్లో కొనసాగిస్తూ పదోన్నతులు ఇవ్వరాదన్నారు. తెలంగాణ ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతుల్ని వెనక్కు తీసుకోవద్దనే పలు అంశాలపై మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ఐకాస ప్రతినిధులు తెలిపారు. అనంతరం విద్యుత్తుసౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును కలిసి చర్చించారు.

ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.6,689 కోట్లు ఖర్చు: మంత్రి జగదీష్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: దళితుల సంక్షేమం కోసం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను పూర్తిగా ఖర్చు చేయాలని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి నిధి ఖర్చులు పారదర్శకంగా ఉండాలని, అవసరమైతే అదనపు బడ్జెట్‌ను కేటాయించాలని సూచించారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 14,375 కోట్లు కేటాయించగా.. జనవరి నాటికి రూ.6,689 కోట్లు ఖర్చు చేశామని ప్రకటించారు. సోమవారమిక్కడ ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధిపై నోడల్ ఏజెన్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌ను ఎన్‌కౌంటర్ చేస్తారు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారని, చిత్తుచిత్తుగా ఓడించి జాడ లేకుండా చేస్తారని రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు సహనం, విచక్షణ కోల్పోయి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెరాస హయాంలో నల్గొండ ప్రశాంతంగా ఉందన్నారు. తెరాస ప్రభుత్వంపై నిందలు వేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్వరలో ఆరు జిల్లాలకు శాశ్వత డీఈఓలు

తెలంగాణ రాష్ట్రంలోని ఆరు పాత జిల్లాలకు మరికొద్ది రోజుల్లో శాశ్వత డీఈఓలు రానున్నారు. రాష్ట్రంలో 31 జిల్లాలుండగా ప్రస్తుతం 10 పాత జిల్లాలకు మాత్రమే శాశ్వత డీఈఓ(మంజూరు) ఉద్యోగాలున్నాయి. మిగిలిన 21 జిల్లాలకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. పాత జిల్లాల్లో కూడా ప్రస్తుతం రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో శాశ్వత డీఈఓలున్నారు. మిగిలిన ఏడు జిల్లాల్లో ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోంది. ఈక్రమంలో ఇటీవల పదోన్నతుల కమిటీ భేటీలో కొందరికి డీఈఓలుగా పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఏడుగురుకి పదోన్నతి ఇవ్వాల్సి ఉన్నా ఒకరిపై ఆరోపణలు ఉండటంతో పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. పదోన్నతులు పొందే వారిలో ముగ్గురు ఉప విద్యాశాఖాధికారులు, ఇద్దరు సహాయ సంచాలకులు ఉన్నట్లు తెలిసింది. మొత్తం ఆరుగురికి పదోన్నతి కలిస్తూ రెండుమూడు రోజుల్లో విద్యాశాఖ జీఓ జారీ చేయనుంది. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఇన్‌ఛార్జులు ఉంటే సమస్యలు వస్తాయని భావిస్తోంది.

20 మందికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న 20 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు సోమవారం జీవో సంఖ్య ఆర్‌టీ 82 విడుదల చేసింది. అడహక్ ప్రమోషన్ల పేరుతో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఉద్యోగోన్నతి పొందినవారి జాబితాను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఊబకాయం.. ప్రపంచానికే పెద్ద గుదిబండ! అందుకే ఒంటి బరువు వదిలించుకునేందుకు నోరు కట్టుకోవటం, ఒళ్లు వంచటం నుంచి పొట్ట కుట్టేయటం వరకూ.. రకరకాల విధానాలపై ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ఇప్పటికే బాగా ప్రాచుర్యంలోకీ వచ్చాయి. అయితే వీటిలో ఏది సమర్థమైనదన్న దానిపై చర్చ నడుస్తూనే ఉంది.

మధుమేహం.. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న ఆధునిక ఉపద్రవం. విస్మరిస్తే ఒళ్లంతా కబళించివేసే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు మందులున్నాయి. వీటిని జీవితాంతం తీసుకోవటం తప్పించి మధుమేహాన్ని పూర్తిగా నయం చేసే చికిత్సలు మాత్రం ఇప్పటి వరకూ లేవు.

తాజాగా... ఒక్క బాణంతో ఈ రెండు ఉపద్రవాలనూ ఖాయంగా జయించొచ్చన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. కేవలం ఆహార విధానం మార్చుకుని, అంతా కేవలం 'కొవ్వు ఎక్కువగా తినటం' ద్వారానే అటు ఊబకాయాన్నీ, ఇటు మధుమేహాన్ని కూడా జయించి తీరతారన్న వాదన బలంగా వినపడుతుండటంతో.. సహజంగానే ప్రజల్లోనూ దీనిపై ఆసక్తి పెరుగుతోంది.

అయితే ఈ తరహా ఆహార నియంత్రణ సరైనదేనా? దీంతో బరువు తగ్గే మాట నిజమే కావొచ్చుగానీ.. ఇతరత్రా ఎలాంటి సమస్యలూ తలెత్తవా? అన్నది ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న!

ఈ తరహా డైట్‌తో కొంత ప్రయోజనాలు కనిపించొచ్చు.. కానీ దీంతో సమస్యలు తలెత్తే అవకాశమూ ఉంటుందన్న వాస్తవాన్ని విస్మరించకూడదని హెచ్చరిస్తున్నారు వైద్య ప్రముఖులు.

నిజానికి ఈ తరహా ఆహార విధానం కొత్తదేం కాదు గానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఆసక్తి పెరుగుతున్న మాట వాస్తవం. అందుకే విఖ్యాత వైద్య పత్రిక 'జామా' కూడా దీనిపై తాజా సంచికలో సమగ్రమైన సమీక్షా వ్యాసాన్ని ప్రచురిస్తూ.. ఈ తరహా డైట్ తీసుకోవాలనుకుంటున్న వారికి కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని స్పష్టం చేసింది. అందుకే దీనికి సంబంధించిన వివరాలన్నీ సాధ్యమైనంత సమగ్రంగా మీ ముందుకు తెస్తోంది ఈ వారం సుఖీభవ!

కీటో డైట్

ఆసక్తి సరే..

అతి విశ్వాసం వద్దు!


Interest in the Ketogenic Diet Grows for Weight Loss and Type 2 Diabetes

ఆసక్తి ప్రపంచవ్యాప్తం

అమెరికా వైద్యుల సంఘానికి చెందిన ప్రముఖ వైద్య పత్రిక 'జామా' తాజాగా (జనవరి 16, 2018) ఊబకాయంపై ఒక ప్రత్యేక సంచిక తీసుకువచ్చింది. దీనిలో ఇటీవలి కాలంలో బరువు తగ్గటానికీ, టైప్-2 మధుమేహానికీ ప్రపంచవ్యాప్తంగా 'కీటోజెనిక్ డైట్' మీద సర్వత్రా ఆసక్తి పెరుగుతోందంటూ ప్రత్యేక సమీక్షా వ్యాసం ప్రచురించింది. ఈ తరహా డైట్ మీద ప్రముఖ వైద్య పరిశోధన, అధ్యయన కేంద్రాల్లో జరిగిన, జరుగుతున్న అధ్యయనాలను పరిశీలించి.. వాటి ఫలితాలతో పాటు దీంతో ఎదురవుతున్న సమస్యలేమిటి? దీన్ని అనుసరించే వాళ్లు తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో కూడా కొన్ని హెచ్చరికలు చేసింది. ఆ వివరాలు క్లుప్తంగా ఇక్కడ ఇస్తున్నాం.

బరువు తగ్గిపోయేందుకు ప్రపంచవ్యాప్తంగా రకరకాల ఆహార నియంత్రణ పద్ధతులు ప్రాచుర్యంలో ఉన్నాయిగానీ.. కొవ్వు పదార్థాలు అధికంగా, పిండిపదార్థాలు చాలా తక్కువగా ఉండే ఆహారం (లో కార్బ్, హై ఫ్యాట్ ఆహారం- ఇదే కీటోజెనిక్ డైట్) తీసుకుంటున్న వారిపై విస్తృతస్థాయిలో జరిగిన 13 అధ్యయన ఫలితాలు, వాటి విశ్లేషణలను పరిశీలిస్తే... ఈ 'కీటో డైట్' మీద ఉన్న వాళ్లు బరువు ఎక్కువగా తగ్గుతున్నారని వెల్లడవుతోంది. దీంతో ఊబకాయాన్ని ఎదుర్కొనేందుకు చాలామంది పరిశోధకులు పిండిపదార్థాలు బాగా తగ్గించేసే 'కీటోజెనిక్' ఆహార విధానం వైపు మొగ్గుచూపుతున్నారు.

ఇది న్యూట్రిషనల్ కీటోసిస్

కీటోజెనిక్ ఆహారంలో పిండిపదార్థాలను బాగా తగ్గించేయటంతో- శరీరం ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించేస్తుంది. ప్రధానంగా ఒంట్లోని కొవ్వును కరిగించుకుని, వారంలోపే దాన్నే శక్తిగా వినియోగించుకోవటానికి అలవాటుపడిపోతుంది. ఈ దశనే వైద్యపరంగా 'న్యూట్రిషనల్ కీటోసిస్' అంటారు. ఈ స్థితిలో మన కాలేయం ఒంట్లోని కొవ్వును, కొవ్వు ఆమ్లాలను 'కీటోన్ బోడీస్' అనే రకం రసాయనాలుగా మార్చటం మొదలుపెడుతుంది. అనివార్యపరిస్థితుల్లో ఈ కీటోన్ బోడీలే మన శరీరానికీ, మెదడుకు అవసరమైన శక్తిని అందించటం మొదలుపెడతాయి. ఇదీ ఈ రకం డైట్ ప్రత్యేకత.

కొవ్వు తిన్నా బరువు తగ్గుతున్నారు!

కొవ్వు ఎక్కువగా తినమని చెప్పినా కూడా 'కీటో డైట్' మీద ఉండేవాళ్లు బాగా, వేగంగా బరువు తగ్గిపోతున్నారు. రెండు వారాల్లోనే దాదాపు 10 పౌండ్లు (4.5 కేజీలు) తగ్గిపోతున్న వాళ్లూ ఉంటున్నారని బర్మింగ్‌హామ్‌లోని అలబామా యూనివర్సిటీ ప్రొఫెసర్ అమీ గాస్ తదితరులు గుర్తించారు. కీటోడైట్ వల్ల ఒంట్లో నీరు బాగా బయటకుపోతుంది, కాబట్టి మొదట్లో వేగంగా తగ్గిన బరువులో నీటిదే అధిక భాగం కావొచ్చు. క్రమేపీ ఇన్సులిన్ స్థాయులు తగ్గిపోతూ, మన శరీరం కొవ్వును కరిగించుకునే దశలోకి వెళుతున్న కొద్దీ.. ఒంట్లో పేరుకుపోయిన కొవ్వును కరిగించుకోవటం ఆరంభిస్తుంది, దానివల్ల బరువు బాగా తగ్గుతున్నారని గాస్ అంటున్నారు.

ఆకలి ఉండటం లేదు

కారణం స్పష్టంగా తెలియకపోయినా కీటోడైట్ మీద ఉన్నవాళ్లకు పెద్దగా ఆకలిగా అనిపించటం లేదు. కాబట్టి సహజంగానే వాళ్లు తీసుకునే మొత్తం క్యాలరీలు తగ్గిపోతున్నాయి, బరువు తగ్గటానికి ఇది కూడా దోహదం చేస్తుండొచ్చని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ బ్రూస్ బిస్ట్రియన్ అభిప్రాయపడుతున్నారు. వీరి అధ్యయనంలో- పూర్తి కీటో డైట్ మీద ఉన్న వారికి శరీరంలో 9.7% కొవ్వు తగ్గిపోగా కేవలం కొద్దిగా కొవ్వు తగ్గించినవారిలో 2.1% మాత్రమే తగ్గింది. అలాగే కీటో డైట్ మీద ఉన్న వారిలో పొట్టలో పేరుకున్న కొవ్వు కూడా 3 రెట్లు ఎక్కువగా తగ్గిపోయినట్లు గుర్తించారు.

బరువు ఒక్కటే కాదు..

"కీటో డైట్ బరువు తగ్గేందుకే కాదు, మధుమేహుల్లో మందుల అవసరాన్ని తగ్గించేందుకు కూడా దోహదం చేస్తోంది. అలాగే రక్తంలో గ్లూకోజు స్థాయుల మూడు నెలల సగటును చెప్పే హెచ్‌బీఏ1సీ కూడా బాగా మెరుగవుతోంది" అంటున్నారు లూసియానా స్టేట్ యూనివర్సిటీకి చెందిన మెటబాలిజం విభాగం ప్రొఫెసర్ స్టీవెన్ హెమ్స్‌ఫీల్డ్. "కానీ ఇక్కడ సమస్యల్లా ఒక్కటే.. ఈ ఆహారాన్ని దీర్ఘకాలం తిని తట్టుకోగలరా? అన్నదే" అంటారాయన. కాలిఫోర్నియా యూనివర్సిటీలో మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ స్టీఫెన్ ఫినే 2015 నుంచి కొంతమంది మధుమేహ రోగులకు కీటోడైట్ ఇచ్చి ఫలితాలను అధ్యయనం చేస్తున్నారు. 10 వారాల తర్వాత 56.1% మందిలో హెచ్‌బీఏ1సీ అదుపులో ఉన్నట్టు తేలింది. 56.8% మందిలో మధుమేహం మందుల అవసరం తగ్గిపోయింది. త్వరలో ఏడాది ఫలితాలు రాబోతున్నాయి.



ఏ కొవ్వు మంచిదో ఇంకా తేలలేదు!

కీటో డైట్‌తో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, పొట్టచుట్టుకొలత తగ్గుతున్నాయి, బీపీ కూడా మెరుగవుతోంది. అయితే కొందరిలో చెడ్డ (ఎల్‌డీఎల్) కొలెస్ట్రాల్ పెరుగుతున్నట్టు గుర్తించారు. కాబట్టి ఏ రకం కొవ్వులు మంచివో నిపుణుల్లో ఇంకా ఏకాభిప్రాయం లేదు. దీనిపై దీర్ఘకాలిక ఫలితాలు ఎలా ఉన్నాయన్నది కచ్చితంగా చూడాల్సిన అవసరం ఉందంటున్నారు క్యాలిఫోర్నియా యూనివర్సిటీ వైద్యవిభాగం ప్రొఫెసర్ రిక్ హెట్. ఆహారపరంగా తేలికగా పాటించటానికి వీలైన ఈ కీటో డైట్ అనేది బేరియాట్రిక్ సర్జరీలకు, బరువు తగ్గించే మందులకు మంచి ప్రత్యామ్నాయం కావొచ్చనీ అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు పాటిస్తేనే సురక్షితం!

ప్రపంచంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎప్పటి నుంచో అనివార్యంగా ఈ తరహా ఆహారం తింటూనే ఉన్నారు. ఇదేకాదు, మూర్ఛలు అస్సలు అదుపులోకి రాని చిన్నపిల్లలకు చికిత్సలో భాగంగా ఈ కీటో డైట్‌ను దాదాపు శతాబ్ద కాలంగా సిఫార్సు చేస్తున్నారు. కాబట్టి "సాధారణంగా చూసుకుంటే ఈ డైట్ సురక్షితమైనదనే చెప్పుకోవచ్చు" అన్నది హెమ్స్‌ఫీల్డ్ భావన. కీటోడైట్‌తో ఎక్కువమందిలో తలెత్తుతున్న సర్వసాధారణ దుష్ప్రభావం- ఆరంభించిన కొత్తలో తల తేలిపోతున్నట్టు, కళ్లు తిరిగినట్లు ఉండటం, బాగా అలసట, శారీరక శ్రమ కష్టంగా ఉండటం, నిద్ర పట్టకపోవటం, ముఖ్యంగా మలబద్ధకం వంటి లక్షణాలు ఎక్కువగా కనబడుతున్నాయి. వీటన్నింటినీ కలిపి వైద్యులు 'కీటో ఫ్లూ' అంటున్నారు. అయితే ఈ లక్షణాలన్నీ కొద్ది రోజుల్లోనో, వారాల్లోనే సర్దుకుంటున్నాయి. ఇక ఈ డైట్‌లో భాగంగా తీసుకునే కొద్దిపాటి మాంసకృత్తులను కూడా- బాగా శుద్ధి చేసిన వాటి నుంచి కాకుండా.. ముడి పదార్థాల నుంచి వచ్చేలా చూసుకోవటం వల్ల సోడియం, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు లభిస్తాయి, దాంతో ఈ రకం దుష్ప్రభావాలు బాగా తగ్గిపోవచ్చు.

ఇది సొంత వైద్యం కాదు!

కొన్ని సుగుణాలున్నట్టు చెప్పుకున్నా కూడా... ఈ డైట్ అందరికీ సమర్థంగా, సురక్షితంగా ఉండాలంటే దీన్ని 'ఎవరికి వాళ్లు చేసేసుకునే సొంత వైద్యంలా' భావించకూడదన్నది ఈ వైద్యులందరూ ముక్తకంఠంతో చేస్తున్న హెచ్చరిక. ముఖ్యంగా మధుమేహానికి మందులు, ఇన్సులిన్ తీసుకుంటున్న వాళ్లు ఈ కీటోడైట్ మొదలుపెడితే వాళ్ల గ్లూకోజు స్థాయులు బాగా పడిపోయి తీవ్రమైన 'హైపోగ్లైసీమియా'లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుందని బిస్ట్రియన్ హెచ్చరిస్తున్నారు. కాబట్టి దీన్ని మొదలుపెట్టే ముందే కచ్చితంగా అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రదించి మందుల మోతాదులను సరిచేయించుకుని, వాళ్ల పర్యవేక్షణలో వాడుకోవటం అవసరం.

మధుమేహులు బరువు తగ్గితే మంచిదే!

తాజా అధ్యయనాన్ని ప్రచురించిన లాన్సెట్

బరువు తగ్గితే టైప్-2 మధుమేహం కూడా అదుపులోకి వస్తుందా? ఈ ప్రశ్నకు సమాధానం కోసం స్కాట్లండ్, ఇంగ్లండ్‌లలో తాజాగా ఓ విస్తృత అధ్యయనం జరిగింది. 2014-2017 మధ్య చాలామంది ఊబకాయ మధుమేహులపై జరిగిన ఈ అధ్యయన విశేషాలను విఖ్యాత బ్రిటన్ వైద్య పత్రిక లాన్సెట్ తాజా సంచికలో ప్రచురించింది. బీఎంఐ 27-45 మధ్య ఉన్నవారికి కొన్ని నెలల పాటు ఆహారం చాలా పరిమితంగా (రోజుకు 800 క్యాలరీలు మించకుండా) ఇచ్చి పరిశీలించారు. ఫలితంగా వీళ్లంతా ఏడాదిలో 15 కేజీలకు పైగా బరువు తగ్గిపోయారు. విశేషమేమంటే 46% మందిలో మధుమేహం మందుల అవసరం పూర్తిగా తగ్గిపోయింది కూడా. మొత్తమ్మీద దాదాపు సగం మంది కేవలం బరువు తగ్గిన కారణంగానే మధుమేహం నుంచి పూర్తిగా బయటపడ్డారు. వీరికి మధుమేహం మందుల అవసరం కూడా ఉండటం లేదు. కాబట్టి బరువు తగ్గటం వల్ల మధుమేహం విషయంలో మంచి ప్రయోజనం ఉంటుందన్నది స్పష్టం. అయితే ఈ అధ్యయనాన్ని ఊబకాయుల మీదే చేశారు, రెండోది- బరువు తగ్గేందుకు మొత్తం ఆహార పరిమాణాన్ని తగ్గించారేగానీ కేవలం కొవ్వు పదార్థాల వంటివి ఇచ్చే ప్రయోగాలు మాత్రం చెయ్యలేదు!

మధుమేహులూ.. బహుపరాక్!

మధుమేహులు 'కీటో డైట్' వంటివి ఆరంభించే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మధుమేహుల్లో సహజంగానే 'ఫ్యాట్ మెటబాలిజం' ఎక్కువగా జరుగుతుంటుంది. వీరిలో పిండిపదార్థాల కంటే కూడా కొవ్వు పదార్థాలను శక్తిగా మార్చుకోవటమన్నది ఎక్కువ. ఇది స్వతహాగానే మధుమేహంలో ఉండే ఒక లక్షణం. దాన్ని సరిచేసేందుకే మనం బయటి నుంచి మందులు, ఇన్సులిన్ తదితరాలు ఇస్తుంటాం. కాబట్టి మధుమేహులు సహజంగానే 'కీటోజెనిక్'గా ఉంటారన్న వాస్తవాన్ని మనం మర్చిపోకూడదు. దీనివల్ల మనం ఏ కొంచెం మార్పులు తీసుకువచ్చినా వీరిలో రక్తంలో 'కీటోన్ బోడీస్' అనేవి తయారై, ఆమ్ల అయాన్లు పెరిగిపోయి.. 'కీటోసిస్' అనే ప్రమాదకర స్థితిలోకి వెళ్లిపోతారు. సాధారణ ఆరోగ్యవంతులకు రక్తంలో ఈ 'కీటోన్ బోడీస్'కు సంబంధించిన 'సీరం ఎసిటోన్' అనేది 1 ఎంజీ/డీఎల్ లోపే ఉండాలి. మధుమేహుల్లో ఇది 1 నుంచి 3 మధ్య ఉన్నా కూడా దీనివల్ల రకరకాల దుష్ప్రభావాలు బయల్దేరతాయి. ఇక ఇది 5 ఎంజీ/డీఎల్ దాటిపోతే వాళ్లు స్పృహతప్పి కోమాలోకి కూడా వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కీటోడైట్ వంటివి పాటించే మధుమేహులు ఈ దుష్ప్రభావాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.



డా॥ పి.వి.రావు
డైరెక్టర్
డయాబెటీస్ రీసెర్చ్ సెంటర్, రాందేవ్‌రావ్ హాస్పిటల్, కూకట్‌పల్లి, హైదరాబాద్

రోజూ మూత్ర పరీక్ష తప్పనిసరి

మధుమేహుల్లో సీరం ఎసిటోన్ అనేది పెరగటం వల్ల-

1. శరీరంలోని కణాలకు ఆక్సిజన్ అందటం తగ్గిపోతుంది.
2. ఒకవైపు కణాల నుంచి.. మరోవైపు కిడ్నీల నుంచి అధికంగా నీరు బయటకు వెళ్లిపోతుంటుంది. దీంతో రక్తం చిక్కబడటం మొదలవుతుంది. వీటి కారణంగా మనిషి 'ఇంట్రాసెల్యులార్ డీహైడ్రేషన్', 'హైపర్‌ఆస్మలారిటీ'ల్లోకి వెళ్లి.. వీటి ఫలితంగా ఊపిరితిత్తుల శ్వాస సామర్థ్యం, గుండె కండరాల పంపింగ్ సామర్థ్యం తగ్గుతాయి. మెదడుకు కూడా ఆక్సిజన్ తగ్గుతుంది.
3. ఎముకల్లోంచి క్యాల్షియం కరగటం మొదలై, చివరికి మూత్ర అవయవాల్లో గట్టిపడి క్యాల్షియం రాళ్లు ఏర్పడొచ్చు. కాబట్టి మధుమేహులంతా కూడా అసలీ స్థితి తలెత్తకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. కాబట్టి 'కీటో డైట్' వంటివి పాటించేవాళ్లు రోజూ మూత్ర పరీక్ష చేయించుకుంటూ ఉండాల్సిందే. మూత్రంలో 'కీటోన్ బోడీస్' అనేవి ఉండకూడదు. అవి కనిపించాయంటే అప్పటికే రక్తంలో 'సీరం ఎసిటోన్' పెరిగిందని అర్థం. (అయితే మూత్రంలో కీటోన్ బోడీస్ కనబడకుండా కూడా సీరం అసిటోన్ పెరిగి ఉండొచ్చు). **కాబట్టి వీళ్లు రోజూ మూత్రపరీక్ష, తరచూ రక్తంలో సీరం అసిటోన్ స్థాయులు పరీక్ష చేసి చూసుకుంటూ ఉండాల్సిందే.** మూత్రంలో కీటోన్ బోడీస్‌ను గుర్తించటమన్నది చాలా తేలికైన, చవకైన పరీక్ష కూడా. ప్రతి దీన్ని చేసుకోవటం ఉత్తమం. ఇక ఒంట్లో లవణాలు, సూక్ష్మపోషకాలు తగ్గకుండా రోజూ విటమిన్ మాత్రలు కూడా తప్పనిసరిగా తీసుకోవాలి. అలాగే కొలెస్ట్రాల్ స్థాయులనూ చూసుకుంటూ ఉండాలి.

ఎంత బరువు తగ్గొచ్చు?

వైద్యపరంగా నెలకు 2 కేజీలకు మించి ఎక్కువ బరువు తగ్గటం ప్రమాదకరం. కాబట్టి పాటిద్దామని అనుకునేవాళ్లు వారానికి 4 రోజులు మాత్రమే కీటోడైట్ వంటివి తీసుకుని, మిగతా రెండుమూడు రోజులైనా సమతుల ఆహారం తీసుకోవటం మంచిది. అలా చేస్తే నెలకి ఒక్కసారే 5-10 కేజీలు తగ్గిపోకుండా.. నెలకు 2 కిలోల వరకు తగ్గుతారు. ఎక్కువ సమయం పట్టినా కూడా నెమ్మదిగా తగ్గటం మంచిది. బరువు ఎక్కువ ఉన్నవాళ్లు (అంటే బీఎంఐ 23 కంటే ఎక్కువున్నవాళ్లు) బరువు తగ్గేందుకు మాత్రమే కీటోడైట్ వంటి ప్రయోగాలు చేసుకోవచ్చేమోగానీ.. **కేవలం మధుమేహం తగ్గించుకోవటం కోసమే ఇలాంటి ప్రయోగాలు చెయ్యటం అస్సలు శ్రేయస్కరం కాదు!** ముఖ్యమైన విషయం ఏమంటే- బరువు తగ్గేందుకు చేసే ఇలాంటి ఆహార ప్రయోగాలతో మధుమేహం తగ్గినట్లు కనబడినా అది తాత్కాలికమేనని గుర్తించాలి. ఇలాంటి పరిశోధనలు/ప్రయోగాలేవీ కూడా 3-4 నెలలకు మించి చేసిన దాఖలాల్లేవు. 3-4 నెలలు ఈ డైట్‌ను పాటిస్తే ఆ ప్రభావంతో తర్వాత కూడా కొద్ది వారాలు, నెలల పాటు మధుమేహం అదుపులో ఉన్నట్టే ఉండొచ్చు (లెగసీ ఎఫెక్ట్). కానీ ఈ ప్రయోజనాలు శాశ్వతంగా ఉంటాయనుకోకూడదు. కాబట్టి అందరూ బరువు తక్కువగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఇందుకు పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు.. ఈ మూడూ తగుపాళ్లలో ఉండే సమతులాహారం తీసుకుంటూ, వాటి మొత్తం పరిమాణాన్ని తగ్గించుకుని, మితంగా తింటూ నిదానంగా బరువు తగ్గించుకోవటమే ఉత్తమం.

అంతా పాటించే డైట్ కాదు!

మనదేశంలో చాలామందికి తమకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లే తెలియదు. తరచూ పరీక్షలు చేయించుకునే అలవాటు లేకపోవటం మూలంగా చాలామందికి గుండె జబ్బులకు సంబంధించిన ముప్పులు, కిడ్నీ-లివర్ వంటి సమస్యలున్నా కూడా ఆ విషయమే తెలియటం లేదు. ఇలాంటి వాళ్లు వేగంగా బరువు తగ్గాలనో, మధుమేహాన్ని వదిలించుకోవాలనో తాపత్రపయడుతూ 'కీటో డైట్' వంటివి ఆరంభిస్తే తీవ్ర సమస్యల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఇలాంటి ఆహారం మొదలుపెట్టిన తర్వాత-



డా॥ ఎం.వి.రావు
కన్సల్టెంట్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

ఒంట్లోని కొవ్వు ఎక్కువగా కరిగిపోతుంటే కీటోన్ బోడీస్ తయారై, వాటి స్థాయులు పెరిగి స్పృహ తప్పటం వంటి 'కీటోసిస్' సమస్యలు తలెత్తే ముప్పు ఒకటి. అదొక్కటే కాదు, మరో ముఖ్య విషయం ఏమంటే- ఎవరైనా కొవ్వు చాలా ఎక్కువగా (లేదా కొవ్వు మాత్రమే) తింటుంటే వాళ్ల శరీరం- ఒంట్లో నిల్వ ఉన్న కొవ్వులు, ప్రోటీన్ల నుంచి గ్లూకోజును తయారు చేసుకోవటం ఆరంభిస్తుంది. ఈ క్రమంలో 1. యూరియా 2. క్రియాటినైన్ 3. యూరిక్ యాసిడ్ 4. పొటాషియం వంటివన్నీ పెరుగుతాయి. ఇవన్నీ ఒక మోస్తరు వరకూ మూత్రంలో వెళ్లిపోతుంటాయిగానీ.. ఒకస్థాయి దాటితే వీటితో తీవ్ర దుష్ప్రభావాలు మొదలవుతాయి. ప్రాణహాని కూడా జరగొచ్చు. ముఖ్యంగా గుండె, లివర్, కిడ్నీలు దెబ్బతినిపోవచ్చు.

రెండోది- ప్రోటీన్లనేవి మన ఒంట్లో రోగనిరోధక శక్తికి కూడా అత్యంత కీలకమైనవి. ఇవి తగ్గిపోతే రోగనిరోధక శక్తీ తగ్గి, రకరకాల జబ్బులు, ఇన్ఫెక్షన్ల బారినపడే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి ఎవరైనా కీటోడైట్ వంటివి తీసుకోవాలని అనుకుంటుంటే- ముందు వైద్యులను సంప్రతించి కొన్ని పరీక్షలు చేయించుకుని.. గుండె, లివర్, కిడ్నీల వంటి కీలక అవయవాల పనితీరు బాగుందని నిర్ధారించుకున్న తర్వాతే ప్రయత్నించటం మంచిది.

అంతా గుర్తించాల్సిన విషయం ఏమంటే- ఎవరైనా బరువు తగ్గటమన్నది ఆరోగ్యకరంగా తగ్గాలి. దానివల్ల ఇతరత్రా సమస్యలు ముంచుకొచ్చేలా ఉండకూడదు. కానీ 'కీటో డైట్' వంటివి నెలల తరబడి తీసుకుంటే ఎలాంటి ప్రభావం లేదా దుష్ప్రభావాలు ఉంటాయన్నది చెప్పేందుకు దీర్ఘకాలిక అధ్యయనాలేవీ లేవు. బరువు తగ్గేందుకు ఆహార నియంత్రణ, వ్యాయామం వంటి తంటాలు పడేకంటే 'కీటో డైట్' ఒక్కటి చేసేస్తే పోతుందన్న భావనా సరికాదు. ఎందుకంటే వ్యాయామం వల్ల ఇతరత్రా కూడా ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలున్నాయి, అవన్నీ ఇప్పటికే కచ్చితంగా నిరూపణ అయ్యాయి. కాబట్టి మితాహారం, రోజూ చక్కటి శారీరక శ్రమ.. వీటితో బరువు తగ్గేందుకు ప్రయత్నించటమే అన్ని విధాలా శ్రేయస్కరం!

ఆందోళన

సాధారణమా? సమస్యనా?

ఉన్నట్టుండి ఏదో ప్రమాదం ఎదురైందనుకోండి. వెంటనే వెన్నులోంచి భయం పుట్టుకొస్తుంది. గుండెదడ మొదలవుతుంది. శ్వాస వేగం పెరుగుతుంది. ఒళ్లంతా చెమట్లు పడతాయి. గొంతులో ఏదో అడ్డం పడినట్టు అనిపిస్తుంటుంది. భయం, బాధ, ఒత్తిడి వంటి అనుభవాలకు గురైనప్పుడు ఇలాంటి లక్షణాలు కనబడటం సహజమే. ఆందోళన సమస్యగా మారినప్పుడూ సరిగ్గా ఇలాంటి లక్షణాలే పొడసూపుతాయి. లేనిపోని భయాలను, ప్రమాదాలను ఊహించుకోవటం వంటివి ఇందుకు దోహదం చేస్తాయి. చిక్కేంటంటే- ఆందోళన లక్షణాలు అందరిలో ఒకేలా ఉండాలనేమీ లేదు. ఒకొక్కరిలో ఒకోలా కనబడొచ్చు. అందువల్ల మామూలు ఆందోళనేనా? సమస్యగా మారిందా? అనేది గుర్తించగలగటం చాలా అవసరం.

- **ఉన్నట్టుండి భయం:** కొందరిలో హఠాత్తుగా ఉన్నట్టుండి తీవ్రమైన భయం పుట్టుకొస్తుంటుంది. ఈ సమయంలో గుండె దడ, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది మొదలవుతాయి. గొంతులో ఏదో తట్టుకున్నట్టూ అనిపిస్తుంటుంది.
- **భయాలు:** కొందరికి లేనిపోని భయాలు పట్టుకుంటాయి. ఇరుకు ప్రాంతాల్లోకి వెళ్లాలన్నా, ఇంటి నుంచి బయటకు రావాలన్నా, నలుగురిలో కలవాలన్నా విపరీతంగా భయపడిపోతుంటారు. దీంతో పాటు వాంతి, వికారం, చెమట్లు పట్టటం, వణకటం వంటివీ కనబడతాయి.
- **చేసిందే చేయటం:** పురుగులు, కీటకాల వంటి వాటి భయంతోనో.. ఎప్పుడూ శుభ్రంగా ఉండాలనే భావనతోనో కొందరు మాటిమాటికీ చేతులు కడుక్కుంటుంటారు. చేసినపనే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. దీన్నే అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అంటారు.
- **గాయాల ఒత్తిడి:** తీవ్రంగా గాయాల పాలవటం వంటి వాటి అనంతరం ఇలాంటి రకం ఆందోళన



మొదలవుతుంది. ఇందులో నిద్ర పట్టకపోవటం, కండరాలు బిగుసుకుపోవటం, అదేపనిగా బాధపడటం వంటి లక్షణాలు కనబడటం.. ఉన్నట్టుండి భయాలకూ లోనవటం వంటివి వేధిస్తూ వస్తుంటాయి.

- **సాధారణ ఆందోళన:** ఒక ప్రత్యేకమైన కారణమంటూ ఏదీ లేకపోయినా నిరంతరం ఆందోళనకు గురికావటం దీని ప్రధాన లక్షణం. భయం, ఒత్తిడిలో కనిపించే అన్ని లక్షణాలూ ఇందులో కనబడతాయి.

- ఇలాంటి లక్షణాలు రోజులో ఎప్పుడైనా ఎదురవ్వొచ్చు. మామూలు ఆందోళనైతే కొద్దిరోజుల్లో అంతా సర్దుకుంటుంది. అయితే లక్షణాలు దీర్ఘకాలంగా వేధిస్తూ.. రోజువారీ పనులకు ఆటంకంగా మారుతుంటే తాత్సారం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవటం మంచిది.

ఉప్పు

మెదడుకూ ముప్పే

ఉప్పు అనగానే మనకు ముందుగా అధిక రక్తపోటే గుర్తుకొస్తుంది. అయితే ఉప్పు రక్తపోటు పెరగటానికే కాదు, మెదడుకూ చేటు చేస్తుందనే సంగతి మీకు తెలుసా? ఉప్పు ఎక్కువగా గల ఆహారం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచన సమస్యలూ తలెత్తుతున్నట్టు తాజాగా బయటపడింది. ఉప్పు వాడకాన్ని చాలావరకు హైబీపీ, గుండెజబ్బులు, పక్షవాతం కోణంలోనే చూస్తున్న నేపథ్యంలో తాజా అధ్యయనానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇకపై డాక్టర్లు ప్రతి ఒక్కరినీ ఉప్పు వాడకం గురించి ఆరా తీయాల్సిన అవసరమూ రావొచ్చు.

ఉప్పుతో ముప్పేంటి?

ఉప్పు అధికంగా తిన్నప్పుడు చిన్న పేగుల్లో కొత్త ప్రతిస్పందన మొదలవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దీంతో టీహెచ్17 అనే తెల్లరక్తకణాలు పెద్ద మొత్తంలో ఉత్పత్తి కావటం.. ఇది రోగనిరోధకవ్యవస్థలో పాలు పంచుకునే ఐఎల్-17 ప్రోటీన్ స్థాయులు పెరగటానికి దారితీయటం సంభవిస్తోంది. ఇలా ఐఎల్-17 ప్రోటీన్ స్థాయులు బాగా పెరిగిపోతే నైట్రిక్ ఆక్సైడ్ సరఫరా తగ్గిపోతుంది. నైట్రిక్ ఆక్సైడ్ స్థాయులు తగ్గిపోతే రక్తనాళాలు బిగుసుకుపోతాయి. ఫలితంగా మెదడుకూ రక్తసరఫరా తగ్గిపోతోంది. అంటే పేగుల్లో తలెత్తే ప్రతిస్పందనలు జ్ఞాపకశక్తి, ఆలోచనా సమస్యలకు దారితీస్తున్నాయన్నమాట. కేవలం 3 నెలల పరిశోధనలోనే ఇలాంటి విషయాలు బయటపడితే పదేళ్ల పాటు చేస్తే ఇంకెన్ని దిగ్భ్రాంతికర అంశాలు బయటపడతాయోనని వీల్ కార్నెల్ మెడికల్ కాలేజీకి చెందిన కోస్టాంటినో లాడెకోలా చెబుతున్నారు. మెదడుకు రక్తసరఫరా తగ్గటం, మెదడులో రక్తనాళాలు సరిగా పనిచేయకపోవటం వంటివి దీర్ఘకాలం కొనసాగితే పెద్ద ప్రమాదమే ముంచుకురావొచ్చని అభిప్రాయపడుతున్నారు. ఉప్పు ఎక్కువగా తినే దేశాల్లో పక్షవాతం, డిమెన్షియా ఎక్కువగా కనబడుతున్నట్టు కొన్ని ఇతర పరిశోధనలు కూడా పేర్కొంటున్న సంగతిని ఆయన గుర్తుచేస్తున్నారు. అందువల్ల డిమెన్షియా నివారణకు ఉప్పు తక్కువగా తినటం కీలకమైన అడుగు కాగలదని సూచించారు.

ఈనాడు సినిమా



తమన్నా

నా ప్రేమలో... నేను

'విజయాలకు పొంగిపోను... అపజయాలకు కృంగిపోను' - సెలబ్రెటీలు చెప్పే అతి మామూలు మాట ఇదే. 'ఈ విజయం నాది కాదు... అందరిదీ' అని చెప్పుకోవడంలో వినయం ఉంటుంది. కాకపోతే తమన్నా మాత్రం కొత్త సూత్రం చెబుతోంది. 'మీ విజయాలకు మీరే కారణం.. ఆ విషయం గుర్తుంచుకోండి' అంటోంది. ''ఇది వరకు నేను కూడా అంతే. ఓటమికి పూర్తిగా బాధ్యత తీసుకొనేదాన్ని. విజయం వరిస్తే మాత్రం 'ఇందులో నేను చేసిందేముంది' అనిపించేది. ఈ దృక్పథం మనలోని ఆత్మవిశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తుంది. ఎవరి విజయాలకు వాళ్లే కారణం. మీరు సాధించిన చిన్న చిన్న విజయాలకు కూడా పొంగిపోండి. మిమ్మల్ని మీరు పూర్తిగా ప్రేమించుకోండి. ఇప్పుడు నేను చేస్తోంది అదే. ప్రతి చిన్న విజయాన్నీ ఆస్వాదిస్తున్నా. నా ప్రేమలో నేను మునిగిపోతున్నా. ఈ ఆలోచనా విధానం నాలో చాలా మార్పు తీసుకొచ్చింది'' అంది.

కలకాలం కాకుల్లాగా
గడిపేస్తే ఏమొస్తుంది
హంసల్లే దర్జాగుండాలోయ్
అందమైన ఈ జీవితానికో
అర్థం వెతకాలోయ్
కోటిమందిలో పోటుగాడిలా
నువ్వే బతకాలోయ్

గీతం: సత్తే ఏ గొడవా లేదు...
చిత్రం: దేశముదురు
రచన: కందికొండ
- పంపినవారు:
కె.వి.నారాయణ, కూడేరు

గీతోపదేశం



నాగార్జున

'గన్' పట్టుకుంటాడా?

నాగార్జున - రాంగోపాల్ వర్మ అనగానే... 'శివ' గుర్తొస్తుంది. తెలుగు చలన చిత్రసీమలో ఆ చిత్రం ఓ మైలు రాయిగా నిలిచింది. ఆ తరవాత వీరిద్దరి కలయికలో 'అంతం', 'గోవిందా గోవిందా' తెరకెక్కాయి. సుదీర్ఘ విరామం తరవాత నాగ్ - వర్మ మళ్లీ కలిశారు. వారి కొత్త చిత్రం ప్రస్తుతం ముంబయిలో షూటింగ్ జరుపుకుంటోంది. అక్కడ కొన్ని యాక్షన్ దృశ్యాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి వర్మ ఎలాంటి పేరు నిర్ణయిస్తాడన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'గన్', 'శపథం', 'జడ్జిమెంట్'... ఇలా కొన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వాటిలో 'గన్'కే వర్మ, నాగ్ ఓటేశారని తెలుస్తోంది. ఓ పాప కోసం నాగార్జున చేసే పోరాటం ఈ చిత్రం. యాక్షన్ సన్నివేశాలకు ప్రాధాన్యం ఉంది. మార్చి 30 వరకూ ముంబయిలోనే చిత్రీకరణ జరుగుతుంది. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు.



పదికి పది వేసుకుంటా!

''ప్రేక్షకులకు కొన్ని కథలు అర్థం కావని మనకు మనమే అనుకోవడం పొరపాటు. వాళ్లు మనకంటే బాగా ఆలోచిస్తారు. ఇప్పుడు కావల్సింది కథాబలమున్న చిత్రాలే. ఒక దర్శకురాలిగా అలాంటి సినిమా తీయడం నా బాధ్యతగా భావించి 'మనసుకు నచ్చింది' తెరకెక్కించా'' అన్నారు మంజుల ఘట్టమనేని. ప్రముఖ నటుడు కృష్ణ వారసురాలైన ఆమె నటిగా మెరిశారు. నిర్మాతగా కూడా నిరూపించుకొన్నారు. 'మనసుకు నచ్చింది'తో ఇటీవల దర్శకురాలిగా మారారు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఆ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంజుల సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

దర్శకురాలిగా తొలి సినిమా అనుభవం గురించి ఏం చెబుతారు?
ఏ క్షణం కూడా కష్టంగా అనిపించలేదు. తొలి రోజే సెట్ మొత్తం నా చేతుల్లో ఉన్నట్టు అనిపించింది. బాలీవుడ్‌లో పలు చిత్రాలు చేసిన ఛాయాగ్రాహకుడు రవి యాదవ్ 'పది సినిమాల అనుభవమున్న దర్శకురాలిగా పనిచేస్తున్నారు' అన్నారు. దర్శకురాలిగా నా వరకు నేను పదికి పది మార్కులు వేసుకుంటా.

'మనసుకు నచ్చింది' ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమేనా?
ప్రేమకథ మాత్రమే కాదు... అంతమించిన విషయాలు ఇందులో ఉన్నాయి. ఈ కథలో చాలా పార్శ్వాలు ఉంటాయి. ప్రకృతిది కీలకమైన పాత్ర. మనం మన మనసుతో కనెక్ట్ అవ్వడానికి ఇందులో ప్రకృతిని వాడాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ కథకి అదే కథానాయకుడు. ఈ సినిమా చూశాక సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూసి ఆస్వాదించాలనుకొంటారు. ప్రకృతికి మహేష్‌బాబు వాయిస్ ఓవర్ చెప్పాడు. దాంతో సినిమాలో తను కూడా ఉన్నాడనే ఓ అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది.

ఈ కథ మీ మనసులోకి ఎలా వచ్చింది?
ప్రకృతిని ఆస్వాదించడం మొదలుపెట్టాకే (నవ్వుతూ). కాలంతో పరిగెడుతున్న మనందరి జీవితాల్లోనూ ఎక్కడో ఏదో ఒక మూల అలజడి, నైరాశ్యం తొంగి చూస్తుంటుంది. నేనెప్పుడైతే కాస్త ఆగి పక్షులు చేసే శబ్దాల్ని, పూల సువాసనల్ని, సూర్యోదయాల్ని, సూర్యాస్తమయాల్ని గమనిస్తూ ప్రకృతితో మమేకమయ్యానో... చిన్న చిన్న ఆనందాల్ని ఆస్వాదించడం మొదలుపెట్టానో అప్పట్నుంచి నా జీవితంలో చాలా మార్పు కనిపించింది. ఈ విషయాన్ని పదిమందితో చెప్పాలనిపించింది. అలాగని నేను ఊరికే కూర్చుని ప్రకృతిని చూడండి, హృదయంతో కనెక్ట్ అవ్వండని చెబితే ఎవ్వరూ వినరు. కథ చెప్పడం అనేది మనకు ఎప్పట్నుంచో ఉంది. కథ మన జీవితాల్లో ఓ భాగం. అందుకే నా హృదయంలో నుంచి వచ్చిన ఓ మంచి కథ, ఓ మంచి కాన్సెప్టుతో 'మనసుకు నచ్చింది' చిత్రం చేశా. సినిమా అంటే కచ్చితంగా వినోదమే. దాంతోపాటు ఏదో ఒక చిన్న మార్పు, ఒక్క క్షణం పాటు 'అవును.. ఇది నిజమే' అనిపించే ఓ మంచి విషయం ఉండాలి. అలాంటి సినిమానే ఇది.

నటీనటుల్లో ఎవర్నైనా దృష్టిలో ఉంచుకొని ఈ కథ రాసుకొన్నారా?
ఒకర్ని దృష్టిలో ఉంచుకొని, వారికి తగ్గట్టుగా కథ రాయడం నాకు నచ్చదు. కథ పూర్తయిన తర్వాతే ఎవరైతే బాగుంటుందా అని ఆలోచించా. కథ సిద్ధమయ్యాక కొద్దిమందిని కలిశా. నిర్మాత కిరణ్ సందీప్‌కిషన్ పేరు చెప్పడంతో తనైతేనే బాగుంటుందని ఎంపిక చేసుకొన్నాం. నా జీవితంలో నేను చూసిన అబ్బాయిల శైలిని స్ఫూర్తిగా తీసుకొని ఆ పాత్రని తీర్చిదిద్దా. మహేష్ ఇంట్లో ఉన్నాడంటే అమ్మ జుట్టుకో, నా జుట్టుకో ఉన్న రబ్బర్‌బ్యాండ్ తీయడం, సరదాగా చిరాకు పెట్టడం చేస్తుంటాడు. అలాంటి లక్షణాలు కథానాయకుడి పాత్రలో కనిపిస్తాయి. కథానాయిక నిత్య పాత్రలో అయితే నేనే కనిపిస్తా (నవ్వుతూ). మా అమ్మాయి జాన్వి ఓ కీలకమైన పాత్రలో నటించింది.

అసలు దర్శకత్వంపై మనసు ఎప్పుడు మళ్లింది? మీ అభిప్రాయాన్ని ఇంట్లో చెప్పినప్పుడు మీ కుటుంబ సభ్యులు ఎలా స్పందించారు?
మొదట్నుంచీ దర్శకత్వంపైనే ప్రేమ నాకు. అయితే భాషపై పట్టులేదు. సినిమాల్లో కూడా సాధారణమైన భాషే కదా అని ధైర్యం తెచ్చుకొని కథ రాసేశా. ఆ కథకి యేడాది పట్టింది. మరో ఆరు నెలలు రచయిత బుర్రా సాయిధరమ్‌తో కలిసి స్క్రిప్టుని తీర్చిదిద్దా. దర్శకత్వం గురించి నా అభిప్రాయాన్ని చెప్పగానే నా భర్త సంజయ్ ప్రోత్సహించారు. నాన్నకి చెబితే ఆయన థ్రిల్ అయ్యారు. నాన్న నటించిన 'తెలుగువీర లేవరా' సినిమాకి దర్శకత్వ శాఖలో పనిచేశాను కూడా. మహేష్‌కి చెబితే 'దర్శకత్వం చేయడం ఎంత కష్టమో తెలుసా?' అన్నాడు. కానీ నా ఆలోచనల్ని విన్నాక తనకి నమ్మకం కలిగింది. ట్రైలర్ చూశాక తను షాక్ అయ్యాడు.

మహేష్‌బాబు కోసమైతే ఎలాంటి కథని సిద్ధం చేస్తారు?
తనకి ఎలాంటి కథ రాయాలని ఆలోచించాల్సిన అవసరమే లేదు. ఎలాంటి కథలోనైనా ఒదిగిపోగలడు. కాకపోతే తన ఇమేజ్ గురించే ఆలోచించాలి. తన ఇమేజ్‌కి తగ్గ కథైతే తనే పిలిచి సినిమా చేయమంటాడేమో. ఆ రోజు వస్తుందని నా నమ్మకం.

పాటల వేడుకలో పవన్‌కల్యాణ్ కోసం కథ సిద్ధం చేశానని అన్నారు కదా...
కథానాయకుడుగా ఆయన ఇప్పుడొక స్థాయిలో ఉన్నాడు. అలాంటి వ్యక్తి రాజకీయాల్లోకి వెళుతున్నాడంటే ప్రజాసేవ చేయాలనే తపన మనసులో ఎంత బలంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆ కోణంలో పవన్‌కల్యాణ్‌కి మాత్రమే సరిపడే కథ నా దగ్గరుంది. అందుకే ఆ మాట చెప్పా.



షకలక శంకర్

శంభో శివ శంకర

హాస్యనటుడు షకలక శంకర్‌ని కథానాయకుడిగా పరిచయం చేస్తూ ఆర్.ఆర్.పిక్చర్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. శ్రీధర్ ఎన్ దర్శకుడు. వై.రమణారెడ్డి, సురేష్ కొండేటి నిర్మాతలు. ఈ చిత్రానికి 'శంభో శంకర' అనే పేరు ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ''నా కథని నమ్మిన నిర్మాతలకు కృతజ్ఞతలు. సాయికార్తీక్ మంచి పాటలు ఇచ్చారు. అందరికీ నచ్చే సినిమా అవుతుంద''న్నారు. ''హాస్యనటుడిగా నన్ను ఆదరిస్తున్నారు. ఇప్పుడు కథానాయకుడిగానూ ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉంది. చాలా కథలు విన్న తరవాత ఎంపిక చేసిన స్క్రిప్ట్ ఇద''న్నారు శంకర్. ''ఈ నెలాఖరున చిత్రీకరణ పూర్తవుతుంది. వేసవిలో విడుదల చేస్తామ''న్నారు నిర్మాతలు.


శీనుగాడి ప్రేమ



ప్రణవి

శ్రీనివాసరావు, ప్రణవి, కావేరి, చాందిని ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'శ్రీనుగాడి ప్రేమకథ'. సిన్సియర్ రా మామా అనేది ఉపశీర్షిక. ఆర్.కె దర్శకుడు. శ్రీనివాసరావు నిర్మాత. రమణ సాకే సంగీతం అందించిన గీతాలు విడుదలయ్యాయి. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. నిర్మాత మాట్లాడుతూ ''ప్రతి బ్యాచ్‌లోనూ శ్రీను అనే పేరుతో కనీసం ఒక్కడైనా స్నేహితుడు ఉంటాడు. అలాంటి వాడి కథ ఇది. శ్రీను అనే పేరు పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ నచ్చేలా తీర్చిదిద్దాం. ప్రేమ, వినోదం, స్నేహం.. ఇలా అన్నీ ఉంటాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ''న్నారు.

తారా'జువ్వ'లా దూసుకొచ్చాడు



బొత్స ఝాన్సీ, బొత్స సత్యనారాయణ, రంజిత్, వినాయక్, భరత్, కీరవాణి, లల్వాని, త్రికోటి

రంజిత్, పాలక్ లల్వాని జంటగా నటించిన చిత్రం 'జువ్వ'. త్రికోటి దర్శకుడు. భరత్ సోమి నిర్మాత. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. వినాయక్, బివిఎస్ఎన్ ప్రసాద్, బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీ పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ ''అన్ని రకాల వాణిజ్య హంగులున్న చిత్రమిది. విందుభోజనంలా ఉంటుంది. త్రికోటి తొలి చిత్రానికీ నేనే సంగీతం అందించా'' అన్నారు. ''ఓ చిత్రానికి కీరవాణి సంగీతం అందించడానికి ఒప్పుకున్నారంటే కథలో విషయం ఉన్నట్టే'' అన్నారు వినాయక్. ''దర్శకుడిగా ఇది నాకు రెండో అవకాశం. వరుసగా రెండో చిత్రానికీ సంగీతం అందించిన కీరవాణి రుణం తీర్చుకోలేను. రత్నం ఓ మంచి కథని అందించారు. బడ్జెట్ అనుకున్నదానికంటే కాస్త ఎక్కువే అయ్యింది. నిర్మాత బాగా సహకరించార''న్నారు దర్శకుడు. రంజిత్ మాట్లాడుతూ ''కథే ఈ సినిమాలో హీరో. అంత మంచి కథ దొరికింది. కీరవాణి సంగీతం ప్రధాన ఆకర్షణ'' అన్నారు. ఈనెల 23న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు నిర్మాత.

సోనాక్షికి సోనమ్ క్షమాపణ



బాలీవుడ్ ముద్దుగుమ్మలు సోనమ్‌కపూర్, సోనాక్షి సిన్హా ఇద్దరూ సినిమా నేపథ్యం నుంచి వచ్చినవారే. ఇద్దరి మధ్య మంచి వాతావరణమే ఉంది కానీ శత్రుత్వం లేదు. కానీ ఇప్పుడు సోనాక్షికి సోనమ్ క్షమాపణ చెపాల్సివచ్చింది. ఇటీవల జరిగిన ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొంది సోనాక్షి. అప్పుడు సోనమ్ గురించి చెప్పమని వ్యాఖ్యాత అడిగితే ''ఒకనొక సమయంలో సోనమ్ నా పట్ల తన యాటిట్యూడ్ చూపించింది. కానీ అంత అవసరం లేదు'' అని చెప్పింది సోనాక్షి. ఈ విషయం తెలిసి సోనమ్ స్పందిస్తూ ''నువ్వంటే నాకు ఎప్పుడూ ఇష్టమే. నీ పట్ల నేను అలా ప్రవర్తించినట్టు నాకు గుర్తు లేదు. నువ్వు అలా అనుకుంటున్నావు కాబట్టి క్షమించు'' అని ట్వీటింది. దీనికి వెంటనే సోనాక్షి స్పందించి ''అయ్యో సోనమ్ నువ్వు ఇవన్నీ పట్టించుకుంటున్నావా..! ఇలాంటి టీవీ షోల్లో మనం చెప్పే వన్నీ నిజాలేనా ఏంటి? ఇలాంటి వాటిని నువ్వు సీరియస్‌గా తీసుకోవద్దు'' అని ట్వీటింది సోనాక్షి.



సోనాక్షి సిన్హా

సోనమ్ కపూర్

సీనియర్ సిటిజన్లు అంటే బరువు కాదు.
మన దేశ పరువు.
చిత్రం: ఖైదీ నంబర్ 150
- పంపినవారు: పార్శి ప్రభావత్ ఓంప్రకాశ్, మహబూబ్‌నగర్

పంచ్ డైలాగ్

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్- 501512

సందేశంతో 'సత్య గ్యాంగ్'



సాత్విక ఈశ్వర్, అక్షిత

సాత్విక ఈశ్వర్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. అక్షిత కథానాయిక. ప్రభాస్ దర్శకత్వం వహిస్తున్నారు. మహేష్ ఖన్నా నిర్మాత. సమాజంలో ఎవ్వరూ అనాథలు కాకూడదనే ఓ సందేశానికి వినోదాన్ని జోడించి తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అనాథ బాలల సమక్షంలో వాళ్లే అతిథులుగా ఈ వేడుకని నిర్వహించింది చిత్రబృందం. నిర్మాత మాట్లాడుతూ ''సమాజంలో మార్పు కోరే ఓ బలమైన సందేశంతో తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమా చూసి నచ్చలేదన్నవాళ్లకి డబ్బులు తిరిగిచ్చేస్తాం. సినిమాపై మాకున్న నమ్మకంతోనే ఆ మాట చెబుతున్నాం. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం. నాయకానాయికలకి, దర్శకులకి మంచి భవిష్యత్తు ఉంటుంది'' అన్నారు. ఆయన అనాథ బాలలకి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకానాయికలతో పాటు, నటులు నియూష్, హర్షిత, ఛాయాగ్రాహకుడు అడుసుమిల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియమైన నీకోసం...

ఆడవారికి అలంకారం ఓ ఆభరణం. వేడుకేదైనా తారలు దిగి వచ్చినట్టు తళుక్కున మెరవాలంటే... ఆహార్యం ఆకట్టుకునేలా కనిపించాల్సిందే. నప్పే నగలూ... సింగారించుకోవాల్సిందే! మరి ఈ ప్రేమికుల దినోత్సవంలో ప్రియమైన వారితో సరదాగా గడిపేవేళ... మన ఆహార్యంలో చిన్నచిన్న మార్పులు చేసుకుందామా...















- సాయంత్రపు వేళ పార్టీలకు వెళ్తోంటే తేలికగా ఉండే దుస్తులు బాగుంటాయి. లేత వర్ణంపై ముదురు గులాబీల డిజైను ఉండేలా చూసుకుంటే మరీ మంచిది. అలాగే నలుపు తెలుపు కలబోతలో గీతలు లేదా హృదయాకారంలో పోల్కాడాట్లు ఉన్న గౌన్లు నప్పుతాయి. పూర్తిగా ఎరుపురంగు డ్రెస్, చేతులు మాత్రం కోల్డ్ షోల్డర్‌లో ఉండేలా కూడా చూసుకోవచ్చు. అలాగే పొడవు గౌన్లు కూడా ఈ సమయానికి నప్పుతాయి. ఇవి కూడా ఎరుపు లేదా ముదురు నీలం రంగులయితే ఆకర్షణీయంగా ఉంటారు.
- పార్టీలకు వెళ్తోంటే... జీన్స్‌పై ముదురు వర్ణంలో రఫెల్స్ ఉన్న క్రాప్‌టాప్ సరైన ఎంపిక. ఇది ఎరుపైతే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. అలాగే లెగ్గింగ్‌లపై సెల్ఫ్ డిజైన్ ఉండే క్రాప్‌టాప్ వేసి, పైన ఎరుపు రంగు ష్రగ్ వేసుకుంటే మీరే ప్రత్యేకంగా కనిపిస్తారు. వీటికి జతగా చిన్న బ్యాగూ, ఎత్తు చెప్పులు ఉండేలా చూసుకోవాలి. మెడలో చిన్న హృదయాకారపు పెండెంట్ మిమ్మల్ని హుందాగా కనిపించేలా చేస్తుంది. మోకాళ్ల కిందవరకు వచ్చే గౌన్లు లేదా పూల డిజైన్లు ఉండే పొడవాటి గౌన్లు, కూడా ఈ సందర్భానికి అందంగా ఉంటాయి. ఈ తరహా దుస్తులకు చేతులు పొట్టిగా రఫెల్స్ డిజైనులో ఉంటే బాగుంటుంది. కాస్త సంప్రదాయంగా కనిపించాలనుకుంటే గాగ్రాలు ప్రయత్నించొచ్చు. వీటిమీదకు హృదయాకారం ఉన్న పెండెంట్లు నప్పుతాయి.
- చీరకట్టులో మెరవాలనుకుంటే... ఎరుపును మించిన రంగు మరొకటి ఉండదు. ఆ రంగు చీరపై సన్నటి అంచు కుదిరితే దానిపై ఎంబ్రాయిడరీ పనితనం ఉంటే అదుర్స్. నెట్టెడ్ బ్లవుజు దానికి బాగా నప్పుతుంది. నగల విషయానికొస్తే.. కాస్త కనిపించేలా జుంకాలూ, చోకర్, ఉంగరం.. ఇలాంటివి ఎంచుకోవాలి.
- దుస్తులు ఎలాంటివయినా... బ్రేస్‌లెట్, బ్యాగూ, చెప్పులూ, పెండెంట్, లోలాకులు... ఇలా ఏవో ఒకటి హృదయాకారంలో ఉండేలా చూసుకుంటే ఆ అందమే వేరు.





చీరతో స్కైడైవింగ్...!



చీరతో స్కైడైవింగ్ చేసిన తొలి భారతీయ మహిళగా పుణెకు చెందిన శీతల్ రాణె మహాజన్ రికార్డు సృష్టించారు. పైగా తను కట్టుకుంది మామూలు చీర కూడా కాదు. ఏకంగా తొమ్మిది గజాలుండే మహారాష్ట్ర సంప్రదాయమైన నౌవారి చీర..!! థాయ్‌లాండ్‌లోని పట్టాయా రిసార్ట్స్‌లో 13 వేల అడుగుల ఎత్తు నుంచి డైవింగ్ చేసి ఆమె ఈ రికార్డు సొంతం చేసుకున్నారు. అంతకముందే 750 అడుగుల ఎత్తులో హాట్ ఎయిర్ బెలూన్‌లో ఉండి పెళ్లి చేసుకుని రికార్డు కూడా నమోదు చేశారు. అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమీపిస్తుండటంతో ఏదైనా కొత్తగా చేయాలనిపించి ఇలా చీరతో డైవింగ్ చేసినట్లు శీతల్ తెలిపారు. "భారతీయ మహిళలు ఎక్కువగా చీరల్లోనే కనిపిస్తారు. ఎంతటి సాహసాన్నైనా ఆ చీర కట్టుకునే చేయగలరని నిరూపించడానికే ఇలా చేశాను" అంటారామె. ఆమె పేరున దేశీయంగా 18 స్కైడైవింగ్ రికార్డులూ, అంతర్జాతీయంగా 6 రికార్డులు ఉన్నాయి.



ప్రపంచవ్యాప్తంగా 704 జంప్స్ చేసిన ఆమెకు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలూ వరించాయి. 2004 సంవత్సరం ఏప్రిల్ నెలలో రష్యాకు చెందిన ఎంఐ-8 హెలికాప్టర్ నుంచి ఉత్తర ధ్రువంలో మైనస్ 37 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 2,400 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి సాధన లేకుండా స్కైడైవింగ్ చేసి అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించారామె.

పరదాలకు రాళ్ల ఉప్పు!

ఇంటి అలంకరణలో పరదాల పాత్ర ప్రత్యేకం. వివిధ వర్ణాల మేళవింపుతో విభిన్నంగా కనిపించే పరదాలు ఇంటికే కొత్తందాన్ని తెస్తాయి. అయితే వీటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. అదేవిధంగా వాడకంలోనూ చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవాలి.

- రోజంతా పని ఒత్తిడితో అలసిన మనసుకు ఆహ్లాదం కలిగించేలా పడకగది ఉంటే ఎంతో హాయి. పెద్ద పెద్ద డిజైన్‌లతో ముదురు వర్ణాల్లోని పరదాలను ఎంచుకుంటే మంచిది. ఇతర గదులకు పసుపూ, పచ్చ, ఎరుపుతో పాటూ ఊదాను వాడవచ్చు.
- పరదాలను ఎంపిక చేసుకునేప్పుడు ఏ గదికి వాడబోతున్నారో, ఎండ ఎంతమేరకు పడుతుందో పరిశీలించాలి. లేదంటే వేడి నుంచి రక్షణ కలగదు సరికదా రంగూ పోతాయి.
- పరదాలు ఉతికే నీటిలో డిటర్జంట్‌తో పాటూ, నాలుగు చెంచాల నిమ్మరసం, కొద్దిగా రాళ్ల ఉప్పు వేస్తే రంగు వెలిసి పోకుండా ఉంటాయి. సువాసనలూ వెదజల్లుతాయి.

బంగారం వెండి
12 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,100	31,050	30,900	30,950
ఆర్నమెంట్	29,050	29,000	28,800	28,800
వెండి (కిలో)	39,450	38,800	40,000	40,000
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	31,050	30,950	30,340	30,790
ఆర్నమెంట్	28,680	28,530	28,770	28,790
వెండి (కిలో)	39,200	39,000	38,300	38,000
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,960	30,820	-------	-------
ఆర్నమెంట్	28,790	28,660	2,877	2,879 గ్రా
వెండి (కిలో)	39,900	40,900	41.00	40.60 గ్రా

ఉద్యోగం రాత్రుల్లు... నిద్ర సరిపోవడంలేదు!

ప్రముఖ ఆస్పత్రిలో ఐదేళ్ల నుంచి నర్సుగా పనిచేస్తున్నాను. వృత్తిలో భాగంగా రాత్రి పనివేళలు మాకు తప్పనిసరి. రాత్రి షిఫ్టులు చేయడం చాలా కష్టంగా ఉంటోంది. అలసటగా అనిపిస్తోందని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. అలాని ఈ పని వదులుకోవడం నాకిష్టం లేదు. ఇబ్బందులు లేకుండా.. రాత్రి పనిని ఎలా మేనేజ్ చేసుకోవాలో సలహా ఇవ్వండి.

- నవీన, బెంగళూరు

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నిజమే రాత్రి పనివేళలు మీరు అనుకున్నంత సులభమేమీ కాదు. కానీ సరిగ్గా ప్రణాళిక వేసుకుంటే అనుకున్నంత కష్టం కూడా కాదు. ముఖ్యంగా నిద్ర సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే శారీరకంగా, మానసికంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. వృత్తిలో భాగంగా మీరు పగటి నిద్రపోవడం తప్పనిసరి అయినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పగటిపూట నిద్రకు భంగం కాకుండా వెలుతురుని నివారించేందుకు కర్టెన్లు వేసుకోవడం, ఫోన్ల లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండటం మంచిది. నేషనల్ స్లీప్ ఫౌండేషన్ వివరణ ప్రకారం... అమెరికాలో నైట్‌షిఫ్ట్ ఉద్యోగులకు ప్రత్యేకంగా ఒక నిద్రా నియమావళి ఉంది. నిద్ర భంగం కాకుండా కళ్లకు మాస్కులు, చెవుల్లో ఇయర్‌ప్లగ్స్ తప్పనిసరిగా పెట్టుకుంటారక్కడ. మీరూ ప్రయత్నించి చూడండి. నిద్రపోవడానికి ముందు కెఫీన్ ఉన్న పానీయాలు తాగకూడదు. అలాగే రాత్రిపూట పని ఉన్నప్పుడు తీసుకునే ఆహారం కూడా చాలా కీలకం. శక్తి, సామర్థ్యాన్ని పెంచే ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. అలాని నిద్రను చెడగొట్టేవి కాదు. అయితే చాలా మంది రాత్రిపూట నిద్రను అడ్డుకునేందుకు కాఫీలు, టీలు తాగుతుంటారు. ఇవే సగం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని అంటున్నారు నిపుణులు. బదులుగా సలాడ్లూ, పండ్లూ, కాయగూర ముక్కలూ, పప్పులు మేలు చేస్తాయి. ఆహారంలో మాంసకృత్తులు ఎక్కువగా ఉండి, నిదానంగా జీర్ణమై శక్తిని విడుదల చేసే సంక్లిష్ట పిండిపదార్థాలు అధికంగా ఉండాలి. కొవ్వు తక్కువగా ఉన్నవాటిని ఎంచుకోవాలి. చాలామంది సరైన ఆహారంపై దృష్టి పెట్టక.. నిద్రలేమీ, అధికరక్తపోటూ, మధుమేహం, నెలసరులు సరిగా రాకపోవడం, అధిక బరువు లాంటి సమస్యల బారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అలాగే పగటిపూటతో పోలిస్తే రాత్రిళ్లు ఉండే ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఎమర్జెన్సీ కేసులు వంటివి ఎదురయితే వాటిని తడబడకుండా పూర్తిచేయడానికి తోటి ఉద్యోగులతో సత్సంబంధాలు ఉండాలి. అప్పుడే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా మీ పనిని పూర్తి చేయగలుగుతారు. వీలైనంతవరకూ ఒకచోట కూర్చోకుండా... మెట్లు ఎక్కడం, దిగడం లాంటివి చేస్తే నిద్ర ఇబ్బంది పెట్టదు.

కీరనీళ్లు... తాగి చూడండోసారి!

మన శరీరంలోని మలినాలను బయటకు పంపించడానికి చాలా మార్గాలే ఉంటాయి. కానీ వాటిలో అన్నింటికన్నా సులభమైన మార్గం కీరదోస నీళ్లు తాగడం. వీటి వల్ల కలిగే ప్రయోజనాలేంటో చూద్దాం.

- ఇవి తయారు చేసుకోవడం కూడా సులువే. కీరను పలుచని ముక్కలుగా కోసి తాగే నీళ్లలో వేయాలి. అరగంటయ్యాక తాగొచ్చు. అయితే నీళ్లలో ముక్కలు మాత్రం ఒకరోజు కన్నా ఎక్కువ ఉంచకూడదు. కావాలంటే రుచి కోసం నిమ్మరసం కూడా కలపొచ్చు.
- ఈ నీళ్లు రోజూ తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాకుండా ఉంటుంది. ఈ నీళ్లలోని కీరదోస ముక్కల్ని కూడా తినొచ్చు.




- దోసలో విటమిన్లూ, మినరళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.
- బరువు తగ్గించడంలో ఈ నీటి పాత్ర మెండు. ఆకలిగా అనిపించినప్పుడు కీరదోస నీళ్లు తాగితే పొట్టనిండిన భావన వస్తుంది.
- ఈ నీటిలో పుష్కలంగా ఉండే విటమిన్-కె, మాంసకృత్తులు... ఎముకలూ, కండరాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ఈ నీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లూ, విటమిన్ సి మాంగనీసు, బీటాకెరోటిన్ గుండె సంబంధ వ్యాధులు రాకుండా కాపాడతాయి.
- నోటి నుంచి దుర్వాసన వస్తుంటే ఈ నీళ్లను క్రమం తప్పకుండా తాగి చూడండి. నోట్లో ఉండే బ్యాక్టీరియాను చంపి ఈ సమస్య తగ్గుముఖం పడుతుంది.

నజరానా

గారెలు కరకరలాడాలంటే పిండి రుబ్బేటప్పుడు కాస్తంత అన్నాన్ని లేదా సేమియా వేసి రుబ్బితే సరి.

సర్దుకుపోయి ఆదా చేద్దాం!

ఇప్పటి అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువే. దాన్ని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తు బంగారు బాటే.. కానీ అప్పుడే రెక్కలు తొడుగుతున్న వారి మనసుకి ఖర్చులు కళ్లెం వేయలేకపోతున్నాయి. మరెలా అంటారా..



- కొందరు విపరీతంగా ఖర్చుచేస్తారు. దీంతో పది రోజులు తిరక్కుండానే చేతిలో చిల్లిగవ్వ కూడా మిగలదు. పైగా ఖర్చులకోసం మరో చోట చేయి చాచాల్సిన పరిస్థితి. అందుకే ముందే వచ్చే జీతం, ఖర్చులూ, మిగులుపై ఓ స్పష్టత ఉండాలి.
- జీతం రాగానే ముందు ఓ ప్రణాళిక వేసుకోవాలి. కొంత దాచి ఆ తరువాత ఖర్చులు అనే నియమాన్ని పెట్టుకోవాలి. మీ జీతంలోంచి ఎంతో కొంత పొదుపు చేసుకున్నాకే ఖర్చుల గురించి ఆలోచించాలి.
- ఇంటి అద్దె అదుపులో ఉండాలంటే... నలుగురితో కలిసి ఓ చోట ఉండేలా చూసుకోండి. మన జీతంలో కాస్త ఎక్కువమొత్తమే మిగులుతుంది.
- హోటళ్లకు వెళ్లి తినడం బాగానే అనిపిస్తుంది. కానీ అదేపనిగా తింటోంటే డబ్బు ఖర్చు కావడమే కాదు, ఆరోగ్యానికీ మంచిది కాదు. అందుకే కనీసం నెలా, నెలన్నర రోజులు బయట ఆహారం తినకూడదని అనుకోవాలి. అలాంటి రుచుల్ని వీలుంటే ఇంట్లోనే ప్రయత్నించొచ్చు.
- అమ్మాయిలు ఎక్కువగా ఖర్చు చేసేది మేకప్ సామగ్రి, క్రీంలూ, బ్యాగులు.. ఇలాంటివాటిపైనే. ఒకేసారి కొనేసి, తరువాత వాటిని వృథాగా పారేసే బదులు.. కొనేముందు అవసరమా కాదా అని నిర్ణయించుకోవాలి. ఆ తరువాతే కొనాలి. ఇదే సూత్రం అన్నింటికీ నిత్యావసరాలకూ పెట్టుకుంటే మంచిది.

ఈ సైకిల్‌ని తొక్కక్కర్లేదట!



సైకిల్ కదలాలంటే... మనం కష్టపడాలి. పెడల్‌తో తొక్కితేనే ముందుకు వెళుతుంది. దీనికి భిన్నంగా ఓ సరికొత్త ఆవిష్కరణతో మన ముందుకొచ్చింది తేజస్విని. కేవలం గాలితోనే ముందుకు వెళ్లే సైకిల్‌ని రూపొందించింది. కష్టపడకుండానే గంటకు అరవై కిలోమీటర్లు వెళుతుందిది. ఇంకా దీని ప్రత్యేకలేంటో తెలియాలంటే చదవాల్సిందే!

కాలుష్యం ప్రాణాంతకమైంది. దిల్లీలో దీనికి భయపడే వాహనాల మీద నియంత్రణ పెట్టారు. ఇవన్నీ నిరోధిస్తూ.. కష్టపడాల్సిన అవసరం లేకుండా వాహనాన్ని తయారు చేస్తే ఎంతో మందికి ఉపయోగపడుతంది అనుకుంది తేజస్విని ప్రియదర్శిని. అయితే తన మనసులో ఇలాంటి బీజం పడటానికి నాంది మాత్రం ఒక టుంది. అదేంటంటే... తేజస్విని పుట్టి పెరిగింది. ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలా పరిధిలో. తండ్రి వ్యయసాదారుడు. వారిది ఆర్థికంగా అంత ఉన్నత కుటుంబం ఏమీ కాదు. తేజస్విని ప్రతిరోజూ బడికి సైకిల్ మీద వెళ్లి వచ్చేది. ఒకసారి స్కూల్‌కి వెళ్తుంటే సైకిలుకు పంక్చర్ పడింది. దాన్ని బాగు చేయించడానికి సైకిల్ మెకానిక్ వద్దకు వెళ్లింది. అతను ఎయిర్ గన్‌తో టైర్లను బాగు చేయడం చూసింది. అప్పుడే గాలితో కదిలే సైకిల్‌ని తయారు చేయాలనే ఆలోచన వచ్చింది.

సిలెండర్ గాలితో: వెంటనే తండ్రి వద్దకు వెళ్లి మనసులో మాట చెప్పింది. కూతురు సృజనాత్మకంగా ఆలోచించడం ఆ తండ్రికి ఎంతో సంతోషాన్నిచ్చింది. అందుకోసం ఏదైనా చేయడానికి సిద్ధపడ్డాడు అతను. ఓ పాత సైకిల్‌ని.. ఆసుపత్రుల్లో వాడే సిలిండర్‌ను ఇచ్చారు. సైకిల్ మెకానిక్‌ల సాయంతో కొన్ని ముడి భాగాలను సేకరించింది. ఇందు కోసం బడికి వెళ్లి రాగానే.. అదే పనిలో ఉండేది. తండ్రి కూడా పనులన్నీ ముగించుకుని కూతురుకు సాయం చేస్తుండేవాడు. తేజస్విని ఇందుకోసం దాదాపు ఆరు నెలలు కష్టపడింది. చివరిగా సైకిల్‌కి వెనక భాగంలో ఓ సిలెండర్‌ను ఏర్పాటు చేసింది. దానికి ఎయిర్ గన్‌ను పెడల్ వద్ద ఉంచింది. సిలెండర్ వద్ద ఓ నాబ్‌ను అమర్చింది. దాన్ని నొక్కినప్పుడు ఎయిర్ గన్ నుంచి గాలి ఉధృతంగా వస్తుంది. ఆ ఉధృతికి పెడల్ కదిలి తొక్కకుండానే సైకిల్ ముందుకు వెళ్తుంది. సైకిల్‌ని నియంత్రించడానికి గేర్లు కూడా ఏర్పాటు చేసింది.

ఖర్చులేని ప్రయాణం: తేజస్వినికి ఈ ప్రయోగంలో తండ్రితోపాటు, బడిలో టీచర్లు మార్గనిర్దేశం చేశారు. అలా ఆ సైకిల్ రోడ్డుపైకి వచ్చింది. పది కిలోల సిలెండర్‌తో దాదాపు గంటలో అరవై కిలోమీటర్లు నడపొచ్చు. ఇలాంటి సైకిళ్లు.. శక్తి లేని వృద్ధులూ, వికలాంగులూ, పర్యావరణ ప్రేమికులు ఎంచుకోవచ్చు. ఖర్చు కూడా తక్కువే. కేవలం బైకుల మాదిరి గాలి నింపితే సరిపోతుంది. ఈ సైకిల్‌ను తేజస్విని స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించింది. ప్రతి ఏటా తాను చదివే పాఠశాలలో ఏదైనా కొత్త ప్రయోగంతో రమ్మంటారు. ఈసారి మాత్రం తేజస్విని ఈ సైకిల్‌ను ప్రదర్శించి బడిస్థాయిలో బెస్ట్ అనిపించుకుంది. పాఠశాల యాజమాన్యం.. ఈ సైకిల్‌కు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. పెటెంట్ కూడా తీసుకునే పనిలో ఉన్నారు.

సివిల్ సర్వీసెస్-2018 వ్యూహం



దేశంలోనే అత్యున్నతమైన సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యే అభ్యర్థులు నిరంతర అధ్యయనశీలురై ఉండాలి. పరిజ్ఞానం, నైపుణ్యాలకు ఎప్పటికప్పుడు పదును పెట్టుకోవడంతోపాటు ఉద్యోగ విధుల పట్ల భావోద్వేగ భరితమైన బంధాన్ని కలిగిఉండాలి. అప్పుడే ప్రజాసంక్షేమం పరమార్థంగా పాలన సాగుతుంది. ఈ లక్షణాల పరిశీలనే లక్ష్యంగా సివిల్స్ పరీక్షలు జరుగుతాయి. 2018 సంవత్సరానికి ప్రకటన వెలువడింది. గతంతో పోలిస్తే ఖాళీలు 780కి తగ్గాయి. పోటీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సన్నద్ధత సాగించాలి.

ప్రిలిమ్స్‌లో పోటీకి దీటుగా!

ప్రశ్నపత్ర రూపకర్తలు సివిల్స్ పరీక్ష లక్ష్యాన్ని ముందస్తుగానే వ్యక్తపరిచారు. వాటిలో రెండు ముఖ్య లక్ష్యాలను పేర్కొన్నారు. అవి:

ఎ) నిరంతర పరిజ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోగల అభ్యర్థులనూ బి) వ్యక్తిత్వపరంగా, ప్రేరణపరంగా తగినవారై, నియమితులైన సర్వీస్‌తో భావోద్వేగపరంగా అనుబంధం పెంచుకోగల వారినీ ఎంపిక చేయడం.



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

వీటికి అనుగుణంగానే పరీక్ష

ఎ) ప్రాథమికాంశాలపై అభ్యర్థి పరిజ్ఞానాన్నీ, దాన్ని వర్తమాన వ్యవహారాలకు ఎలా జోడిస్తున్నారో పరీక్షిస్తారు (నిరంతరంగా జ్ఞాన సముపార్జన చేయగల సామర్థ్యం).

బి) జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, అభివృద్ధిపై ఆసక్తి, ప్రజలు ఎదుర్కొనే సమస్యలపట్ల సున్నితత్వం, వాటి పరిష్కారానికి ప్రభుత్వం అనుసరించిన మార్గాలను పరీక్షిస్తారు.

సి) భవిష్యత్తుకు సంబంధించి ప్రభుత్వ ఆలోచనలు, వాటిని సాధించడానికి తీసుకుంటున్న చర్యలపై అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు.

దీంతోపాటు అభ్యర్థులను వడపోత పోసి, వారి సంఖ్యను తగ్గించగలిగేలా ప్రిలిమినరీ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు.

ఇదంతా దృష్టిలో ఉంచుకుని ప్రిలిమినరీ పరీక్షను ఓసారి పరిశీలిద్దాం.

ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి: జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2. ప్రతి పేపర్‌కు 200 మార్కులు. పేపర్-1లో 100 ప్రశ్నలుంటాయి. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు. పేపర్-2లో 80 ప్రశ్నలుంటాయి. ప్రతీ సరైన సమాధానానికి రెండున్నర మార్కులు. రుణాత్మక మార్కులున్నాయి. ప్రతి తప్పు సమాధానానికీ 0.33% మార్కుల కోత విధిస్తారు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే- పేపర్-2 అర్హత కోసం మాత్రమే. అంటే పరీక్షార్థి 200 మార్కులకుగానూ 33% అంటే సుమారు 67 మార్కులు సాధిస్తే సరిపోతుంది. ఈ మార్కులను సాధించడంలో విఫలమైతే, తిరస్కరణకు గురైనట్టే. కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు సాధిస్తేనే పేపర్-1ను దిద్దుతారు. మెరిట్ లిస్ట్‌ను పేపర్-1లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ పాలసీని దృష్టిలో ఉంచుకుని తయారుచేస్తారు.

ప్రిలిమినరీలో అర్హత సాధించడానికి ఎంత స్కోరు చేయాలో పట్టికలో ఇచ్చిన గత సంవత్సరాల కటాఫ్ మార్కులను పరిశీలిస్తే తెలుస్తుంది.

2017లో కటాఫ్ మార్కు జనరల్ కేటగిరీకి 59% ఉండవచ్చు. ఓబీసీకి 57.5%, ఎస్సీకి 51%, ఎస్టీకి 49% ఉండే అవకాశముంది. అయితే జూన్ 2018 లో తుది ఫలితాలు ప్రకటించాక కటాఫ్ శాతం ఎంతన్నది తెలుస్తుంది.

ఈ ఏడాది ప్రశ్నల స్థాయి కఠినంగా ఉంటుందని భావించవచ్చు. అలాగే కటాఫ్ కూడా ఎక్కువగానే ఉండే అవకాశముంది. కాబట్టి కనీస లక్ష్యాన్ని 120/200గా పెట్టుకోవాలి. అందుకు తగిన వ్యూహాన్ని రూపొందించుకోవాలి.

పరీక్ష	జనరల్		ఓబీసీ		ఎస్సీ		ఎస్టీ	
	2015	2016	2015	2016	2015	2016	2015	2016
సీఎస్ - ప్రిలిమ్స్ (కటాఫ్ మార్కులు)	107.34	116.00	106.00	110.66	94.00	99.34	91.34	96.00

వ్యూహమిదిగో!

సరైన వ్యూహ రూపకల్పనను పునాది నుంచి ప్రారంభించడం అవసరం. అంటే సిలబస్‌ను స్థూలంగా గమనించి, దానిలోని తాజా ధోరణులను అర్థం చేసుకోవాలి.

సిలబస్ కరెంట్ అఫైర్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, జనరల్ సైన్స్‌లతో సాధారణంగా ఉంది. ఏ అంశం నుంచి ఏది వస్తుందో అర్థం చేసుకోవడానికి గత సంవత్సరాల పరీక్షల్లోని ప్రశ్నల సరళిని విశ్లేషించుకోవాలి.

- సిలబస్‌లోని ప్రతి సబ్జెక్టు ప్రాథమికాంశాలపై దృష్టి సారించాలి.
- ప్రాథమికాంశాల అధ్యయనం పూర్తయ్యాక గత సంవత్సరాల్లో అడిగిన ప్రశ్నలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఏటా మారే ప్రశ్నలతీరును గమనించాలి.
- ఏ అంశాలపై ప్రశ్నలను ఇస్తున్నారో గ్రహించడంతోపాటు వాటికి సంబంధించిన వర్తమాన వ్యవహారాలను కూడా చదవాలి.
- గత ఏడు సంవత్సరాల పేపర్-1 ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే 2016, 2017లో కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ విభాగంలో ప్రశ్నలన్నీ దాదాపుగా ప్రభుత్వ కార్యక్రమాలపైనే వచ్చాయి. భారత్‌లో యువత సంఖ్య మొత్తం జనాభాలో 34.8%. అక్షరాస్యత శాతం 73. పరిపాలనలో ఎక్కువ భాగం యువతదే. అందుకే ప్రభుత్వం వారికోసం ఎన్నో కార్యక్రమాలూ, పాలసీలను రూపొందిస్తోంది. ఒక సివిల్ సర్వెంట్ వీటిని అమలు పరచాల్సి ఉంటుంది. కాబట్టి, భావి సివిల్ సర్వెంట్‌కు ఈ పథకాల గురించి అవగాహన ఉండాలని ప్రశ్నల్లో వీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

సెలక్షన్ చేజారినా.. మరో ఉద్యోగం!

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను పెంచాలనే ఉద్దేశంతో ఈ నోటిఫికేషన్ ద్వారా యూపీఎస్సీ మరో మంచి అవకాశాన్ని కల్పించింది. తుది జాబితాలో సెలక్షన్ కోల్పోయిన వారి వివరాలను పోర్టల్‌లో పొందుపరుస్తుంది. ఆ సమాచారం ఆధారంగా అభ్యర్థులను ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించింది. సివిల్స్ ఇంటర్వ్యూకు అర్హత సాధించి తుది జాబితాలో చోటు కోల్పోయినవారిని ఇతర ఏజెన్సీలు నియమించుకునేలా చూడాలని బ్రిటన్‌కు చెందిన ఫల్టన్ కమిషన్ సూచించింది. ఎంతో శ్రమించి పర్సనాలిటీ టెస్ట్ దాకా వచ్చిన అభ్యర్థుల కష్టం వృథా కాకుండా ఈ నిర్ణయం ఉపయోగపడుతుంది. పబ్లిక్ లేదా పెద్ద ప్రైవేటు రంగ సంస్థలు ఈ అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూలకు పిలిచి ఉద్యోగాలు ఇచ్చే అవకాశముంది.

ప్రస్తుత నోటిఫికేషన్ వివరాలు

- గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఖాళీల సంఖ్య దాదాపుగా 200 తగ్గింది. గడిచిన పదేళ్లతో పోలిస్తే ఈసారి ఖాళీలు తక్కువే. అంటే పోటీ ఎక్కువ ఉంటుంది. కాబట్టి ప్రిలిమ్స్‌ను దాటడానికి కష్టపడాల్సిందే.
- ఈ ఏడాది నుంచి పర్సన్స్ విత్ డిసెబిలిటీ యాక్ట్ 2017 ప్రకారం రిజర్వేషన్లను పెంచారు. ఈ నోటిఫికేషన్‌లో రిజర్వేషన్‌ను 3% నుంచి 4%కు పెంచారు. ఆటిజం, డౌన్ సిండ్రోమ్, బుద్ధిమాంద్యం, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీస్, ఆసిడ్ దాడి నుంచి బయటపడినవారికి రిజర్వేషన్లు పెంచారు. వయసు పరిమితిని కూడా 10 సంవత్సరాలు పొడిగించారు.

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2018

నోటిఫికేషన్ తేదీ: 07.02.2018

దరఖాస్తు చివరితేదీ: 06.03.2018 (ఆన్‌లైన్)

ప్రిలిమినరీ పరీక్ష: 03.06.2018

మెయిన్స్: 01.10.2018

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం



ఈ తప్పులు చేయవద్దు!

- ప్రశ్నపత్రం సరళిని తెలుసుకోడానికి పరీక్ష రాసి ఒక అవకాశాన్ని నష్టపోవద్దు. ఆరు ప్రయత్నాల్లో ఒకటి పోయినా ఇబ్బంది లేదని అనుకోకూడదు. ఆరుసార్లు రాసి కూడా ఐఏఎస్ కాని వాళ్లు ఎంతోమంది ఉన్నారు. పరీక్ష అయిన తర్వాత ప్రశ్నపత్రం ఎలాగూ బయటకు వస్తుంది కాబట్టి తర్వాత పరిశీలించుకోవచ్చు.
- మనకు ఇష్టమైనదని ఒక సబ్జెక్టుపైనే దృష్టి పెట్టకూడదు. మొదటిసారి రాసేవాళ్లు సాధారణంగా ఈ తప్పు చేస్తుంటారు. అన్ని సబ్జెక్టులకు అవసరమైన ప్రాధాన్యాన్ని ఇచ్చి అధ్యయనం చేయాలి.
- కష్టంగా ఉందని ఏ సబ్జెక్టునూ నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణంగా కొందరు ఎకానమీ పేపర్‌ను ఇలా పక్కన పెడుతుంటారు. అన్ని అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.
- ప్రతి అంశంపై అందుబాటులో ఉన్న పుస్తకాలన్నీ చదవడానికి ప్రయత్నించవద్దు. దాని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంటుంది.
- అంత పెద్ద సబ్జెక్టులో కొద్దిగానే చదివానని కంగారు పడాల్సిన అవసరం లేదు. ఒక ప్రముఖ రచయిత చెప్పినట్లు మీకెంత తక్కువ తెలుసో గ్రహించడానికే ఎవరికైనా చాలా సమయం పడుతుంది. కాబట్టి పరీక్షకు అవసరమైనంత తెలుసుకుంటే చాలు.
- ఫలానా అంశం నుంచే ప్రశ్నలు వస్తాయని అనుకోవద్దు. నిపుణుల విశ్లేషణలు కేవలం అంచనాలే. ఎగ్జామినర్ వాళ్ల అంచనాలన్నింటినీ తలకిందులు చేసే అవకాశం ఎప్పుడూ ఉంటుంది.
- పదే పదే సలహాల కోసం సీనియర్లను సంప్రదించవద్దు. మొదటిసారికి ఫర్వాలేదు. రెండోసారికి మీ సందేహాలను మీరే నివృత్తి చేసుకోగలరు. అంతకుమించితే సమయం వృథా కూడా.
- ఇతరుల టైంటేబుల్‌ను గుడ్డిగా అనుసరించవద్దు. సొంతంగా తయారు చేసుకోండి. మోడల్ కోసం ఇతరుల ప్రణాళిక సమాచారాన్ని ఉపయోగించుకోవచ్చు.
- మాదిరి పరీక్షలను రాయండి, కానీ మరీ ఎక్కువగా కాదు. కాంప్రహెన్సివ్ పరీక్షలు అంటే 100 ప్రశ్నల ప్రశ్నపత్రంలో హిస్టరీ, పాలిటీ మొదలైనవన్నీ ఉన్నవాటిని రాయడం మేలు. ఉదాహరణకు.. కేవలం హిస్టరీపైనే 100 ప్రశ్నలు ఉన్నవి రాయడం అంత మంచిది కాదు.
- చేసిన తప్పులను వదిలేయవద్దు. నమూనా పరీక్ష సమాధానాలను చెక్ చేసుకునేటప్పుడు జరిగిన తప్పులకు సంబంధించి నోట్స్ రాసుకోండి. అవి మీ తుది స్కోరును ఎలా ప్రభావితం చేస్తున్నాయో గుర్తించండి. ప్రతి చిన్న తప్పుకి మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అది ప్రిలిమ్స్‌లో అర్హత కోల్పోవడానికీ కారణం కావచ్చు.

నోటీస్ బోర్డు

వాక్ - ఇన్స్

స్నో అండ్ అవలాంచ్ స్టడీ ఎస్టాబ్లిష్‌మెంట్

డీఆర్‌డీఓకు చెందిన ఈ పరిశోధన, అభివృద్ధి కేంద్రం చండీగఢ్‌లో ఉంది.

పోస్టు: జేఆర్ఎఫ్ **ఖాళీలు:** 09

స్టైపెండ్: నెలకు రూ.25,000తోపాటు హెచ్ఆర్ఏ.

అర్హత: ఆయా సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్సీ/ ఎంఎస్సీ (టెక్)తోపాటు నెట్/ గేట్. **వయసు:** 28 సంవత్సరాలకు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీ: 06.03.2018

వేదిక: స్నో అండ్ అవలాంచ్ స్టడీ ఎస్టాబ్లిష్‌మెంట్ పరిశోధన, అభివృద్ధి కేంద్రం, చండీగఢ్.

ప్రవేశాలు

ఎయిమ్స్, న్యూదిల్లీ

కోర్సులు: 1) డీఎం/ ఎంసీహెచ్ 2) ఎండీ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్) 3) ఫెలోషిప్ ప్రోగ్రాములు

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

ప్రవేశ పరీక్ష తేది: 2018 ఏప్రిల్ 7, 14

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 16.02.2018 నుంచి 13.03.2018 వరకు

వెబ్‌సైట్: www.aiimsexams.org

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలరీ సైన్సెస్, న్యూదిల్లీ

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్ **ఖాళీలు:** 22

అర్హత, వయసు, ఎంపిక: నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరితేది:** 28.02.2018 **వెబ్‌సైట్:** www.ilbs.in

ఐడీఎస్ఏ, న్యూదిల్లీ

ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనలైజెస్ (ఐడీఎస్ఏ) అసోసియేట్ ఫెలో తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అసోసియేట్ ఫెలో-06, సెక్షన్ ఆఫీసర్-01, జూనియర్ అసిస్టెంట్-01.

అర్హత: ఏదైనా డిగ్రీ, కామర్స్ డిగ్రీ తదితరాలు.

వయసు: జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు 40 ఏళ్లు, మిగిలినవాటికి 45 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: నిబంధనల ప్రకారం.

దరఖాస్తు: ఈమెయిల్/ ఆఫ్‌లైన్.

చివరితేది: అసోసియేట్ ఫెలో పోస్టులకు ఫిబ్రవరి 28, మిగిలినవాటికి మార్చి 14.

ఈమెయిల్: hr.idsa@nic.in

వెబ్‌సైట్: https://idsa.in/jobs

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్

ఇస్రోకి చెందిన ఈ సంస్థ డెహ్రాడూన్‌లో ఉంది.

పోస్టు: సైంటిస్ట్/ ఇంజినీర్ - ఎస్‌డీ **ఖాళీలు:** 02

అర్హత: సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 12.02.18 నుంచి 03.03.18 వరకు

వెబ్‌సైట్: http://www.iirs.gov.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

వ్యవసాయరంగం మెరుగేనా?

పదో తరగతి చదువుతున్నాను. అగ్రికల్చర్‌పై ఆసక్తి ఉంది. ఇంటర్, ఆపై ఏ గ్రూపులు ఎంచుకోవాలి? అందించే కళాశాలలేవి? భవిష్యత్తు ఎలా ఉంటుంది?

- ఇ. అంజి నాయక్

జ: మనది వ్యవసాయాధారిత దేశం కాబట్టి ఈ రంగంలో అభ్యర్థులకు అపార విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఉన్నాయి. ఇంటర్ (10+2)లో బైపీసీ చదివినవారు డిగ్రీలో అగ్రికల్చర్ రంగాన్ని ఎంచుకోవచ్చు.

మన తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ ద్వారా బీఎస్సీ (అగ్రికల్చర్)లో ప్రవేశాన్ని కల్పిస్తున్నారు.




ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ, డాక్టర్ వైఎస్ఆర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, గుంటూరు, అనుబంధ కళాశాలలు ఈ కోర్సును అందిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) వారు నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్)లో ఐసీఏఆర్ సంస్థల్లో సీటు సాధించుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కోర్సు పూర్తి చేసినవారు అగ్రోనమిస్ట్, ఫుడ్ ఇంజినీర్, సాయిల్ సైంటిస్ట్, ఫార్మ్ షాప్ మేనేజర్ వంటి వివిధ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

● ***ప్రొ. బి. రాజశేఖర్,*** కెరియర్ కౌన్సెలర్

ఇక్కడ ఈసీఈ ప్రత్యేకం!



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) పూర్తిచేస్తే ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉంటాయో అని మీరు అన్వేషిస్తుంటే.. ఒకసారి హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ఐటీ) అందిస్తున్న ఈసీఈ కోర్సు గురించి కొంత సమాచారం తెలుసుకోవాలి. సంప్రదాయ కోర్సుతో పోలిస్తే కొన్ని ప్రత్యేక లక్షణాలతో దీన్ని రూపొందించారు.



హైదరాబాద్ ట్రిపుల్ఐటీలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ లేదు. వాస్తవానికి ఏ విభాగానికీ డిపార్ట్‌మెంట్లు లేవు. అన్నీ రిసెర్చ్ సెంటర్లు లేదా ల్యాబ్‌లే. విద్యార్థి ఏ బ్రాంచిలో చేరినా తనకు నచ్చిన రిసెర్చ్ సెంటర్‌లో పేరు నమోదు చేసుకోవచ్చు. పరిశోధనలు చేయవచ్చు. అదే ఇక్కడి ప్రత్యేకత. ఈసీఈకి సంబంధించిన డిస్ట్రిబ్యూటెడ్ స్టోరేజ్, ఆర్టిఫిషియల్ న్యూట్రల్ నెట్‌వర్క్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ ఇన్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్ రిసెర్చ్ సెంటర్లలో కంప్యూటర్‌సైన్స్ బ్రాంచి విద్యార్థులు కూడా పరిశోధనలు చేస్తూ కనిపిస్తుంటారు. అలాగే సీఎస్ బ్రాంచికి సంబంధించిన కంప్యూటర్ విజన్ లేదా మెషిన్ లెర్నింగ్ వంటి విభాగాలను ఈసీఈ అభ్యర్థులు అధ్యయనం చేయడం కూడా చూడవచ్చు.

ఇతర కాలేజీల్లో ఈసీఈ చేరిన విద్యార్థులు ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో సంప్రదాయ సబ్జెక్టులైన ఇంజినీరింగ్ డ్రాయింగ్, ఇంజినీరింగ్ మెకానిక్స్ తదితర సబ్జెక్టులు చదువుతుంటే ట్రిపుల్ఐటీలో మాత్రం కంప్యూటర్ ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ తదితరాలు నేర్చుకుంటారు.

ట్రిపుల్ఐటీలో సీఎస్, ఈసీఈలకు సంబంధించిన కోర్సు నిర్మాణాల్లో కొన్ని సౌలభ్యాలు ఉన్నాయి. ఇంజినీరింగ్ మూడు, నాలుగు సంవత్సరాల్లో ఈసీఈ విద్యార్థులు సీఎస్‌లోని ఎలెక్టివ్స్ లేదా సీఎస్ అభ్యర్థులు ఈసీఈలోని ఎలెక్టివ్స్‌ను తీసుకోవచ్చు. ఇన్ఫర్మేషన్ థియరీ, కోడింగ్ టు మొబైల్ రోబోటిక్స్, కంప్యూటర్ విజన్ అండ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఇన్ ఏఐ వంటి ఎలెక్టివ్స్ దాదాపు 20 వరకు అందుబాటులో ఉన్నాయి.

సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులు కలిసి పనిచేయడం వల్ల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించిన సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది. దీని వల్ల ఎన్‌విడియా, క్వాల్‌కామ్, ఇంటెల్ వంటి హార్డ్‌వేర్ సంస్థల్లోనూ; ఇంటర్‌నెట్ సంబంధిత సోషల్ మీడియా సర్వీసెస్ అందిస్తున్న గూగుల్, ఫేస్‌బుక్‌ల్లోనూ పనిచేయడం తేలికవుతుంది.

అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనే (ఆనర్స్, డ్యుయల్ డిగ్రీ) పరిశోధనలు చేసే అవకాశాన్ని విద్యార్థులకు ట్రిపుల్ఐటీ కల్పిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధానంగా వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్, రోబోటిక్స్, కంప్యూటర్ విజన్ అండ్ మెడికల్ ఇమేజింగ్‌ల్లో వీరు జరిపే పరిశోధనలు వారి ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తున్నాయి. దీంతో ఈ విద్యార్థులు అంతర్జాతీయ సదస్సుల్లో పేపర్లు ప్రజెంట్ చేస్తున్నారు. వీరి పరిశోధనలు జర్నల్స్‌లో పబ్లిష్ అవుతున్నాయి. ఇలా గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా అవార్డులను కూడా ట్రిపుల్ఐటీ అందిస్తోంది.

ప్రకటన వచ్చింది

ఈసీఈతోపాటు ఇతర అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో ప్రవేశానికి హైదరాబాద్ ఐఐఐటీ ప్రకటన జారీ చేసింది. కింది విధానాల ద్వారా ప్రవేశాలు జరుగుతాయి.

- జేఈఈ మెయిన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా సీఎస్ఈ, ఈసీఈ సింగిల్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌లోకి మాత్రమే ప్రవేశం కల్పిస్తారు.
- డీఏఎస్ఏ (డైరెక్ట్ అడ్మిషన్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్) పద్ధతిలో విదేశాల్లోని అభ్యర్థులకు ప్రవేశం కల్పిస్తారు.
- యూజీఈఈ (అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామ్) పద్ధతిలో పరిశోధనల ప్రధానంగా సాగే డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌లోకి అడ్మిషన్ ఇస్తారు. ఇందులో ప్రవేశపరీక్షతోపాటు ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఈ పరీక్షలో పరిశోధనల పట్ల అభ్యర్థుల అభిరుచిని పరిశీలిస్తారు.

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఇన్ఫర్మేటిక్స్ (ఐఓఐ), సైన్స్ ఒలింపియాడ్, మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్ (ఐఓఎల్), పాణినీయన్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్ (పీఎల్ఓ)ల్లో ఏ ఒక్కదానిలోనైనా మనదేశం తరపున పాల్గొన్నవారు యూజీఈఈకి దరఖాస్తు చేసుకుంటే ప్రవేశపరీక్ష లేకుండా డైరెక్ట్‌గా ఇంటర్వ్యూకి పిలుస్తారు.

- ఎస్‌సీఏ (స్పెషల్ చానెల్ ఆఫ్ అడ్మిషన్) పద్ధతిని ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్తగా ప్రవేశపెట్టారు. అసాధారణ ప్రతిభ ఉన్నవారికి ప్రోత్సాహం ఇవ్వడం దీని లక్ష్యం. ఇందులో కేంద్ర ప్రభుత్వ పథకం ఉడాన్‌కి ఎంపికైన అభ్యర్థులు, ఆర్‌జీయూకేటీ వంటి సంస్థల్లో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో చేరి 2018 మే నాటికి రెండో సంవత్సరం పూర్తిచేసుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ అభ్యర్థులు ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఎస్‌సీఏ పద్ధతి కింద 20 సీట్ల వరకు భర్తీ చేస్తారు.

కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్ష ఏప్రిల్ 18, 2018న జరుగుతుంది. యూజీఈఈ, ఎస్‌సీఏ పద్ధతుల కింద ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 5న మొదలైంది. చివరి తేదీ 15 మార్చి, 2018. మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటిస్తారు. జూన్ మొదటి వారం నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి.

వెబ్‌సైట్: iiit.ac.in

ఒమన్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు ఊపు

- ఎప్పటికీ గుర్తుండిపోయే పర్యటన ఇది: మోదీ
- 125 ఏళ్లనాటి శివాలయంలో పూజలు... భారీ మసీదు సందర్శన
- 8 ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు

మస్కట్

ఒమన్ దేశంలో తాను చేసిన పర్యటన, అధినాయకత్వంతో జరిపిన చర్చలు ఇరుదేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాలకు అన్ని పార్శ్వాల్లోనూ చెప్పుకోదగ్గ రీతిలో ఊపు తీసుకువస్తాయని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే పర్యటనల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని చెప్పారు. ఒమన్‌లో రెండ్రోజుల పర్యటన సోమవారం ముగిసిన సందర్భంగా ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'అనేక శతాబ్దాలుగా మన దేశాల నడుమ, మన ప్రజల మధ్య సత్సంబంధాలున్నాయి. వాణిజ్యం, పెట్టుబడుల సహా అన్ని రంగాల్లో ఇవి మరింత విస్తృతం కానున్నాయి. నాకు సౌహార్ద్రపూరితంగా ఆత్మీయమైన ఆతిథ్యమిచ్చి ఆదరించిన సుల్తాన్ కాబూస్‌కు, ఇక్కడి ప్రజలకు కృతజ్ఞతలు..' అని ట్విటర్లో రాశారు. మూడు దేశాల పర్యటనలో చివరిదైన ఒమన్‌కు ఆదివారం రాత్రి చేరుకున్న మోదీ.. వివిధ అంశాలపై సుల్తాన్ కాబూస్‌తో చర్చలు జరిపారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్న సహకారం, సత్సంబంధాలను పెంపొందించడానికి ఉన్న మార్గాలు దీనిలో చర్చకు వచ్చాయని ఒమన్ వార్తాసంస్థ తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సరఫరా, రక్షణ, ఆహార భద్రత, ఇతర ప్రాంతీయ అంశాలపై చర్చలు జరిగినట్లు భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ వెల్లడించారు. ఒమన్ అభివృద్ధికి భారతీయులు చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తున్నారంటూ సుల్తాన్ కాబూస్ కితాబు ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా రక్షణరంగ సహకారం సహా ఎనిమిది ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. పౌర-వాణిజ్య అంశాల్లో న్యాయపరమైన సహకారం అందించుకోవడం, దౌత్యవేత్తలు సహా వివిధ వర్గాలకు వీసా మినహాయింపు, ఆరోగ్యం/ పర్యాటకం/ శాంతియుత ప్రయోజనాలకు అంతరిక్ష ప్రయోగాలు వంటి అంశాల్లో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. సైనిక సహకారంపైనా అనుబంధ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. సంయుక్త విన్యాసాలు చేపట్టడం, శిక్షణ అందించుకోవడం, అనుభవాన్ని పంచుకోవడం, రక్షణరంగ కొనుగోళ్లు చేపట్టడంపైనా రెండుదేశాలూ సహకరించుకోనున్నాయి. ఒమన్ ఉప ప్రధానులు సయ్యద్ ఫహ్ద్ బిన్ మహ్మూద్ అల్ సయ్యద్, సయ్యద్ అసద్ బిన్ తారిక్ అల్ సయ్యద్‌లతో సోమవారం మోదీ భేటీ అయ్యారు.



సోమవారం మస్కట్‌లోని ప్రఖ్యాత గ్రాండ్ మసీదు సందర్శనలో ప్రధాని మోదీ

శివాలయంలో అభిషేకం

మస్కట్‌లోని పురాతన శివాలయాన్ని భారత ప్రధాని సందర్శించి, అభిషేకం నిర్వహించారు. ఆలయ యాజమాన్య కమిటీ సభ్యులతో మాట్లాడారు. వారితో ఫొటోలు దిగారు. ఇంతటి ప్రాచీన శివాలయంలో పూజలు జరపడం తనకెంతో ఆనందాన్నిస్తోందని పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని గుజరాత్ వ్యాపారులు 125 ఏళ్ల క్రితం నిర్మించారు. 1999లో పునర్నిర్మించారు. మస్కట్‌లో ప్రఖ్యాత మసీదునూ సందర్శించారు. మూడు లక్షల టన్నుల రాతిని భారత్ నుంచి రప్పించి, 200 మంది భారతీయ కార్మికులు దీనిని నిర్మించారు.

వ్యాపారానికి ఆకర్షణీయ గమ్యం భారత్

మోదీ తన పర్యటనలో ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశమయ్యారు. వ్యాపారానికి ఆకర్షణీయ గమ్యంగా నిలుస్తున్న భారత్‌కు రావాల్సిందిగా పిలుపునిచ్చారు.

ఉగ్రవాద ప్రాయోజితుల్ని వేరు చేయాల్సిందే

సంయుక్త ప్రకటనలో భారత్, ఒమన్ ఉద్ఘాటన

మస్కట్: ఉగ్రవాద ప్రాయోజితుల్ని వేరు చేయాల్సిందేనని భారత్, ఒమన్ ఉద్ఘాటించాయి. మతాన్ని దుర్వినియోగం చేస్తూ ఉగ్రవాద చర్యలకు ఊతమిస్తున్నవారి ప్రయత్నాలను అడ్డుకోవడంలో సమన్వయంతో ప్రయత్నాలు చేయాలని నిర్ణయించాయి. భారత ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటన సోమవారం ముగిసిన సందర్భంగా సోమవారం రెండు దేశాలూ ఈ మేరకు సంయుక్త ప్రకటన వెలువరించాయి. శాంతి, సుస్థిరతలకు ఉగ్రవాదం విసురుతున్న ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు కలిసి పనిచేయడాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న, దానికోసం రాజ్య విధానంగా తీసుకుంటున్నవారిపై చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చాయి. పరోక్షంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించాయి. ఉగ్రవాద పీచమణిచి, దాని వ్యవస్థల్ని, ఆర్థిక మూలాలను దెబ్బతీయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర ఒప్పందం రూపొందించి దాన్ని త్వరగా కొలిక్కి తీసుకురావాలని పిలుపునిచ్చాయి. ఉగ్రవాద భావజాల వ్యాప్తికి అంతర్జాలాన్ని వినియోగించుకోవడాన్ని ఖండించాయి. త్రివిధ దళాలతో సంయుక్త విన్యాసాలు చేయడంతో పాటు పరస్పరం శిక్షణ అందించుకోవాలనీ, తీర రక్షణలో సహకరించుకోవాలనీ నిర్ణయించాయి.



కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కాంబర్ చేతుల మీదుగా అకాడమీ అవార్డు అందుకొంటున్న దేవీప్రియ, మహ్మద్ బేగ్ ఎహసాస్. 'దుఖ్మా' అనే షార్ట్ స్టోరీకి బేగ్‌కు ఈ అవార్డు దక్కింది. హైదరాబాద్ యూనివర్సిటీలో ఉర్దూ విభాగాధిపతిగా ఆయన పనిచేశారు

సాహిత్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి

సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవీప్రియ

ఈనాడు, దిల్లీ: తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవీప్రియ తెలిపారు. సాహిత్యాన్ని రాజకీయాలకు సంబంధం లేని అంశంగా పరిగణించాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన విజ్ఞప్తిచేశారు. రెండు ప్రభుత్వాలూ సాహిత్యం పట్ల సానుకూల దృక్పథం ఉన్నవేనన్నారు. పిల్లలకు మాతృభాషలో చదువుకునే అవకాశాలు కల్పించాలని, అది కూడా కుటుంబం నుంచే ప్రారంభం కావాలని ఆయన ఆకాంక్షించారు. సోమవారం దిల్లీలో సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ కాంబర్ చేతుల మీదుగా దేవీప్రియ సహా భారతీయ భాషల్లో సుప్రసిద్ధులైన 23 మంది రచయితలు అవార్డులను స్వీకరించారు. సాహిత్య అకాడమీ-2017 అవార్డునందుకొన్న అనంతరం దేవీప్రియ మీడియాతో మాట్లాడారు. 'గాలి రంగు' సంకలనానికి అవార్డు రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. 'కేంద్రసాహిత్య అకాడమీకి దక్షిణాది రాష్ట్రాల కవులు, రచయితలు, విమర్శకులు దూరంగా ఉంటున్నారు. ఉత్తరాది ప్రభావం ఎక్కువగా ఉండటం కూడా ఒక కారణం కావచ్చు. ఈ పరిస్థితులు మారాలి. ఏపీ, తెలంగాణల్లో అకాడమీ కార్యక్రమాలు పెరగాలి. ఇవన్నీ త్వరలోనే జరుగుతాయని ఆకాంక్షిస్తున్నా' అన్నారు. తెలుగు వ్యక్తి శ్రీనివాసరావు కేంద్రసాహిత్య అకాడమీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా అయినప్పటి నుంచి తెలుగు సాహిత్యం పురోగమన దిశగా వెళ్తోందన్నారు. సాహిత్యం, నాణ్యత, ప్రమాణాలపరంగా తెలుగు సాహిత్యం ప్రపంచంలో ఏ భాషలోని సాహిత్యానికీ తీసిపోదని, ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడమే ప్రధాన లోపమని ఆయన పేర్కొన్నారు.

సేద్యానికి 24 గంటల కరెంటెవరడిగారు?

- విచ్చలవిడిగా విద్యుత్‌ను ఎందుకు కొంటున్నారు?
- ప్రభుత్వం రాయితీ ఎంతిస్తుందో ఎందుకు చెప్పట్లేదు
- ఈఆర్‌సీ బహిరంగ విచారణలో ప్రజల అభ్యంతరాలు

ఈనాడు, హైదరాబాద్: "రైతులను రాజకీయంగా వాడుకోవాలనే ప్రభుత్వం అన్నీ ఇస్తున్నట్లు చెబుతోంది. వ్యవసాయానికి 24 గంటల కరెంటెందుకు? ఎవరడిగారు? ఈరోజు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. నిజామాబాద్ జిల్లాకెళ్లి పరిశీలిస్తే.. పలుచోట్ల పొలాలు ఎండిపోయి కనిపించాయి. పగటిపూట పూర్తిగా కరెంటిస్తే చాలు" అని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. 'విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల 2018-19 ఆదాయ ఆవశ్యకత-విద్యుత్ ఛార్జీలు'పై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) సోమవారమిక్కడ బహిరంగ విచారణ చేపట్టింది. వివిధ వర్గాల ప్రతినిధులు, పరిశ్రమలు, వినియోగదారులు వాదనలు వినిపించారు.

దక్షిణ డిస్కం సీఎండీ రఘుమారెడ్డి తొలుత ఆదాయ-వ్యయాలను వివరించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ- 'గ్రామాల్లో పెద్దపెద్ద టవర్లు, లైన్లువేశారు. రైతులకు మాత్రం పరిహారం ఇవ్వలేదు. పంట పాయె..పొలం పాయె.. అని వారు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పరిహారంపై ఆదేశాలివ్వాలి' అన్నారు. ఇంధనశాఖ ఉప కార్యదర్శి శారదాబాయి మాట్లాడుతూ విద్యుత్ రంగానికి అవసరమైన ఆర్థిక సాయం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫ్యాప్సీ ప్రతినిధి సుజాత మాట్లాడుతూ- ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనేవారిపై అదనపు సర్‌ఛార్జీ వసూలు చేయవద్దన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లను ప్రత్యేక కేటగిరీలో పెట్టి ఛార్జీలు తగ్గించాలన్నారు. ట్రూఅప్ ఛార్జీలను అనుమతించవద్దని కోరారు. రైల్వేశాఖ చీఫ్ విద్యుత్ ఇంజినీరు మల్లికార్జునరావు మాట్లాడుతూ... మెట్రోరైల్వే ట్రాక్, స్టేషన్లకు రెండు కేటగిరీల్లో ఛార్జీలు వసూలు చేస్తున్నారనీ, ఇదే వెసులుబాటును సాధారణ రైల్వేకూ ఇవ్వాలన్నారు. విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాలరావు మాట్లాడుతూ- జెన్‌కో విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తిని ఆపేసి, బయటి నుంచి విచ్చలవిడిగా అధిక ధరలకు ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. రైతు సంఘాల ప్రతినిధి దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌కు ప్రభుత్వమిచ్చే రాయితీ ఎంత, ఏయే వర్గాలకు ఎంత ఇస్తుందనే వివరాలను డిస్కంలు ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్వామి జగన్మయానంద నిరసన తెలిపారు.

అదనంగా డిమాండ్ ఛార్జీ...

రఘుమారెడ్డి అన్నీ అంశాలపై వివరణ ఇస్తూ- వచ్చే ఏడాది డిస్కం పరిధిలో 64,219 మిలియన్ యూనిట్ల విద్యుత్, రూ.23,519 కోట్ల ఆదాయం అవసరమన్నారు. కానీ, రూ.4,222 కోట్ల మేర నికర లోటు ఏర్పడుతుందన్నారు. ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లేవారిపై యూనిట్‌కు అదనంగా రూ.2.05 చొప్పున సర్‌ఛార్జీ వసూలుకు అనుమతించాలన్నారు. ఎత్తిపోతల నిమిత్తం యూనిట్‌కు రూ.6.40 చొప్పున తీసుకుంటున్నామనీ, దీన్ని ఇకపై యూనిట్‌ను రూ.4.88కి తగ్గించి.. 'డిమాండ్ ఛార్జీ'గా కిలోవాట్‌కు నెలకు రూ.390 చొప్పున అదనంగా వసూలుచేసేందుకు అనుమతించాలని మండలిని కోరారు.

టీఆర్‌టీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన

నాంపల్లి, న్యూస్‌టుడే: టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలో దొర్లిన తప్పిదాలతో తాము నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ తప్పిదాలను సవరించి న్యాయం చేయాలని టీఆర్‌టీ అభ్యర్థులు సోమవారం నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అభ్యర్థులు సంతోష్, సాయికిరణ్, రమేష్, నాగమణి, రాజేశ్వరి, అర్షియా, తదితరులు టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయం చేసేంతవరకూ కదిలేది లేదంటూ వారు ఆందోళన చేపట్టగా.. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి అభ్యర్థుల వాదనను విన్నారు. కమిషన్‌కు చెందిన సాంకేతిక బృందంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో అభ్యర్థులు ఆందోళన విరమించారు.

15 లోగా ఎడిట్ చేసుకోండి

టీఆర్‌టీ దరఖాస్తుల్లో దొర్లిన వ్యక్తిగత వివరాల తప్పులను సరిచేసుకునేందుకు ఈనెల 15 వరకు సరిదిద్దే (ఎడిట్) అవకాశాన్ని టీఎస్‌పీఎస్సీ కల్పించింది. ఈనెల 15 తరువాత ఎడిట్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేసింది. ఆ తరువాత హాల్‌టికెట్ల పంపిణీ జరుగుతుందని పేర్కొంది.

అవినీతి గుట్టు.. తవ్వేస్తున్నారు!

- పురుషోత్తమ్‌రెడ్డి అక్రమాలపై లోతుగా పరిశోధన
- జైపుర్, హైదరాబాద్‌లో బంగారు, వజ్రాభరణాల కొనుగోలు
- కుమార్తె నగల వివరాలు సేకరిస్తున్న ఏసీబీ
- మరో రూ.3.2 కోట్ల ఆస్తి పత్రాలు స్వాధీనం

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా పరిశోధిస్తున్నారు. బినామీలు, స్నేహితులు, సన్నిహితుల ఇళ్లపై నిఘా ఉంచారు. తాజాగా అవినీతి సొమ్మును గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పురుషోత్తమ్‌రెడ్డి కుమార్తె విదితారెడ్డి పెళ్లి సందర్భంగా ఆమె ధరించిన బంగారు, వజ్రాభరణాలు ఎక్కడివని ఆరా తీస్తున్నారు.



ఏసీబీ అధికారులు గుర్తించిన నెక్లెస్, వడ్డాణం, వజ్రాభరణాల చిత్రాలు

అంతర్జాలంలో ఉన్న చిత్రాల్లో ఆమె ధరించిన నగలు, వజ్రాభరణాలు తమ సోదాల్లో కనిపించలేదని ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మరోవైపు తాను పట్టుబడితే ఏసీబీ జైలుకు పంపుతుందన్న ముందస్తు అంచనాతో పురుషోత్తమ్‌రెడ్డి, అతడి బావమరిది శ్రీనివాసరెడ్డి ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు.

బంగారు ఆభరణాల వ్యాపారుల నుంచి వివరాల సేకరణ..

పురుషోత్తమ్‌రెడ్డి తన కుమార్తె పెళ్లిని 2016 నవంబరులో వైభవంగా నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వివరాలు సేకరించారు. అంతర్జాలంలో పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సేకరించి బంగారు, వజ్రాభరణాల చిత్రాలను గుర్తించారు. అబిడ్స్, హిమాయత్‌నగర్, పంజాగుట్ట, సికింద్రాబాద్, బంజారాహిల్స్‌లోని ప్రముఖ నగల వ్యాపారులను వాకబు చేశారు. ఫొటోల్లో ఉన్న బంగారు, వజ్రాభరణాలు, ముత్యాల దండల డిజైన్ల ఆధారంగా విలువపై ఆరా తీశారు. డిజైన్, బరువు ఆధారంగా అన్నీ కలిపి రూ.కోట్లలోనే ఉంటాయని వివరించారు. హైదరాబాద్‌లో ఓ నగల దుకాణం, జైపూర్‌లో వజ్రాభరణాల దుకాణం నుంచి కొనుగోలు చేసినట్లు ఆధారాలు సేకరించారు.

కుమార్తెకు రూ.3.2 కోట్ల 'గిఫ్ట్ డీడ్'

పెళ్లి సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి తన కుమార్తె విదితారెడ్డికి రూ.3.2 కోట్ల విలువైన 'గిఫ్ట్‌డీడ్' ఆస్తి పత్రాలను ఇచ్చారు. సదరు ఆస్తి పత్రాలను సోమాజిగూడలోని పురుషోత్తమ్‌రెడ్డి వియ్యంకుడు రాధాచరణ్ రెడ్డి నిర్వహిస్తున్న చరణ్‌లైఫ్ డివైసెస్ కార్యాలయం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మూసాపేట్ రాజీవ్‌గాంధీ నగర్‌లో పారిశ్రామిక సముదాయాన్ని నిర్మించేందుకు కొన్న స్థలం వివరాలు ఇందులో ఉన్నాయని చెప్పారు. పెళ్లి తర్వాత కొత్తజంటను హనీమూన్ యాత్ర కోసం మాల్దీవులకు పంపించారని వివరించారు. పెళ్లికి ముందు సంగీత్ కార్యక్రమానికి కూడా భారీగా ఆహ్వానాలు పంపించినట్లు తెలిపారు.

దర్యాప్తు పేరిట బెదిరింపులతో వేధిస్తున్నారు

- హైకోర్టును ఆశ్రయించిన పురుషోత్తమ్‌రెడ్డి బంధువులు
- కౌంటర్లు దాఖలు చేయాలని ఏసీబీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డికి చెందిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (అనిశా) దర్యాప్తు అభ్యంతరకరంగా ఉందంటూ ఆయన బంధువులు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తు పేరుతో అనిశా అధికారులు వేధింపులకు పాల్పడటంతో పాటు బెదిరిస్తున్నారంటూ పురుషోత్తమ్‌రెడ్డి అల్లుడు జి.నిపుణ్‌రెడ్డి, బావమరిది శ్రీనివాసరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎ.వి.శేషసాయి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది బి.చంద్రసేన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పురుషోత్తమ్‌రెడ్డి కుమార్తెను వివాహం చేసుకున్నందుకు అక్రమాస్తులకు బాధ్యులుగా చేసి ప్రశ్నిస్తున్నారన్నారు. ఏసీబీ అధికారులు ఇంటికి వచ్చి ఆచూకీ చెప్పాలంటూ దురుసుగా వ్యవహరించారన్నారు. కుటుంబ సభ్యులందరినీ కేసులో ఇరికిస్తామని బెదిరించారన్నారు. ఎలాంటి వేధింపులకు పాల్పడటం లేదనీ, పిటిషనర్లు విచారణకు సహకరించడం లేదని ఏసీబీ తరపు న్యాయవాది రవికిరణ్‌రావు పేర్కొన్నారు. నోటీసులు ఇస్తే ఇంటికి తాళం వేసుకుని వెళ్లారని, నిబంధనల ప్రకారం ఇంటికి సీలు వేశామని చెప్పారు. వాదనలను విన్న న్యాయమూర్తి కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

ముందస్తు బెయిలు కోసం పురుషోత్తమ్‌రెడ్డి పిటిషన్: ఈ కేసులో నిందితుడైన పురుషోత్తమ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని అనిశా అధికారులు ప్రయత్నిస్తుండగా, అతను న్యాయవాది ద్వారా హైకోర్టులో ముందస్తు బెయిలు కోరుతూ సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దర్యాప్తునకు సహకరిస్తానని, కోర్టు షరతులకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చే అవకాశాలున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఆనందాశ్రమాల ఏర్పాటుకు కృషి

- యాచకుల పునరావాస కేంద్రాలుగా విజయవంతం
- జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ వెల్లడి



మీడియా సమావేశంలో వీకే సింగ్, ఆకుల నర్సింహ, సైదయ్య

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: మహానగరాన్ని యాచక రహితంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్‌లో జైళ్లశాఖ ప్రారంభించిన ఆనందాశ్రమాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. ఆనందాశ్రమాలు నగరంలోని యాచకులకు పునరావాస కేంద్రాలుగా విజయవంతమయ్యాయన్నారు. సోమవారం ఐజీ ఆకుల నర్సింహ, డీఐజీ సైదయ్యతో కలిసి వీకే సింగ్ మీడియాతో మాట్లాడారు. ఆనందాశ్రమాలను జిల్లా కేంద్రాల్లో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు కోరినట్లు వెల్లడించారు. నగరంలో నిజమైన యాచకులు తక్కువ సంఖ్యలోనే ఉన్నారనీ, యాచక వృత్తిని అడ్డుపెట్టుకొని సొమ్ము చేసుకొనే ముఠాలు ప్రస్తుతం తమ కార్యకలాపాలను తగ్గించినట్లు అర్థమవుతోందన్నారు. ఇప్పటి వరకు చంచల్‌గూడ ఆనందాశ్రమానికి 2,447 మందిని, చర్లపల్లికి 1,302 మందిని తరలించామని, ప్రస్తుతం 141 మంది చంచల్‌గూడలో, 82 మంది చర్లపల్లిలో ఉన్నారని తెలిపారు. ఆనందాశ్రమం కోసం ఇప్పటి వరకు రూ.60 లక్షలు ఖర్చు చేశామని, ఏడాదికి రూ.3 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జైళ్లశాఖలో 300 మంది సిబ్బందిని నియమించేందుకు త్వరలోనే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుందన్నారు.

సబ్ జైళ్ల మూసివేత..: జైళ్ల శాఖ అమలు చేస్తున్న పరివర్తన కార్యక్రమంతో ఖైదీల సంఖ్య తగ్గిపోతోందని, ఇప్పటికే 5 సబ్ జైళ్లను మూసివేయగా.. ప్రస్తుతం మరో తొమ్మిదింటిని మూసి వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిలో తాత్కాలికంగా అంధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు, మతిస్థిమితం లేని వారికి సేవా కార్యక్రమాలు చేపట్టేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు తమ శాఖ కృషి చేస్తుందన్నారు. చిన్నారులు నేరగాళ్లుగా మారకుండా, అనాథలు గౌరవ ప్రదమైన జీవనం సాగించే అవకాశం కల్పించేందుకు జైళ్లశాఖ నడుం బిగించిందన్నారు.

సెన్సెక్స్ ▲ 295 — 34300

నిఫ్టీ ▲ 85 — 10540

రూపాయి 64.32 ▲ (ఒక అమెరికా డాలరుకు) 08 పైసలు

బంగారం 30075 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 95

వెండి 37925 ▲ ముంబయిలో కిలో రూ.లలో 05

ముడి చమురు 63.11 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,605	+414
నాస్‌డాక్	6,963	+88
నిక్కీ 225 (జపాన్)	----	----
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,385	+8
షాంఘై(చైనా)	3,154	+24
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,177	+84
డాక్స్ (జర్మనీ)	12,283	+175

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.47	67.79
పౌండ్ స్టెర్లింగ్	80.93	93.86
యూరో	71.79	83.26
జపనీస్ యెన్/100	53.78	62.36
ఆస్ట్రేలియా డాలరు	45.78	52.97
సింగపూర్ డాలరు	44.08	52.21
థాయ్ బాత్/100	184.79	221.01
బహ్రెయిన్ దీనార్	158.33	181.44
కువైట్ దీనార్	177.15	220.53
సౌదీ రియాల్	15.55	18.43
యూఏఈ దిర్హమ్	15.92	18.60
మలేషియా రింగిట్	14.56	17.90
చైనీస్ యువాన్	7.22	11.70

సోమవారం నిఫ్టీ కదలికలు



మిక్ ఎలక్ట్రానిక్స్ ఆదాయం రూ.41 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మిక్ ఎలక్ట్రానిక్స్ ఆదాయం తగ్గి నష్టాలను చవి చూసింది. 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ.1.39 కోట్ల నికర నష్టాన్ని చవి చూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.3.48 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇదే కాలానికి కంపెనీ మొత్తం ఆదాయం రూ.64.72 కోట్ల నుంచి రూ.41.50 కోట్లకు తగ్గింది. 2017-18 మొదటి తొమ్మిది నెలలకు రూ.149.69 కోట్ల ఆదాయంపై రూ.1.86 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు కంపెనీ తెలిపింది.

తగ్గిన మధుకాన్ ప్రాజెక్ట్స్ లాభం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి మధుకాన్ ప్రాజెక్ట్స్ నికర లాభం భారీగా తగ్గింది. ఏడాది క్రితం ఇదే కాలంలో నికర లాభం రూ.9.71 కోట్లతో పోలిస్తే 85 శాతం తగ్గి రూ.1.46 కోట్లకు చేరింది. అయితే.. ఇతర సమగ్ర ఆదాయం రూ.1.96 కోట్లు ఉందని కంపెనీ తెలిపింది. సమీక్ష కాలానికి మొత్తం ఆదాయం కూడా రూ.156.81 కోట్ల నుంచి రూ.115.66 కోట్లకు పరిమితమైంది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.447.31 కోట్ల ఆదాయంపై రూ.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇతర సమగ్ర ఆదాయం రూ.1.25 కోట్లుంది.

దిగివచ్చిన షేర్లలో కొనుగోళ్లు

• 10 రోజుల్లో రెండోసారి లాభాలు • కలిసొచ్చిన అంతర్జాతీయ సానుకూలతలు

వరుస రెండు వారాల నష్టాల తర్వాత.. మార్కెట్లు పుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సానుకూల అంతర్జాతీయ పవనాలకు తోడు.. తక్కువ స్థాయిలకు చేరిన షేర్లలో కొనుగోళ్లు కనిపించడంతో సోమవారం సూచీలు లాభాలందుకున్నాయి. దీంతో 10 రోజుల ట్రేడింగ్‌లో రెండు రోజులు లాభాలను పొందినట్లయింది. బలమైన కార్పొరేట్ ఫలితాలకు తోడు.. రిటైల్ ద్రవ్యోల్బణం ఓ మోస్తరుగా తగ్గవచ్చున్న అంచనాలు సైతం సెంటిమెంటును బలపడేలా చేశాయి. ఇటీవల బాగా నష్టాల పాలైన విద్యుత్; స్థిరాస్తి, యంత్ర పరికరాలు, బ్యాంకింగ్ షేర్లను మదుపర్లు కొనుగోలు చేశారు. దేశీయ ఫండ్‌లు, రిటైల్ మదుపర్లు సైతం ఇందులో ఉన్నారు.

రోజంతా లాభాల్లోనే..

సెన్సెక్స్ సోమవారం రోజంతా లాభాల్లోనే కొనసాగింది. అంతక్రితం రోజు ముగింపుతో పోలిస్తే దాదాపు 200 పాయింట్ల లాభాలతో ప్రారంభమైంది. ఆ తర్వాత హెచ్చుతగ్గులకు గురై ఒక దశలో 34115.12 వద్ద కనిష్ఠ స్థాయిని చేరినా.. నష్టాలు మాత్రం రాలేదు. చివరకు 294.71(0.87%) లాభంతో 34,300.47 వద్ద స్థిరపడింది. శుక్రవారం సెన్సెక్స్ 407.40 పాయింట్లు కోల్పోయి నెల రోజుల కనిష్ఠానికి (34,005.76) చేరిన సంగతి తెలిసిందే.



ఇక నిఫ్టీ విషయానికొస్తే సోమవారం ఇంట్రా డేలో అది 10,555.50 వద్ద గరిష్ఠ స్థాయిని చేరినప్పటికీ చివరకు 84.40 పాయింట్ల లాభంతో 10,539.75 వద్ద ముగిసింది.

టాటా స్టీల్ మెరుపులు

సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్ అత్యధిక లాభాన్ని పొందింది. నికర లాభంలో 5 రెట్ల వృద్ధిని నమోదు చేయడంతో కంపెనీ షేరు 4.22% పెరిగి రూ.712.50 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.7062.62 కోట్లు మెరుగైంది. మరో పక్క, ఫలితాల్లో నికర నష్టాలను నమోదు చేసిన ఎస్‌బీఐపైనా ప్రభావం పడింది. ఆ బ్యాంకు స్క్రిప్ 3% నష్టపోయింది. మార్కెట్ విలువ కూడా రూ.6819 కోట్లు తగ్గి రూ.2,49,034.75 కోట్లకు చేరుకుంది. బలమైన ఫలితాలను నమోదు చేసిన మారికో.. 4.33% లాభంతో రూ.310.90 వద్ద స్థిరపడింది.

ఇతర షేర్లలో టాటా కమ్యూనికేషన్స్ 1.71%, టాటా మోటార్స్ 1.71%, ఎల్ అండ్ టీ 1.63% చొప్పున రాణించాయి. యెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇండస్ఇండస్, హీరోమోటోకార్ప్, ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, మారుతీ సుజుకీ, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్, సన్‌ఫార్మాలు 2.89% దాకా లాభపడ్డాయి. మొత్తం మీద సెన్సెక్స్ షేర్లలో ఏడు మాత్రమే నష్టపోగా.. మిగతా 23 లాభాలందుకున్నాయి.

నేడు మార్కెట్లకు సెలవు

'మహాశివరాత్రి' సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్లు పనిచేయవు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలతో పాటు ఫారెక్స్, మనీ, బులియన్ మార్కెట్లకు, కమొడిటీ మార్కెట్లకు కూడా సెలవు.

3 షేర్లకు ఓ షేరు బోనస్: గెయిల్

దిల్లీ: గెయిల్ ఇండియా తన వాటాదారులకు ప్రతి మూడు షేర్లకు ఓ షేరును బోనస్‌గా ప్రకటించింది. దీనికి బోర్డు అనుమతి కూడా లభించిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంస్థ నికర లాభం 28 శాతం పెరిగి రూ.1262.22 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే కాలంలో నికర లాభం రూ.982.92 కోట్లు వచ్చినట్లు తెలిపింది. సమీక్షా త్రైమాసికానికి సంస్థ ఆదాయం 17 శాతం పెరిగి రూ.14,717 కోట్లకు చేరింది. గెయిల్ ఇండియా సీఎండీ బీసీ త్రిపాఠి మాట్లాడుతూ "గత ఏడాదితో పోలిస్తే అన్ని విభాగాల్లోనూ వృద్ధి సాధించాం. ఈ ఏడాది నిర్దేశించుకున్న పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకోగలమన్న విశ్వాసం ఉంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 70 శాతం అధికం. 2018-19 ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.6,000 కోట్ల పెట్టుబడుల లక్ష్యం నిర్దేశించుకున్నామ"ని వెల్లడించారు.

తగ్గిన ఇండియన్ బ్యాంక్ లాభం

చెన్నై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఇండియన్ బ్యాంక్ లాభం 18.8 శాతం క్షీణించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.373.47 కోట్లు నికర లాభం ప్రకటించిన బ్యాంకు ప్రస్తుతం రూ.303.06 కోట్లు నికర లాభం వచ్చినట్లు తెలిపింది. గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే ప్రస్తుత సమీక్షా త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.4,557.25 కోట్ల నుంచి రూ.4,903.07 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు గత ఏడాది అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది 7.69 శాతం నుంచి 6.27 శాతానికి తగ్గినట్లు బ్యాంకు ప్రకటించింది.

మధుమేహం చికిత్సకు సనోఫి కొత్త ఇన్సులిన్

దిల్లీ: మధుమేహం చికిత్స కోసం 'టైజియో' ఇన్సులిన్‌ను భారత్‌లో ఆవిష్కరించినట్లు ఔషధ తయారీ సంస్థ సనోఫి పేర్కొంది. టైప్-1, టైప్-2 డయాబెటిస్ ఉన్న పెద్దల్లో గ్లైసీమిక్ నియంత్రణను ఈ ఇన్సులిన్ మెరుగుపరుస్తుందని కంపెనీ అంటోంది. భారత్‌లో మరింత మెరుగ్గా మధుమేహాన్ని నియంత్రించడానికి సనోఫి తన ఉత్పత్తులను విస్తరించడానికి కట్టుబడి ఉందని.. అందుకు ఉదాహరణే తాజా ఆవిష్కరణ అని' సనోఫి ఇండియా ఎండీ ఎన్. రాజారామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ ఇన్సులిన్‌కు తొలుత 2015లో అమెరికాలో అనుమతులు దక్కాయి. ప్రస్తుతం దీనిని 65 దేశాల్లో పైగా వినియోగిస్తున్నారు.

కార్పొరేషన్ బ్యాంక్ నష్టం రూ.1240 కోట్లు

దిల్లీ: మొండి బకాయిలు పెరిగిపోవడంతో కార్పొరేషన్ బ్యాంక్ అక్టోబరు - డిసెంబరుకు రూ.1240.49 కోట్ల నష్టం ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.159.02 కోట్ల నికర లాభం వచ్చింది. ఆదాయం రూ.5,839.56 కోట్ల నుంచి రూ.4841.37 కోట్లకు తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు 11.26% నుంచి 15.92 శాతానికి చేరాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.991.63 కోట్ల నుంచి రూ.2,494.71 కోట్లకు పెరిగాయి. మార్చి 31వ తేదీలోపు మరో రూ.1,004.19 కోట్లు కేటాయింపు చేయాల్సి ఉందని బ్యాంకు వెల్లడించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017-18	2016-17	2017-18	2016-17
బ్రిటానియా ఇండస్ట్రీస్	263.65	220.44	2603.42	2392.49
బ్యాంక్ ఆఫ్ ఇండియా	(2341)	102	10376.03	11594
ఎన్‌హెచ్‌పీసీ	687.93	214.69	2066.76	1483.57
ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్	81.92	(37.11)	1091.41	944.73
జువారి అగ్రో కెమికల్స్	48.02	36.36	1452.08	1367.94
జీఎస్‌కే కన్జ్యూమర్ హెల్త్‌కేర్	163.66	136.41	1034.67	960.17
జేఎస్‌హెచ్‌ఎల్	133.63	55.21	2466.37	2007.54
జీఎస్ఎఫ్‌సీ	199.57	61.17	1545.72	1163.65
యునైటెడ్ బ్యాంక్	(637.53)	64.10	2483.01	3086.06
ఎంఎంటీసీ	6.26	74.43	3387.36	4961.54
ఇండియన్ హోటల్స్	112.61	100.50	1217.12	1145.54
పార్శ్వనాథ్ డెవలపర్స్	(27.95)	(15.06)	22.43	60.90
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్	33.89	29.36	1285.98	1158.73
జేకే టైర్	11.32	86.46	2135.40	1991.95
పీఎఫ్‌సీ	1604.43	1949.91	6320.59	7063.08

ఐకియా విక్రయ కేంద్రాల్లో హైదరాబాద్ పరుపులు

• శ్రీ మలానీ ఫోమ్స్‌తో చేతులు కలిపిన కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా ఐకియా కేంద్రాల్లో విక్రయించడానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీ మలానీ ఫోమ్స్ నుంచి ఐకియా పరుపులను సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఐకియా, శ్రీ మలానీ ఫోమ్స్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. పరుపుల తయారీలో వినియోగించే ఫోమ్ తయారీలో శ్రీ మలానీ ఫోమ్స్ దేశంలోనే మూడో అతిపెద్ద కంపెనీ అని.. ఐకియా ప్రమాణాలు, అవసరాలకు అనుగుణంగా ప్రధానంగా స్ప్రింగ్ పరుపులను తయారు చేయడానికి తమ యూనిట్‌లో ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేశామని శ్రీ మలానీ ఫోమ్స్ ఎండీ సిద్ధార్థ మలానీ తెలిపారు. ఇందులో నెలకు 10,000 పరుపులను తయారు చేస్తామన్నారు. ఐకియా విక్రయ కేంద్రాల్లో రోల్ ప్యాక్ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన పరుపులనే అధికంగా విక్రయిస్తున్నామని.. హైదరాబాద్‌లోని మలానీ ఫోమ్స్ కూడా రోల్ ప్యాక్ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రీమియం స్ప్రింగ్ పరుపులను తయారు చేసి సమకూరుస్తుందని ఐకియా కంఫర్ట్ ఉత్పత్తుల వ్యాపారం అధిపతి పంకజ్ డేట్ తెలిపారు. భారత భాగస్వాముల నుంచి మరిన్ని ఉత్పత్తులను సమకూర్చుకోవాలన్నది ఐకియా ఉద్దేశమని, ఇందుకు అనుగుణంగా శ్రీ మలానీ ఫోమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. శ్రీ మలానీ ఫోమ్స్‌లో తయారైన పరుపులను ఇప్పటికే దుబాయ్‌కి ఎగుమతి చేయడం ప్రారంభించామన్నారు. వచ్చే కొద్ది నెలల్లో హైదరాబాద్‌లో ఐకియా విక్రయ కేంద్రం ప్రారంభం కానుంది. దీని తర్వాత బెంగళూరు, గుడ్‌గావ్, ఇతర నగరాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఐకియా భావిస్తోంది. ఈ విక్రయం కేంద్రాలతోపాటు ఇతర దేశాల్లోని విక్రయ కేంద్రాలకు కూడా ఇక్కడి నుంచి పరుపులను సరఫరా చేస్తారు. శ్రీ మలానీ ఫోమ్స్‌కు మెదక్ జిల్లా చేగుంటలో ఫోమ్ తయారీ ప్లాంట్ ఉంది. దీనిపై ఇప్పటి వరకూ రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టింది. విస్తరణకు వచ్చే రెండేళ్లలో మరో రూ.60 కోట్లను వెచ్చించనుంది. వెదురు బొంగులతో తయారు చేసిన ఉత్పత్తులు మొదలైన వాటిని కూడా భారత్ నుంచి పొందాలని ఐకియో యోచిస్తోంది. వెదురు బొంగులతో తయారు చేసే ఉత్పత్తులను సమకూర్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నట్లు ఐకియా ప్రతినిధి పేర్కొన్నారు. ఐకియా దాదాపు 30 కేటగిరీలకు చెందిన వస్తువులను దాదాపు 50 దేశాల నుంచి సమకూర్చుకుంటోంది. ఐకియా సమకూర్చుకుంటున్న వస్తువుల్లో 60 శాతం ఐరోపా దేశాలు, 35 శాతం ఆసియా దేశాలు అందిస్తున్నాయని ఐకియా ప్రతినిధి వివరించారు.

ఎస్సార్ స్టీల్ కొనుగోలు రేసులో ఆర్సెలర్ మిత్తల్, వీటీబీ గ్రూపు

దిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు ఆర్సెలర్ మిత్తల్, రష్యాకు చెందిన వీటీబీ గ్రూపులు దాఖలు చేశాయి. అయితే వేదాంతా రిసోర్సెస్, జేఎస్‌డబ్ల్యూ, టాటా స్టీల్‌లు బిడ్‌లు వేసేందుకు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్సార్ స్టీల్ దివాలా ప్రక్రియను ఎదుర్కొంటోన్న సంగతి తెలిసిందే. దీని కొనుగోలు నిమిత్తం బిడ్‌ల దాఖలుకు నిన్నటితో గడువు ముగిసింది. ఆఖరి రోజున ఆర్సెలర్ మిత్తల్ అనుబంధ సంస్థ ఆర్సెలర్ మిత్తల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బిడ్‌ను సమర్పిస్తూ.. ఎస్సార్ ఇండియా పనితీరు, లాభాదాయకతను మెరుగుపర్చేందుకు వివరణాత్మక ప్రణాళికను పొందుపరిచింది. మారిషస్‌కు చెందిన పెట్టుబడుల సంస్థ నుమెటల్‌తో కలిసి వీటీబీ బిడ్ దాఖలు చేసింది. న్యూమెటల్‌లో వీటీబీకి 40 శాతం పెట్టుబడి ఉంది. ఎస్సార్ స్టీల్‌పై తమ ఆసక్తిని తెలియజేసేందుకు ఆర్సెలర్ మిత్తల్ ఇండియా, నుమెటల్‌లు రూ.500 కోట్లు డిపాజిట్లు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మార్కెట్ కబుర్లు

- ✦ మరోవిడతగా రూ.565 కోట్లు (87 మిలియన్ డాలర్లు) సమీకరించినట్లు ఆర్థిక సేవల సాంకేతిక దిగ్గజం **లెండింగ్‌కార్ట్ టెక్నాలజీస్** తెలిపింది.
- ✦ అబుధాబికి చెందిన ఏఐ ధాఫ్రా పెట్రోలియం ఆపరేషన్స్ కంపెనీ నుంచి రూ.2,200 కోట్ల ఆర్డరు పొందినట్లు ఎల్ అండ్ టీ అనుబంధ **ఎల్ అండ్ టీ హైడ్రోకార్బన్ ఇంజినీరింగ్** వెల్లడించింది.
- ✦ 64 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల నిమిత్తం ఇండొనేసియా ప్రభుత్వ వినియోగ సంస్థ పీటీ పీఎల్ఎన్ నుంచి రూ.335 కోట్ల ఆర్డరు తమ పూర్తిస్థాయి అనుబంధ సంస్థకు లభించినట్లు **సీసీ పవర్** ప్రకటించింది.
- ✦ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద నిర్వహించిన కార్యక్రమాలపై **రిలయన్స్ ఇండస్ట్రీస్**కు గోల్డెన్ పీకాక్ అవార్డ్ 2017 లభించింది.
- ✦ ఆన్‌లైన్‌లో ఆహారానికి ఆర్డర్లు తీసుకుని, వినియోగదారులు కోరుకున్న హోటళ్ల నుంచి తెచ్చి ఇచ్చే సంస్థ **ఫుడ్‌పాండా,** తమ డెలివరీ వ్యవస్థను పటిష్ఠం చేసుకునేందుకు మరో రూ.400 కోట్లు వెచ్చించనుంది.
- ✦ ముంబయి విద్యుత్తు వ్యాపార విభాగాన్ని **అదానీ ట్రాన్స్‌మిషన్**కు రూ.18,800 కోట్లకు విక్రయించేందుకు తాము చేసుకున్న ఒప్పందానికి సీసీఐ ఆమోదం తెలిపిందని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలిపింది.
- ✦ ప్రమోటర్లయిన ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో 32,66,33,165 షేర్లజారీ ద్వారా రూ.3,250 కోట్లు **ఐడియా** సమీకరించింది.


నేటి బోర్డు సమావేశాలు ★ ఫోర్టిస్ హెల్త్‌కేర్ ★ క్రిసిల్ ★ ఎన్ఎండీసీ ★ షిప్పింగ్ కార్పొరేషన్ ★ జీఎంఆర్ ★ ఐఓబీ ★ ఛంబల్ ఫర్టిలైజర్స్ ★ మదర్‌సన్ సుమి★ ఎన్‌బీసీసీ ★ మంజీరా కన్‌స్ట్రక్షన్స్ ★ గాడ్‌ఫ్రే ఫిలిప్స్

టాటా స్టీల్



రూ.716 వద్ద ప్రారంభమై రూ.697.40 - 716.90 మధ్య కదలాడి క్రితం ముగింపు 685.30తో పోలిస్తే రూ.27.80 (4.06%) లాభంతో రూ.713.10 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,20,36,307

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్



రూ.965.50 వద్ద మొదలై రూ.937.35-972.75 మధ్య చలించి క్రితం ముగింపు 964తో పోలిస్తే రూ.24.85 (2.58%) నష్టంతో రూ.939.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 14,87,794 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

అబాట్ ఇండియా	6109.95
అగ్రిటెక్	167.30
అశోక్ లేలాండ్	136.70
భారత్ ఫోర్జ్	781.25
చోళమండలం ఫైనాన్స్	1395
జేకే టైర్	192.95
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	315.40
పొలారిస్ కన్సల్టింగ్	470
టీవీ టుడే	511.20

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


ఏబీఎం నాలెడ్జ్‌వేర్	98.00
డంకన్ ఇంజినీరింగ్	70.20

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
12/02	4,345	5,159	–814	3,942	2,599	+1343
09/02	3,563	4,915	–1,352	3,152	2,563	+589
08/02	4,396	6,693	–2,297	5,671	3,297	+2,374
07/02	5,875	6,897	–1,022	4,011	3,550	+461
06/02	5,874	8,200	–2,326	5,594	3,895	+1,700

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	371	వరంగల్	373
చిల్లరగా(ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	375
బెంగళూరు	377	చెన్నై	395
13వ తేదీకి..		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	370	నమక్కల్	380

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 403.35 (399.00) 1249277
AMBUJA CEMEN 256.90 (258.90) 1200752
ASIAN PAINTS 1144.40 (1130.75) 646362
AUROBIND PHA 607.30 (589.50) 3059695
AXIS BANK LT 564.20 (557.55) 4765319
BAJAJ AUTO L 3154.10 (3099.25) 239055
BAJAJ FINANC 1643.80 (1639.40) 472115
BHARTI AIRTE 424.40 (422.50) 3593521
BHARTI INFRA 338.25 (341.50) 3252157
BOSCH LTD 19545.85 (19482.60) 5107
BPCL 467.55 (475.40) 4569433
CIPLA 621.65 (621.40) 1957424
COAL INDIA L 300.65 (300.15) 4512970
DR. REDDYS 2204.25 (2193.80) 482626
EICHER MOTOR 27901.40 (27747.95) 17594
GAIL 465.00 (462.45) 2042550
HCL TECH 939.15 (964.00) 1487794
HDFC 1805.45 (1773.05) 3194895
HDFC BANK 1876.65 (1849.50) 1095277
HERO MOTOCOR 3611.90 (3546.10) 385092
HINDALCO IND 243.25 (243.50) 5557349
HINDUSTAN UN 1344.45 (1333.05) 1166428
HPCL 391.45 (395.70) 4523355
ICICI BANK 326.25 (326.75) 8356351
INDIABULLS H 1314.85 (1288.40) 995745
INDIAN OIL 379.05 (378.65) 3116035
INDUSINDBANK 1687.80 (1649.85) 864259
INFOSYS LTD 1102.80 (1109.15) 3145986
ITC 269.85 (271.35) 6713679
KOTAK MAHIND 1042.95 (1032.00) 772861
LARSEN & TOU 1350.50 (1329.25) 1543603
LUPIN 840.45 (822.15) 1781070
M&M 746.00 (750.05) 2662221
MARUTI SUZIK 9117.85 (8936.10) 408523
NTPC LTD 164.90 (163.25) 8722064
ONGC 191.00 (187.35) 14960914
POWER GRID C 198.50 (193.20) 6608165
RELIANCE IND 915.50 (897.85) 5429792
SBI 288.75 (296.40) 50839665
SUN PHARMA 589.15 (582.70) 10261511
TATA CONSULT 2967.30 (2971.70) 987281
TATA MOTORS 371.80 (368.75) 6002369
TATA STEEL L 713.10 (685.30) 12036307
TECH MAHINDR 590.35 (595.25) 2343988
ULTRATECH 4200.30 (4153.30) 218964
UPL LIMITED 726.50 (708.35) 1291508
VEDANTA LIMI 315.55 (316.30) 9097394
WIPRO 288.95 (285.00) 2520859
YES BANK LTD 335.40 (325.55) 12049356
ZEE ENTERTAI 584.50 (580.95) 908184

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1610.65 (1590.80) 36442
ACC 1651.55 (1660.95) 252902
ASHOK LEYLAN 133.30 (134.20) 11892807
AVENUE SUPER 1187.20 (1177.80) 241765
BAJAJ FINSER 5235.45 (5059.35) 141176
BANK OFBAROD 168.65 (156.25) 48926198
BEL 157.75 (156.30) 2143830
BHEL 97.50 (94.40) 9746825
BRITANNIA 4772.50 (4641.15) 214757
CADILA HEALT 423.65 (411.75) 2335436
COLGATE PALM 1093.90 (1100.85) 167510
CONTAINER 1325.30 (1317.65) 334133
CUMMINS INDI 845.00 (824.45) 117316
DABUR INDIA 344.75 (340.55) 919718
DLF LIMITED 233.75 (229.05) 7012358
EMAMI LIMITE 1080.85 (1088.05) 116929
GLAXOSMI CON 5971.10 (6080.20) 10195
GLAXOSMI PHA 2449.05 (2466.25) 11599
GLENMARK PHA 535.35 (535.20) 1626940
GODREJ CONSU 1029.50 (1016.60) 175715
HAVELLS INDI 516.05 (515.25) 724602
HINDUSTAN ZI 307.65 (303.55) 4332375
ICICI PRU LI 416.00 (415.10) 940991
IDEA CELLULR 84.50 (83.70) 18359301
INTERGLOBE A 1250.85 (1258.65) 827507
JSW STEEL LT 310.75 (309.35) 4120075
LIC HOUS.FIN 521.50 (511.85) 1574905
MARICO LIMIT 310.05 (297.20) 3514638
MCDOWELL 3268.20 (3194.00) 426360
MOTHERSON 364.45 (359.95) 2097972
MRF 71640.90 (70013.80) 7298
NHPC LTD 29.50 (28.70) 6398230
NMDC LTD 137.40 (136.00) 3348659
OIL INDIA 360.75 (355.05) 1037814
ORACLE FIN S 4052.70 (4069.15) 14832
P&G HYG&HEAL 9344.10 (9310.00) 1700
PETRONET LNG 248.70 (246.80) 1815272
PIDILITE IND 894.50 (878.20) 926463
PIRAMAL ENTE 2687.30 (2633.75) 120120
PNB 161.65 (156.80) 15391679
POWER FIN CO 111.25 (109.30) 4612747
RURAL ELEC C 154.05 (149.95) 4282712
SAIL 95.35 (93.95) 28901756
SHREE CEMENT 16953.35 (17041.45) 14916
SHRIRAM TRAN 1325.90 (1311.30) 663190
SIEMENS 1255.50 (1229.40) 124117
SUN TV LTD 985.10 (973.55) 1436715
TATA POWER 86.75 (85.05) 3958245
TITAN IND 809.05 (796.80) 2067452
TORRENT PHAR 1430.80 (1434.35) 86563

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 190.15 (186.95) 2183620
ADANI ENTERP 217.25 (210.10) 7269216
ADANI POWER 34.00 (33.80) 8726014
ALL BANK 60.85 (59.50) 2155010
AMARA RAJA 848.55 (800.10) 1752595
ANANT RAJIND 62.65 (59.35) 1882636
ANDHRA BANK 48.75 (47.25) 3272410
APOLLO HOSPI 1151.55 (1122.70) 580640
APOLLO TYRES 274.90 (270.80) 3624552
APTECH 327.35 (272.80) 2353964
BAJAJ ELECT. 514.00 (537.00) 806867
BAJAJ HIND 14.00 (14.00) 3213809
BAJAJ HOLDIN 2689.90 (2693.80) 11220
BALAJI TELE 148.70 (144.65) 87500
BALLARPUR IN 14.55 (15.20) 3096329
BALRAMPUR CH 121.85 (120.40) 1881358
BANK OF MAHA 19.00 (18.80) 558269
BANK OFINDIA 144.85 (142.20) 5262434
BATA INDIA 714.50 (714.90) 755572
BGR ENERGY S 125.30 (121.90) 98304
BHARAT FORGE 776.35 (762.80) 1567761
BHUSHAN STEE 50.90 (53.05) 4072692
BIOCON LTD 612.05 (606.95) 1115591
BOMBAY DYE 251.30 (245.10) 4743722
CANARA BANK 327.80 (321.15) 3225049
CEAT LIMITED 1612.30 (1548.70) 867810
CENTRAL BANK 69.85 (67.40) 712682
CHAMBAL FERT 155.20 (155.05) 345235
CHENNAI PETR 378.85 (376.40) 553226
CITY UNIBANK 166.80 (162.25) 807769
CORPO BANK 35.80 (35.60) 648458
COX & KINGS 257.40 (250.65) 77732
D B REALTY L 58.80 (56.00) 252795
DELTA CORP L 363.90 (350.75) 2954147
DENA BANK 22.80 (22.40) 1553177
DHANALAKBANK 24.15 (24.40) 777839
DIVIS LAB 1036.50 (1016.55) 488773
EDELWEISS CA 258.10 (250.00) 1759113
EID PARRY 324.80 (326.45) 75020
EIH 179.95 (181.10) 77515
ESSAR SHIPPI 26.90 (26.05) 44755
ESTER INDUST 66.50 (65.40) 175598
EXIDE INDUST 213.05 (208.25) 1515768
FEDERAL BANK 95.10 (94.85) 7199398
FINOLEX CABL 699.25 (669.95) 198378
G E SHIP LTD 389.10 (395.15) 165088
GAMMON INFRA 3.35 (3.20) 3572132
GATI LIMITED 118.40 (116.65) 624630
GITANJALIGEM 62.85 (58.70) 2344497
GMR INFRASTR 20.05 (19.55) 47674295
GODREJ IND 550.70 (550.05) 551695
GRASIM IND 1132.30 (1108.95) 492269
GUJ ALK&CHEM 759.75 (742.95) 150597
HCL INFOSYS 60.65 (57.70) 5560117
HEXA TECH 329.55 (341.20) 1244080
HIMACHAL FUT 30.65 (30.70) 9751712
HOUSING DEV 54.80 (51.55) 18602480
IDBI 67.55 (62.75) 26402892
IDFC 53.75 (53.25) 4772526
IFCI 24.15 (23.40) 12556544
IL&FS TRANS 77.25 (75.80) 194633
IND SWIFTLAB 69.85 (66.55) 11387
INDBULLS REL 234.65 (227.60) 11622562
INDIA CEM 162.05 (161.40) 7067514
INDIAN BANK 357.35 (339.40) 4081209
INDO RAMA SY 39.40 (37.70) 173141
INDRAPRASTHA 302.45 (289.55) 3111752
IND-SWIFTLTD 9.65 (9.40) 4216
INGERSOLL-R 758.80 (745.00) 13631
IOB 21.80 (20.90) 961306
IPCA LAB 639.55 (620.05) 670024
IRB INFRA DE 227.50 (221.90) 1456179
J&K BANK 70.50 (70.20) 274157
JAI CORP 168.50 (161.50) 2674861
JAIN IRRIGAT 123.15 (118.15) 10629353
JAYPEE INFRA 15.10 (14.95) 2257241
JAYSHREE TEA 109.80 (111.05) 46703
JET AIRWAYS 823.40 (791.70) 3981483
JINDAL SAW 139.85 (134.05) 2193796
JINDAL STEEL 274.10 (272.65) 7007854
JK LAKSHMI C 423.80 (415.10) 64468
JK PAPER LIM 142.75 (140.80) 1000320
JM FINANCIAL 154.25 (150.00) 710329
JP ASSOCIATS 17.85 (17.50) 41190709
JSW ENERGY L 82.55 (82.50) 2459367
JUBILANT FOO 2026.65 (1998.70) 653313
JUBILANT ORG 936.50 (942.10) 1007739
JYOTHY LABS 353.40 (352.35) 46058
JYOTI STRUC 10.90 (10.60) 582547
KARNATA BANK 139.40 (135.95) 2476669
KEC INTL LTD 363.00 (357.55) 438826

ఘనం (+)

నిఫ్టీ	12న	మార్పు %
TATA STEEL	713.10	4.06
YES BANK	335.40	3.03
AUROBINDO PHA	607.30	3.02
POWER GRID CORP.	198.50	2.74
UPL	726.50	2.56
INDUSIND BANK	1687.80	2.30
LUPIN	840.45	2.23

గ్రహణం (-)

నిఫ్టీ	12న	మార్పు %
HCL TECH	939.15	-2.58
SBI	288.75	-2.58
BPCL	467.55	-1.65
HPCL	391.45	-1.07
BHARTI INFRATEL	338.25	-0.95
TECH MAHINDRA	590.35	-0.82
AMBUJA CEM	256.90	-0.77

KOLTE PATIL 345.60 (326.55) 219376
KPIT CUMMINS 215.45 (215.25) 2621514
L&TFIN.HOLD 166.45 (163.50) 4441247
LAK VIL BANK 125.60 (124.50) 422185
M & M FINANC 444.45 (444.30) 668740
MANAPPURAM G 105.90 (104.35) 2760059
MMTC LIMITED 58.60 (56.75) 1274780
MPHASIS LTD 857.70 (897.60) 479338
MRPL 118.75 (118.75) 548590
MTNL 23.35 (22.40) 1676467
NAGARJUNA OI 4.00 (3.90) 571814
NCC LIMITED 118.55 (114.25) 4742526
NETWORK18 FI 52.10 (51.60) 471958
NEULAND LAB 701.80 (695.80) 14365
NIIT LTD 99.55 (96.75) 1023591
NIIT TECHNOL 829.05 (829.95) 439173
OMAXE LTD 229.55 (228.80) 255882
ONMOBILE GLO 51.70 (50.65) 219090
ORIENT PAPER 39.90 (40.45) 687914
ORIENTALBANK 112.55 (110.30) 2491890
PARSVNATH DE 22.60 (22.25) 131654
PATEL ENGG 74.00 (71.55) 381984
PFIZER 2321.40 (2309.30) 69424
POLARIS SOFT 468.85 (469.30) 335361
POWERTRADING 102.55 (99.05) 2216386
PRAJ IND 97.75 (94.95) 1380031
PRISM CEMENT 136.30 (133.25) 620844
PROVOGUE (IN 5.70 (5.50) 191756
PUNJ LLOYD 22.10 (21.85) 1054103
PUNJAB & SIN 42.00 (41.60) 85759
PURAVANKARA 153.15 (153.35) 330113
PVP VENTURES 7.55 (7.20) 135162
PVR LIMITED 1412.75 (1396.60) 99422
RADICO KHAIT 353.55 (335.45) 2696978
RAJESH EXPOR 815.10 (812.45) 295936
RALLIS INDIA 232.10 (229.35) 216186
RAMCO IND 259.25 (253.00) 148325
RAMCO SYS 452.80 (458.20) 29428
RAMKY INFRA 193.40 (202.95) 357993
RAYMOND 979.10 (966.15) 554296
RELIANCE CAP 507.40 (494.70) 7324771
RELIANCE COM 27.10 (27.00) 72132568
RELIANCE INF 461.15 (451.50) 3527069
RELIANCE POW 47.35 (44.90) 18285447
ROLTA INDIA 77.65 (68.70) 7237498
SAGAR CEMENT 988.05 (988.45) 12512
SAREGAMA 763.50 (762.95) 113843
SHANTHI GEAR 157.05 (141.55) 123235
SHIPPNG CORP 85.45 (77.40) 3405670
SHREE RENUKA 16.25 (15.65) 2777497
SINTEX IND 22.60 (22.35) 1871211
SOBHA DEVELO 562.20 (567.15) 393738
SOUTHINDBANK 28.20 (27.50) 7622593
SRS LIMITED 1.30 (1.25) 2992306
STERLITE TEC 355.60 (346.15) 1142959
SUJANA METAL 1.45 (1.40) 43570
SUN PHARMA 446.85 (440.25) 288712
SUND FASTNER 535.20 (529.65) 95986
SUZLON ENERG 13.50 (13.50) 51777656
SYND. BANK 65.75 (65.00) 6358894
TATA CHEM 715.50 (700.75) 641361
TATA COFFEE 142.50 (138.80) 335603
TATA COMMUN 650.00 (638.10) 414890
TATA GLOBAL 285.10 (278.25) 4583181
TATA METALIK 833.00 (832.15) 79167
TATA MOT DVR 208.20 (207.10) 3085144
TATA TELESER 6.65 (6.50) 731413
THE INDIAN H 138.05 (136.95) 1650018
TORRENT POWE 270.10 (268.50) 1149505
TRIVENI ENGG 68.20 (66.60) 584785
TTK PRESTIGE 7019.40 (7040.85) 2277
TV TODAY NET 475.95 (478.65) 540339
TV18 BROADCA 56.45 (55.40) 3425077
TVS MOTOR 661.25 (664.80) 345065
UCO BANK 29.55 (29.20) 689274
UNION BANK 127.40 (126.25) 4453664
UNITECH 7.60 (7.50) 18649537
UNITED BANK 15.15 (15.15) 2912740
UNITED BREWE 1077.45 (1063.35) 181105
USHA MARTIN 22.95 (23.65) 1182604
VADILAL INDU 937.50 (847.60) 150950
VENKYS 2842.50 (2771.15) 114807
V-GUARD IND 224.00 (218.00) 763088
VIJAYA BANK 61.20 (61.10) 1435729
VIP 354.20 (356.45) 227211
VOLTAS 592.50 (593.70) 1056620
ZEE LEARN LI 44.30 (43.25) 474886
ZUARI GLOBAL 224.15 (217.70) 826029
ZYDUS WELLNE 1133.95 (1147.20) 11778

ALPHAGEO 843.30 (848.60) 2318
AMAR RAJA BA 844.95 (798.45) 85901
ANDHRA BANK 48.75 (47.20) 270881
ANDHRA CEMEN 11.88 (11.88) 21803
ANDHRA PAPER 353.30 (342.95) 18315
ANDHRA PETRO 62.45 (64.60) 259759
ANDHRA SUGAR 509.95 (507.75) 8665
ASTRA MICROW 107.30 (105.15) 81691
AUROBINDO PH 607.85 (590.15) 189543
AVANTEL SOFT 607.90 (605.50) 11895
AVANTI FEEDS 2506.25 (2437.95) 20941
BALAJI AMIN 673 (644) 20048
BARTRONICS 13.77 (13.39) 9656
BHAGIRA CHEM 316.20 (287.60) 7327
BHAGYA NAG 48 (43.70) 31069
BN RATHI SEC 44.25 (39.95) 13499
BRILLIANT SE 12.90 (12.30) 170939
CAMBRIDGE TE 83.20 (81.60) 6524
COMBAT DRUGS 27.40 (27.40) 4010
CONT COFFEE 293.30 (294.10) 2936
COROMAN FERT 530.35 (532.70) 6234
CYIENT LIMIT 626.15 (628.05) 8966
DECCAN CEMEN 580.95 (574.85) 798
DIVI'S LAB 1035.50 (1016.75) 23499
DR REDDY 2200.05 (2194.80) 132439
GATI CORPN 118.65 (116.85) 119356
GAYATRI PROJ 210.25 (200.25) 23878
GMR INFRASTR 20.05 (19.65) 5770553
GOLDST INFRA 214.65 (194.70) 59813
GRANULES (I) 122.30 (118.80) 124135

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 20.60 (20.30) 881614
HBL NIFE POW 60.05 (57.60) 216646
HERITAGE FOO 713.65 (702.15) 735
HYD INDUS 1796 (1693.30) 4721
IDL INDUSTRS 590.80 (600.45) 932
ILFS ENGINEE 50.05 (48.40) 24028
INNAREDY COM 3.99 (4) 25265
IVRCL INFRAS 4.95 (4.93) 171763
KAKATIYA CEM 311.60 (313.75) 6424
KALLAM SPG 24.65 (24.25) 43376
KAVERI SEED 479.55 (477.50) 22663
KCP LTD 138.60 (136.85) 20315
KNR CONSTRUC 326.85 (310.35) 51860
LANCO INDUS 377.60 (370.90) 12835
LANCO INFRAT 1.30 (1.36) 2578269
LAURUS LABS 517.90 (515.40) 2269
MADHUCON PRO 31.10 (30.35) 19255
MIC ELECTRON 8.33 (7.94) 56837
MOLD-TEK.TEC 63.75 (64.95) 2373
MOLDTK PLA 352.60 (346.15) 6792
NAGARJAGRICH 48.15 (47.15) 27347
NATCO PHARMA 818.30 (812.35) 33237
NAVA BH VENT 147.60 (147.65) 33408
NCC 118.50 (114.35) 358684
NCL IND 244.30 (253.45) 24624
NEULAND LAB 700.50 (696.70) 1814
NIHAR INFO 14.45 (13.80) 1001
OIL COUNTRY 45.10 (45.05) 9900
PENNER IND 64.55 (64.80) 148329
PIONEER DIST 194.20 (194.95) 2708
PITTI LAMIN 91.90 (88.40) 7739
POKARNA 214.95 (210.05) 3242
PREMIER EXPL 409.80 (406.40) 1428
PRISM CEMENT 136.30 (133) 80453
PRUDENTL PHA 5.06 (4.91) 197104
RAIN INDUSTR 392.50 (391.65) 473794
SAMKRG PIST 318.15 (308.10) 6624
SAMPRE NUTRI 58.20 (60.15) 14698
SATVAH. ISPA 24.75 (25.20) 15588
SMS PHARMA 95.50 (95.10) 7411
SREE RAYAL A 65.80 (63) 291310
STEEL EXCHAN 34.75 (33.10) 11159
SUJANA METAL 1.43 (1.45) 27252
SUJANA TOWER 4.31 (4.11) 5044
SUJANA UNIVE 0.96 (1) 61397
SUVEN PHARMA 199.95 (195.40) 79993
TAJ GVK HOTE 176.70 (175.40) 5842
TANLA 33.20 (32.05) 75452
TERA SOFTWAR 62 (61.15) 6542
VAJRA GRAN 3.84 (4.04) 17600
VICEROY HOTE 17.10 (17.10) 70073
VIMTA LABS 207.55 (197.70) 4179
VISAKA IND 727.05 (698.15) 20534
VISTA PHARMA 46.10 (41.95) 199437
VIVIMED LABS 87.25 (85.45) 1222194
YBRANT DIGIT 6.02 (5.98) 1271408
ZENTECH 120.90 (114.55) 14718

పదేళ్లుగా క్లెయిమ్ చేయని నిధులు సంక్షేమ నిధికి

దిల్లీ: గత పదేళ్లుగా ఎవరూ కోరని (క్లెయిమ్ చేయని) పాలసీదార్ల నిధులను మార్చి 1 లోగా వయో వృద్ధుల సంక్షేమ నిధి (ఎస్‌సీడబ్ల్యూఎఫ్)కి బదిలీ చేయాలని, బీమా సంస్థలను బీమా నియంత్రణ, ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. 2017 సెప్టెంబరు 30 నాటికి, పదేళ్ల గడువు పూర్తయిన నిధులను 2018 మార్చి 1 లోగా ఎస్‌సీడబ్ల్యూఎఫ్‌కి బదిలీ చేయాలని తెలిపింది. సంక్షేమ నిధికి నిధులు అందించే ఆర్థిక వ్యవహారాల శాఖ ప్రక్రియలో భాగంగా ఈ ఆదేశాలిచ్చింది. జీవిత బీమా, జీవిత బీమా యేతర, ఆరోగ్య బీమా సంస్థలన్నీ కూడా 2016 ఎస్‌సీడబ్ల్యూఎఫ్ నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు సాగించాల్సి ఉంది. ఈ సంస్థలు ఏటా తమ వద్ద ఉన్న, ఎవరూ క్లెయిమ్ చేయని నిధులను మార్చి 1 లోగా ప్రభుత్వ నిధికి బదిలీ చేయాల్సి ఉంటుందనిఐఆర్‌డీఏ పేర్కొంది. వృద్ధాప్య పింఛన్లు, దీర్ఘకాల పొదుపు పథకాలు, ఆరోగ్య పథకాలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఎస్‌సీడబ్ల్యూఎఫ్‌ను ప్రభుత్వం నెలకొల్పింది.



ఈపీఎఫ్‌ఓ వడ్డీ ఈసారీ 8.65 శాతమే!

21న ట్రస్టీల సమావేశంలో నిర్ణయం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా 2016-17 స్థాయిలోనే 8.65 శాతం వడ్డీరేటును ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) నిర్ణయిస్తుందని భావిస్తున్నారు. ఈపీఎఫ్‌ఓలోని 5 కోట్ల మంది నిధులపై ఇచ్చే వడ్డీరేటును ఈనెల 21న జరిగే ట్రస్టీల సమావేశంలో ఖరారు చేస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 8.65 శాతం వడ్డీరేటు ఇచ్చేందుకు, తనవద్ద నిధులు తక్కువగా ఉన్నందున, రూ.2,886 కోట్ల విలువైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)లను సంస్థ ఈ నెలారంభంలో విక్రయించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పెట్టుబడులపై 16 శాతం ప్రతిఫలంగా రూ.1,054 కోట్లను ఈపీఎఫ్‌ఓ ఆర్జించిందని సమాచారం. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలు ఎలా ఉంటాయో ఇప్పటివరకు ట్రస్టీలకు వెల్లడించలేదు. 21న జరిగే సమావేశంలోనే ఈ విషయాలు వెలుగు చూడొచ్చు. 2015-16లో సంస్థ 8.8 వడ్డీరేటు చెల్లించిన సంగతి విదితమే.

- ✦ 2015 ఆగస్టు నుంచి ఈటీఎఫ్‌లలో ఈపీఎఫ్‌ఓ పెట్టుబడులు పెడుతోంది. ఇప్పటివరకు రూ.44,000 కోట్ల మేర పెట్టింది.

ఆర్థికానికి.. సానుకూలతలు

- పారిశ్రామికం.. 7.1 శాతం వృద్ధి
- ద్రవ్యోల్బణం.. 5.07 శాతానికి పరిమితం

దిల్లీ: ఓ వైపు పరిశ్రమ వికసించింది. మరో వైపు ద్రవ్యోల్బణం మరింత అదుపులోకొచ్చింది. దీంతో స్థూల ఆర్థిక వ్యవస్థ మెరుగైనట్లయింది. డిసెంబరు నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) 7.1 శాతం వృద్ధి చెందింది. తయారీతో పాటు, యంత్ర పరికరాలు, మన్నికేతర వినియోగదారు వస్తువుల బలమైన పనితీరు ఇందుకు దోహదం చేసింది. డిసెంబరు 2016లో ఐఐపీ 2.4 శాతంగా మాత్రమే ఉంది. అదే నవంబరు 2017 అయితే 8.4 శాతంగా ఉండగా.. తాజాగా దానిని 8.8 శాతానికి సవరించడం విశేషం.

ఇవి ఇలా రాణించాయ్..


- ✦ డిసెంబరులో ఐఐపీ వృద్ధికి తయారీ రంగం సహకరించింది. డిసెంబరు 2016లో కేవలం 0.6 శాతం మేర రాణించిన ఈ రంగం 2017 డిసెంబరులో ఏకంగా 8.4 శాతం వృద్ధి చెందింది.
- ✦ యంత్రపరికరాల ఉత్పత్తి సైతం గతేడాది డిసెంబరులో 16.4% మేర రాణించింది. అంతక్రితం ఏడాది అదే నెలలో కేవలం 6.2 శాతానికి వృద్ధి పరిమితమైంది.
- ✦ ఇక మన్నికేతర వినియోగదారుల రంగం అంతక్రితం 0.2 శాతం క్షీణించగా.. ఈ సారి 16.5 శాతం మేర వృద్ధి చెందడం గమనార్హం.

వచ్చే కొద్ది నెలల్లో దేశీయ మార్కెట్ కీలకంగా మారనుంది. వృద్ధి చెందుతున్న భారత ఆర్థికం కొత్త వ్యాపారాలకు చేదోడునందిస్తూనే ఉంటుంది. భారత ఆర్థిక వ్యవస్థకు అంతర్జాతీయ అనిశ్చితులు, పెరుగుతున్న రక్షణాత్మక విధానాల వల్ల గిరాకీ విషయంలో ఇబ్బందులకు ఎదురుకావొచ్చు.

- అసోచామ్ అధ్యక్షుడు సందీప్ జజోదియా

యంత్రపరికరాల్లో రెండంకెల వృద్ధి నమోదైనంత మాత్రాన పెట్టుబడుల కార్యకలాపాలు పుంజుకున్నాయని చెప్పలేం.

- ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్



జనవరిలో 5.07 శాతానికి

రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో కిందకు దిగివచ్చి 5.07 శాతంగా నమోదైంది. వినియోగదారు ధరల సూచీ(సీపీఐ) ఆధారంగా లెక్కవేసే ద్రవ్యోల్బణం డిసెంబరులో 17 నెలల గరిష్ఠ స్థాయి అయిన 5.21 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. గతేడాది జనవరిలో ద్రవ్యోల్బణం 3.17 శాతం మాత్రమే. డిసెంబరులో 4.96 శాతం పెరిగిన వినియోగదారు ఆహార ధరలు డిసెంబరులో 4.7 శాతం మాత్రమే ప్రియమయ్యాయి. ఇక కూరగాయలు డిసెంబరు 29.13 శాతం ఖరీదు కాగా.. జనవరికి కాస్త నెమ్మదించిన ధరలు 26.97 శాతం పెరిగాయి. పళ్ల ధరలు సైతం జనవరిలో 6.24 శాతానికి నెమ్మదించాయి. అంతక్రితం నెల వీటి ద్రవ్యోల్బణం 6.63 శాతంగా ఉంది. కాగా, ద్రవ్యోల్బణం, ద్రవ్యోల్బణ అంచనాలు చూస్తుంటే.. 2018 తొలి అర్ధ భాగంలో ఆర్‌బీఐ కీలక రేట్లను యథాతథంగానే ఉంచొచ్చని అనిపిస్తోందని రేటింగ్ ఏజెన్సీ ఇండ్-రా విశ్లేషిస్తోంది.

రూ.700 కోట్లు కట్టండి మాల్యా

బీఓసీ ఏవియేషన్ కేసులో బ్రిటన్ కోర్టు తీర్పు

లండన్/సింగపూర్: విజయ్ మాల్యాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో సంబంధమున్న ఒక కేసులో ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. సింగపూర్‌కు చెందిన బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.700 కోట్లు) చెల్లించాలని బ్రిటన్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు విమానాల లీజింగ్‌కు సంబంధించిన కేసులో తాజాగా తీర్పు వెలువడింది.



లీజు ఒప్పందం ప్రకారం.. బీఓసీ ఏవియేషన్‌కు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు నాలుగు విమానాలను లీజుకు ఇవ్వాలి. అందులో మూడింటిని బీఓసీ ఇచ్చింది కూడా. అయితే ఒప్పందం కింద అడ్వాన్సు మొత్తాన్ని చెల్లించనందున నాలుగో విమానాన్ని ఇవ్వడానికి ఆ కంపెనీ నిరాకరించింది. సాధారణంగా ఇలాంటి ఒప్పందాల కింద ఇచ్చే సెక్యూరిటీ డిపాజిట్ కూడా ఆ చెల్లింపులకు సరిపోలేదంటూ.. లండన్‌లోని హైకోర్టులో 2014లో బీఓసీ పిటిషన్ దాఖలు చేసింది. బకాయిలతో పాటు వడ్డీ చెల్లింపులు, కోర్టు వ్యయాలతో కలిపి మొత్తం 90 మిలియన్ డాలర్లను చెల్లించాల్సిందిగా న్యాయమూర్తి జస్టిస్ పికెన్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, తాజా ఆదేశాలపై కింగ్‌ఫిషర్ నుంచి స్పందన రాలేదు. బీఓసీ మాత్రం హర్షం వ్యక్తం చేసింది. అయితే ఈ దశలో అంతకు మించి మాట్లాడలేమని బీఓసీ ఏవియేషన్ అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. కాగా, రూ.9000 కోట్ల రుణ ఎగవేతకు సంబంధించి మాల్యాను భారత్‌కు రప్పించడానికి ప్రస్తుతం బ్రిటన్‌లో నడుస్తున్న కేసుపై మార్చి 16న తుది విచారణ జరగనుంది.

కలిపి కొంటే కలిసిరాదు



సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

మీరు ఒకటికి మించి వివిధ రకాల వస్తువులను ఒకే ప్యాకింగ్ రూపంలో కొంటున్నారా? అయితే మీరు కాస్త ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకింగ్ రూపంలో కంటే వస్తువులను విడివిడిగా కొంటేనే మీకు ప్రయోజనం. ఎలాగంటారా.. ఈ వ్యాసం చదవండి.

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం 'సరఫరా' చుట్టూనే తిరుగుతుంది. విక్రయం, బదిలీ, మార్పిడి, లైసెన్సు, అద్దె.. ఇలా వస్తువులు లేదా సేవల రూపంలో జరిగే లావాదేవీని 'సరఫరా'గా భావించి పన్ను విధిస్తారు. అయితే సరఫరా పరిధిని నిర్వచించే సమయంలో 'సరఫరా కిందకు ఏవేవి వస్తాయి' అనే విషయాన్ని చట్టరూపకర్తలు ప్రత్యేకంగా వివరించారు కాని.. అసలు సరఫరా అంటే ఏమిటో చెప్పడంలో విఫలమయ్యారు. అందువల్ల పైన చెప్పినవే కాకుండా ఇతరత్రా కార్యకలాపాలను దేనినైనా, ఎప్పుడైనా సరఫరా కిందకు తీసుకొచ్చే వీలు అధికారులు, కోర్టులకు ఉంది. అంటే చట్టంలో పేర్కొనని వాటిని కూడా సరఫరా కిందకు తీసుకొని వచ్చి పన్ను విధించొచ్చన్నమాట.

రెండు రకాలుగా..: వస్తువులు లేదా సేవల సరఫరా కూడా భిన్న రకాలుగా జరుగుతుంటుంది. ఒకటే రకం వస్తువును సరఫరా చేసినప్పుడు ఆ వస్తువుకు వర్తించే పన్ను రేటు చెల్లిస్తే సరిపోతుంది. కొన్ని సందర్భాల్లో వేర్వేరు వస్తువులను లేదా వివిధ సేవలను లేదా కొన్ని వస్తువులు, కొన్ని సేవలను కలిపి ఒకటేసారి సరఫరా చేస్తుంటారు. ఇలాంటప్పుడు ఇవి రెండు రకాల సరఫరా కిందకు వస్తాయి. అయితే అనుసంధాన (కాంపోజిట్) సరఫరా లేదంటే మిశ్రమ (మిక్స్‌డ్) సరఫరా. అవేమిటో.. వాటిల్లో పన్ను రేట్లు ఎలా విధిస్తారో కింద చూద్దాం...



అనుసంధాన సరఫరా

ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న వివిధ వస్తువులు లేదా సేవలను కలిపి సరఫరా చేసినప్పుడు అనుసంధాన సరఫరాగా భావిస్తారు. ఇక్కడ ఆయా వస్తువులు లేదా సేవలను వేర్వేరుగా సరఫరా చేసే వీలుండదు. సహజసిద్ధ ప్రక్రియ లాగా ఒకటి సరఫరా చేస్తే మరొకటి చేయాల్సి ఉంటుందన్నమాట. ఉదాహరణకు హోటళ్లు గదులు అద్దెకు ఇవ్వడంతో పాటు భోజన వసతిని కూడా కల్పిస్తుంటాయి. వ్యాపార ప్రక్రియలో భాగంగా హోటళ్లు ఈ రెండింటిని కలిపి సరఫరా చేస్తుంటాయి.

పన్ను రేట్లు ఇలా..

కాంపోజిట్ సరఫరా విధానంలో ఏదైతే ప్రధాన సరఫరాకు విధించే పన్ను రేటు ఉంటుందో అనుబంధ సరఫరాలకు కూడా అదే పన్ను రేటు వర్తిస్తుంది. పై ఉదాహరణ ప్రకారం గది అద్దెకు ఇవ్వడం ప్రధాన సరఫరా. గది అద్దెపై 18% జీఎస్‌టీ చెల్లించాలి. భోజన సదుపాయానికి 5 శాతం జీఎస్‌టీ ఉన్నప్పటికీ.. ప్రధాన సరఫరా అయిన గది అద్దెపై పన్ను రేటు ప్రకారం 18% జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఉదాహరణ: ఓ హోటల్‌లో ఓ కంపెనీ వార్షిక సమావేశాన్ని నిర్వహించింది. ఇందుకు సమావేశ గది అద్దె, భోజన వసతి తదితరాలకు కలిపి రూ.20,000 ప్యాకేజీని మాట్లాడుకుంది. కాంపోజిట్ సరఫరా ప్రకారమైతే గది అద్దెకు వర్తించే 18% జీఎస్‌టీ ప్రకారం రూ.3,600 పన్ను చెల్లించింది. అయితే హోటల్ అందించిన వివిధ సేవలకు విడివిడిగా పన్ను చెల్లిస్తే ఎలా ఉంటుందో పట్టిక-1లో చూద్దాం.

పై ఉదాహరణలో కాంపోజిట్ సరఫరా ప్రకారమైతే జీఎస్‌టీ కింద రూ.3600 కంపెనీ చెల్లించింది. అదే ఒక్కో సేవకు విడివిడిగా పన్ను చెల్లించి ఉన్నట్లయితే ఇది రూ.3,210 అవుతుంది. అంటే రూ.390 మిగులు ఉంటుందన్నమాట. అయితే విడివిడిగా పన్ను రేట్లు వేయడం వల్లే ప్రయోజనం ఉన్నప్పటికీ.. మనం అలా వేయమని అడిగే వీలు ఉండదు కనుక, కాంపోజిట్ సరఫరా విధానం ప్రకారమే మనం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

పట్టిక- 1

సరఫరా	పన్ను రేటు	మూల ధర (రూ.లో)	జీఎస్‌టీ (రూ.లో)	మొత్తం విలువ (రూ.లో)
సమావేశ రుసుం	18%	5,000	900	5,900
ఆహారం	5%	3,000	150	3,150
వసతి	18%	12,000	2,160	14,160
మొత్తం		20,000	3,210	23,210

ఒకవేళ కంపెనీకి జీఎస్‌టీ గుర్తింపు ఉంటే.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందేందుకు వీలుంటుంది. కాంపోజిట్ ప్రకారం పన్ను చెల్లించినట్లయితే రూ.3,600ను ఐటీసీ రూపంలో తిరిగి పొందొచ్చు. అదే విడివిడిగా పన్ను చెల్లిస్తే ఐటీసీ ఏవిధంగా ఉంటుందో పట్టిక- 2లో చూద్దాం.

పట్టిక ప్రకారం కాంపోజిట్ సరఫరా కింద చెల్లిస్తేనే, ఐటీసీ కింద పూర్తి మొత్తాన్ని తిరిగి పొందే వీలున్న విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

పట్టిక- 2

సరఫరా	చెల్లించిన జీఎస్‌టీ	అదే రాష్ట్రమైతే ఐటీసీ	వేరే రాష్ట్రమైతే ఐటీసీ
సమావేశ రుసుం	900	900	900
ఆహారం (ఐటీసీ వర్తించదు)	150	0	0
వసతి	2,160	2,160	0
మొత్తం	3,210	3,060	900

మిశ్రమ సరఫరా

రెండు లేదా అంతకుమించి వస్తువులు లేదా సేవలను కలిపి ఒకటేసారి సరఫరా చేసినప్పుడు అది కాంపోజిట్ సరఫరా కిందకు రాకుంటే అప్పుడు దానిని మిశ్రమ సరఫరాగా భావిస్తారు. ఉదాహరణకు: మిఠాయిలు, చాక్‌లెట్లు, డ్రైఫ్రూట్స్, కేకులు, శీతల పానీయాలు ఒకటే ప్యాకేజి కింద సరఫరా చేయడం లాంటివి. వీటన్నింటిని విడివిడిగా కూడా సరఫరా చేసే వీలున్న విషయాన్ని మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. అదే సమయంలో వీటిల్లో ఒక్కోదానికి ఒక్కోలా పన్ను రేట్లు ఉన్నాయి.

పన్ను రేట్లు ఇలా..

మిశ్రమ సరఫరా కింద సరఫరా చేసిన వస్తువుల్లో దేనికి అధిక పన్ను రేటు ఉంటుందో. ఆ రేటును మిగతా వస్తువులకు కూడా వర్తింపజేస్తారు. ఉదాహరణకు రూ.1000 ధరకు పై వస్తువుల ప్యాకేజీని సరఫరా చేశారనుకుందాం. వీటిల్లో అత్యధికంగా శీతల పానీయాలకు 28% పన్ను రేటు ఉంది. దీని ప్రకారం రూ.1000 ప్యాకేజీకి 28% జీఎస్‌టీ కింద రూ.280 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పై వస్తువులకు వాటి పన్ను రేట్ల ఆధారంగా విడివిడిగా చెల్లిస్తే ఎలా ఉంటుందో కింది పట్టిక-3లో చూద్దాం.

మిశ్రమ సరఫరా కింద పన్ను చెల్లిస్తే రూ.280 కట్టాల్సి వచ్చింది. అదే ఒక్కో వస్తువుకు విడివిడిగా పన్ను చెల్లిస్తే రూ.188 అవుతుంది. అంటే రూ.92 తగ్గుతుందన్నమాట. దీని ప్రకారం చూస్తే వీటన్నింటిని ప్యాకింగ్ రూపంలో కొనడం కంటే విడివిడిగా కొంటేనే ప్రయోజనమనే విషయం అర్థమవుతోంది.

ఒకవేళ కొనుగోలుదారు జీఎస్‌టీ కింద నమోదై ఉంటే.. మిశ్రమ సరఫరా కింద చెల్లించినా, విడివిడిగా చెల్లించినా ఐటీసీ కింద ఆ మొత్తాన్ని పూర్తిగా తిరిగి పొందే వీలుంటుంది.

పట్టిక- 3

సరఫరా	పన్ను రేటు	మూల ధర (రూ.లో)	జీఎస్‌టీ (రూ.లో)	మొత్తం విలువ (రూ.లో)
మిఠాయిలు	18%	200	36	236
డ్రై ఫ్రూట్స్	12%	200	24	224
చాక్‌లెట్లు	18%	200	36	236
కేకులు	18%	200	36	236
శీతల పానీయాలు	28%	200	56	256
మొత్తం		1000	188	1,188

నిర్ణయం మీ చేతిలోనే..

జీఎస్‌టీ కింద నమోదిత వ్యాపారుల సంగతి సరే.. మరి సామాన్యుల సంగతేంటి. వీరిలో ఎవరూ కూడా జీఎస్‌టీ కింద నమోదుకారు. అందువల్ల అనుసంధాన, మిశ్రమ సరఫరా విధానాల కింద వస్తువులు లేదా సేవల కొనుగోలు చేసేటప్పుడు పైన చెప్పిన ఉదాహరణలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం వారి చేతిలోనే ఉంది. ముఖ్యంగా ప్యాకింగ్ రూపంలో కంటే విడివిడిగా కొంటేనే ప్రయోజనం ఉండే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.



కొత్త లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం

వి-గార్డ్ కొత్త లోగో.. అధునాతన ఉత్పత్తులు

బెంగళూరు: వి-గార్డ్ ఇండస్ట్రీస్ కొత్త లోగోను ఆవిష్కరించింది. నలుపు, రాయల్ గోల్డ్ రంగుల్లో, ఆధునికంగా, ప్రీమియం విలువలు కలగలసి, కంగారూ గుర్తు మరింత ప్రస్ఫుటంగా కనిపించేలా కొత్త లోగోను రూపొందించినట్లు తెలిపింది. నాలుగు దశాబ్దాలుగా స్టెబిలైజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, సౌరవిద్యుత్తు పరికరాలు, వాటర్‌హీటర్లు తయారు చేస్తున్న సంస్థ, భవిష్యతరం అవసరాలకు అనుగుణంగా, 'స్మార్ట్' పరికరాలు ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ ఎండీ సీహెచ్ మిథున్ తెలిపారు. 'ఇంటికి మెరుగైన రేపటిని తీసుకురండి' నినాదంతో ఇంటెలిజెంట్ వాటర్ హీటర్లు, స్మార్ట్ ఇన్వర్టర్లు, ఎల్ఈడీ లైటుతో స్మార్ట్‌ఫ్యాన్ ఆవిష్కరించింది. ఎక్కడ ఉన్నా, ఆన్ చేసుకోవడంతో పాటు ఎంత ఉష్ణోగ్రత కావాలో కూడా మొబైల్ ద్వారా నియంత్రించుకోవడం ఇంటెలిజెంట్ వాటర్ హీటర్ ప్రత్యేకతగా సంస్థ డైరెక్టర్ వి.రామచంద్రన్ తెలిపారు. బ్యాటరీ సామర్థ్యానికి అనుగుణంగా ఇంటిలో వినియోగించే విద్యుత్తు ఉపకరణాలు ఏవి ఆన్ చేసుకోవచ్చో కూడా స్మార్ట్ ఇన్వర్టర్ నుంచి మొబైల్‌కు సమాచారం అందుతుందని ఉపాధ్యక్షుడు నందగోపాల్ నాయర్ తెలిపారు. స్మార్ట్‌ఫ్యాన్ వల్ల సముద్రపు ఒడ్డున ఉన్న అనుభూతి పొందవచ్చని ప్రకటించింది.

కంపెనీలన్నీ ఐటీ రిటర్నులు వేయాల్సిందే!

- రూ.3,000 పన్ను చెల్లించాల్సి ఉన్నా తప్పదు
- ఏప్రిల్ 1 నుంచి మినహాయింపుల తొలగింపు
- డొల్ల కంపెనీలను పసిగట్టేందుకే

దిల్లీ: డొల్ల కంపెనీలను మరింతగా అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా, రూ.3,000 వరకు పన్ను చెల్లించాల్సి వచ్చే కంపెనీలు ఆదాయపు పన్ను (ఐటీ) రిటర్నులు దాఖలు చేయకుండా ఉన్న మినహాయింపును తొలగించనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచే ఈ మార్పు అమల్లోకి తేవాలన్నది ప్రతిపాదన. రిటర్నులు సమర్పించకపోతే ప్రాసిక్యూషన్‌కు అవకాశం కల్పించే ఐటీ చట్టంలోని నిబంధనకు 2018-19 బడ్జెట్ ప్రతిపాదన మరింత పదును పెట్టింది. దీని ప్రకారం, ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే ఏదేని ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రిటర్నులు గనుక వేయకపోతే, సంబంధిత కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్/డైరెక్టర్/నిర్వహణాధికారిని అందుకు బాధ్యులను చేస్తారు. ఇకపై ఆదాయపు పన్ను విభాగాలు, ఆయా కంపెనీల పెట్టుబడులను పరిశీలిస్తాయి. ఇకపై తక్కువ లాభం చూపుతున్న, తొలిసారిగా ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్న కంపెనీలపైనా, నిశిత పరిశీలన జరపాలని నిర్ణయించినట్లు ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

కార్పొరేట్ వ్యవహారాల శాఖ ప్రకారం..

- ✦ దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు- 12 లక్షలు
- ✦ వార్షిక ఆడిట్ నివేదిక రూపొందించడంతో పాటు ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నవి- 7 లక్షలు



- ✦ రిటర్నులే చూపని కంపెనీలు - 5 లక్షలు
- ✦ ఆదాయం శూన్యంగా చూపుతున్న సంస్థలు - 3 లక్షలు
- ✦ 2017 డిసెంబరు వరకు 2.26 లక్షల డొల్ల కంపెనీల నమోదును కార్పొరేట్ వ్యవహారాల శాఖ రద్దు చేసింది.
- ✦ చెల్లించిన మూలధనం నామమాత్రంగా ఉండటం, అధిక నగదు నిల్వలు, షేర్ ప్రీమియంగా అధికమొత్తాలు ఉండటం, నమోదు కాని సంస్థల్లో పెట్టుబడులు, డివిడెండ్ ఆదాయమే లేకపోవడం, నగదు మాత్రం అధికంగా ఉండటాన్ని 'డొల్ల కంపెనీలకు' నిదర్శనాలుగా పేర్కొంటున్నారు.
- ✦ ప్రధాన వాటాదార్లుగా ప్రైవేటు కంపెనీలు ఉండి, తక్కువ టర్నోవర్, నిర్వహణ ఆదాయం, నామమాత్ర వ్యయాలు, తప్పనిసరిగా చెల్లించాల్సిన మొత్తాలు అతితక్కువగా ఉండటం, ట్రేడ్ అవుతున్న షేర్లు అతి స్వల్పంగా ఉండటం, తక్కువ స్థిరాస్తులున్న వాటినీ ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారు.

ఐటీ చట్టం ప్రకారం..

- ✦ సెక్షన్ 276సీసీ కింద, ఎవరైనా వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తన ఆదాయానికి సంబంధించి రిటర్నులను గడువులోగా సమర్పించకపోతే, జరిమానా, జైలు శిక్ష కూడా విధించవచ్చు.
- ✦ అయితే పన్ను చెల్లించాల్సిన మొత్తం రూ.3,000 మించని కంపెనీల విషయంలో మాత్రం ప్రాసిక్యూషన్ కూడా ఉండదు. కంపెనీలకు ఉన్న మినహాయింపును 2018 ఏప్రిల్ 1 నుంచి తొలగించనుంది. ప్రస్తుత నిబంధనను దుర్వినియోగం చేయకుండా డొల్ల కంపెనీలను అడ్డుకోనున్నారు. తద్వారా బినామీ ఆస్తులను కలిగి ఉన్న సంస్థలు బయటపడతాయి.
- ✦ ఐటీ రిటర్నులే దాఖలు చేయని కంపెనీలు మనీ లాండరింగ్‌కు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిల్లో కొన్ని నిజాయితీగా కార్యకలాపాలు సాగించే చిన్న కంపెనీలు కావచు. ఇదే సమయంలో, మనీలాండరింగ్‌కు పాల్పడే సంస్థలు కూడా వీటిల్లో ఉన్నాయనడం కాదనలేదని ఒక అధికారి వివరించారు.
- ✦ అయితే తీవ్ర నేరాల విషయంలోనే ప్రాసిక్యూషన్‌కు వెళ్లాలే కానీ, సాధారణ పన్ను విషయాల్లో అంత చర్య అవసరం లేదని, అత్యధిక వర్ధమాన దేశాల్లో ఇలానే అమలవుతున్నాయని నంగియా అండ్ కో మేనేజింగ్ భాగస్వామి రాకేశ్ నంగియా పేర్కొన్నారు.

ప్రత్యేక సాయం రూ.16,447 కోట్లు రావాలి

- రూ.12వేల కోట్లే అంటున్న కేంద్రం
- ఏపీ అధికారుల దిల్లీ పర్యటన వాయిదా
- ప్రధాని అభిప్రాయం తర్వాతే ముందడుగుకు అవకాశం

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు సమావేశాలు ముగిసి మూడు రోజులైనా విభజన హామీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లెక్కలు తేలడం లేదు. ప్రత్యేక హోదాకు సమానమైన ప్రత్యేక ఆర్థిక సాయం, రెవెన్యూ లోటు భర్తీ ఖరారుకు సంబంధించిన ఫార్ములాలపై కసరత్తు చేస్తున్నామని.. ఒకటి రెండు రోజుల్లో దీనిపై తుది నిర్ణయానికి వస్తామని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈనెల 7, 9 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో వేర్వేరుగా ప్రకటించారు. అందుకు తగ్గట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులు రెండు రోజులపాటు సమీక్షించారు. ఈ సమావేశాల్లోనే ఎవరి వాదనలకు వారు కట్టుబడి ఉండటంతో అడుగు ముందుకు పడలేదు. ఈ అంశాలపై ప్రధాని తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఇప్పుడు చెబుతున్నారు. దీంతో జరుగుతున్న ఇరువర్గాల సమావేశాలు వాయిదాపడ్డాయి. రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు, ఆర్థిక శాఖ అధికారులు సోమవారం దిల్లీకి రావాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ఆర్థికశాఖ అధికారుల సూచన మేరకు వారు పర్యటనను బుధవారానికి వాయిదా వేసుకున్నారు. 2014-15 నాటి పది నెలల రెవెన్యూ లోటు భర్తీపై కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు ఇప్పటికే పట్టువిడటం లేదు. రూ.నాలుగు వేల కోట్లే ఆఖరి మాట అని, ఇందులో మార్పునకు అవకాశం లేదని చెబుతున్నట్లు తెలిసింది. ఏపీ అధికారులు మాత్రం మీరు లోగడ అంగీకరించిన రూ.7,500 కోట్లలో మిగిలిన రూ.3,500 కోట్లు తక్షణం ఇచ్చి, తమ విస్తృతం(క్లెయిమ్) న్యాయబద్ధతను తేల్చడానికి వైవీరెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అలా అయితేనే ప్రజలకు నిజానిజాలు తెలుస్తాయని, అపోహలకు తావుండదని చెబుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద తమకు రూ.16,447 కోట్లు రావాల్సి ఉంటుందని ఏపీ చెబుతుండగా, కేంద్రం మాత్రం రూ.11-12వేల కోట్లకే పరిమితం అవుతోంది. ఏపీ మాత్రం తమది పక్కా లెక్క అని, 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక సీఎస్ఎస్ కింద రాష్ట్రానికి గత మూడేళ్లలో కేంద్రం ఎంత ఇచ్చిందో స్పష్టంగా ఉంది, అందుకు 30శాతం కలిపితే తమకు రావాల్సిన మొత్తం లెక్కగట్టామని పేర్కొంటోంది. గత వృద్ధిరేటు ఆధారంగా మిగిలిన రెండేళ్లకు కచ్చితమైన అంచనాలను రాయచ్చు. ప్రధానమంత్రి సంకేతాల ఆధారంగా ఈ అంశంలో పురోగతి ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. ఈఏపీలు, ప్రత్యేక ప్యాకేజీ, రెవెన్యూ లోటు భర్తీ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల గ్రాంట్ డిమాండ్ చేస్తోంది. అది చాలా పెద్దమొత్తమని, తాము ఇవ్వలేమని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది.

వేలెత్తి చూపని విధంగా పోలవరం పనులు

ఈనాడు-అమరావతి: "ఎవరూ వేలెత్తి చూపలేని విధంగా పోలవరం పనులు జరగాలి.. వ్యయంలో కచ్చితత్వం పాటించాలి.. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే ఎవరినీ ఉపేక్షించేది లేదు. రియల్‌టైమ్ విధానంలో పనులు జరగాలి"అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం, ప్రాధాన్య సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సోమవారం సచివాలయం నుంచి జిల్లాల వారీగా సమీక్షించారు. పోలవరం వద్ద జరుగుతున్న పనులను వర్చ్యువల్ రివ్యూ ద్వారా పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నవయుగ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. వారంలో యంత్రాలు సిద్ధం చేస్తున్నాం అని వారు పేర్కొన్నారు. లక్ష్యం కంటే ఎక్కువే చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తాను వచ్చే వారం పోలవరం వస్తానని చంద్రబాబు చెప్పారు. సబ్‌కాంట్రాక్టర్లకు కూడా నవయుగ సంస్థ నుంచి చెల్లింపులు చేస్తారన్నారు. పనుల పురోగతి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 11 వరకు జరిగిన పని వివరాలను ప్రాజెక్టు అధికారి శ్రీధర్ వివరించారు. కొన్నింటికి వర్క్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉందని.. త్వరగా అందజేయాలని కోరారు. కొన్ని డిజైన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

పోలవరానికి రూ.12,915 కోట్ల వ్యయం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.12,915.38 కోట్లు ఖర్చు చేసినట్లు చంద్రబాబు వివరించారు. 2014 నుంచి 2018 ఫిబ్రవరి 9 వరకు రూ.4,932.26 కోట్లు రీఎంబర్స్‌మెంట్ కింద కేంద్రం చెల్లించిందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.417 కోట్లు త్వరలోనే నాబార్డు ద్వారా రాష్ట్రానికి అందనున్నట్లు వివరించారు.

ప్రత్యేక హోదానే అజెండా

- బడ్జెట్ సమావేశాల తర్వాత ఎంపీల రాజీనామా?
- అవసరమైతే ఎమ్మెల్యేలు కూడా..
- వైకాపా అత్యవసర సమావేశంలో నిర్ణయం

ఈనాడు అమరావతి, కలిగిరి- న్యూస్‌టుడే: 'ప్రత్యేక హోదానే మన అజెండా. హోదా వద్దు ప్యాకేజీ చాలని ఒకసారి.. కాదు హోదానే కావాలని మరోసారి, హోదాతో సమానంగా రాష్ట్రానికి నిధులు సాధించేశామంటూ ముఖ్యమంత్రి చేస్తున్న మోసాలను బట్టబయలు చేస్తూనే హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఆందోళన కొనసాగించా'లని వైకాపా నిర్ణయించింది. నెల్లూరు జిల్లాలో పాదయాత్రలో ఉన్న ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సాయంత్రం యాత్ర నిలిపేశాక అక్కడే పార్టీ ఎంపీలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో అత్యవసర, కీలక సమావేశాన్ని నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ తెదేపా ఎంపీలు పార్లమెంటులో చేసిన ఆందోళన ప్రాధాన్యాంశం కావడం సమావేశంలో చర్చకు వచ్చింది. దిల్లీలో పరిస్థితిని ఎంపీలు జగన్‌కు వివరించారు. జగన్ స్పందిస్తూ. . ప్రత్యేక హోదా కోసం మొదటినుంచి మాట మార్చకుండా పోరాడుతున్న ఏకైక రాజకీయ పార్టీ మనదేనని, ఇప్పుడు కూడా అదే డిమాండ్‌తోనే ఉద్యమిద్దామని పేర్కొన్నారు. 'హోదా కోసం దిల్లీవరకు వెళ్లింది మనమే. మరోసారి దిల్లీలోనే పోరాడదాం' అని నాయకులు అభిప్రాయపడ్డారు. అవసరమైతే బడ్జెట్ సమావేశాలయ్యాక ఎంపీలు రాజీనామాలు చేద్దాం.. పరిస్థితి తీవ్రతను పెంచేందుకు తర్వాత కావాలంటే రాష్ట్రంలో శాసనసభ్యులు కూడా రాజీనామాలు చేస్తే ఎలా ఉంటుంది? అని చర్చించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల రాజీనామాలపై సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలను పార్టీ అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు విలేకరులకు వివరించారు.

★ మార్చి 1న రాష్ట్రంలోని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట 'ప్రత్యేక హోదా మన హక్కు.. ప్యాకేజీతో మోసపోవద్దు' నినాదంతో ధర్నాలు.
★ మార్చి 5న దిల్లీ జంతర్‌మంతర్ వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో ధర్నా. 'ప్రత్యేక హోదా మన హక్కు- ప్యాకేజీ మాకొద్దు' నినాదంతో ధర్నా.
★ మార్చి 3న పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాదయాత్రలో జగన్‌ను కలుస్తారు. అక్కడినుంచే దిల్లీకి ర్యాలీని జగన్ ప్రారంభిస్తారు. దిల్లీకి ప్రత్యేకంగా రైళ్లలో వెళ్లాలా? ఎలా వెళ్లాలనే దానిపై తుది నిర్ణయానికి రాలేదు.

కాళేశ్వరం పనులు సకాలంలో పూర్తి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు సకాలంలో పూర్తవుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని సీఎస్ ఎస్‌కే జోషి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఈ వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకుంటామని, పంటలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూన్ లేదా జులై నాటికి పనులు పూర్తవుతాయన్నారు.






పూడ్చేదెవరు?

బోర్లు వేసిన అనంతరం వాటిని పూడ్చివేయకుండా అలానే వదిలేయడం, అందులో చిన్నారులు పడి మృత్యువాత పడిన గత ఉదంతాలు కళ్లముందు కదలాడుతున్నా కొంతమందిలో నిర్లక్ష్యం ఇంకా కనిపిస్తోంది. రంగారెడ్డిరెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మీర్జాగూడ గ్రామ శివారు, ఉస్మాన్ సాగర్‌కు రిజర్వాయర్‌కు వెనక భాగాన 5 బోర్లను పూడ్చకుండా ఇలా అడ్డదిడ్డంగా వదిలేశారు. కూలీలు, పశువుల కాపరులు ఈ ప్రదేశంలో సంచరిస్తూ ఉంటారు. పలు నిర్మాణాల కోసం అక్రమంగా వేసిన బోర్లను అధికారులు అడ్డుకోవడంతో వాటిని మధ్యలోనే వదిలి వెళ్లిపోయారు. అధికారులు కూడా వీటిపై దృష్టి సారించకపోవడంతో బోరు గుంతలను పూడ్చేవారు కరవయ్యారు. **- ఈనాడు, రంగారెడ్డి జిల్లా**

అమరావతిలో సిటీ సివిల్ కోర్టు భవనం!

- రూ.108 కోట్లతో జీ+5 విధానంలో నిర్మాణం
- తాత్కాలికంగా ఆ భవనంలో హైకోర్టు
- 20 ఎకరాల్లో సమీకృత క్రీడా ప్రాంగణం
- 5.5 ఎకరాల్లో రెండు ఐటీ టవర్ల నిర్మాణం
- సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలోని పరిపాలన నగరంలో శాశ్వత హైకోర్టు నిర్మించే ప్రాంతానికి సమీపంలో సిటీ సివిల్ కోర్టు భవనానికి రూపమివ్వనున్నారు. శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని ఇందులో ఏర్పాటుచేస్తారు. శాశ్వత హైకోర్టు భవన నిర్మాణం పూర్తయ్యాక,



హైకోర్టుని అక్కడికి తరలించి, ఈ భవనంలో సిటీ సివిల్ కోర్టు ఏర్పాటుచేస్తారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ విలేఖరులకు తెలిపారు.

● సిటీ సివిల్ కోర్టు భవనాన్ని జీ+5 విధానంలో నిర్మిస్తారు. 1.96 లక్షల చ.అడుగుల నిర్మితప్రాంతం ఉంటుంది. రూ.108కోట్లు వ్యయమవుతుందని అంచనా. 8నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలన్నది లక్ష్యం.

● వర్చువల్ సింగపూర్ ప్రాజెక్టు తరహాలో రాజధాని కోసం 'అమరావతి వర్చువల్ త్రీడీ సిటీ' ప్రాజెక్టుని రూపొందిస్తారు. డస్సాల్ట్ సిస్టమ్స్ సంస్థకు ఈ బాధ్యత అప్పగించారు. ఈ ప్రాజెక్టుని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించాలని, ప్రపంచంలోనే అత్యుత్తమ పరిజ్ఞానాల్ని వినియోగించాలని సీఎం సూచించారు. అమరావతి వర్చువల్ త్రీడీ సిటీ ప్రాజెక్టు నమూనాని ఏప్రిల్‌లో జరిగే సంతోష నగరాల సదస్సులో ప్రదర్శించాలని తెలిపారు.

● రాజధాని అమరావతి, విజయవాడ నగరాల చుట్టూ నిర్మించే అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్)కి సంబంధించిన ముసాయిదా ప్రకటన జారీకి సీఆర్‌డీఏ అంగీకారం తెలిపింది. రాజధాని అమరావతిలో గ్రిడ్ విధానంలో నిర్మిస్తున్న ప్రధాన రహదారుల్ని అంతర వలయ రహదారికి అనుసంధానిస్తారు. ఐఆర్‌ఆర్‌కి, రాజధాని రహదారుల్ని ఐఆర్‌ఆర్‌తో అనుసంధానించేందుకు మొత్తం 8వేల ఎకరాల వరకు కావాలని అంచనా. దీన్ని భూసమీకరణ విధానంలో తీసుకోవాలని అథారిటీ నిర్ణయించింది. అలా ఇవ్వని భూముల్ని భూసేకరణ ద్వారా తీసుకుంటారు. సీఆర్‌డీఏ త్వరలోనే ముసాయిదా ప్రకటన విడుదల చేస్తుంది. అభ్యంతరాలు తెలియజేసేందుకు 30రోజుల గడువుంటుంది.

● రాజధాని నిర్మాణానికి విదేశాల్లో మసాలా బాండ్లు విడుదల ద్వారా రూ.500కోట్లు సమీకరించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఎస్‌బీఐ ద్వారా ఈ ప్రక్రియ నిర్వహిస్తారు.

● రాజధానిలో సీఆర్‌డీఏ 10లక్షల చ.అడుగుల నిర్మితప్రాంతం కలిగిన రెండు ఐటీ టవర్లు నిర్మిస్తుంది. రూ.284 కోట్లు వెచ్చించి, 5.5 ఎకరాల్లో వీటిని నిర్మిస్తుంది.

● సంతోష నగరాల సదస్సుని ఏప్రిల్ 10 నుంచి 12 వరకు విజయవాడలోని ఎ1 కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారు. దేశ, విదేశాల నుంచి 1500 ప్రతినిధులు హాజరవుతారని అంచనా.

● సంతోష నగరాల సదస్సు లోగో ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలని, లోగో కూచిపూడి నృత్యం, శాసనసభ భవన నమూనా, హరిత, జల రాజధాని ఇతివృత్తాలు ప్రతిబింబించేలా ఉండాలని తెలిపారు.

● రాజధానిలో వెంకటపాలెం సమీప కృష్ణా తీరంలో 8.38 ఎకరాల్లో రూ.40 కోట్ల వ్యయంతో 'మెరీనా' ఏర్పాటుకి అథారిటీ ఆమోదముద్ర వవేసింది. త్వరలో టెండర్లు పిలుస్తారు

● పరిపాలన నగరంలోనే 20ఎకరాల్లో సమీకృత బహుళ ప్రయోజనకర క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేస్తారు. దీనిలో 11 ఎకరాల్లో స్టేడియం, 9ఎకరాల్లో వాణిజ్య సదుపాయాలు, వసతులు వస్తాయి. వీటి నిర్మాణానికి రూ.450-500 కోట్లు వ్యయమవుతుందని అంచనా.

రాజధాని అంతర వలయ రహదారి ప్రణాళిక ఖరారు

- త్వరలో ముసాయిదా ప్రకటన
- సుమారు ఎనిమిది వేల ఎకరాల భూసమీకరణ
- ఐఆర్‌ఆర్ మొత్తం పొడవు 96.16 కి.మీ.

ఈనాడు, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి, విజయవాడ చుట్టూ నిర్మించే అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్) తుది ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో దీనికి ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సుమారు ఎనిమిది వేల ఎకరాలను భూసమీకరణ విధానంలో తీసుకోవాలని నిర్ణయించినందున సీఆర్‌డీఏ త్వరలోనే ముసాయిదా ప్రకటన జారీ చేయనుంది. ప్రకటన వెలువడ్డాక ప్రజల అభ్యంతరాలు, సూచనలు తెలిపేందుకు 30 రోజుల గడువునిస్తారు. 217 చ.కి.మీ.ల పరిధిలో రాజధానిలో నిర్మిస్తున్న ప్రధాన అంతర్గత రహదారులను ఐఆర్‌ఆర్‌తో అనుసంధానిస్తారు. ఐఆర్‌ఆర్ నిర్మాణానికి, రాజధానిలోని రహదారులను ఐఆర్‌ఆర్‌తో అనుసంధానించేందుకు కలిపి సుమారు ఎనిమిది వేల ఎకరాలు అవసరమవుతాయని అంచనా.

ఐఆర్‌ఆర్ స్వరూపమిది!

★ **అంతర్‌వలయ రహదారి పొడవు:** 96.16 కి.మీ., వెడల్పు: 75 మీటర్లు
★ **కేవలం అంతర్‌వలయ రహదారి రైట్‌ఆఫ్ వే విస్తీర్ణం:** 2195.87 ఎకరాలు
★ **ఏయే జిల్లాల మీదుగా వెళ్తుందంటే:** గుంటూరు, కృష్ణా
★ **ఎన్ని మండలాల మీదుగా వెళ్తుందంటే:** 10 మండలాలు- తుళ్లూరు, అమరావతి, దుగ్గిరాల, మంగళగిరి, తాడికొండ, గన్నవరం, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, విజయవాడ గ్రామీణ, జి.కొండూరు
★ **ఎన్ని గ్రామాల మీదుగా వెళ్తుందంటే:** 41 గ్రామాలతో పాటు కొండపల్లి రక్షిత అటవీ ప్రాంతం మీదుగా

రెండు భాగాలుగా నిర్మాణం

మొదటి భాగం

★ మొత్తం గ్రామాలు: 41
★ అంతర వలయ రహదారి పొడవు: 68.08 కి.మీ.
★ ఎన్‌హెచ్-65 (హైదరాబాద్ రహదారిలో) కేతనకొండ వద్ద మొదలై ప్రతిపాదిత జాతీయ రహదారి బైపాస్ (నున్న సమీపం) వద్ద ముగుస్తుంది.

కృష్ణా నదిపై వేర్వేరు చోట్ల రెండు వంతెనలు వస్తాయి. అవి

1. కృష్ణానదికి ఉత్తరాన కొటికలపూడి గ్రామానికి పశ్చిమం వైపున వంతెన మొదలై కృష్ణా నదికి దక్షిణాన వైకుంఠాపురం గ్రామానికి తూర్పు వైపున ముగుస్తుంది. దీని పొడవు: 3.1 కి.మీ.
2. కృష్ణానదికి దక్షిణాన రామచంద్రాపురం గ్రామానికి తూర్పు వైపున వంతెన మొదలై కృష్ణా నదికి ఉత్తరం వైపున, చోడవరం గ్రామానికి తూర్పు వైపున ముగుస్తుంది. దీని పొడవు: 1.4 కి.మీ.

★ అనంతవరం వద్ద ఈ అంతరవలయ రహదారి రాజధానిని తాకుతుంది.

రెండో భాగం

★ అంతరవలయ రహదారి పొడవు: 28 కి.మీ.
★ కొండపల్లి రక్షిత అటవీ ప్రాంతం గుండా తొమ్మిది కి.మీ మేర ఈ రహదారి వెళ్తుంది. అందులో 8 కి.మీ. సొరంగ మార్గం.
★ అంబాపురం వద్ద పోలవరం కాలువ మీదుగా రెండు చోట్ల వెళ్తుంది.

హక్కులను కాపాడుకోవాలి

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ హక్కులను కాపాడుకోవాల్సి ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో జయప్రకాష్ నారాయణతో సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం వారితో కలిసి జయప్రకాష్ నారాయణ విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోవడం, వాటిని దేశమంతా గుర్తించేలా ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై చర్చించామని అన్నారు. మన దేశంలో తాత్కాలిక ఆర్భాటాలు, ప్రకటనలపై చూపిన శ్రద్ధ.. ఫలితంపై లేదని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, యువత ఉపాధి, రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా అడుగేయాలని అభిప్రాయపడ్డారు. ఈ అంశంలో ఇప్పటికే నాలుగేళ్ల ఆలస్యమైందని, ప్రారంభంలోనే జాగ్రత్తపడితే ఈ ఇబ్బంది ఉండేది కాదని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకతీతంగా తమ వంతు సాయం చేస్తామన్నారు. సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి అన్ని పార్టీల సలహాలు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 18న విజయవాడలో అన్ని పార్టీలు, ఎంపీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అదేరోజు కార్యాచరణ ప్రకటిస్తామని, న్యాయం జరిగేంతవరకూ తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రయోజనాలను ఎలా సాధించాలన్నదే తమ ఎజెండా అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఈ అంశాలపై ఒక ముగింపునకు వచ్చాక మాట్లాడతామని తెలిపారు.

ఏవోబీలో ఎదురుకాల్పులు

ఈనాడు డిజిటల్ విశాఖపట్నం, ముంచంగిపుట్టు, మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దు సోమవారం తుపాకీల మోతతో దద్దరిల్లింది. ఏవోబీ సరిహద్దు ప్రాంతం మల్కాన్‌గిరి జిల్లా పరిధిలోని జోడాంబో గ్రామ పంచాయతీ టికరపడా, జగన్నాథ్‌గుడ సమీప ప్రాంతాల్లో సోమవారం ఉదయం మావోయిస్టులకు పోలీసుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ప్రాణనష్టం జరక్కపోయినా సరిహద్దులో భయాందోళనలు నెలకొన్నాయి. 2016 అక్టోబరులో ఎన్‌కౌంటర్ జరిగిన రాంగుడ ప్రాంతం నుంచి 6 కి.మీల దూరంలోని జోడాంబో పంచాయతీ పరిధిలో సుమారు 120 మంది మావోయిస్టులు కీలక నేతలతో కలిసి సమావేశమైనట్లు అందిన సమాచారం మేరకు పోలీసు బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ జగన్ మోహన మీనా వెల్లడించారు. 'గ్రేహౌండ్స్ దళాలు, ప్రత్యేక బృందాలతో కలిసి కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో మావోయిస్టులంతా తప్పించుకున్నారు. ఎదురుకాల్పులు ముగిసిన తరువాత ఆ ప్రాంతాన్ని గాలించగా 45 కిట్లుతో పాటు పేలుళ్లకు సంబంధించిన 15 రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు' పేర్కొన్నారు. గ్రామాల్లో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్లు విశాఖ గ్రామీణ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామాగ్రి

★ మందుపాతరలతో కూడిన స్టీల్ క్యారేజిలు: 2
★ కిట్ బ్యాగులు : 45 ★ సింగిల్ బ్యారెల్ వెపన్స్: 2
★ ఇన్‌సాస్ రౌండ్స్: 2 ★ ఏకే ఫైర్ ఆయుధం: 6
★ 16 డిటోనేటర్లు ★ 303 రైఫిల్ : 6 రౌండ్లు
★ ఖాళీ మ్యాగ్‌జైన్: 1 ★ 9ఎమ్ఎమ్ కార్బైన్ మ్యాగజైన్

ఆర్కే మళ్లీ తప్పించుకున్నాడా..?

2016 అక్టోబర్‌లో జరిగిన రాంగుడ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత ఆర్కే తప్పించుకున్నాడు. అతన్ని రక్షించే క్రమంలోనే ఆర్కే కొడుకు మున్నాతో పాటు 31 మంది మావోయిస్టులు పోలీసుల కాల్పుల్లో మృతిచెందినట్లు చెబుతారు. ప్రస్తుత ఘటనలో 100 నుంచి 120 మంది వరకు మావోయిస్టులు సమావేశమయ్యారని వారిలో కీలక నేతలున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రామకృష్ణ (ఆర్కే), ఉదయ్, ఇతర అగ్రనాయకులు ఈ సమావేశానికి వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. అయితే అగ్రనేతలున్న విషయాన్ని వారు ధ్రువీకరించడం లేదు.

బదులు తీర్చుకోవడానికా..

రాంగుడ ఎన్‌కౌంటర్‌కు తప్పకుండా బదులు తీర్చుకుంటామని ఇదివరకే మావోయిస్టులు ప్రకటన చేశారు. ఇంతవరకు ఎటువంటి పెద్ద ఘటనలూ చోటుచేసుకోలేదు. పోలీసులపై దాడికి వ్యూహం పన్నడానికి సమావేశమయ్యారా లేక విశాఖ మన్యంలో నాయకత్వ లేమితో ఉన్న గాలిగొండ ఏరియా కమిటీకి నాయకులను నియమించడానికా అన్నది తెలియాల్సి ఉంది. గతేడాది 117 మంది మిలీషియా సభ్యులు, సానుభూతిపరులను అరెస్టు చేశారు. అలాగే 62 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. దీంతో చాలావరకు ఏరియా కమిటీలు ఖాళీలైపోయాయి.

15న డీడీ 'అరుణ్ ప్రభ' ఛానల్‌ను ప్రారంభించనున్న ప్రధాని

ఇటానగర్: ఈశాన్య భారత ప్రాంతానికి ఉద్దేశించిన ప్రత్యేక దూరదర్శన్ ఛానల్ 'అరుణ్ ప్రభ'ను ఈ నెల 15వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారు. ఈ 24/7 ఛానల్‌తో పాటూ...అరుణాచల్ ప్రదేశ్ పౌర సచివాలయ సముదాయానికి కూడా ఆయన ప్రారంభోత్సవం చేస్తారని అధికారులు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన ప్రధాని ఇటానగర్‌లో ఏర్పాటు చేయనున్న 'ఫిలిం, టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్'కు సైతం ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం ఇక్కడి ఇందిరాగాంధీ పార్కులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

వెంటనే పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

- జిల్లాల్లో ఆర్డర్ టు సర్వ్ ఉత్తర్వులను రద్దు చేయాలి
- టీఎన్జీవోల కార్యవర్గం తీర్మానాలు

ఈనాడు-హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగులకు 2018, జులై 1 నుంచి నూతన వేతనాలను అమలు చేయటం కోసం వేతన సవరణ సంఘాన్ని (పీఆర్‌సీ) వెంటనే ఏర్పాటు చేయాలని సోమవారం టీఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జిల్లాల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న 'ఆర్డర్ టు సర్వ్' ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేసింది. టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ఇతర ప్రతినిధులు మందడి ఉపేందర్ రెడ్డి, బండారు రేచల్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో చేసిన తీర్మానాలు ఇలా ఉన్నాయి..

★ నూతన పింఛను విధానం రద్దు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవటానికి ఉద్యమించాలి. ఉద్యోగులు 8 ఏళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్నందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే బదిలీలను చేపట్టాలి.
★ ఆంధ్రాలో పనిచేస్తున్న తెలంగాణ వారిని ఇక్కడికి తీసుకురావాలని అనేక సార్లు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వ పట్టించుకోకపోవటంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. ఆ ఉద్యోగులను వెంటనే ఇక్కడికి తీసుకురావాలి. జనాభాతో నిమిత్తం లేకుండా కొత్త జిల్లాల్లో 20 శాతం ఇంటి అద్దె భత్యాన్ని ఇవ్వాలి.
★ రిజిస్ట్రేషన్ విధులను తహసీల్దార్ కార్యాలయాలకు అప్పగిస్తున్నందున అక్కడ అదనపు పనిభారం పెరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. అన్ని జిల్లాల్లో ప్రభుత్వం వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నూతన పింఛను విధానం రద్దు కోసం మార్చి 22న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహణ.

'షోపియాన్' కేసులో జమ్మూకశ్మీరుకు చుక్కెదురు

దిల్లీ: షోపియాన్‌లో పౌరులపై కాల్పుల కేసులో జమ్మూకశ్మీరు ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. మేజర్ ఆదిత్యకుమార్ సహా సైనికాధికారులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సోమవారం ఆదేశించింది. షోపియాన్‌లో ఇటీవల సైనిక వాహనాలపై రాళ్లు రువ్వుతున్న అల్లరిమూకలపై సైన్యం కాల్పులు జరపడంతో ముగ్గురు పౌరులు చనిపోయిన సంగతి విదితమే. దీనిపై స్థానిక పోలీసులు హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. విధి నిర్వహించిన సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారని, కేసులు కొట్టేయాలని ఆదిత్యకుమార్ తండ్రి, లెఫ్టినెంట్ కల్నల్ కరంవీర్‌సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం వ్యాజ్యాన్ని విచారించింది. వ్యాజ్యం కాపీలను అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ కార్యాలయం, జమ్మూకశ్మీరు ప్రభుత్వానికి కూడా అందజేయాలని సూచించింది. ఈ విషయంలో సహకరించాలని వేణుగోపాల్‌ను కోరిన ధర్మాసనం, రెండు వారాల్లోగా స్పందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. సైనికాధికారులపై ఎలాంటి బలవంతపు చర్య తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సైనికుల హక్కులను పరిరక్షించడానికి తగిన మార్గదర్శకాలు సూచించాలని, వేధింపులకు గురైన సైనికసిబ్బందికి తగిన పరిహారం చెల్లించాలని వ్యాజ్యదారుడు కోరాడు.

భూకంపాలను సూచించలేకపోతున్నాం

- ఏపీ జోన్-3, 2ల్లో ఉంది
- ఎన్జీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డా.నగేష్

ఈనాడు, అమరావతి: తగిన శాస్త్రీయ సమాచారం లేకపోవడంతో భూకంపాల రాకను ముందుగా సూచించలేకపోతున్నామని ఎన్జీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డా. నగేష్ అభిప్రాయపడ్డారు. ప్రమాదం సంభవించిన తరువాతే తీవ్రతను గుర్తించగలుగుతున్నామన్నారు. భూకంపాల తీవ్రతలో రాష్ట్రం జోన్-3, 2ల్లో ఉందని వెల్లడించారు. సోమవారం కుంచనపల్లిలో విపత్తులశాఖ ఆధ్వర్యంలో భూకంప ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలు, చర్యలు, సంసిద్ధత అనే అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ జోన్-3లో 5.5 తీవ్రతతో, జోన్-2లో 4.5 తీవ్రతతో ప్రకంపనలు ఉంటాయని చెప్పారు. గతంలో వచ్చిన భూకంపాలనుబట్టి ఎక్కడ సంభవిస్తాయో ఓ అంచనా వేయొచ్చని, ఉత్తర భారతంతో పోల్చుకొంటే దక్షిణాదిన ఈ ప్రమాద స్థాయి తక్కువగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిది భూకంప పరిశీలన కేంద్రాలు ఉన్నాయన్నారు. విపత్తుల నిర్వహణశాఖ ఈడీ కోట్ల శివశంకరరావు మాట్లాడుతూ అవసరమైతే మరికొన్ని పరిశీలనా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్జీఆర్ఐతోపాటు ఇన్‌కాయిస్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కేఎల్‌యూ శాస్త్రవేత్తలు, ఆచార్యులతో ప్రణాళికలు రూపొందించడానికి సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

'ఆయుష్మాన్ భారత్' అమలుపై కేంద్రం సమాలోచనలు

అన్ని రాష్ట్రాల ఆరోగ్య కార్యదర్శులు, నీతిఅయోగ్ అధికారులతో రెండురోజుల కార్యశాల

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకం అమలుకు కేంద్రం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లుచేస్తోంది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల ఆరోగ్య కార్యదర్శులు, నీతి అయోగ్ ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ నెల 15, 16 తేదీల్లో దిల్లీలో రెండు రోజుల కార్యశాల(వర్క్‌షాపు) నిర్వహించనుంది. అందులో చర్చించాల్సిన అంశాల జాబితాను సోమవారం రాష్ట్రాలకు పంపించింది. రాష్ట్రాలను కార్యశాలలో భాగస్వాములను చేయడం ద్వారా పథకం అమలుకు అనుసరించాల్సిన విధి విధానాలు? పథకాన్ని ట్రస్టు విధానంలో నిర్వహించాలా? లేదా బీమా పద్ధతిని అమలుచేయాలా? అనే దానిపై స్పష్టత సాధించడమే కార్యశాల నిర్వహణ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఈ పథకాన్ని అమలుచేయడానికి రాష్ట్రాలకు అవసరమైన నిధులు, ఈ పథకం ప్రజల్లోకి వెళ్లడానికి అనుసరించాల్సిన కార్యాచరణ ప్రణాళిక తదితరాలపైనా కార్యశాలలో చర్చించే అవకాశం ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

బడ్జెట్‌పై కమిటీలు అధ్యయనం చేస్తున్నాయ్..

కేంద్ర పౌర విమానయాన మంత్రి అశోక్

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌పై ఇంకా చర్చ జరుగుతోందని, దీనిపై కమిటీలు అధ్యయనం చేస్తున్నాయని, ఆ విషయాన్ని ఇలాంటి వేదికలపై మాట్లాడడం సరికాదని, తనపై ఎన్ని విమర్శలొచ్చినా స్వీకరిస్తానని కేంద్ర పౌర విమానయాన మంత్రి అశోక్‌గజపతిరాజు తెలిపారు. సోమవారం విజయనగరం జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైకాపా నాయకులు తనపై చేస్తున్న అర్థరహిత ఆరోపణలు పట్టించుకోనన్నారు. ప్రపంచంలోనే భారత పౌర విమానయానం వేగంగా పురోగతి సాధిస్తుందన్నారు. సొంత సంస్థ సామర్థ్యం మంత్రిగా తనకు తెలుసు కాబట్టే భోగాపురం విమానాశ్రయ టెండర్లు రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించానని, ఈ విషయంలో ఎవరెన్ని విమర్శలు చేసినా తప్పు చేయలేదనే నమ్మకం తనకు ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ గనుల మంత్రి సుజయకృష్ణ రంగారావు పాల్గొన్నారు.

కనుసైగతో.. ఏ మాయ చేసావే!

అంతర్జాలంలో మలయాళ నటి ప్రియ హల్‌చల్



హైదరాబాద్: ఎందరో సినీనటులు వస్తుంటారు. పోతుంటారు. కానీ కొందరే ప్రేక్షకుల మదిలో చెరగని ముద్రవేస్తారు. దీనికి కొందరు సినిమా నిడివి.. అంటే 2.15 గంటలు తీసుకుంటే మరికొందరు జీవితాంతం కష్టపడుతుంటారు. అయితే జీవితానికి సరిపడా క్రేజ్‌ను 27 సెకన్ల వీడియోతో కొల్లగొడితే... అవును.. ఇది సాధ్యమేనని మలయాళ ముద్దుగుమ్మ ప్రియ ప్రకాశ్ వారియర్ నిరూపించింది. అది కూడా ఎలాంటి మాటలు లేకుండానే. ''ఒరు అదార్ లవ్'' సినిమాలోని మణిక్య మలరాయ పాటలో కనుసైగలతో ఆమె పలికించిన హావభావాలు మాటలకు అందనివి. ఇవి ఆమెకు అమాంతం స్టార్‌డమ్ తెచ్చిపెట్టాయి. యూట్యూబ్, ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్ ఇలా అన్ని సామాజిక అనుసంధాన వేదికలూ ఆమె పేరు జపించేలా చేశాయి. రెండు రోజుల్లోనే 45 లక్షల మందిని ఈ వీడియోను వీక్షించారు. యూ-ట్యూబ్‌లో మొదటి స్థానంలో ఇది ట్రెండ్ అవుతోంది. ఊహించని రీతిలో వస్తున్న ఈ స్పందనకు ప్రియ తబ్బిబ్బవుతోంది. త్రిస్సూర్‌లో ఆమె డిగ్రీ చదువుకుంది. శాస్త్రీయ నృత్యం మోహినియాట్టంలోనూ ఆమె శిక్షణ తీసుకుంది. ''ఒరు అదార్ లవ్'' సినిమాతోనే ఆమె తెరంగేట్రం చేస్తోంది.

5 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రమాణాల మేరకు సౌకర్యాలు లేనందున అఖిల భారత సాంకేతిక విద్యామండలి నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో 54 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలుండగా అయిదు కళాశాలలకు నోటీసులిచ్చింది. విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో కొత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను ఏర్పాటు చేయాలనుకుంటే రెండేళ్లపాటు తాత్కాలిక ప్రాంగణాల్లో నడుపుకోవచ్చని కేంద్ర మానవ వనరుల శాఖ గతంలో అనుమతి ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో ఎనిమిది కొత్త కళాశాలలను నెలకొల్పారు. ఇచ్చిన గడువు పూర్తికావడంతో దేశవ్యాప్తంగా ఏఐసీటీఈ అధికారులు గత అక్టోబరులో కళాశాలలను తనిఖీ చేశారు. శాశ్వత భవనాల్లోకి మారని, నిబంధనల ప్రకారం ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, వర్క్‌షాపులు, ఇతర సౌకర్యాలు లేని మొత్తం 35 కళాశాలలకు నోటీసులు జారీ చేశారు. అందులో తెలంగాణలో అయిదు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు, మెదక్ మహిళా కళాశాల, అదే జిల్లాలో చేగుంట కళాశాల, మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి, సిద్దిపేట మహిళా కళాశాలలకు నోటీసులు జారీ అయ్యాయి. ఈనెల 16న దిల్లీలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశానికి అధికారులు హాజరు కావాలని ఏఐసీటీఈ సూచించింది.

డీజీపీ సర్క్యులర్ అమల్లో లేదు

నేరస్థుల సమగ్ర సర్వేపై హైకోర్టుకు తెలిపిన సర్కారు

ఈనాడు, హైదరాబాద్: సకల నేరస్థుల సమగ్రసర్వే కోసం ఈ ఏడాది జనవరి 3న తెలంగాణ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్ అమల్లో లేదని సర్కారు తరఫున తెలంగాణ అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాశ్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులు ఆ సర్క్యులర్ ఆధారంగా వ్యవహరించొద్దని కోరుతూ డీజీపీ తాజాగా జారీచేసిన ప్రతిని కోర్టుకు అందజేశారు. నేరస్థుల సర్వేపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ దాఖలైన రెండు వ్యాజ్యాలపై విచారణను ముగిస్తూ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి సోమవారం ఆదేశాలు జారీచేశారు. సర్వే పేరుతో మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వో, హైదరాబాద్ ఉత్తర జోన్ డీసీపీ తనను వేధిస్తున్నారంటూ గ్రేటర్ హైదరాబాద్ తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు చిర్రబోన బద్రీనాథ్‌యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. కల్వకుర్తి ఎస్‌హెచ్‌వో తనను వేధిస్తున్నారంటూ అబ్దుల్ హఫీజ్ మరో వ్యాజ్యం దాఖలు చేయడం తెలిసిందే. సర్క్యులర్ అమల్లో లేదనే వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ వ్యాజ్యాలపై విచారణను ముగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

15న కేంద్ర జలవనరుల సమావేశం

కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న దిల్లీలో సమావేశం నిర్వహించనున్నారు. ఆ శాఖ మంత్రి గడ్కరీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి తెలంగాణ నీటిపారుల శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం అందింది. దేశ వ్యాప్తంగా ప్రాధాన్యక్రమంలో ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన కింద పూర్తి చేయతలపెట్టిన 99 సాగు నీటి పథకాలు, నాబార్డు నుంచి ఇప్పటివరకు రాష్ట్రాలకు ఇచ్చిన నిధులపై ఇందులో చర్చించనున్నారు. భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అన్ని రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు, నీటిపారుదల, ఆర్థిక శాఖల ప్రధాన కార్యదర్శులు, కేంద్ర జల సంఘం ఛైర్మన్, నాబార్డు ఛైర్మన్ హాజరుకానున్నారు.

వాతావరణ మార్పులను అధిగమించేందుకు చర్యలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణ మార్పుల వల్ల తలెత్తే అనర్థాలను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం హరితహారం, మిషన్ కాకతీయ వంటి పథకాలను అమలు చేస్తోందని అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ అన్నారు. గచ్చిబౌలిలోని 'పర్యావరణ పరిరక్షణ, పరిశోధనా, శిక్షణ సంస్థ'(ఈపీటీఆర్ఐ)లో సోమవారం ప్రారంభమైన రెండ్రోజుల సదస్సులో ఆయన ప్రసంగించారు. సదస్సులో అమెరికా పర్యావరణ సమాచార శాఖ, అక్కడి ఉత్తర కరోలినా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అమెరికా వాతావరణ సమాచార శాఖ సాంకేతిక విభాగం అధిపతి డేవిడ్ ఈస్టర్లింగ్ మాట్లాడుతూ.. భారత్‌తో కలిసి పనిచేయడం ద్వారా మరింత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

ముస్లింలంతా ఏకతాటిపైకి రావాలి: ఓవైసీ

అబిడ్స్, న్యూస్‌టుడే: అధికారం అడ్డుపెట్టుకొని దేశంలోని ముస్లింలపై విషం చిమ్ముతున్న మతతత్వ శక్తులకు గుణపాఠం నేర్పించాలంటే ముస్లింలంతా ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉందని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. బాబ్రీ మసీదు పునఃనిర్మాణం కోసం అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు తీసుకున్న నిర్ణయానికి ప్రతి ముస్లిం సహాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన బహిరంగసభలో ఓవైసీ మాట్లాడుతూ.. బాబ్రీ మసీదు కూల్చివేతకు గురైన డిసెంబరు 6వ తేదీని తీవ్రవాద దినంగా పరిగణిస్తున్నామని, ఇతర స్థలంలో మసీదు నిర్మించుకోండి అంటూ ఇస్తోన్న ఉచిత సలహాలు మానుకోవాలని హితవు పలికారు. ట్రిపుల్ తలాక్ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ తన భార్యను దిల్లీకి రప్పించుకొని ఇంట్లో ఉంచుకోవాలనీ, ఆ తర్వాతే ఇతరుల విషయాన్ని ప్రస్తావించాలని వ్యాఖ్యానించారు.

ద.మ. రైల్వే నిఘావిభాగం తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: రైల్వే బుకింగ్ కార్యాలయాలు, టిక్కెట్ రిజర్వేషన్ కేంద్రాలు, సరకు రవాణా విభాగాలు ఇలా ప్రజలతోనూ.. డబ్బుతోనూ ముడిపడి ఉన్న ప్రతి చోటా అవినీతికి ఆస్కారం ఉందని తేలింది. ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు వివిధ చోట్ల దక్షిణమధ్య రైల్వే నిఘా విభాగం తనిఖీల్లో వెల్లడైన అవకతవకలే ఇందుకు నిదర్శనం. మొత్తం 676 చోట్ల తనిఖీలు నిర్వహించి 69 మంది ఇందుకు బాధ్యులని నిఘావిభాగం తేల్చింది. వీరిపై విచారణ జరుగుతోంది. 155210 నంబరుకు ఫోను చేసి రైల్వేలో ఏ స్థాయిలో అవకతవకలు జరిగినా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా నిఘా విభాగం అధికారులు ప్రయాణికులను కోరారు.

ఐసిస్ అధినేత అబు బాకర్‌కు తీవ్రగాయాలు!

గత మే నెలలో క్షిపణిదాడిలో గాయపడ్డాడని చెబుతున్న అమెరికా అధికారులు

వాషింగ్టన్: కరడు గట్టిన ఉగ్రవాద సంస్థ ఐసిస్ అధినేత అబు బాకర్ అల్ బగ్దాది ఓ క్షిపణి దాడిలో తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. గత ఏడాది మే నెలలో సిరియాలోని రఖ్ఖాలో అబు బాకర్ ఉన్న సమయంలో ఈ దాడి జరిగినట్లుగా అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ ఓ వార్తా సంస్థ వెల్లడించింది. ఉత్తర సిరియాలో పట్టుబడిన ఐసిస్ ఉగ్రవాదులు, శరణార్థులు అందించిన సమాచారం ఆధారంగా ఈ నిర్ధరణకు వచ్చారు. అయితే, ఆ గాయాలు ప్రాణాపాయం కలిగించేవి కావని సమాచారం. 2014 మార్చి తర్వాత బగ్దాది బహిరంగంగా కనిపించలేదు. ఐసిస్ మాత్రం బగ్దాది పేరుతో అప్పుడప్పుడు ఆడియో సందేశాలను విడుదల చేస్తోంది.


ముఖ్యమంత్రుల ఆస్తుల్లో చంద్రబాబుకు తొలి స్థానం

- 4వ స్థానంలో కేసీఆర్
- అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ విశ్లేషణ

ఈనాడు - దిల్లీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలో అత్యంత సంపన్నుడైన ముఖ్యమంత్రి అని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.177 కోట్లని (చంద్రబాబు ఆస్తులు, ఆయన సతీమణి భువనేశ్వరి ఆస్తులు కలిపి) పేర్కొంది. ఆ తర్వాతి స్థానాల్లో అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండూ (రూ.129 కోట్లు), పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్‌సింగ్ (రూ.48 కోట్లు) ఉన్నట్లు వెల్లడించింది. వీరు ముగ్గురూ పాన్‌కార్డులు సమర్పించినట్లు తెలిపింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆస్తులను ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్, నేషనల్ ఎలెక్షన్ వాచ్ సంస్థలు సంయుక్తంగా ఆయా ముఖ్యమంత్రులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్లను విశ్లేషించి ఈ ఆస్తులను పేర్కొన్నాయి. అత్యధిక ఆస్తులున్నవారి జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగోస్థానంలో నిలిచారు. ఆయనకు రూ.15.51 కోట్లున్నట్లు (కేసీఆర్ ఆస్తులు, ఆయన సతీమణి శోభ ఆస్తులు కలిపి) వెల్లడయింది. వీరిద్దరి చరాస్తులు రూ.6,50,82,464 కాగా, స్థిరాస్తుల విలువ రూ.8,65,00,000.

అతితక్కువ ఆస్తులున్నవారి జాబితాలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఉన్నారు. ఈయనకు మొత్తం రూ.26 లక్షల ఆస్తులున్నాయి. ఆ తర్వాతి స్థానంలో మమతాబెనర్జీ (రూ.30లక్షలు), మెహబూబా ముఫ్తీ (రూ.55 లక్షలు) తేలారు. ఇందులో మాణిక్‌సర్కార్ పాన్ నెంబర్ ఇవ్వలేదు. రూ.వందకోట్లకు పైగా ఆస్తులున్న ముఖ్యమంత్రులు ఇద్దరు, రూ.10-50 కోట్ల మధ్య ఉన్నవారు ఆరుగురు, రూ.1-10 కోట్ల మధ్య ఉన్నవారు 17 మంది, రూ.కోటిలోపు ఉన్నవారు ఆరుగురు ఉన్నట్లు ఏడీఆర్ తేల్చింది. దేశంలోని 31 ముఖ్యమంత్రి పీఠాల్లో ముగ్గురు మహిళలు (10%), ఉంటే 28 మంది పురుషులు (90%) ఉన్నారు.





	ముఖ్యమంత్రి	రాష్ట్రం	చరాస్తులు రూ.లలో	స్థిరాస్తులు రూ.లలో	మొత్తం రూ.లలో	పాన్‌ఇచ్చారా
తొలి ముగ్గురు	చంద్రబాబునాయుడు	ఆంధ్రప్రదేశ్	134,80,11,728	42,68,83,883	177,48,95,611	అవును
	పెమాఖండు	అరుణాచల్‌ప్రదేశ్	103,21,28,444	26,36,27,570	129,57,56,014	॥
	అమరిందర్‌సింగ్	పంజాబ్	6,03,02,449	42,28,68,560	48,31,71,009	॥
చివరి ముగ్గురు	మాణిక్ సర్కార్	త్రిపుర	24,63,195	2,20,000	26,83,195	లేదు
	మమతాబెనర్జీ	పశ్చిమబెంగాల్	30,45,013	0	30,45,013	అవును
	మెహబూబా ముఫ్తీ	జమ్మూకశ్మీర్	10,96,854	45,00,000	55,96,854	॥

మిగతా వారి ఆస్తులెంత? (రూ.కోట్లలో)

తెలంగాణ ముఖ్యమంత్రి	15.51
మేఘాలయ	14.50
కర్ణాటక	13.61
ఒడిశా	12.06
సిక్కిం	10.70
పుదుచ్చేరి	9.65
మిజోరాం	9.15
గుజరాత్	9.09
తమిళనాడు	7.80
గోవా	6.29
మధ్యప్రదేశ్	6.27
ఛత్తీస్‌గఢ్	5.61
మహారాష్ట్ర	4.34
రాజస్థాన్	4.04
హిమాచల్‌ప్రదేశ్	3.27
దిల్లీ	2.09
నాగాలాండ్	1.96
అసోం	1.85
బిహార్	1.71
మణిపూర్	1.56
ఉత్తరాఖండ్	1.15
కేరళ	1.07
ఉత్తర్‌ప్రదేశ్	0.95
ఝార్ఖండ్	0.72
హరియాణా	0.61

క్రిమినల్ కేసులున్నవారు

ముఖ్యమంత్రి	రాష్ట్రం	మొత్తం కేసులు	తీవ్రక్రిమినల్ కేసులు
దేవేంద్ర ఫడణవిస్	మహారాష్ట్ర	22	3
పినరయి విజయన్	కేరళ	11	1
అరవింద్ కేజ్రీవాల్	దిల్లీ	10	4
రఘుబర్‌దాస్	ఝార్ఖండ్	8	1
అమరిందర్‌సింగ్	పంజాబ్	4	3
యోగి ఆదిత్యనాథ్	ఉత్తరప్రదేశ్	4	1
చంద్రబాబునాయుడు	ఆంధ్రప్రదేశ్	3	0
కేసీఆర్	తెలంగాణ	2	1
నారాయణస్వామి	పుదుచ్చేరి	2	0
మెహబూబా ముఫ్తీ	జమ్మూకశ్మీర్	1	0
నితీశ్ కుమార్	బిహార్	1	1

ముఖ్యమంత్రుల్లో ఎంతమంది ఏమేరకు చదువుకున్నారు?

12వ తరగతి ఉత్తీర్ణులయిన వారు	3	స్నాతకోత్తర విద్య	5
పట్టభద్రులు	12	డాక్టరేట్	1
వృత్తివిద్య పట్టభద్రులు	10	మొత్తం	31

ఆరు జిల్లాల రైతు సమితులు ఖరారు

ఈనాడు, హైదరాబాద్: ఆరు జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితుల అధ్యక్షులు, సభ్యుల పేర్లను వ్యవసాయశాఖ సోమవారం ఖరారు చేసింది. ఉత్తర్వులు జారీ అయ్యాకే పేర్లు వెల్లడించనున్నారు. మిగతా 24 జిల్లాల సమితులకు మంత్రులింకా ఆమోదం తెలపాల్సి ఉంది. ప్రతీ జిల్లా సమితికి దాని పరిధిలోని మండల సమితుల సభ్యుల నుంచి పేర్లను ఎంపిక చేయాల్సి ఉంది. జిల్లా సమితిలో 24 మంది సభ్యులుంటారు. వీరిలో ఒకరిని అధ్యక్షుడిగా నియమిస్తారు. ఈ జాబితాల్లో స్థానం సంపాదించడానికి పెద్దఎత్తున ఎమ్మెల్యేలు, మంత్రుల ఒత్తిళ్లు, పైరవీలు సాగుతున్నందునే ఆలస్యమవుతోంది. హైదరాబాద్ మినహా మిగిలిన 30 జిల్లాలకు సమితులను నియమిస్తూ వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వారంలోగా ఉత్తర్వులు జారీచేయనుందని సమాచారం. తరవాత రాష్ట్రస్థాయి సమితిని 42 మందితో నియమిస్తారు. దీని కార్యాలయాన్ని బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనరేటులో ఏర్పాటు చేయనున్నారు. ఈ సమితుల ఆధ్వర్యంలోనే ఏప్రిల్ ఒకటి నుంచి పెట్టుబడి సాయం పథకం కింద ఎకరానికి రూ.4 వేల చెక్కులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఉపాధికి కేంద్ర పథకాలు చాలానే ఉన్నాయి

- రాష్ట్రాలు వాటిని విరివిగా ఉపయోగించుకోవాలి
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్

ఈనాడు, హైదరాబాద్: గ్రామీణులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కేంద్ర పథకాలు అందుబాటులో ఉన్నాయని.. రాష్ట్రాలు వాటిని విరివిగా ఉపయోగించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి రాంకృపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఉపాధి హామీ, ముద్ర యోజన తదితర పథకాలను ఆయన ఉదహరించారు. రాజేందర్‌నగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక సాయం ద్వారా గ్రామీణాభివృద్ధి' అనే అంశంపై వివిధ దేశాల వారికి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఎన్ఐఆర్‌డీ డైరక్టర్ జనరల్ డబ్ల్యు.ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ (సిపార్ట్)లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాంకృపాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్ర పథకాల గురించి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు. రాష్ట్రానికి కేంద్రం మరింత సాయం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రానికి ఉపాధి హామీ పథకంలోని మెటీరియల్ వాటా నిధులు రూ.750 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు.



కేంద్ర సహాయ మంత్రి రాంకృపాల్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉపాధి పనిదినాలను 16కోట్లకు పెంచాలని, రూర్బన్ పథకం కింద కనీసం ఒక్కో జిల్లాకు ఒక్కో క్లస్టర్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సీఈవో పౌసమి బసు, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

కావాలనే రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్: ఛాయ్ అమ్ముకునే వ్యక్తి కుమారుడు దేశ ప్రధాని అయినపుడు... పకోడీలు అమ్ముకునే వ్యక్తి రేపు మరో అంబానీ కావచ్చని కేంద్ర సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ గ్రామీణ పేదరిక నిర్మూలనను ఎన్నడూ పట్టించుకోలేదని, ఇప్పుడు కావాలనే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. 2022 నాటికి మోదీ నేతృత్వంలో నూతన భారత్ ఆవిష్కృతమవుతుందని, కుటుంబాల్లో పేదరికం దూరమైన సంతోషం కనిపిస్తుందని వెల్లడించారు. సోమవారమిక్కడ భాజపా కార్యాలయంలో తెలంగాణ భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం నుంచి భారీగా నిధులు ఇస్తున్నామని, ఎలాంటి వివక్ష లేదని కేంద్ర మంత్రి చెప్పారు.

భక్తవశంకరా పాహిమాం

వేలాదిమంది రాకతో శ్రీశైలం కిటకిట

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల ఏడోరోజు సోమవారం భక్తవశంకరా పాహిమాం అంటూ వేలాదిగా తరలివచ్చిన భక్తజనం నడుమ శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు గజ వాహనంపై విహరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ వేళల్లో మార్పులు చేశారు. ఉదయం 1 గంట తర్వాత ఆలయ ద్వారాలు తెరుస్తారు. 1.30 గంటలకు మంగళవాయిద్యాలు, 2.30 గంటలకు సుప్రభాతసేవ, విశ్వరూప దర్శనం, గోపూజ, కాలపూజ, 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మహామంగళహారతి సేవలు జరుగుతాయి. తెల్లవారు జామున 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు. మధ్యలో సేవల కోసం విరామాలు తప్పించి..రాత్రి 2 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు.



మాడవీధుల్లో భక్తజనం

గవర్నర్, సీఎంల మహాశివరాత్రి శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్‌లు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, శివాలయాల్లో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ కవితలు సైతం ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యుత్తు దీపాలతో అలంకరించిన వేములవాడ రాజన్న ఆలయం

దేశంలోనే ప్రసిద్ధ క్షేత్రంగా వేములవాడ

శివార్చన ప్రారంభోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

వేములవాడ, న్యూస్‌టుడే: దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చేరుకున్న ఆయన సోమవారం గుడిచెరువులో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివార్చన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రూ.400 కోట్లతో నూతన ప్రాకారాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇరుకుగా ఉన్న ఆలయాన్ని విస్తరించేందుకు గుడిచెరువులో స్థలాన్ని తీసుకుని ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, జిల్లా పాలనాధికారి డి.కృష్ణభాస్కర్, ఎస్పీ విశ్వజిత్ కాంపాటి, సాంస్కృతికశాఖ కార్యదర్శి హరికృష్ణ, ఆలయ ఈవో రాజేశ్వర్, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమ పాల్గొన్నారు.

ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు: శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 1,572 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. జాతరకు 3లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టారు. నిశీపూజల అనంతరం రాత్రిపూట స్వామి దర్శనానికి అనుమతించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు స్వామికి రాష్ట్రప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక యాత్రలు

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక పర్యాటక యాత్రలను ఏర్పాటు చేసింది. సోమవారం ప్రారంభం కాగా ఈ నెల 15 వరకు ఈ యాత్రలుంటాయని పేర్కొంది. శివాలయాల్లో దర్శనం, మార్గమధ్యలోని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన వసతి గృహాల్లో స్వల్పవిశ్రాంతికి వెసులుబాటు కల్పించింది.

వివరాలు ఇలా...

- హైదరాబాద్ - శ్రీశైలం యాత్ర ఉదయం 6.30 గంటలకు నగరం నుంచి ప్రారంభమై.. తిరిగి రాత్రి 10 గంటలకు చేరుకుంటుంది. ఇందుకు పెద్దలకు రూ. 1700. చిన్నారులకు రూ. 1400 చెల్లించాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ - వేములవాడ యాత్ర ఉదయం 7.00 గంటలకు నగరం నుంచి ప్రారంభమై.. తిరిగి రాత్రి 10 గంటలకు చేరుకుంటుంది. పెద్దలకు రూ. 700. చిన్నారులకు రూ. 600.
- హైదరాబాద్ - రామప్ప యాత్ర ఉదయం 7.30 గంటలకు నగరం నుంచి ప్రారంభమై.. తిరిగి రాత్రి 8.30 గంటలకు చేరుకుంటుంది. పెద్దలకు రూ. 1000. చిన్నారులకు రూ. 800.
- హైదరాబాద్ - కాళేశ్వరం యాత్ర ఉదయం 6.30 గంటలకు నగరం నుంచి ప్రారంభమై.. తిరిగి రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుంది. పెద్దలకు రూ. 1000. చిన్నారులకు రూ. 800 చెల్లించాలి.

పూర్తి వివరాలకు బషీర్‌బాగ్ కేంద్ర రిజర్వేషన్ కార్యాలయంలోని 9848540371, 040-29801039, 29801040 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

పార్టీలకు నేరగాళ్ల నేతృత్వమా!

- సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్య

దిల్లీ: దోషిగా నిర్ధరణ జరిగిన వ్యక్తి రాజకీయ పక్షానికి నేతృత్వం వహించటం, పార్టీ తరపున అభ్యర్థులను ఎంపికచేయటం ఎన్నికల పవిత్రతకు భంగం కలిగించటమేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అభిప్రాయపడ్డారు. నేరస్థులుగా తేలిన వ్యక్తులను కనీసంవారి అనర్హతాకాలం పూర్తయ్యేవరకైనా రాజకీయ పార్టీలను స్థాపించకుండా, పార్టీ పదవులు చేపట్టకుండా నిరోధించాలంటూ భాజపా నాయకుడు అశ్వినీ కె ఉపాధ్యాయ్ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తితో పాటు జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ సభ్యులుగా ఉన్నారు. ''నిబంధనల ప్రకారం.. దోషిగా తేలిన వ్యక్తి ఎన్నికల్లో పాల్గొనకూడదు. అయితే, అదే వ్యక్తి పార్టీ పదవిలో ఉంటూ తన ప్రతినిధులను పోటీకి దించుతాడు. అంటే వ్యక్తిగా తాను చేయకూడని పనిని సమష్టిగా తన ప్రతినిధులతో చేయించగలడు! ఇది పవిత్రమైన ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అంశం' 'అని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై ప్రభుత్వ స్పందనను తెలియజేయటానికి రెండు వారాల గడువివ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్ కోరగా ధర్మాసనం అంగీకరించింది. ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలను నమోదు చేసుకునే అధికారాన్ని కల్పించే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29ఎ రాజ్యాంగ చెల్లుబాటుపై తమ స్పందనలను తెలియజేయాలని గత డిసెంబరు 1న కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలను నమోదు చేసుకునే అధికారమే కాదు...వాటిని రద్దు చేసే అధికారం కూడా కల్పించాలని పిటిషనర్ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. రాజకీయ పక్షాలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించేలా, నేరగాళ్లకు ఎన్నికల ప్రక్రియలో చోటుదక్కని విధంగా మార్గదర్శకాలను రూపొందించాలని ఈసీని ఆదేశించాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు.

'ప్రభుత్వ సౌకర్యాలు, ప్రయోజనాలు నిలిపివేయాలి..'

ఏ దంపతులకైనా ఇద్దరికి మించి పిల్లలు ఉండకూడదని, ఈ నిబంధన పాటించకపోతే ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు, ప్రయోజనాలు అందజేయకూడదని సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వానికి సూచించాలని కోరుతూ అనుపం బాజ్‌పేయి అనే సామాజిక కార్యకర్త అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేటి తరాల కరుణ, ఉదాసీనత కారణంగా భవిష్యత్తు తరాలు జనాభా విస్ఫోటం కారణంగా ప్రమాదకరమైన, దారుణమైన దుష్పరిణామాలు అనుభవించాల్సి వస్తుందని వ్యాజ్యదారుడు ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ఇదే రేటులో జనాభా పెరుగుతూ పోతే భవిష్యత్తులో భూమి, నీరు, గాలి కాలుష్యంతో పర్యావరణం పాడైపోతుందన్నారు.

రష్యా విమానం డేటా రికార్డర్‌లు లభ్యం

మాస్కో: కుప్పకూలిన రష్యా విమానానికి సంబంధించి రెండు 'డేటా రికార్డర్''లనూ అత్యవసర సేవల సిబ్బంది సోమవారం కనుగొన్నారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా బయటకు తెలియరాలేదు. 71 మందితో ఆర్స్క్‌కు బయలుదేరిన ఈ విమానం(ఆంటనోవ్ ఏఎన్-148 శ్రేణి) ఆదివారం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదులతో ఈ ఘటనకు ఎలాంటి సంబంధమూలేదని అధికారులు స్పష్టంచేశారు. పేలుడు ధాటికి విమానం శిథిలాలు 74 హెక్టార్ల మంచు ప్రాంతంలో పడినట్లు తెలిపారు. దీంతో మృతుల అవశేషాలను కనుగొనేందుకు మరింత సమయం పడుతుందని వివరించారు.



మాస్కో సమీపంలో విమానం కూలిన ప్రాంతంలో సోమవారం అన్వేషణ చేపట్టిన అత్యవసర సేవల బృందం

‘గోనె సంచుల్లో మృతదేహం’ కేసు కొలిక్కి

- అంతమొందించింది బిహారీ కుటుంబం
- కొండాపూర్ సిద్ధిఖీనగర్‌లోనే ఘాతుకం
- పోలీసులు అదుపులో ముగ్గురు నిందితులు

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, మాదాపూర్: నగరంలో కలకలం సృష్టించిన గోనె సంచుల్లో మృతదేహం కేసును సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ ఘాతుకం చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ సమీపాన.. సీతారాం కళ్లజోళ్ల దుకాణం వద్ద గతనెల 29న రెండు గోనెసంచి మూటలు లభ్యమయ్యాయి. కోళ్ల వ్యర్థాలుగా భావించి సీతారాం వాటిని కొద్దిదూరం తీసుకెళ్లి పడేశాడు. మరుసటి రోజు దుర్వాసన రావడంతో, పోలీసులు వాటిని విప్పి చూడగా... ఎనిమిది ముక్కలుగా కోసిన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. 8 నెలల గర్భిణి


నిందితుడు అమర్‌కాంత్‌ఝా

అయిన ఆమెను ముక్కలుగా కోయడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకొంది. సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలు గాలింపునుముమ్మరం చేశారు. సమాచారం ఇచ్చినవారికి రూ.లక్ష పారితోషికం కూడా ప్రకటించారు.

ద్విచక్ర వాహనంతో కీలక ఆధారం

సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించగా.. 29వ తేదీ రాత్రి యమహా ద్విచక్రవాహనమొకటి ఘటనాస్థలం వద్ద 8 సెకన్లపాటు ఆగినట్లు కనిపించింది. హైడ్రెన్ కెమెరాతో విశ్లేషించి, యమహాపై మూటల్ని గుర్తించారు. ఆ వాహనం గచ్చిబౌలిలోని సిద్ధిఖినగర్ నుంచే వచ్చి, తిరిగి అక్కడికే వెళ్లినట్లు నిర్ధారించారు. వాహనం నంబరు ఆధారంగా దర్యాప్తు చేయగా... విజయ్ అనే వ్యక్తి పేరిట ఉన్నట్లు తేలింది. అయితే ఆయన 2014 లోనే సదరు వాహనాన్ని విక్రయించగా... పలువురి చేతులు మారి పబ్ మేనేజర్ బర్ధన్ వద్దకు వచ్చినట్లు గుర్తించారు. అమర్‌కాంత్‌ఝా అనే యువకుడు గత నెల 22న బర్ధన్ నుంచి యమహాను తీసుకున్నట్లు దర్యాప్తులో తేలడంతో పోలీసులకు కీలక ఆధారం లభించింది. బిహార్‌లోని బాంకా జిల్లా, ఓదహారా ప్రాంతంలోని రాజౌన్‌థాణాకు చెందిన ఝా కుటుంబం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చింది. అతని తండ్రి అనిల్‌ఝా(55), తల్లి మమతఝా(38) ఏడాది క్రితం సిద్ధిఖీనగర్‌లో నివాసముంటూ ఛాట్‌బండార్ నిర్వహిస్తున్నారు. అమర్‌కాంత్ మాత్రం గచ్చిబౌలిలోని ది లాల్ స్ట్రీట్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్ వీరి కుటుంబానికి జతకలిశాడు. ఆ ఇంట్లోనే ఉంటూ గప్‌చుప్ బండి నడుపుతున్నాడు.

ఘర్షణలో మృతి..?

మృతురాలు, వికాస్‌ల మధ్య సంబంధాలపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత లేదు. ఆమెను పెళ్లి చేసుకున్నాడో లేదో తెలియరాలేదు. ఆమెను వదిలేసి వికాస్ హైదరాబాద్‌కు వచ్చేశాడు. ఎనిమిది నెలల గర్భంతో ఉన్న ఆమె అతడిని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చింది. వికాస్ ఆమెనూ అమర్‌కాంత్‌ఝా ఇంట్లోనే ఉంచాడు. వికాస్‌తో మమత సన్నిహితంగా మెలుగుతుండటంతో... ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మమత చేసిన దాడిలో ఆ మహిళ మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని బయట పారేసేందుకు వీలుగా ఉండేందుకే ముక్కలుగా నరికినట్లు నిందితులు చెబుతున్నట్లు సమాచారం. స్టోన్‌కట్టర్‌తో మృతదేహాన్ని కోసి గోనెసంచుల్లో తరలించారు. తామే ఆమెను ముక్కలుగా నరికినట్లు మమత, అనిల్ చెబుతుండగా... అమర్‌కాంతే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గోనెసంచుల విషయం బహిర్గతం కావడంతో ఈనెల 3న అతడు బిహార్ పారిపోయాడు. సైబరాబాద్ పోలీసులు అక్కడికి వెళ్లి, అమర్‌కాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సోమవారం రాత్రి నిందితుల్ని సిద్ధిఖీనగర్‌లోని ఇంటితో పాటు ఘటనాస్థలానికీ తీసుకెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఆరేళ్ల బాలుడిని పోలీసులు గుర్తించారు. మృతురాలితోపాటు వికాస్‌ను ఆ బాలుడు తన తల్లిదండ్రులుగా చెబుతున్నట్లు సమాచారం.


అమెరికాలోని షికాగోలో రికార్డు స్థాయిలో హిమపాతం విజృంభిస్తోంది. నివాసాలు, వాహనాలు, రహదారులను మంచు కప్పేస్తోంది


రెండు రోజుల క్రితం మినీట్యాంకుబండ్ ప్రారంభోత్సవం సందర్భంగా పరుగు పందెం నిర్వహించినపుడు చక్కగా ఉన్న రహదారి

48 గంటల్లోనే ‘తారు’మారు!

ఖమ్మం నగరవాసుల ఆహ్లాదం కోసం స్థానిక లకారం చెరువుపై మినీట్యాంకుబండ్ నిర్మాణాన్ని చేపట్టారు. సంబంధిత పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం రూ.13.50 కోట్లు విడుదల చేసింది. లకారం మినీట్యాంకుబండ్‌ను ఖమ్మం-వైరా ప్రధాన రహదారితో అనుసంధానం, సుందరీకరణ పనుల నిమిత్తం మరో రూ. 4 కోట్లు కేటాయించింది. రెండు రోజుల క్రితమే ఈ మినీట్యాంకు బండ్‌ను మంత్రి హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అమాత్యుల పర్యటన ముగిసి 48 గంటలూ కూడా పూర్తిగాకముందే ఈ రహదారి ఇలా అధ్వానంగా మారింది. ప్రస్తుతం రోడ్డుపై చాలా చోట్ల తారు లేచిపోవడంతో వాహనాల ప్రయాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. గుత్తేదారు నాసిరకం పనులకు తోడు అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

–ఈనాడు, ఖమ్మం


తారు లేచిపోయి ప్రస్తుతం అధ్వానంగా మారిన రోడు

అటవీ వృద్ధిలో తెలంగాణకు 5వ స్థానం

- అగ్రభాగాన ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: అటవీవిస్తీర్ణం వృద్ధిలో తెలుగురాష్ట్రాలు దేశంలో తొలి అయిదుస్థానాల్లో నిలిచాయి. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్ విడుదల చేసిన 2017 నివేదిక ప్రకారం అత్యధిక అటవీ ప్రాంతం వృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో, తెలంగాణ ఐదో స్థానంలో నిలిచాయి. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం ఏపీలో గత రెండేళ్లలో 2,141 చదరపు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం పెరిగింది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (1,101 చ.కిమీ), కేరళ (1,043చ.కిమీ), ఒడిశా (885 చ.కిమీ), తెలంగాణ (565 చ.కిమీ) నిలిచాయి.

తెలంగాణలో వృద్ధి ఇలా: తెలంగాణ వైశాల్యం 1,12,077 చ.కిమీ. గత ఏడాది అటవీ విస్తీర్ణం 19,854 చ.కిమీ. తాజాగా నమోదైన అటవీ విస్తీర్ణం 20,419 చ.కిమీ. రాష్ట్ర విస్తీర్ణంలో ఇది 18.22%. ఇందులో దట్టమైన అడవులు 1,596 చ.కిమీ. మధ్యస్థాయి అడవులు 8,738 చ.కిమీ. ఓపెన్‌ఫారెస్ట్ 10,085 చ.కిమీ. దట్టమైన అడవుల్లో పెరిగిన విస్తీర్ణం 1,131 చ.కిమీ. ఓపెన్‌ఫారెస్ట్‌లో పెరిగిన విస్తీర్ణం 2,036 చ.కిమీ. మధ్యస్థాయి అడవులు 2,602 చ.కిమీమేర తగ్గాయి.

‘సాహితీ’ శిఖరంపై అక్షర నగధీరుడు!

- కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఆచార్య చంద్రశేఖర కంబార

బెంగళూరు, న్యూస్‌టుడే: కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడిగా కన్నడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య చంద్రశేఖర కంబార ఎన్నికయ్యారు. భారతీయ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ.. ఇప్పటికే జ్ఞానపీఠ పురస్కారాన్ని స్వీకరించిన ఈయన.. విఖ్యాత నాటకరంగ కళాకారుడు/ పరిశోధకుడు, కవి, నవలాకారుడు కూడా. “ఇంత గొప్ప పదవి సామాన్యుడినైన నన్ను వరించటమే అపూర్వం. ఈ మధుర క్షణాలను మరువలేను. నెహ్రూ వంటి మహామహులు అధ్యక్షులుగా కొనసాగిన సంస్థ పగ్గాలు బాధ్యతతో నిర్వర్తించడమే నా ముందున్న కర్తవ్యం’ అంటూ స్పందించారు ఆచార్య కంబార. ఒడిస్సీ రచయిత ప్రతిభా రేను అధిగమించి, అత్యధిక ఓట్లతో అకాడమీ అధ్యక్ష పీఠం అందుకున్న నేపథ్యంలో దిల్లీ నుంచి కంబార ఫోనులో ‘న్యూస్‌టుడే’తో మాట్లాడారు. భారతీయ సాహితీలోకానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు నిరంతరం కృషిచేస్తానని ప్రకటించారు. వినాయక్ కృష్ణ గొకాక్(1983), యు.ఆర్.అనంతస్వామి(1993)ల తర్వాత



ఈ విశిష్ట గౌరవం అందుకున్న మూడో కన్నడ రచయిత కంబారనే కావటం గమనార్హం.

- ఆచార్య కంబార 1937లో బెళగావి జిల్లా ఘొడిగెరె అనే కుగ్రామంలో బసవణ్ణప్ప కంబార, చిన్నమ్మ దంపతులకు జన్మించారు. బెళగావి లింగరాజ కళాశాలలో స్నాతకోత్తర విద్య, ఆపై పరిశోధక పట్టా అందుకున్నారు.
- కంబార రచనల్లో ప్రముఖమైనవి.. ముళుగు, హేళతెనె కేళ, తకరారినవరు (కేంద్రసాహిత్య అకాడమి పురస్కారం పొందింది), సావిరారు నెరళు(కుమార ఆశన్ ప్రశస్తి), బెళ్లిమీను తదితరాలు. 25 నాటకాలు, 5నవలలు, 17నాటక పరిశోధనా గ్రంథాలు రాశారీయన. కంబారను వరించిన పురస్కారాలకు లెక్కేలేదు. కేంద్రసాహిత్య అకాడమి, జ్ఞానపీఠ, దేవరాజ్ అరస్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాహిత్య పురస్కారం, కర్ణాటక ప్రభుత్వ మాస్తి పురస్కారం, రాజ్యోత్సవ పురస్కారం, మధ్యప్రదేశ్ ప్రభుత్వ కాళిదాస సమ్మాన్, పద్మశ్రీ, తదితరాలు ఎన్నదగినవి.

శ్రీనగర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడికి ముష్కరుల యత్నం విఫలం

కాల్పుల్లో జవాన్ మృత్యువాత

శ్రీనగర్: భారీ ఆయుధాలతో శ్రీనగర్‌లోని కేంద్ర రిజర్వు పోలీసు దళం(సీఆర్‌పీఎఫ్) శిబిరంపై దాడిచేసేందుకు సోమవారం ఉగ్రవాదులు ప్రయత్నించారు. ఈ పన్నాగాన్ని భద్రతా బలగాలు సమర్థంగా అడ్డుకోగలిగాయి. అయితే అనంతరం చోటుచేసుకున్న కాల్పుల్లో ఓ జవాన్ మృత్యువాతపడ్డారు. లష్కరే తోయిబా ఉగ్రవాది నవీద్ జట్ అలియాస్ అబూ హంజాలాను విడిపించుకుని వెళ్లిన ఎస్ఎంహెచ్ఎస్ ఆసుపత్రికి సమీపంలోని సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ముష్కరులు దాడికి యత్నించినట్లు సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. ‘ఉదయం 4.30 గంటల సమయంలో బ్యాగులు ధరించి ఆయుధాలు చేతపట్టుకున్న ఇద్దరు అనుమానాస్పదంగా శిబిరం పరిసరాల్లో తిరిగారు. అక్కడే గస్తీకాస్తున్న ఓ జవాన్ వారిని గుర్తించారు. దీంతో ఆ ఇద్దరు ముష్కరులూ పరారయ్యారు. నగరం నడిబొడ్డునున్న కరణ్ నగర్‌లోని ఓ ఇంట్లోకి వారు వెళ్లిపోయారు. వారిని బయటకు రప్పించేందుకు కాల్పులు జరుపుతున్నాం. ముష్కరుల కాల్పుల్లో ఓ జవాన్ గాయపడ్డారు. ఆసుపత్రిలో ఆయన మరణించారు. చివరి సమాచారం అందేవరకూ కాల్పులు జరుగుతూనే ఉన్నాయి’అని సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. మరోవైపు కాల్పులు కొనసాగుతున్న సమయంలో కొందరు యువకులు రాళ్లు రువ్వేందుకూ ప్రయత్నించారని, వారితోనూ బలగాలు ఘర్షణ పడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మూడు రోజుల్లోనే రెండు ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతా పరిస్థితులను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమీక్షించారు. దాదాపు గంటసేపు ఆయన అధికారులతో మాట్లాడారు.


ముష్కరుల దాడిలో గాయపడ్డ మహిళను ఓదార్చుతున్న రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

దుస్సాహసానికి పాక్ మూల్యం చెల్లిస్తుంది

నిర్మలా సీతారామన్

జమ్ము: సుంజ్వానా సైనిక శిబిరంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు కొమ్ముకాస్తున్న పాకిస్థాన్ మూల్యం చెల్లించక తప్పదని కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఉగ్రదాడిలో గాయపడి ఇక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆమె పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎప్పుడు, ఎలా అనేది ఇప్పుడే చెప్పలేనని, ఈ దుస్సాహసానికి పాకిస్థాన్ మూల్యం చెల్లిస్తుందని పునరుద్ఘాటించారు. నియంత్రణ రేఖ వెంబడి ఎవరైతే ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్నారో, వారే ఈ దాడికి సూత్రధారులని జైషే మొహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. వారంతా పాకిస్థాన్‌లో నిశ్చింతగా ఉన్నారన్నారు. ఉగ్రదాడికి సంబంధించిన సాక్ష్యాధారాలు పాకిస్థాన్‌కు అందజేస్తామన్నారు. ముంబయిలో దాడికి పాల్పడిన వారు సైతం దాయాదిదేశంలో సంతోషంగా, స్వేచ్ఛగా తిరుగుతున్నారన్నారు. సుంజ్వానాలో దాడి జరిగిన తీరును బట్టి ఉగ్రవాదులకు స్థానికుల సహకారం ఉందని అర్థమైందన్నారు.

భగవత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

షాహ్‌పూర్(కర్ణ): “సైన్యం కంటే వేగవంతంగా మిలిటరీ సిబ్బందిని సంఘ్ పరివార్ సన్నద్ధం చేయగలద”ంటూ ఆరెస్సెస్ సారధి మోహన్ భగవత్ ఆదివారం చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. దేశానికి భగవత్ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షాలు సోమవారం డిమాండ్ చేశాయి. అసలు ప్రధాని కూడా ఈ అంశంపై స్పందించాలనీ... భారత సరిహద్దులను ఓ ప్రైవేటు తీవ్రవాద సంస్థ కాపలాకాయడాన్ని ఆయన సమర్థిస్తారా? లేదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలనీ విపక్షాలు ప్రశ్నించాయి. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో భగవత్ చేసిన ఈ ఉద్ఘాటనను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం ఖండించారు. బిహార్‌లో ఆరెస్సెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తూ భగవత్ చేసిన ఈ వ్యాఖ్యలు పూర్తి పొరబాటనీ... వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలనీ రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. మోహన్ భగవత్ మాటలను కొందరు వక్రీకరించారంటూ ఆరెస్సెస్ వివరణ ఇచ్చింది.

త్రిపురలోనూ కమల వికాసమే: అమిత్ షా

అగర్తల: త్రిపురలోనూ అధికారంలోకి వచ్చేది భాజపాయేనని ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక నియోజకవర్గాల్లో పర్యటించిన అనంతరం వాతావరణం, ప్రచారం తమకు అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఈమేరకు భాజపా పాలించే 20వ రాష్ట్రంగా త్రిపుర ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపా ఆదివారం విడుదల చేసిన ఎన్నికల వాగ్దాన ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టంచేశారు. ప్రధాని మోదీకి ఉన్న ప్రజాదరణ, భాజపా సంక్షేమ పథకాలు పార్టీకి అధికారాన్ని కట్టబెడతాయంటూ.. మణిపుర్, అసోంలను ఉదహరించారు.

నాలుగు మీటర్లు తక్కువే

ఎవరెస్టు ఎత్తుపై నేపాల్ లెక్కతో విభేదిస్తున్న చైనా

బీజింగ్: బీజింగ్: ఎవరెస్టు శిఖరం ఎత్తుపై నేపాల్ లెక్కతో చైనా ఇప్పటికీ విభేదిస్తోంది. ప్రపంచంలోనే ఎత్తైన ఈ శిఖరం ఎత్తు చైనా లెక్క ప్రకారం నేపాల్ లెక్కకన్నా నాలుగు మీటర్లు తక్కువగా ఉందని మీడియా కథనమొకటి సోమవారం వెల్లడించింది. నేపాల్ లెక్కతో చైనా ఏకీభవిస్తుందని కథనాలు వచ్చిన నేపథ్యంలో చైనా పాత వైఖరికే కట్టుబడి ఉన్నట్లు తాజాగా వెల్లడయింది. ఎవరెస్టు ఎత్తు సముద్రమట్టం నుంచి 8,848 మీటర్లని నేపాల్ చెబుతుండగా చైనా మాత్రం 8,844.43 మీటర్లని స్పష్టం చేస్తోంది. రెండు దేశాల మధ్య సరిహద్దుల నిర్ధారణలో ఎవరెస్టు పర్వతపు శిఖరం ముఖ్యభూమిక పోషించింది. ఈ పర్వతం మొత్తం తమ భూభాగంలోకే వస్తుందని తొలుత చైనా వాదించింది. అయితే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ జోక్యంతో 1961లో రెండు దేశాల మధ్య పరిష్కారం కుదిరింది. సరిహద్దు రేఖ ఎవరెస్టు శిఖరాగ్రం గుండా వెళ్లాలని ఆయన చేసిన సూచనకు నేపాల్ అంగీకరించింది. అంతర్జాతీయంగా పలువురు పర్వతారోహకులు టిబెట్ వైపు నుంచే ఈ శిఖరం ఎక్కుతున్నారు. నేపాల్‌తో పోలిస్తే చైనా వైపే సౌకర్యాలు మెరుగుగా ఉండడమే ఇందుకు కారణం.

కోర్కె తీర్చలేదని నిప్పంటించిన బాలుడు

ఆస్పత్రిలో చావుబతుకుల్లో 13ఏళ్ల బాలిక

రాజ్‌గఢ్: తనకు ఎదురుతిరిగిందన్న కోపంతో ఆ కుర్రాడు రాక్షసుడిగా మారిపోయాడు. ఒంటరిగా ఉన్న ఓ పదమూడేళ్ల బాలికపై కిరోసిన్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. తీవ్రగాయాలతో ఆమె ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో జరిగింది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లటంతో ఒంటరిగా ఉన్న బాలికను చూసిన అదే గ్రామానికి చెందిన బాలుడు అత్యాచార యత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించటంతో ఆగ్రహించిన ఆ కుర్రాడు ఇంట్లో ఉన్న కిరోసిన్‌ను బాలికపై కుమ్మరించి నిప్పంటించాడు. పోలీసుల సాయంతో స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. పరారైన బాలుడిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

దిల్లీ బస్సులో లైంగిక దుష్ప్రవర్తన

- ఫిర్యాదు స్వీకరణకు సతాయించిన పోలీసులు
- సామాజిక మాధ్యమంలో వీడియో దృశ్యాలుంచిన బాధితురాలు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో మహిళల పట్ల ఆకతాయిల వేధింపులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తమకు ఎదురైన ఇబ్బందులపై ఫిర్యాదులు చేయబోతే పోలీసుల ప్రతిస్పందన సరిగా ఉండటంలేదని దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ విద్యార్థిని వాపోయారు. బస్సులో ఓ ప్రయాణికుడి దుష్ప్రవర్తనను ఆమె సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఈ నెల 7న బాధితురాలు వసంత్ విహార్ ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తుండగా ఆమె పక్కనే కూర్చున్న ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేసినా తోటి ప్రయాణికులు స్పందించకపోవటంతో ఆ వ్యక్తి మరింతగా రెచ్చిపోయాడు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన బాధితురాలు మూడు రోజుల తర్వాత దిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేయబోగా కేసు నమోదుకువారు సుమారు ఆరు గంటలపాటు నిరీక్షించేలా చేశారని, ఘటన జరిగిన రోజే ఎందుకు రాలేదంటూ ప్రశ్నలు సంధించారని ఆమె వాపోయారు. వీడియోలో ఉన్న నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదని తెలిపారు.

ఐరాస నిషేధిత ఉగ్రసంస్థలపై చర్యలే లక్ష్యంగా పాక్ ఆర్డినెన్స్

ఇస్లామాబాద్: ఐరాస భద్రతా మండలి నిషేధం విధించిన ఉగ్రసంస్థలు, ముష్కరులపై చర్యలు తీసుకొనేందుకు సిద్ధంచేసిన అత్యవసరాదేశం (ఆర్డినెన్స్)పై పాకిస్థాన్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ సంతకం చేశారు. ఉగ్రవాద నిరోధక చట్టం (ఏటీఏ)లో కొన్ని నిబంధనలను సవరిస్తూ ఈ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. దీంతో ముష్కరుల కార్యాలయాలు ఆధీనంలోకి తీసుకోవడం, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం లాంటి చర్యలకు వీలుకలుగుతుంది. ఈ వార్తలను జాతీయ ఉగ్రవాద వ్యతిరేక పోరాట సంస్థ (ఎన్‌ఏసీటీఏ) ప్రతినిధులూ ధ్రువీకరించారు.

రాజస్థాన్‌లో రైతులకు రుణమాఫీ

జైపుర్: రాజస్థాన్‌లోని భాజపా ప్రభుత్వం రైతుల రుణాలను రద్దు చేసింది. భూమిశిస్తు రద్దుతో పాటు వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు భారీ ప్రోత్సాహకాలనూ వెల్లడించింది. శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ‘రైతు రుణ ఉపశమన కమిషన్’ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజే సోమవారం శాసనసభలో ప్రకటించారు.

ప్రకటనలోని ముఖ్యాంశాలు

- చిన్న,సన్నకారు రైతులకు రూ.50వేలవరకు రుణాలు రద్దు
- సహకార బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నవారికే వర్తింపు
- దీనివల్ల రాష్ట్ర ఖజానాపై పడనున్నభారం రూ.8వేల కోట్లు
- భూమి శిస్తు రద్దు. దీనివల్ల 40 లక్షల నుంచి 50 లక్షల మంది వరకూ రైతులకు లబ్ధి చేకూరనుంది.
- ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ‘రైతు రుణ ఉపశమన కమిషన్’ శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తుంది. రుణమాఫీకి తాము ఎలా అర్హులమో వ్యవసాయదారులు కమిషన్ ముందు నిరూపించుకోవాల్సి ఉంటుంది.
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, సేవలకు ప్రోత్సాహంగా వాటి నిర్వాహకులకు ఏడాదికి గరిష్ఠంగా రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకూ వడ్డీ రాయితీ.
- రాజస్థాన్‌కు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లోని 40ఏళ్ల లోపు వయస్సు ఉన్న మహిళలు, దివ్యాంగులు, ఎస్సీఎస్టీలకు వడ్డీ రాయితీ 5శాతం నుంచి 6 శాతానికి పెంపు.
- రాష్ట్రంలో బాగా వెనుకబడిన ప్రాంతాల్లో తొలిసారిగా రూ.50 కోట్లకు పైగా పెట్టుబడిపెట్టే పారిశ్రామికవేత్తలకు గరిష్ఠంగా రూ.5కోట్లవరకూ మౌలిక వసతుల రాయితీ. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్; బయోటెక్నాలజీ, ఐటీ రంగాలలో పెట్టుబడులకు ఈ రాయితీ వర్తిస్తుంది.
- రైతులకు రెండు లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు.
- కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా స్వల్పకాలిక రుణాలు పొందిన రైతులకు వడ్డీ రాయితీ కోసం రూ.384 కోట్ల కేటాయింపు.
- రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలుచేసిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు రూ.350 కోట్లతో 5లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణం.
- జైపుర్‌లో ఒంటె పాల ప్రాసెసింగ్, మార్కెటింగ్ కేంద్రం నిర్మాణానికి రూ.5కోట్ల కేటాయింపు.
- ముఖ్యమంత్రి వసుంధర రాజే ప్రకటించిన రుణ మాఫీ పథకంగా అరకొరగా ఉందని, రైతుల అప్పులను పూర్తిగా రద్దు చేయాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు.

పైపుల మార్పుతో రూ.8 వేల కోట్ల ఆదా

- గోదావరి-కావేరి ప్రాజెక్టు వ్యయంపై కేంద్రమంత్రి గడ్కరీ అంచనా

ఈనాడు, దిల్లీ: నీటి తరలింపునకు 20 మిల్లీమీటర్ల(ఎంఎం) మందం గల గొట్టాల(పైపులు) స్థానంలో 5 మిల్లీమీటర్ల మందం గల గొట్టాలను ఉపయోగించబోతున్నందున తాము తలపెట్టిన గోదావరి-కావేరి నదుల అనుసంధానంలో రూ.8 వేల కోట్ల వరకూ ఆదా అయ్యే అవకాశం ఉందని కేంద్ర రహదారులు, జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఆయన సోమవారం ఇక్కడ దేశంలోని జాతీయ రహదారుల సామర్థ్యంపై సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ రూపొందించిన నియమావళిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న నమూనాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. “అమెరికాకు చెందిన రెడ్డి అనే ఇంజనీర్‌ను ప్రధాని కార్యాలయం ఇటీవల నా దగ్గరకు పంపింది. సాగునీటి తరలింపునకు కాలువలకు బదులు ఉపయోగించే స్టీల్‌గొట్టాలను 20 ఎంఎంకు బదులు 5 ఎంఎం ఉపయోగించినా అంతేస్థాయిలో ప్రయోజనం పొందవచ్చని ఆయన చెప్పారు. నా సూచమేరకు ఆయన దానిపై పూర్తిస్థాయి వివరాలు ఇచ్చారు. ఆయనతో వ్యాప్కోస్‌కు ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేయించాం. ఆయన మాటలతో ఇంజనీర్లు కూడా సంతృప్తి చెందారు. గోదావరి-కావేరి అనుసంధానంలో ఈ నమూనాను అనుసరిస్తే ప్రభుత్వానికి రూ.8వేల కోట్ల దాకా ఆదా కానుంది. ప్రస్తుతం గోదావరి నుంచి ఏటా 3వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. అందులో 150 టీఎంసీలు పోలవరం ద్వారా నిల్వచేయబోతున్నాం. గోదావరి నీరు కృష్ణా, పెన్నాల ద్వారా కావేరికి తరలించి దక్షిణాదిలోని ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడుల కోసం పెద్ద ప్రాజెక్టు చేపడుతున్నాం. 20 ఎంఎం పైపులు వాడితే ప్రాజెక్టు వ్యయం రూ.30-40వేల కోట్లకు చేరే అవకాశం ఉంది. ఇప్పుడు 5 ఎంఎం పైపులు వాడటంవల్ల రూ.7-8వేల కోట్లు ఆదా అయ్యే అవకాశం ఉంది. అలాగే రహదారిపై వేసే తారులో 8% వరకు ప్లాస్టిక్ ఉపయోగించడానికి అవకాశం కల్పించాం. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టిపెట్టి రహదారి నిర్మాణ ఖర్చులు తగ్గించుకోవాలి.” అని గడ్కరీ పేర్కొన్నారు.

పేదల ఆకలి తీర్చలేని ప్రధాని: రాహుల్

రాయచూరు, న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చే పథకమేదీ ప్రధాని మోదీ మదిలో లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమంలా నిర్వహిస్తున్న ‘ఇందిరా క్యాంటీన్’ల తరహాలో దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలను ఆవిష్కరించే శక్తి మోదీకి ఉందా? అని సవాలు విసిరారు. కర్ణాటకలో ఎన్నికల ముందస్తు ప్రచారంలో భాగంగా సోమవారం రాహుల్ రాయచూరు, యాదగిరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. రాయచూరు జిల్లాలోని దేవదుర్గలో కార్యకర్తల సభలో ప్రసంగించారు. ‘గుజరాత్‌లో నేను మూడు నెలలు పర్యటించా. ఆ సమయంలో అక్కడి ప్రభుత్వం పేదల భూమిని ఎలా లాక్కొన్నదీ ఆదివాసీలు నా దృష్టికి తెచ్చారు. వారికి సరైన పరిహారం అందించలేదు’ అని తప్పుపట్టారు. యూపీఏ పాలనలో రూ.84 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని, ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక అదే తరహాలో రైతులకు మేలు చేయాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. పర్యటనలో భాగంగా రాహుల్ రాయచూరుకు చేరువలోని షంషాలం దర్గాను దర్శించుకుని పూల చద్దర్‌ను సమర్పించారు. అనంతరం కల్మల గ్రామంలోని ఓ చిరు హోటల్‌లో ఉత్తర కర్ణాటక ప్రజల అల్పాహారం ‘ఉగ్గాణి- మిరప బజ్జీ’ రుచిచూశారు.


రాయచూరు జిల్లా కల్మలలో ఓ రహదారి పక్క హోటల్‌లో మిర్చి బజ్జీ ఆరగిస్తున్న రాహుల్

ఆ నలుగురు జడ్జీల ప్రకటనలపై సందేహాలు అనవసరం!

లోయా కేసులో ‘సుప్రీం’కు నివేదించిన మహారాష్ట్ర

దిల్లీ: సంచలనం సృష్టించిన సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సీబీఐ న్యాయమూర్తి బి.హెచ్.లోయాది సహజ మరణమని.. దురదృష్టకరమని.. మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు నివేదించింది. లోయా మృతిచెందిన రోజున ఆయనతో ఉన్న నలుగురు జడ్జీలు సంతకాలు చేసి పేర్కొన్న అంశాలు (స్టేట్‌మెంట్లు) సందేహాలకు తావులేనివని తెలిపింది. ఈమేరకు మహారాష్ట్ర తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి - ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర, జస్టిస్ ఏ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట సవివరంగా వాదనలు వినిపించారు. లోయాది సహజ మరణమని పేర్కొన్న జడ్జీల స్టేట్‌మెంట్లను తిరస్కరించదలిస్తే.. వారు సహ కుట్రదారులని ప్రాథమికంగా అంగీకరించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేత, జర్నలిస్టు సహా పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాల్లోని అంశాలన్నీ అధ్రువ వార్తలని.. అవాస్తవాలని.. ఈమేరకు కేసును కొట్టివేయాలని కోరారు. తిరిగి ఈనెల 16న రోహత్గి వాదనలు కొనసాగిస్తారు.

హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం వీరభద్రసింగ్ దంపతులకు సమన్లు

దిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్, ఆయన భార్య ప్రతిభాసింగ్‌తో పాటు మరో ముగ్గురికి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. మార్చి 22న తమ ఎదుట హాజరు కావాలని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సంతోష్ స్నేహిమన్ ఆదేశించారు. అక్రమంగా సంపాదించిన రూ.ఏడు కోట్లను హవాలా మార్గంలో లావాదేవీలు జరిపి, వ్యవసాయ ఆదాయంగా చూపించి, ఎల్ఐసీ పాలసీలు కొన్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అభియోగపత్రం దాఖలు చేసింది. పాలసీలు అమ్మిన ఏజెంట్ ఆనంద్‌చౌహాన్‌ను ఇప్పటికే అరెస్టు చేసింది. ఈ లావాదేవీల్లో సహకరించిన మరో ముగ్గురిపైనా తాజాగా సమన్లు జారీ అయ్యాయి.

చాంపియన్స్

కోహ్లీసేన వీరవిహారంతో ఏకపక్షంగా సాగిపోతున్న సిరీస్‌లో గత మ్యాచ్ ఓ మలుపు. విజయంతో పోటీలోకి వచ్చిన దక్షిణాఫ్రికా.. సిరీస్‌ను ఆసక్తికరంగా మార్చేసింది. నాలుగో వన్డేలో అనూహ్యంగా ఓడిన భారత్, తిరిగి ప్రత్యర్థిని చిత్తు చేసి సిరీస్‌ను చేజిక్కించుకోవాలని తహతహలాడుతుండగా.. ఊపును కొనసాగించి సిరీస్ చేజారకుండా చూసుకోవాలని ఆతిథ్య దక్షిణాఫ్రికా ఆరాటపడుతోంది. పోరిక రసవత్తరం. పోర్ట్ ఎలిజబెత్‌లో ఐదో వన్డే నేడే.

సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-1, 3ల్లో





సిరీస్ కోసం.. తహతహ

దక్షిణాఫ్రికాతో భారత్ ఐదో వన్డే నేడు

పోర్ట్‌ఎలిజబెత్

సిరీస్ ముగించాలన్న పట్టుదలతో భారత్.. గత మ్యాచ్‌లో గెలుపు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో దక్షిణాఫ్రికా! వన్డే సిరీస్‌లో అత్యంత కీలక సమరానికి రంగం సిద్ధమైంది. మంగళవారమే ఐదో వన్డే. ఈ మ్యాచ్ పోయినా సిరీస్ గెలిచేందుకు టీమ్‌ఇండియాకు మరో అవకాశముంటుంది. కానీ దక్షిణాఫ్రికాకు మాత్రం చావోరేవో! డర్బన్‌లో 6 వికెట్ల తేడాతో, సెంచూరియన్‌లో 9 వికెట్ల తేడాతో, కేప్‌టౌన్‌లో 124 పరుగుల తేడాతో నెగ్గిన భారత్.. జొహానెస్‌బర్గ్‌లో గులాబీ దుస్తులతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. మెరుపులు, వర్షం ప్రభావం.. కొన్ని స్వీయ తప్పిదాల వల్ల గత మ్యాచ్‌లో ఓడినప్పటికీ.. సూపర్ ఫామ్‌లో ఉన్న భారతే ఈ మ్యాచ్‌లో ఫేవరెట్ అనడంలో సందేహం లేదు.

అయినా స్పిన్నర్లు కీలకమే: తొలి మూడు వన్డేల్లో దక్షిణాఫ్రికాపై భారత్ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించడంలో మణికట్టు స్పిన్నర్లదే కీలక పాత్ర. తమ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను వాళ్లు ఉక్కిరిబిక్కిరి చేశారు. గత మ్యాచ్‌లో దారాళంగా పరుగులిచ్చినప్పటికీ.. ఈ మ్యాచ్‌లో చాహల్, కుల్‌దీప్ యాదవ్ కీలకమే. జొహానెస్‌బర్గ్‌లో రెండు అంతరాయాలు బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో భారత్ లయను దెబ్బ తీశాయి. లక్ష్యాన్ని సవరించడం కూడా దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది. ఛేదన టీ20లా మారడంతో పాటు పిచ్ అను కూలించడంతో మిల్లర్, క్లాసెన్‌లు స్పిన్నర్ల బౌలింగ్‌లోనూ చెలరేగి, మ్యాచ్‌ను భారత్‌కు దూరం చేశారు. మిల్లర్ క్యాచ్‌ను అయ్యర్ వదిలేయడం, ఇంకోసారి అతడు బౌల్డయినా అది నోబాల్ కావడం కూడా భారత్‌కు ప్రతికూలంగా మారింది. ఈ నేపథ్యంలో కుల్‌దీప్, చాహల్‌ల బౌలింగ్‌ను దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ పూర్తిగా అర్థం చేసుకున్నారని చెప్పలేం. కాబట్టి మరోసారి భారత్ స్పిన్ ద్వయం మరోసారి కీలకంగా మారనుంది. మరోవైపు తొడకండరాల గాయంతో గత మ్యాచ్‌కు దూరమైన కేదార్ జాదవ్ ఫిట్‌నెస్‌పై సందేహాలు ఇంకా తొలగిపోలేదు. అతడు కోలుకోకుంటే శ్రేయస్ అయ్యర్ కొనసాగుతాడు. సిరీస్‌లో కోహ్లి (393), ధావన్ (271)ల సూపర్ ఫామ్ భారత్ విశ్వాసాన్ని పెంచుతోంది. ఐతే ఈ మ్యాచ్‌తోనైనా రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలు పేలవ ఫామ్ నుంచి బయటపడాలని టీమ్ ఇండియా ఆశిస్తోంది. ఈ పర్యటనలో ఆడిన 8 ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమైన రోహిత్‌పై ఇప్పుడందరి దృష్టి నిలిచి ఉంది. తనకు మంచి రికార్డున్న వన్డేల్లోనూ అతను విఫలమవుతుండటం ఆశ్చర్యమే. ఐదో వన్డేలోనూ విఫలమైతే జట్టులో అతడి చోటే ప్రశ్నార్థకమవుతుంది. ఈ నేపథ్యంలో రోహిత్ ఎలా ఆడతాడో చూడాలి. రహానె కూడా పరుగుల బాట పట్టాల్సిన అవసరముంది. ఒకవేళ కోహ్లి, ధావన్ త్వరగా ఔటైతే భారత మిడిల్ ఆర్డర్‌కు కఠిన పరీక్ష తప్పదు.

ఆత్మవిశ్వాసంతో వాళ్లు: వరుస ఓటముల తర్వాత గత మ్యాచ్‌లో విజయం దక్షిణాఫ్రికా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. డేవిడ్ మిల్లర్ ఫామ్‌లోకి రావడం, క్లాసెన్ తన ఎంపికకు న్యాయం చేయడం ఆతిథ్య జట్టుకు సానుకూలాంశాలు. ఆ ప్రదర్శనను వాళ్లు పునరావృతం చేయాలని దక్షిణాఫ్రికా ఆశిస్తోంది. ఐతే ఓపెనర్లు హషీమ్ ఆమ్లా, మార్‌క్రమ్‌ల ఫామే ఆ జట్టును కలవర పెడుతోంది. వాళ్లు శుభారంభాన్నివ్వడం కీలకం. సిరీస్‌లో ఇప్పటివరకు వాళ్లిద్దరిలో ఎవరూ 33 పరుగుల కంటే ఎక్కువ చేయలేకపోయారు. గరిష్ఠ భాగస్వామ్యం 43 పరుగులు. ఈ మ్యాచ్ కోసం ఓ స్పిన్నర్ తిరిగి దక్షిణాఫ్రికా జట్టులోకి వచ్చే అవకాశముంది. ఆ స్థానం కోసం తాహిర్, శంసి మధ్య పోటీ ఉంది.

పిచ్ మందకొడిగా..: దక్షిణాఫ్రికాలో మందకొడి పిచ్‌లలో సెయింట్ జార్జ్స్ పార్క్ (పోర్ట్‌ఎలిజబెత్) పిచ్ ఒకటి. భారత బౌలర్లకు ఇది అనుకూలించే పిచ్ అని భావిస్తున్నారు. ఐతే పరుగులు ధారాళంగానే వస్తాయి. గత ఐదు మ్యాచ్‌ల్లో ఇక్కడ సగటు స్కోరు 320 పరుగులు.

5
గతంలో ఇక్కడ ఆడిన ఐదు వన్డేల్లోనూ భారత్ ఓడిపోయింది

17
ఈ మైదానంలో జరిగిన 32 వన్డేల్లో ఛేదించిన జట్లు సాధించిన విజయాలు

46
పది వేల పరుగుల మైలురాయిని అందుకోవడానికి ధోని ఇంకా చేయాల్సిన పరుగులు

మహి.. మరోసారి

జొహానెస్‌బర్గ్: టీమ్‌ఇండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోని అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్‌ఎస్) విషయంలో ఎంత పక్కాగా ఉంటాడో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ధోని సమీక్ష కోరాడంటే కచ్చితంగా అది విజయవంతం కావాల్సిందే! అందుకే అభిమానులు డీఆర్‌ఎస్‌ను సరదాగా 'ధోని రెఫరల్ సిస్టమ్' అని అంటుంటారు. డీఆర్‌ఎస్ విషయంలో తన ప్రత్యేకతను దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డే సందర్భంగా ధోని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో బుమ్రా వేసిన బంతి ఆమ్లా బ్యాట్ పక్కగా వెళ్లి ధోని చేతుల్లో పడింది. ధోనితో సహా అందరూ అప్పీల్ చేశారు. కానీ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అయితే బంతి కచ్చితంగా బ్యాట్‌ను తాకిందని భావించిన రోహిత్ సమీక్ష కోరాలని కోహ్లికి సూచించాడు. అయితే వెంటనే ధోని కల్పించుకొని సమీక్ష వద్దని కోహ్లికి సంకేతాలిచ్చాడు. దాంతో కోహ్లి సమీక్ష కోరలేదు. రీప్లేలో బంతి బ్యాట్‌ను తాకలేదని తేలింది. దాంతో మరోసారి ధోని నిర్ణయం సరైందని తేలింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా తిరుగుతోంది. అభిమానులు 'దటీజ్ ధోని' అంటూ అతడిని పొగిడేస్తున్నారు.

లెగ్‌స్పిన్నర్ ధోని!

వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అయిన ధోని అప్పుడప్పుడూ బంతి అందుకుని మీడియం పేస్ వేసిన సందర్భాలున్నాయి. మరి కొత్తగా లెగ్‌స్పిన్నర్ ధోని అంటున్నారేంటి అనుకుంటున్నారా? తాజాగా ధోని ఆ అవతారమే ఎత్తాడు. తన లెగ్ స్పిన్ ప్రతిభ చూపించాడు. అయితే అది మ్యాచ్‌లో కాదు. దక్షిణాఫ్రికాతో మంగళవారం జరగబోయే ఐదో వన్డే కోసం ప్రాక్టీస్‌లో భాగంగా ధోని నెట్స్‌లో లెగ్ స్పిన్ వేస్తూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ తన వెబ్‌సైట్లో పెట్టింది. ఇప్పటికే సిరీస్‌లో చాహల్, కుల్‌దీప్ తమ మణికట్టు మాయాజాలం ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. మరి ధోని కూడా లెగ్‌స్పిన్‌తో సఫారీలకు సవాలు విసురుతాడా ఏంటి?

ఏబీకి దొరికారు...

నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికాను గెలిపించింది మిల్లర్, క్లాసెన్‌లే. ఐతే దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లో ఆత్మవిశ్వాసం, దూకుడు తెచ్చిన ఘనత ఏబీ డివిలియర్స్‌దే. చేసింది 26 పరుగులే అయినా ఉన్నంతసేపూ భారత స్పిన్ ద్వయంలో వణుకు పుట్టించాడు. అతను చూపిన బాటలోనే తర్వాతి బ్యాట్స్‌మెన్ చెలరేగారు. కాబట్టి ఐదో వన్డేలో ఏబీతో అప్రమత్తంగా ఉండాల్సిందే.




మిథాలీ

టీ20ల్లో మెరిపిస్తారా!

పొచెఫ్‌స్ట్రూమ్: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో నెగ్గి ఊపు మీదున్న భారత మహిళల జట్టు.. ఇక టీ20 సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారమే భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టీ20 జరగనుంది. వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి.. ఆఖరి వన్డేలో ఓడిన భారత్.. టీ20 సిరీస్‌లో శుభారంభం చేయాలనే పట్టుదలతో ఉంది. టీ20 జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తోంది. భారత్ బోణీ కొట్టాలంటే హర్మన్‌తో పాటు వెటరన్ మిథాలీరాజ్, మెరుపు తార స్మృతి మంధాన రాణించడం భారత్‌కు కీలకం. చెలరేగి ఆడుతున్న ఓపెనర్ స్మృతిపైనే అందరి దృష్టి నిలిచి ఉంది. మిడిలార్డర్‌లో దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. మూడో వన్డేకు విశ్రాంతి తీసుకున్న సీనియర్ బౌలర్ జులన్ గోస్వామి తిరిగి జట్టులోకి రావడంతో భారత్ బలం పెరగనుంది.

క్వార్టర్స్‌లో ఆంధ్ర

వరుసగా ఐదో విజయం ● విజయ్ హజారే ట్రోఫీ



భరత్ (106 నాటౌట్)

చెన్నై: అఖిల భారత విజయ్ హజారే ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జోరు కొనసాగుతోంది. గ్రూపు-సిలో వరుసగా ఐదో విజయంతో ఆంధ్ర క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. దేశవ్యాప్తంగా 28 జట్లు బరిలో ఉండగా.. ముంబయి, తమిళనాడు లాంటి పటిష్ఠ జట్లు గ్రూపు-సిలో ఉన్నా.. అన్నింటి కంటే ముందుగా ఆంధ్ర నాకౌట్ బెర్తు సొంతం చేసుకోవడం విశేషం. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 9 వికెట్ల తేడాతో గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 50 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు అయ్యప్ప (2/68), కార్తీక్ రమణ్ (4/32), నరేన్‌రెడ్డి (2/35) మెరిశారు. అనంతరం ఆంధ్ర 45.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 251 పరుగులు సాధించింది. భరత్ (106 నాటౌట్; 132 బంతుల్లో 4×4, 4×6), అశ్విన్ హెబర్ (99; 108 బంతుల్లో 11×4, 2×6), కెప్టెన్ హనుమ విహారి (39 నాటౌట్; 35 బంతుల్లో 3×4, 3×6) సత్తాచాటారు. భరత్, అశ్విన్ తొలి వికెట్‌కు 192 పరుగులు జోడించి ఆంధ్ర విజయానికి బాటలు వేశారు. ఈ విజయంతో 4 పాయింట్లు గెల్చుకున్న ఆంధ్ర.. మొత్తం 20 పాయింట్లతో గ్రూపు-సి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ముంబయి (16) ద్వితీయ, మధ్యప్రదేశ్ (12) తృతీయ స్థానాల్లో ఉన్నాయి.

రోహిత్ రాయుడు సెంచరీ

ఈనాడు, హైదరాబాద్: రోహిత్ రాయుడు (130; 130 బంతుల్లో 11×4, 3×6) సెంచరీ సాధించడంతో విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మరో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన గ్రూపు-డి మ్యాచ్‌లో హైదరాబాద్ 149 పరుగుల తేడాతో జమ్ము-కశ్మీర్‌పై గెలుపొందింది. మొదట హైదరాబాద్ 50 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. రోహిత్‌తో పాటు సందీప్ (72; 74 బంతుల్లో 5×4) మెరిశాడు. బదులుగా జమ్ము-కశ్మీర్ 34.1 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/33), రవికిరణ్ (2/17), ఆకాశ్ భండారి (3/34) సత్తాచాటారు. 4 మ్యాచ్‌ల అనంతరం హైదరాబాద్.. మొత్తం 12 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఐదేసి మ్యాచ్‌లాడిన విదర్భ (16), చత్తీస్‌గఢ్ (16), సౌరాష్ట్ర (12) వరుసగా తొలి 3 స్థానాల్లో ఉన్నాయి. మరో 3 మ్యాచ్‌లాడనున్న హైదరాబాద్ రెండింట్లో నెగ్గితే క్వార్టర్స్‌లో అడుగుపెట్టొచ్చు!



క్రికెట్ ఆస్ట్రేలియా అవార్డుల వేడుకలో ప్రేయసితో స్మిత్

స్మిత్‌కు మళ్లీ బోర్డర్ పతకం

సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రతిష్ఠాత్మక అలెన్ బోర్డర్ పతకాన్ని రెండోసారి గెలుచుకున్నాడు. గత ఏడాది టెస్టుల్లో పరుగుల వరద పారించి దిగ్గజ ఆటగాడు బ్రాడ్‌మన్‌ను గుర్తుకు తెచ్చిన స్మిత్‌కు బోర్డర్ పతకం కోసం నిర్వహించిన ఓటింగ్‌లో అత్యధికంగా 246 ఓట్లు వచ్చాయి. వార్నర్ (162), నాథన్ లైయన్ (156) తర్వాతి స్థానాల్లో నిలిచారు. గత ఏడాది కాలంలో స్మిత్ 67.46 సగటుతో 1754 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలున్నాయి. అతను ఐసీసీ ఉత్తమ టెస్టు క్రికెటర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. 2015లోనూ స్మిత్.. బోర్డర్ పతకం సాధించాడు.



టేలర్ (125)

ఒక విచిత్రం!

● వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఒకే స్కోర్లు
● అఫ్గాన్‌ను దెబ్బకు దెబ్బ తీసిన జింబాబ్వే

షార్జా: క్రికెట్ చరిత్రలో ఎన్నడూ చూడని చిత్రమిది! బహుశా భవిష్యత్తులో కూడా ఇలా ఇంకెప్పుడూ జరగదేమో! మూడు రోజుల కిందట జింబాబ్వేతో తొలి వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 333 పరుగులు చేసింది. తర్వాత జింబాబ్వేను 179 పరుగులకే ఆలౌట్ చేసి 154 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పుడు రెండో వన్డేలోనూ సరిగ్గా ఇవే స్కోర్లు నమోదయ్యాయి. కాకపోతే ఈసారి మొదట బ్యాటింగ్ చేసింది, గెలిచింది.. జింబాబ్వే. సరిగ్గా ముందు మ్యాచ్‌లో అఫ్గాన్ చేసినన్ని పరుగులే చేసి.. అన్నే వికెట్లు కోల్పోయి.. ఆ తర్వాత ప్రత్యర్థిని అన్నే పరుగులకు ఆలౌట్ చేసి.. అంతే తేడాతో నెగ్గి ఆశ్చర్యపరిచిందా జట్టు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ బ్రెండన్ టేలర్ (125; 121 బంతుల్లో 5×4, 8×6), ఆల్‌రౌండర్ సికిందర్ రజా (92; 74 బంతుల్లో 9×4, 4×6)ల మెరుపులతో మొదట జింబాబ్వే 5 వికెట్లు కోల్పోయి 333 పరుగులు చేసింది. అనంతరం క్రీమర్ (4/41), చటార (3/24)ల ధాటికి అఫ్గాన్ 30.1 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. దవ్లత్ జాద్రాన్ (47), రహ్మద్ షా (43), మహ్మద్ నబి (31) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఈ విజయంతో జింబాబ్వే ఐదు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

తాహిర్‌పై జాతివివక్ష వ్యాఖ్యలు!



పోర్ట్ ఎలిజబెత్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య నాలుగో వన్డే సందర్భంగా ఒక అభిమాని తనపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడని లెగ్‌స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ ఆరోపించాడు. ఈ మేరకు అతను దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్‌ఏ)కు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఎస్‌ఏ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ మ్యాచ్‌లో 12వ ఆటగాడిగా ఉన్న తాహిర్‌ను లక్ష్యంగా చేసుకుని ఒక అభిమాని పదే పదే దూషించినట్లు తెలిసింది. ఆటగాళ్లకు శీతల పానీయాలు అందించి పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో ఆ అభిమాని తాహిర్‌ను తిట్టినట్లు సమాచారం. అతణ్ని గుర్తించడానికి తాహిర్ ఇద్దరు భద్రతా సిబ్బందిని తీసుకుని వెళ్లాడు. "మ్యాచ్ జరుగుతున్నప్పుడు తాహిర్‌ను అభిమానుల్లో ఒకతను దూషించాడు. తాహిర్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి అతను భారత అభిమాని అని అర్థమవుతోంది" అని దక్షిణాఫ్రికా జట్టు మేనేజర్ మూసాజె అన్నాడు.

ఆడలేం.. బాబోయ్!

ప్యాంగ్‌చాంగ్: శీతాకాల ఒలింపిక్స్ పోటీలు క్రీడాకారులకు సవాలు విసరుగుతున్నాయి. విపరీతమైన గాలులు, అంతమించిన చలితో క్లిష్టంగా మారిన వాతావరణంతో అథ్లెట్లు హడలిపోతున్నారు. వాతావరణం సహకరించకపోవడంతో చాలా ఈవెంట్లు వాయిదా పడుతున్నాయి. కొన్ని ఈవెంట్లలో అయితే అథ్లెట్లు పోటీపడటానికే భయపడుతున్నారు. పతకాల సంగతి దేవుడెరుగు.. ప్రాణాలు మిగిలితే చాలు అంటున్నారు. మహిళల స్నో బోర్డింగ్‌లో ప్రమాదకర పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మొదట క్వాలిఫయింగ్‌లో చాలామందికి గాయాలు కాగా.. ఫైనల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. చలి గాలుల ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో కొంతమంది అథ్లెట్లు పోటీల మధ్యలోనే పడిపోయి గాయాల పాలయ్యారు. కొందరు ప్రమాదకరంగా మంచు గడ్డలను ఢీకొన్నారు. అయితే ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. ఫైనల్లో గెలిచిన అమీ ఫులర్ (బ్రిటన్)తో పాటు మరో ఇద్దరికి గాయాలు గట్టిగానే తగిలాయి. -15 డిగ్రీల ఉష్ణోగ్రతలో, భీకర గాలుల మధ్య ఫైనల్ నిర్వహించడంపై అథ్లెట్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు అల్పైన్ స్కీయింగ్ ఈవెంట్ మరోసారి వాయిదా పడింది. మున్ముందు వాతావరణ పరిస్థితులు మరింత క్లిష్టంగా మారేందుకు ఆస్కారమున్న నేపథ్యంలో అనుకున్న సమయానికి క్రీడలను ముగించాలనే ఉద్దేశంతో ఉన్న నిర్వాహకులు ఈవెంట్లను వాయిదా వేసేందుకు అంగీకరించట్లేదు. కానీ ఇంతటి ప్రతికూల వాతావరణంలో ఆడడం చాలా కష్టమని.. తాము క్షేమంగా ఉండటానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అథ్లెట్లు అంటున్నారు.



గాయంతో క్రీడాకారిణి

"ఇలాంటి వాతావరణంలో స్నో బోర్డింగ్ ఫైనల్ ఎలా నిర్వహించారో తెలియట్లేదు. గాయం కాకుండా పోటీని ముగించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి పరిస్థితిలో ఈవెంట్‌ను రద్దు చేయాలి.. లేదా వాయిదా వేయాలి" అని ఈ పోటీల్లో కాంస్యం గెలిచిన ఫిన్లాండ్ అథ్లెట్ రుకాజార్ చెప్పింది.

ఆసియా పోటీల్లో బాక్సర్లకు 10 పతకాలు

జకార్తా: ఆహ్వానిత దేశాల ఆసియా పోటీల్లో భారత బాక్సర్లు సత్తా చాటుతున్నారు. ఈ టోర్నీలో పది మంది బాక్సర్లు సెమీస్ చేరి పతకాలు ఖాయం చేశారు. సోమవారం క్వార్టర్స్‌లో శశి చోప్రా (57 కిలోలు) 5-0తో నుర్ సబ్రినా (సింగపూర్)ను చిత్తు చేశాడు. శ్యామ్ కుమార్ (49కిలోలు) 3-2తో సమక్ (థాయిలాండ్)పై నెగ్గాడు. ఆశిశ్ (64కిలోలు) 5-0తో నారిమత్సు (జపాన్)ను ఓడించాడు. మరో ఏడుగురు భారత బాక్సర్లకు బై లభించడంతో నేరుగా సెమీస్ చేరారు.



సెరెనా.. ఓటమితో

యాష్‌విలీ: దాదాపు ఏడాది విరామం తర్వాత తిరిగి అధికారిక టెన్నిస్ మ్యాచ్ ఆడిన సెరెనాకు చేదు అనుభవం ఎదురైంది. ఫెడ్ కప్‌లో సెరెనా-వీనస్ జోడీ 2-6, 3-6తో డెమి స్ఖూర్స్- లెస్లీ కెర్కోవ్ జోడీ (నెదర్లాండ్స్) చేతిలో పరాజయం పాలైంది. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన సెరెనా.. ఆ తర్వాత బిడ్డకు జన్మనివ్వడంతో దాదాపు ఏడాదిగా ఆటకు దూరంగా ఉంది. తిరిగి రాకెట్ పట్టి గత డిసెంబర్‌లో ఆడిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లోనూ ఆమె గెలవలేకపోయింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగుతుందనుకున్న సెరెనా.. పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో తప్పుకుంది. ఆమె ఫ్రెంచ్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ పునరాగమనం చేయాలనుకుంటోంది.

'అనుబంధం'.. అసంబద్ధం..!

- వృత్తి విద్యా కళాశాలలకు అనుబంధ గుర్తింపు విషయంలో మారని జేఎన్‌టీయూహెచ్ తీరు

ఈనాడు, హైదరాబాద్: వృత్తి విద్యా కళాశాలలకు అనుబంధ గుర్తింపు జారీ విషయంలో జేఎన్‌టీయూహెచ్ తీరు విమర్శలకు తావిస్తోంది. ఎప్పుడు అనుమతులు ఇస్తారో తెలిపే సంపూర్ణ కాలపట్టిక లేకుండా 'మా ఇష్టం' అన్న చందంగా వర్సిటీ వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. అనుమతి ఇచ్చిన కళాశాలల జాబితాను ఎంసెట్ కౌన్సెలింగ్ దాదాపు ప్రారంభమయ్యాక విడుదల చేస్తుండటంతో ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ అధికారులకు ఉత్కంఠ తప్పడం లేదు. విద్యార్థులూ తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల అనుమతి పొడిగింపునకు ఏటా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. దరఖాస్తులకు తుది గడువు, పరిశీలన, చివరకు ఎప్పుడు అనుమతులు జారీ చేస్తుందో ఒక కాలపట్టికను విడుదల చేస్తుంది. దానివల్ల యాజమాన్యాలకు, విశ్వవిద్యాలయాలకు, సాంకేతిక విద్యాశాఖకు ఒక స్పష్టత వస్తుంది. జేఎన్‌టీయూహెచ్ మాత్రం ఏటా సగం కాలపట్టికనే విడుదల చేస్తోంది. దీనివల్ల ఎప్పుడు అనుబంధ గుర్తింపు ఇస్తారన్న దానిపై ఏటా అయోమయం నెలకొంటోంది. ఈ సారీ ఇటీవలే కాలపట్టికను విడుదల చేసినా కేవలం కళాశాలల తనిఖీల వరకు మాత్రం అందులో పొందుపరచడం గమనార్హం. అనుబంధ గుర్తింపు ఎప్పటిలోపు జారీ చేస్తారన్నది మాత్రం చెప్పలేదు.

విద్యార్థులు, తల్లిదండ్రులకూ అవస్థలే: ఎంసెట్ కౌన్సెలింగ్ ఆలస్యమైతే విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు వెళతారని భావించి ముందుగా కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించి నిర్వహిద్దామనుకున్నా.. జేఎన్‌టీయూహెచ్ కళాశాలల జాబితా ఎప్పుడిస్తుందోనన్న ఆందోళన ఉన్నత విద్యామండలినీ వెంటాడుతోంది. కౌన్సెలింగ్ ప్రారంభం నాటికే కాదు.. వెబ్ ఆప్షన్లు మొదలయ్యాక జేఎన్‌టీయూహెచ్ జాబితా ఇస్తోంది. దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభానికి కనీసం 15 రోజుల ముందుగా అనుమతులు ఇస్తే విద్యార్థులకూ ప్రయోజనం ఉంటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. దీనిపై జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ఆచార్య వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. జూన్ చివర లేదా జులైలో కౌన్సెలింగ్ మొదలవుతుంది కాబట్టి మే నెలలోనే అనుమతులు ఇస్తామన్నారు.

చేపలు, సముద్ర ఆహార శుద్ధి కేంద్రాలపై ఆదాయ పన్ను శాఖ అధికారులు సోమవారం ఉదయం దాడులు చేశారు. కర్ణాటక తీర నగరాలు.. మంగళూరు, ఉడుపి పరిసరాల్లోని 150 కేంద్రాలతో పాటు, మరో ఐదు రాష్ట్రాల్లోనూ ఇవి జరిగాయి. దాడుల్లో రూ.195కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలు, రూ.88లక్షల నగదును స్వాధీనపరచుకున్నారు. పూర్తి వివరాలను ఆ శాఖ అధికారులు ఇంకా విడుదల చేయలేదు.



ఉమ్మడి ఓటర్ల జాబితా రూపొందించాలన్న విజ్ఞప్తిపై సమాధానం దాఖలు చేయండి

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: పార్లమెంట్, శాసనసభ, స్థానిక ఎన్నికలన్నింటికీ ఒకటే ఓటర్ల జాబితా రూపొందించేలా ఆదేశించాలంటూ దాఖలయిన విజ్ఞప్తిపై రెండు వారాల్లోగా సమాధానం దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ అంశంలో కోర్టుకు సహకరించాల్సిందిగా అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎం. ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేసింది. భాజపా నేత అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ విజ్ఞప్తి దాఖలు చేశారు. ఉమ్మడి ఓటర్ల జాబితా వల్ల డబ్బు, మానవ వనరులు ఆదా అవుతాయని పేర్కొన్నారు.

మరో వ్యాజ్యంపై మార్చి19న తుదివిచారణ: ఎన్నికల్లో అభ్యర్థులు రెండు స్థానాల నుంచి పోటీ చేయకుండా నిషేధించాలని, స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడకుండా నియంత్రించాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు తుది విచారణ మార్చి 19న చేపట్టనుంది. అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు.

కీమోథెరపీ పనితీరును ముందే చెప్పేస్తుంది!

★ సరికొత్త వ్యవస్థను అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: రొమ్ము క్యాన్సర్ రోగుల్లో కీమోథెరపీ ఆశించిన ఫలితాలనిస్తోందో.. లేదో.. తొలిదశల్లోనే గుర్తించేందుకు దోహదపడగల సరికొత్త వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సాధారణంగా రొమ్ము క్యాన్సర్ రోగులకు వైద్యులు 'నియోఅడ్జువంట్ కీమోథెరపీ' చికిత్సను.. శస్త్రచికిత్సకు 5-6 నెలల ముందు నుంచి అందిస్తారు. క్రియాశీలంగా ఉన్న క్యాన్సర్ కణాలను నిర్మూలించడమే ఈ చికిత్స లక్ష్యం. తద్వారా శస్త్రచికిత్స విజయవంతమయ్యేందుకు మెరుగైన అవకాశాలు ఏర్పడతాయి. రోగుల్లో ఈ కీమోథెరపీ ఏమేరకు పనిచేస్తోందో తొలిదశల్లోనే తెలుసుకునే విధానాలేవీ ప్రస్తుతం అందుబాటులో లేవు. దీనికి పరిష్కారమార్గంగా అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సరికొత్త వ్యవస్థను రూపొందించారు. కీమోథెరపీ ప్రారంభమైన రెండు వారాల నుంచే.. రోగులపై దాని ప్రభావాన్ని నూతన వ్యవస్థ విశ్లేషిస్తుంది. రెండు స్తనాల త్రీడీ చిత్రాలను ఏకకాలంలో తీయడం ద్వారా.. స్తనాల్లో రక్తప్రవాహాన్ని విశ్లేషించడానికి ఉపకరిస్తుంది. తద్వారా కీమోథెరపీ పనితీరును అంచనా వేయవచ్చు. కీమోథెరపీతో ఆశించిన ప్రభావాలు కనిపించకపోతే.. చికిత్సను మార్చేందుకు వీలు కలుగుతుంది.

ఆ తేనెటీగలతో మొక్కలు అంతరించిపోయే ముప్పు!



లండన్: పరిశోధనల నిమిత్తం పర్యావరణంలోకి కృత్రిమంగా ప్రవేశపెడుతున్న తేనెటీగలతో కొన్నిరకాల మొక్కలు అంతరించిపోయే ముప్పుందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. పరాగ సంపర్కానికి దోహదపడే స్థానిక తేనెటీగలను అవి నిలువరిస్తుండటమే అందుకు కారణమని వెల్లడించింది. ఈజిప్టులోని పర్వత ప్రాంతాల్లో పలురకాల మొక్కలు, తేనెటీగలను బ్రిటన్‌కు చెందిన ఆంగ్లియా రస్కిన్ విశ్వవిద్యాలయం, నాటింగ్‌హాం విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో కనిపించే కొన్ని జాతుల మొక్కల్లో స్థానిక తేనెటీగలు మాత్రమే పరాగ సంపర్క వాహకాలుగా పనికొస్తున్నట్లు తెలిపారు. స్థానికుల ఆదాయమార్గాలను పెంచేందుకు, పరిశోధనల్లో ఉపయోగించుకునేందుకు ఇటీవల పలు సంస్థలు కృత్రిమ తేనెపట్టులను ఆ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించారు. ఆహారం, ఇతర వనరుల కోసం జరిగే వేటలో స్థానిక తేనెటీగలపై కృత్రిమ తేనెటీగలు పైచేయి సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా మొక్కల్లో ప్రత్యుత్పత్తి మార్గాలు తగ్గిపోయి. . చివరకు అంతరించిపోయే ముప్పుందని వివరించారు.

ఇక అడవుల్లోనూ డ్రోన్లు దూసుకెళ్తాయ్!

★ 'నానోమ్యాప్' వ్యవస్థను రూపొందించిన శాస్త్రవేత్తలు

బోస్టన్: రద్దీ ప్రాంతాల్లోనూ స్వతంత్రంగా, వేగంగా దూసుకెళ్లడంలో డ్రోన్లకు ఉపకరించే సరికొత్త వ్యవస్థను అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. డ్రోన్లు వేగంగా ప్రయాణిస్తున్నప్పుడు ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడం సంక్లిష్టమైన వ్యవహారం. ప్రస్తుతం వాటికి దారి చూపేందుకు సూక్ష్మ పటాలను వినియోగిస్తున్నారు. వాస్తవిక ప్రపంచంలో అనుకోకుండా ఎదురయ్యే అడ్డంకులను పసిగట్టడంలో మాత్రం అవి విఫలమవుతున్నాయి. ఇందుకు పరిష్కారమార్గంగా ఎంఐటీ శాస్త్రవేత్తలు 'నానోమ్యాప్' వ్యవస్థను అభివృద్ధి చేశారు. డ్రోన్లు స్థిరంగా గంటకు 30 కిలోమీటర్ల వేగంతో.. అడవులు, నగరాల వంటి రద్దీ ప్రాంతాల్లోనూ దూసుకెళ్లేందుకు అది దోహదపడుతుందని తెలిపారు. అందులోని లోతైన సెన్సింగ్ వ్యవస్థ డ్రోన్ల కదలికలను అనుక్షణం పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ఏ క్షణంలో అడ్డంకులు ఎదురైనా.. పక్కకు తప్పుకొని వేరే మార్గంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు వీలు కల్పిస్తుందని వివరించారు.

గాలిలో సూక్ష్మజీవులకు చెక్‌పెట్టే పరికరం

★ అభివృద్ధిచేస్తున్న పరిశోధకులు



లండన్: గాలిలో కలిసి ఇన్ఫెక్షన్లు వ్యాపింపజేసే సూక్ష్మజీవులకు కళ్లెంవేసే అధునాతన పరికరాన్ని పరిశోధకులు అభివృద్ధి చేస్తున్నారు. భిన్నరకాల అలర్జీలు, ఇన్ఫెక్షన్లను దీని సాయంతో ఇట్టే అడ్డుకునే వీలుంది. క్రియాశీల రసాయనిక సమ్మేళనాలతోపాటు విద్యుదావేశపూరిత ఎలక్ట్రాన్లు, అయాన్లతో గ్యాస్‌ను ప్రేరేపించడాన్ని "కోల్డ్ ప్లాస్మా" సాంకేతికతగా పిలుస్తారు. ప్రస్తుతం దీని సాయంతోనే బ్రిటన్‌లోని లివర్‌పూల్ వర్సిటీ నిపుణులు ఓ అధునాతన పరికరాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఓ బల్బు కంటే తక్కువ విద్యుత్ శక్తిని తీసుకుని ఇది చక్కటి ఫలితాలను ఇస్తుందని వారు వివరించారు. వైద్యం మొదలుకొని ఆహార తయారీ, వస్తూత్పత్తి రంగాల్లో దీన్ని ఉపయోగించే వీలుందని పేర్కొన్నారు. 'అత్యంత క్రియాశీల రసాయనిక సమ్మేళనాలతో కూడిన ప్లాస్మాను జనింపచేసే పరికరాన్ని ప్రస్తుతం మేం తయారుచేస్తున్నాం. తక్కువ ధరలోనే అందుబాటులోకి వస్తూ.. చక్కగా పనిచేసేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం'అని పరిశోధకులు జేమ్స్ వాల్ష్ తెలిపారు.

చిన్నారుల్లో రోగాల ముప్పును ముందే గుర్తించే సరికొత్త డీఎన్‌ఏ పరీక్ష!!

న్యూయార్క్: చిన్నారులకు రాబోయే మూర్ఛ....క్యాన్సర్...కండరాల సంబంధిత సమస్యల వంటి సుమారు 193 బాలారిష్టాల ముప్పు గురించి ముందే గుర్తించగల సులువైన సరికొత్త డీఎన్‌ఏ పరీక్షకు పరిశోధకులు రూపకల్పన చేశారు. ఈ జన్యు పరీక్షను చేయడం కూడా చాలా సులువు. దీనిని 'సెమా 4 నటాలీస్' పరీక్షగా పేర్కొంటున్నారు. చిన్నారి బుగ్గ లోపలి నుంచి చాలా మృదువుగా కణజాలాన్ని సేకరిస్తారు. ఎలాంటి నొప్పిలేకుండా....పూర్తిగా స్టెరిలైజ్ చేసిన స్వాబ్‌తోనే డీఎన్‌ఏ సేకరణ జరుగుతుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో డీఎన్‌ఏను విశ్లేషిస్తారు. అనంతరం పూర్తి కచ్చితత్వంతో రాబోయే అనారోగ్య సమస్యలను గుర్తించవచ్చని ఈ డీఎన్‌ఏ పరీక్ష రూపకర్తలు తెలిపారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.